మొదటి ముద్రణ
1000 ప్రతులు

వె ౧
రూపాయిన్నర

శ్రీ కొండపల్లి ముద్రాశాల
రాజమండ్రి

మొదటి ముద్రణ
1000 ప్రతులు

వెల
రూపాయిన్నర

శ్రీ కొండపల్లి ముద్రాశాల
రాజమండ్రి

''నేను యేమీ చెప్పను. తలుపుబైట నుంచున్న దర్వానే జవాబు చెప్పిపంపగలడు'' అని కొంచెం కోపంతోనే అన్నది.

ఈ మాటలు చిన్నమ్మగారి చెవుల్లో పడినయ్! ఆ మాటలు ఆమెకంతగా రుచించలేదు, ఆమె పూజమీదనుంచి లేచివచ్చి, రమ మాట పూర్తికాకముందే. రుసరుసలాడుతూ—'దర్వానెందుకు చెప్పాలి? నాకు చేతకాదా? మళ్ళీ యీగడప తొక్కకుండావుండేటట్లు చెప్పుతాను, తారిణీఘోషాల్ కొడుకు సిలవడానికి వస్తాడా? మాయింటికా? వేణీ! నేనింకా అన్ని సంగతులు మర్చిపోలేదు. తారిణీ తన యీకొడుకుకే, మా రమను పెండ్లిచేసుకుందామని చూశాడు. అప్పటికి మా యతీంద్రుడు పుట్టలేదు. యీ వివాహం జరిగినట్లయితే, యదునాధముఖర్జి ఆస్థంతా చిక్కుతుందని చూశాడు. గ్రహించావా వేణీ! ఎప్పుడైతే యీ పెళ్ళి జరగలేదో, అప్పుడిక, యీ భైరవాచారికి ఏదో లంచంమేపి-జపతపాలతో-చేతపడిచేయించి, నాబిడ్డ గొంతు కోశాడు. ఆర్నెల్లయినా గడవకముందే దీని ముఖాని కుంకుమ, చేతిగాజులు పోయినయ్! వాడివంశం ఎటువంటిది? పరువు-మర్యాదలేని వంశంలోపుట్టి-యదుముఖర్జి కూతురును కోడలిగా చేసుకుందామనిప్రయత్నించాడు. అటువంటి కుత్రిమముగలవాడికి అటువంటి చావే గలిగింది. చివరకు కొడుకుచేతిమీదుగా తలకొరివికూడా పెట్టించుకోలేకపోయాడు. పరువూ, మర్యాదలులేని వీడిముఖంమండ-' అని ఆమె కుస్తీపట్టి ఓడిపోయిన పీరునిలా రొప్పుతూవుంది.

మాటి మాటికి 'పరువు-ప్రతిష్టలూ-మానమర్యాదలు' అని అంటుంటే వేణీ ముఖం నల్లబడింది. ఎందుకంటే తారిణీ

ఘోషాల్, వేణీకి పినతండ్రి. ఈ సంగతి రమ గ్రహించి, పినతల్లిని చీవాట్లుపెట్టి అన్నది.—"ఏం పిన్నీ—? జాతిని గురించి నీ వెందు కలా అంటావు? వంశమంటే ఒకరిచేత్తో గడించిన వస్తువుకాదు. ఎవరే జాతిలో జన్మిస్తారో వాళ్ళకా జాతే గొప్పది"

వేణీ కొంచం లజ్జాభావంతో నవ్వుతూ—"కాదు రమా! చిన్నమ్మ అన్నదికూడా నిజమే! నువ్వు కులీనుల యింటి ఆడ పడుచువు. అటువంటి నిన్ను మా యింటికి తెచ్చుకో గలమా? అసలు బాబాయ్ అలా అనడం తప్పంటాను. యిక, జప తపాలూ - వాతపడులూ - ప్రయోగాలంటావా? అదీ నిజమే! భైరవాచారికీ, బాబాయ్‌కీ, చేతకాని పనంటూ ప్రపంచంలో లేదు, మరి ప్రస్తుతం యీ భైరవాచారే, రమేశుకు సలహా దారు' అని చెప్పాడు,

"అదే తెలిసిన మాటంటే: వీడు పది పన్నెండేళ్ళ నుంచి యీ వూరికి రాలేదు. అసలు యింతకాలం యెక్కడునట్లు?" అని చిన్నమ్మ అడిగింది.

"నాకేం తెలుసమ్మా! మా బాబాయ్‌తో మీ కెంత వ్యవహారం వుందో—నాకూ అంతే; అయినా వాడు యింతకాలం బొంబాయి లోనో ఎక్కడో వున్నాడని విన్నాను. కొందరేమో డాక్టరు ప్యాసయాడని అంటున్నారు. మరికొందరు ప్లీడరు ప్యాసయా డంటారు. యిదంతా వట్టిదే, ఏమీలేదని యింకా కొంద రన్నారు, పెద్ద త్రాగుబోతని చాలామంది అన్నారు. యింటికి వచ్చాక చూశాను. కళ్ళు ఎర్రగా మందారపు పువ్వుల్లా వున్నాయ్!"

"అదా సంగతి....? అటువంటివాన్ని గడప తొక్కనీయ కూడదు." అని పిన్నమ్మ అన్నది.

ఉత్సాహంగా తలూపుతూ వేణీ అన్నాడు— "అవును. ఎప్పుడూ రానీయకూడదు. ఏం రమా? నీకు రమేశ్ గుర్తే కదూ?"

తన దౌర్భాగ్యపు ప్రసంగం రావడంతోనే రమ సిగ్గుపడింది. అయినా, సలజ్జాభావంతో నవ్వుతూ చెప్పింది—"గుర్తెందుకు లేదు—? నా కంటే ఎక్కువ పెద్దవాడేమీ కాడు. అదీగాక, మే మిద్దరం ఆ మసూచిఆసుపత్రి దగ్గరున్న పాఠశాలలో చదువుకున్నాం. కాని, అతనితల్లి చనిపోవడం నాకు బాగా గుర్తువుంది. అతని తల్లికి నేనంటే మహా ఆపేక్షగా వుండేది."

"దాని ఆపేక్ష మండిపోయిందిలే! తన పనికోసం తను చేశిన, నటనది. నిన్నెలాగైనా చేతుల్లో యిరికించు కోవాలనే వాళ్ళ వుద్దేశ్యం?" అని పినతల్లి యింకోమారు ఎగిరి పడింది.

వేణీ ఏదోమహా తెలిసినవాడిలా హుంకరించి—"యిందులో సందేహ మేముంది? పిన్ని వుద్దేశ్యంకూడా..........." అతని మాట పూర్తి కాకముందే రమ కోపంగా—"పిన్ని! యిప్పుడా పాతపురాణం తవ్వుకోవడ మెందుక?" అని అడిగింది.

రమేశు తండ్రితో రమకు ఎంత విరోధ మున్నప్పటికీ, అతని తల్లిమీద, ఏదో ఆంతరంగికమైన అనురాగం వుండేది. ఆ అనురాగం యింకా పూర్తిగానశించలేదు. వెంటనే వేణీ పిన మాటల్ని సమర్థిస్తూ—"అవునవును! అది నిజమే! పిన్ని గొప్పింటివారిబిడ్డ. ఆమె విషయం ఏమైనా అనుకుంటే,

"అదా సంగతి....? అటువంటివాన్ని గడప తొక్కనీయ కూడదు." అని పిన్నమ్మ అన్నది.

ఉత్సాహంగా తలూపుతూ వేణీ అన్నాడు—"అవును. ఎప్పుడూ రానీయకూడదు. ఏం రమా? నీకు రమేశ్ గుర్తే కదూ?"

తన దౌర్భాగ్యపు ప్రసంగం రావడంతోనే రమ సిగ్గుపడింది. అయినా సలజ్జాభావంతో నవ్వుతూ చెప్పింది—"గుర్తెందుకు లేదు—? నా కంటే ఎక్కువ పెద్దవాడేమీ కాడు. అదీగాక, మే మిద్దరం ఆ మసూచిఆసుపత్రి దగ్గరున్న పాఠశాలలో చదువుకున్నాం. కాని, అతనితల్లి చనిపోవడం నాకు బాగా గుర్తువుంది. అతని తల్లికి నేనంటే మహా ఆపేక్షగా వుండేది."

"దాని ఆపేక్ష మండిపోయిందిలే! తన పనికోసం తను చేశిన, నటనది. నిన్నెలాగైనా చేతుల్లో యిరికించు కోవాలనే వాళ్ళ వుద్దేశ్యం?" అని పినతల్లి యింకోమారు ఎగిరి పడింది.

వేణీ ఏదోమహా తెలిసినవాడిలా హుంకరించి—"యిందులో సందేహ మేముంది? పిన్ని వుద్దేశ్యంకూడా..........." అతని మాట పూర్తి కాకముందే రమ కోపంగా—"పిన్ని! యిప్పుడా పాతపురాణం తవ్వుకోవడ మెందుకు?" అని అడిగింది.

రమేశు తండ్రితో రమకు ఎంత విరోధ మున్నప్పటికీ, అతని తల్లిమీద, ఎదో ఆంతరంగికమైన అనురాగం వుండేది. ఆ అనురాగం యింకా పూర్తిగానశించలేదు. వెంటనే వేణీ రమ మాటల్ని సమర్థిస్తూ—"అవునవును! అది నిజమే! పిన్ని గొప్పింటివారిబిడ్డ. ఆమె విషయం ఏమైనా అనుకుంటే,

వున్నాం, యిప్పుడిక తారిణీ ఘోషాల్ లేడు. ఇప్పుడు చూస్తాను యీ భైరవాచారిని రక్షించే వారెవరో ?''

"రమేశ్ ఘోషాల్ రక్షిస్తాడు. చూడన్నయ్యా! శత్రుత్వం పెంచడంలో యితనేమీ తక్కువవాడుకాడు. ఈ సంగతి నేను నీతో ముందే చెప్పివుంచుతున్నాను-'' రమ అన్నది.

యిప్పుడు వేణీ యింకా కొంచెం జరిగివచ్చి, గడపమీద కూచుని అటూ-యిటూ చూసి-తన స్వరాన్ని యింకా తగ్గించి అన్నాడు—"యిప్పుడు నువ్వు వెదురువాసాన్ని వంచాలంటే యిదే అదును. అది ముదిరిందంటే వంచడం చాలా కష్టం. డబ్బూ, దస్కం ఆస్థి-పాస్థులు ఎలా రక్షించుకోవాలో వాడింకా నేర్చుకోలేదు. యిప్పుడీ మధ్యలోనే శత్రువును నిర్మూలించకుంటే ఆ తరువాత మన వల్లకాదు. వాడు ఎవరనుకున్నారు: తారిణీఘోషాల్ కొడుకని మనం మర్చిపోకూడదు''అన్నదిరమ.

"అన్నయ్యా! ఆ సంగతి నాకు బాగాతెలుసు."

"నీకు తెలవందేముందమ్మా—భగవంతుడు నిన్ను మగ పిల్లవాడిగా తయారుచేస్తూ—పొరపాటున ఆడపిల్లగా చేశాడు. తెలివితేటలు గల పెద్ద జమీందారైనా, నీముందు పనికిరాడు. సరే, రేపు ఏదో ఒక సమయంలో వస్తాను. చాలా ఆలస్యమైంది. యిక వెళతాను." అని వేణీఘోషాల్ లేచి నిల్చున్నాడు. ఈ ప్రసంగంవల్ల. రమ వుప్పొంగిపోయింది. ఆయన్ని సాగనంపేందుకు లేచి నిల్చుంది. హఠాత్తుగా ఆమెగుండె దడదడలాడింది. పెరట్లోంచి ఎవరిదో పరిచితవ్యక్తి కంఠస్వరం వినిపించింది—"అరే, రాణీ! ఎక్కడున్నావే....?" అని,

రమను చిన్నతనంలో, రమేశ్ తల్లి యీ పేరుపెట్టి పిలుస్తుండేది. కాని రమ ఆ సంగతే మర్చిపోయింది. ఆమె తలెత్తి వేణీవేపు చూసింది. అతని ముఖం నల్లబడివుంది. ఆ వెంటనే రేగిపోయిన జుట్టుతో—కాళ్ళకు చెప్పులులేకండా తలకు తువాలు చుట్టుకుని రమేశ్ అక్కడికివచ్చి నిలుచున్నాడు. అతనిచూపులు వేణీమీద పడగానే—"అరే! పెద్దన్నయ్యా యిక్కడున్నావేం? సరే పదండి! మీరు లేకుంటే అక్కడి పనంతా ఎవరుచేస్తారు? నేను మీకోసం వూరంతా గాలించి వస్తున్నాను. రాణి ఏదీ?" అని అడిగి గుమ్మానికెదురుగా వచ్చి నిలుచున్నాడు. రమ పారిపోయేందుకు వీలులేక, అక్కడే తలవంచుకుని, నిలుచుంది. క్షణంసేపు రమేశ్ ఆమెవేపు చూసి ఆశ్చర్యపడుతూ అన్నాడు." అరే! నువ్వు చాలా పెద్దదానివయావే? బాగా వున్నావా?"

రమ తలొంచుకునేవుంది. చటుక్కున మాట్లాడలేకపోయింది. రమేశు నవ్వుతూ అడిగాడు—"గుర్తించలేదాయేమే? నేను నీ రమేశన్నయ్యను."

కాని రమ తలెత్తి అతనివేపు చూడలేక, ఎంతో మృదువుగా—"మీరు బాగావున్నారా?" అని అడిగింది.

"ఆ! బాగానేవున్నాను. కానీ, రమా! నువ్వు నన్ను 'మీరు' అని పిలుస్తావెందుకు?" అని వేణీవేపు చూసి విచార సూచకమైన నవ్వు నవ్వి—"పెద్దన్నయ్యా! ఆనాడు రమ అన్న మాటలు నేనింతవరకూ మర్చిపోలేదు. మాఅమ్మ చనిపోయినప్పుడు యిది చాలాచిన్నది. ఆనాడిది నా కళ్ళు తుడుస్తూ—"రమేశన్నయ్యా నువ్వు ఏడవ వద్దు. మా అమ్మవుంది.

మనిద్దరం ఆమెను చెరిసగం పంచుకుందాం" అని చెప్పింది. యేం రమా? నీకాసంగతి గుర్తులేదుకదా? పోనీ, మా అమ్మ అయినా గుర్తుందా?'' అని అడిగాడు.

ఈ మాటవిని రమ యింకా సిగ్గుపడిపోయింది. ఆమె తనకు బాగా గుర్తేనని తల వూగించైనా చెప్పలేకపోయింది. యిక రమతో రమేశు చెప్పడం మొదలుపెట్టాడు. "యిక ఎక్కువ వ్యవధిలేదు. యింకా మూడురోజులు మాత్రమే వున్నయ్! అక్కడ చేయాల్సిందేమో, 'మీరే చేయించండి! ఒక నిరాశ్రయునిలా మీ వాకిటిముందుకు వచ్చి నిలుచున్నాను. మీ రక్కడికి రానిదే ఏపని చేయలేను."

రమ పినతల్లి మెదలకుండావచ్చి రమేశువెనక నిలుచుని వుంది. వేణీగాని, రమగాని రమేశునికి జవాబుచెప్పలేదు, అప్పుడామె అతని ఎదటకువచ్చి—అతన్ని ఎగాదిగా చూసి-''నువ్వు తారిణీఘోషాల్ కొడుకువు కదూ?" అడిగింది.

రమేశుడు యీామెను అంతకుముందెప్పుడూ చూడలేదు. అతను గ్రామమువదిలి వెళ్ళిపోయాక, రమ తల్లికి జబ్బుచేసినప్పుడు యీ యింటికివచ్చింది, అప్పటినుంచీ యిక్కడనుంచి బయటికివెళ్ళలేదు. రమేశు చకితుడై ఆమెవేపు చూస్తున్నాడు.

''కాకుంటే యింతసిగ్గులేనివాడు ఎవడుంటాడు? తండ్రికితగ్గ కొడుకు. అడక్కుండా—చేయకుండా పరులయిళ్ళలోదూరి, యింత అల్లరి చేసేందుకు నీకు సిగ్గుకూడాలేదూ?''

రమేశు మతిలేనివానిలా చూస్తూ కొయ్యబారిపోయాడు.— 'నేను వెళుతున్నాను-' అంటూ వేణీ జారుకున్నాడు.

రమ వంటింటిలోంచే అన్నది "ఏమిటా వాగుడు పిన్నీ? నువ్వెళ్ళినీపని చూడరాదూ?"

తన అక్కకూతురు అన్నమాటల్లోని ఆంతర్యాన్ని గ్రహించిన దానిలా పినతల్లి—తన స్వరంలో యింకా కొంచం విషం కలిపి-అన్నది—"చూడు రమా? యిది వాగడమని నువ్వనుకోవద్దు. ఏదైనా పనిచేయవలసి వచ్చినప్పుడు, మీలా నేను మొహమాటపడను. యింతకూ వేణీ భయపడి పారిపోవాల్సిన అవుసర మేమివచ్చింది? చూడబ్బాయీ! మీ కొంపలోదూరి నీళ్ళుతేవడానికీ, పనిపాటలు చేయడానికీ, మేము నీ నౌకరులంగానీ, గుమస్తాలంగానీ, మీ జమీందారీలోని ప్రజలం కాము. తారిణీఘోషాల్ చనిపోయాడు. గ్రామ మంతా చల్లబడింది. వేణీ యీమాట నా నోటితో చెప్పించక, తన నోటిమీదుగా చెప్పినట్లయితే మగవాడు తగినపని చేసినట్లయేది—"

అప్పటికి రమేశు రాతిప్రతిమలా నిల్చుని వున్నాడు. వాస్తవంగా ఈ సంగతులు, యిలా యెదురుతిరగుతవని ఆతను కలలో కూడా అనుకోలేదు. లోపల వంటగదిలో గొళ్ళెం చప్పుడు వినిపించింది. కాని ఎవరూ అది గమనించలేదు. నోరుమెదల్చక తెల్లపోయి చూస్తున్న రమేశ్ ముఖంలోకి చూస్తూ ఆమె మళ్ళీ అన్నది—"ఏది ఏమైనా—నువ్వు బ్రాహ్మణుల అబ్బాయివి. నిన్ను నౌకరులతో, దరవానుతో గెంటించలేను. వళ్ళు దగ్గరెట్టుకుని పనులు చేస్తూవుండు. యిక్కడనుంచివెళ్ళు. యితరుల యిళ్ళలో దూరి అల్లరిచెయ్యడానికి నువ్వేమీతెలియని పసివాడివి కావు. నీయింట్లో కాలుగడిగేందుక్కూడా మా రమ రాదు. నేనా సంగతి నీకు ముందే చెబుతున్నాను."

రమేశ్‌కు నిద్రనుంచి మేలుకున్నట్లయింది. అతనిలోంచి ఓ పెద్దనిట్టూర్పు వచ్చింది. తన నిట్టూర్పును విని తనే త్రుళ్ళిపడ్డాడు. తలుపుచాటున నిలుచుని రమ తలెత్తిచూసింది. మొదట రమేశు కొంచం తొట్రుపడ్డాడు. కాని, ఆతరవాత వంటింటివేపు చూసి చెప్పాడు—"రావడానికి వీలులేనప్పుడు యిక వుపాయమేముంది? కానీ, నాకీసంగతు లన్నీ తెలియవు. నేను తెలియక చేసిన తప్పును క్షమించు రాణీ—"

ఈ మాట లని రమేశు బయటికి వెళ్ళిపోయాడు. గదిలోంచి ఏవిధమైన శబ్దము లేదు. రమేశు ఎవరిని క్షమించమని కోరాడో వాళ్లు తలుపుచాటున వుండి తనను చూస్తున్నారన్న సంగతే తెలియదు. ఆ తరవాత వెంటనే వేణీ అక్కడకు వచ్చాడు. అతను పారిపోలేదు. ఎక్కడో దాగుకుని, రమేశు యెప్పుడు వెళతాడా అని చూస్తున్నాడు. ఆమె అతన్ని చూచి చారెడు ముఖంచేసుకుని ముందుకురాగా ఆమెతో అన్నాడు—"మా బాగా అడిగేశావు చిన్నమ్మా! యిలా మేము అడగలేము. రమా! యిది నౌకర్లూ, దర్వానులు చేసేపనేనా? నేను చాటుగావుండి చూస్తున్నాను. వాడిముఖం ఆషాఢమేఘంలా అయిపోయింది. మంచిశాస్తి జరిగింది."

"అవును. బాగానే శాస్తిజరిగిందని నాకూతెలుసు. కానీ యీ మాటలన్నీ మా యిద్దరి ఆడవాళ్ళతో చెప్పించకండా- నువ్వన్నట్లయితే ఎంతో బావుండేది. పోనీ, నువ్వు చెప్పలేకపోవచ్చు. మరి యిక్కడే నిల్చుని నేనన్నమాటలు వింటే ఎంతబావుండేది? నువ్విక్కడినుంచి తప్పుకోవడం యేమంత బావుండలేదు." అని అభిమానంతో ఆమె అన్నది.

ఆమె మాటలకు వేణీ ముఖంలోని నవ్వు మాయమైంది. ఆమె అన్నమాటలకు ఏమని జవాబు చెప్పాలో అతనికి చప్పున తోచలేదు. యింతలో రమ లోపల్నుంచి వచ్చి జవాబుచెప్పింది- యింతవరకూ ఆమె ఒక్కమాటకూడా మాట్లాడలేదు—"పిన్నీ! నువ్వు బాగానే అడిగావుగా? నువ్వు మాట్లాడ్డమే మంచిదయింది. ఎవరెంత బాగా మాట్లాడినా—నీలా యెవరికి యింత విషం కక్కడం చేతకాదు.''

వేణీ, పిన్ని యిద్దరూ ఆశ్చర్యంలో మునిగిపోయారు. పిన్ని వంటింటివేపు చూస్తూ అడిగింది—'ఏమిటే నువ్వన్నది?'

"ఏమీలేదు. పూజచేస్తూ-చేస్తూ-ఏడుమార్లు లేచివచ్చావు. వెళ్ళి పూజ ఆఖరుచెయ్! యివాళ వంట ఏమీ చేయనవుసరం లేదా?'' అంటూ రమ బయటికివచ్చి, ఎవరితో ఏమీ మాట్లాడకుండా వరండాలోంచి యింకొక గదిలోకి వెళ్ళిపోయింది. వేణీ శుష్కించిన ముఖంతో చాలా నెమ్మదిగా—'అసలు సంగతేమిటి పిన్నీ?' అని అడిగాడు.

"నాకేం తెలుసు? ఆరాజా-రాణిగారి ఉద్దేశ్యంతెలుసుకునేందుకు నాబోటి దాసీలకూ నౌకర్లకూ చేతకాదు—" అంది. కోపంతోనూ, క్షోభతోనూ, పిన్నిముఖం నల్లబడిపోయింది. ఆమె వెళ్ళి పూజాసనం మీద కూచుంది. బహుశా మనసులోనే భగవంతుని తలుచుకుంటుందేమో! వేణీ మెల్లి మెల్లిగా అక్కణ్నుంచి వెళ్ళిపోయాడు.

2

ఈ కుంవాపురం సంపద సంపాదన విషయంలో ఒక కథ వుంది, అది యిక్కడ చెప్పడం అవసరం; వంద సంవత్సరాల

క్రితం మహాకులీనుడైన బలరామముఖర్జి, తన మిత్రుడైన బలరామఘోషాల్‌ను వెంటబెట్టుకుని, విక్రమపురంనుంచి, యిక్కడికి వచ్చాడు. ముఖర్జి కులీనుడేకాదు. చాలా తెలివితేటలుగలవాడు. ఆయన తన వివాహంచేసుకుని, జమీందారులవద్ద పనిచేస్తూ-యింకా ఏమేమోచేసి, యీ ఆస్థిఅంతా చేజిక్కించుకున్నాడు. ఘోషాలు కూడా యిక్కడే వివాహంచేసుకున్నాడు, ఆయన తన తండ్రిచేసిన అప్పులు తీర్చడం తప్ప యింకేమీ చేయలేకపోయాడు. అందువల్ల అతను చాలాకష్టంగా కాలం వెళ్ళదీస్తున్నాడు. వివాహ విషయంలోనే యిద్దరిమిత్రులకు విరోధం కలిగింది. ఈ విరోధం ఎంతవరకు వచ్చిందంటే, ఒక వూళ్ళోనేవుంటూ, మిత్రులిద్దరూ యిరవైయేండ్లవరకూ ఒకరిముఖం ఒకరు చూచుకోలేదు. చివరకు బలరామముఖర్జి చనిపోయినప్పుడు కూడా, ఘోషాల్ ఆయనింట్లో అడుగుపెట్టలేదు. కానీ ముఖర్జి చనిపోయిన మరునాడు తన యావదాస్థిని, సగం తన సంతానానికీ, మిగిలిన సగం మిత్రుని సంతానానికి చెందేట్లు వీలునామా వ్రాశాడనివూరంతా గుప్పుమన్నది. అప్పటినుండీ యీ కుంవావురం జమీందారీ యావత్తూ ముఖర్జీ - ఘోషాల్‌వంశస్థుల హస్తగతమై చెరిసమానంగా అనుభవిస్తూ వస్తున్నారు. వీరు తాము జమీందారులమని సగౌరవంగా చెప్పుకుంటున్నా, గ్రామస్తులు కూడా కాదనడంలేదు. ఈ కథ జరిగేనాటికి, ఘోషాల్ వంశంవాళ్ళుకూడా రెండు భాగాలుగా ఆస్థిని పంచుకుని వేరుపడివుంటున్నారు. కొన్నిరోజుల క్రితం, ఆ వంశంలో చిన్నవాడైన తారిణీఘోషాల్ దావా విషయంలో జిల్లాకోర్టుకు

వెళ్ళాడు. అక్కడి కోర్టులో అతనికి అయిదారు కేసులున్నయ్ ! కాని, అదావాలపర్యవసానం ఏమీ తేలకముందే, ఎక్కడిదో యింకొక పెద్దకోర్టు ఆజ్ఞనుంచి తప్పించుకోలేక, యీలోకంనుంచి మెదలకుండా వెళ్ళిపోయాడు. ఈ సంగతి కుంవాపురమంతా గుప్పుమని ప్రక్కవూర్లకుకూడా వ్యాపించిపోయింది. ఘోషాల్ వంశంలో పెద్దసంతతికి చెందిన వేణీఘోషాల్ తన పినతండ్రి చావుకు చాలా సంతోషించి నిట్టూర్పు విడిచాడు. ఆ తరువాత రాబోవు చిన్నాయనగారి శ్రాద్ధం సరిగ్గా జరగనివ్వకుండా చేయాలని, లోలోపలే కుట్రలుచేస్తున్నాడు. పదిసంవత్సరాలనుంచి తనకూ పినతండ్రికీ మాటలులేవు. ఒకరిముఖం ఒకరు చూచుకుని ఎరుగరు. పదిసంవత్సరాల క్రితం తారిణీ భార్య చనిపోయింది. అందువల్ల తన కొడుకు రమేశుని మేనమామల యింటికి పంపి. తను యింట్లోనే, దాసదాసీలతో-నౌకర్లతో-బయటి వ్యవహారాలతో తన కాలం కాస్తాగడిపాడు, కాలేజీలో చదువుకుంటున్న రమేశు తండ్రి మృత్యువార్త విని-ఎంతో దుఃఖంతో శ్రాద్ధాది కర్మలు చేసేందుకు తన స్వగ్రామము నిన్నటి మధ్యాహ్నమే వచ్చాడు,

మైలకొంప ! యింకా రెండురోజులే వ్యవధివుంది. గురువారంనాడు తండ్రి శ్రాద్ధం. చుట్టుప్రక్కల గ్రామాలనుంచి, ముసలివాళ్ళు ఒకరూ, యిద్దరూ వస్తున్నారు. కాని, వున్నవూరైన కుంవాపురంలోంచి యింకా ఎవరూ రాలేదు. ఎందుకు రాలేదో-ఆసంగతి రమేశుకు తెలుసు. అసలు శ్రాద్ధం ఆఖరయేవరకూ ఎవరూ రారని కూడా గ్రహించాడు, ఒక్క భైరవాచారి—అత్త

నింటివాళ్ళుమాత్రంవచ్చి, పనులన్నీ చేస్తున్నారు. చాలానేపటి నుంచి రమేశం యింట్లో తన పనులు చేసుకుంటున్నాడు. వూళ్ళోని బ్రాహ్మణులు తనింటికి వస్తారనే ఆశలేకపోయినా- పనులన్నీ భారీగానే చేస్తున్నాడు. రమేశు ఏదో పనిమీద బయటికి వచ్చాడు. ఈలోపల ఎవరో యిద్దరు వృద్ధులు వచ్చి తివాచీ మీద కూచుని హుక్కా త్రాగుతూండడం చూశాడు. ఆయన వాళ్ళదగ్గరకు వచ్చి ఏవోరెండు ఉపచార వాక్యాలు అందామని అనుకుంటుండే సరికి- వెనక చప్పుడైంది. ఆయన తలతిప్పి చూసేసరికి, ఎవరో పండుబారిన వృద్ధుడు అయిదారుగురు పిల్లలను వెంటబెట్టుకుని దగ్గుతూ లోపలికి రావడం చూశాడు. ఆయన భుజంమీద ఒకపాత కండువావుంది. ముక్కుమీదగాజుల్లా రెండుకళ్ళద్దాలువున్నాయ్! కళ్ళద్దాలు దారంతో వెనకకట్టివున్నయ్. తలమీది వెంట్రుకలు పండి తెల్లగావున్నయ్! మీసాలుకూడా తెల్లగా వున్నయ్! కానీ పొగత్రాగడంవల్ల, ఆ పొగకు అవి పొగాకురంగుగా మారిపోయినయ్! ఆయన యింకా కొంచం ముందుకువచ్చి, ఆ భయంకరమైన కళ్ళద్దాల్లోంచి రమేశునిముఖం చూస్తూ—అనునయ వాక్యాలు ఏమీ మాట్లాడకుండానే, ఒక్కసారిగా యేడ్చాడు. ఈయన ఎవరో రమేశు గ్రహించలేక పోయాడు. కానీ ఆయన ఎవరైతేయేం? రమేశు గాబరాతో ఆయనకు ఎదురు వెళ్ళాడు. రమేశు అతని చేతులు పట్టుకున్నాడో లేదో గద్గదకంఠంతో—"లేదు నాయనా రమేశ్! ఈవిధంగా నన్ను మోసపుచ్చి, తారిణీ యిలా వెళ్ళిపోతాడని నేనెప్పుడూ అనుకోలేదు. అక్కడా—యిక్కడాచేరి, ఎవరిముందు వారిమాటల్లు

మాట్లాడే ఛటర్జీవంశంలో పుట్టలేదునేను. రమేశు శ్రాద్ధానికి ఎంతగొప్పగా ఏర్పాట్లు చేస్తున్నాడో, అంతగొప్పగా యిదివరకు ఈ ప్రాంతాల్లో ఎవరూ చేసివుండరు. అని నేను వచ్చేప్పుడు వేణితో చెప్పేవచ్చాను.'' అని కొంచంఆగి—"చూడు నాయనా! కొంతమంది వెధవలు నామీద లేనిపోనిమాటలు మీముందు అనే వుంటారు. కానీ యీ సంగతిమాత్రం గుర్తుంచుకో! ఈ ధర్మదాసు కేవలం ధర్మానికి దాసుడుకానీ, యింకెవరికీ కాదు.'' అని వృద్ధుడు తన సత్యభాషణంలోని పౌరుషమంతా ప్రదర్శిస్తూ, గోవింద గంగూళీ చేతి హుక్కా లాగుకుని గట్టిగా దమ్ములాగి, గట్టిగా దగ్గడం సాగించాడు.

ధర్మదాసన్నదానిలో అత్యుక్తి యేమీలేదు. శ్రాద్ధానికి జరుగుతున్న యేర్పాట్లు చూస్తుంటే, యిదివర కెప్పుడూ యెవరూ ఇలా చేసివుండ రనుకోవచ్చు. కలకత్తానుంచి వంటవాళ్ళు వచ్చారు. వాళ్ళు పెరట్లో ఒక ప్రక్కన పిండివంటలు చేస్తున్నారు. వూళ్ళోని పిల్లలంతా అక్కడ చేరారు. బీదవాళ్ళకు బట్టలు పంచా లనుకున్నారు. చండీమండపానికి ఒక ప్రక్కగా కూచుని, భైరవాచారి తానులనుంచి ధోవతులు చింపుతూ కుప్పలు పెడుతున్నాడు. కొంతమంది అక్కడ కూడా కూచుని, యీఅపవ్యయం లెక్కలువేస్తూ—రమేశుని మూర్ఖత్వాన్నిగురించి మనసులో తిట్టుకుంటున్నారు. బీద—బిక్కా మొదలైనవాళ్ళంతా చాలాదూరంనుంచి వస్తున్నారు. అన్నిరకాలైన మనుష్యులతో యిల్లంతా నిండిపోయింది. కొందరు పోట్లాడుకుంటున్నారు. కొందరు అల్లరి చేస్తున్నారు. చుట్టూ కలియ చూశాడు ధర్మదాసు.

చివరకు యింత అపవ్యయము కంటబడేసరికి ధర్మదాసుకు దగ్గు యెక్కువైంది.

ధర్మదాసుకు సమాధానంగా రమేశు—'కాదు, కాదు.' అని అంటూ యింకా యేదో చెప్పబోతున్నాడు. కానీ ధర్మదాసు చేత్తో అతన్ని ఆగమని, గడగడ మంటూ ఏదో వాగుతున్నాడు, కానీ దగ్గువల్ల అత నన్నమాటలు యెవరికీ అర్థంకాలేదు.

అసలు గోవిందగంగూళి అందరికంటే ముందువచ్చాడు. ధర్మదాసు చెప్పిన మాట లన్నీ గోవిందగంగూళీ అందరికంటే ముందు చెప్పే అదను దొరికింది. కానీ, అప్పు డామాటలు చెప్పలేక పోయాడు. యిప్పుడు పశ్చాత్తాప పడుతున్నాడు. కానీ యిప్పుడు మళ్ళీ అవుసరం దొరికింది. దీన్ని మాత్రం వ్యర్థం చేయలేదు. ఆయన ధర్మదాసుకు చెపుతున్నట్లు తొందర తొందరగా చెప్పాడు—"నిన్న ప్రొద్దున విను ధర్మదాసన్నయ్యా! యిక్కడికి వద్దామని యింట్లోంచి బయలుదేరాను. వేణు నన్ను పిలవడం మొదలుపెట్టాడు. 'గోవింద్ చిన్నాయనా! కొంచం హుక్కాత్రాగి వెళ్ళువుగానిరా!' అని పిల్చాడు. మొదట అక్కడికి వెళ్ళవలసిన అవుసరం లేదులేఅని అనుకుని, అయినా అతని అభిప్రాయంకూడా తెలుసుకోవచ్చునని వెళ్ళాను. వేణీ యేమన్నాడో విన్నావా రమేశ్? అతను—''చిన్నాయనా! నువ్వు రమేశుకు సాహాయ్యం చేద్దామని, నిలుచున్నావు. కాని, మరి అక్కడికివచ్చి తిండి తినివెళ్ళేవా రెవరైనా వున్నారా?" అని అడిగాడు. అయినా నేను వదిలిపెట్టాననుకున్నారా? అతను గొప్ప వాడైతేకావచ్చు. కాని రమేశుకూడా ఎవరికి తీసిపోడు. అతని

దగ్గర్నుంచి చిట్టెడు గింజలు తెచ్చుకుందామనే ఆశ యెవరికీ లేదు. నేను—"వేణీ! వచ్చేపోయేదారి యిదేకదూ? బీద—సాదలు సెలవుపుచ్చుకుని వెళ్ళిపోయేప్పుడుమాత్రం కొంచెం యిక్కడుండి చూస్తూవుండు. రమేశు యింకా పసివాడైతేయేం? హృదయమంతే అతనిదే. నాకింత వయసు వచ్చింది. కాని యిటువంటి ఏర్పాట్లు ఎక్కడా చూడలేదు. అయినా మనదేముంది ధర్మన్నయ్యా? ఇది యెవరిపనో—ఆయనే పైనుంచి చేయించుకుంటున్నాడు. తారిణీ అన్నయ్యశాపంవల్ల పుట్టిన దిక్పాలకుడు కాకుంటే మరెవరు....?"

కాని ధర్మదాసు దగ్గుమాత్రం తగ్గలేదు. ఆయన దగ్గుతూనే వున్నాడు. తనయెదటనే గంగూళీ వినసొంపైన మాటలు చిన్న జమీందారుకు చెపుతూంటే, తనంతకంటే మంచిమంచి మాటలు చెప్పాలని దగ్గుతో తల్లక్రిందవుతున్నాడు.

గంగూళి యింకా చెపుతూనే వున్నాడు—"నాయనా! నువ్వు నాకేమీ పరాయివాడివికావు. మీ అమ్మ మా మేనత్తకూతురుకు చిన్నాయనకూతురు. రాధానగరంలో బెనర్జీల యింటిసంగతి తారిణీ అన్నయ్యకు బాగాతెలుసు. అందువల్లనే ఏపనికలిగినా—దావాలు కలిగినా—ఈ గోవిందునికి పిలుపువచ్చేది."

యిప్పుడు ధర్మదాసు ప్రాణాలన్నీ బిగబట్టి దగ్గు ఆపుకుని కోపంతో అన్నాడు—"గోవింద్! యెందుకు వ్యర్థంగా వాగుతావు? ఖ్-ఖ్-ఖ్. నేనిప్పటివాణ్ణికాను. నాకేమీ తెలవదనుకున్నావా? ఒకప్పుడు సాక్ష్యానికి రమ్మంటే, నాకాళ్ళకు చెప్పులు లేవు. అందు దూరం నడిచి ఎలా రమ్మంటావు? అని నువ్వు

నలా ? ఛ్-ఛ్-ఛ్. తారిణీ అన్నయ్య రెండున్నరయిచ్చి కొని పెట్టిన చెప్పులు తొడుక్కొని వెళ్ళి వేణీతరఫున సాక్ష్యంచెప్పి వచ్చావు. ఛ్-ఛ్-ఛ్."

గోవింద కళ్ళెర్రచేసి—'నేను సాక్ష్యం చెప్పానా ?' అన్నాడు.

'చెప్పలేదూ ?'

'పోరా—తప్పుడు ముండాకొడకా'

'తప్పుడువాడు మీనాయన, నేనుకాదు.'

గోవిందుడు తన విరిగిపోయిన గొడుగు ఎత్తి—'రారా ! రా—' అన్నాడు.

ధర్మదాసు చేతికర్ర పైకెత్తి హుంకరించాడు. అప్పుడీ దగ్గు తెర వచ్చింది—రమేశు గాభరాపడుతూ యిద్దరిమధ్యకు వచ్చి స్తంభించిపోయాడు. ధర్మదాసు తన చేతికర్ర క్రిందకు దించి దగ్గుతూ కూచుని అన్నాడు—"ఆ వెధవకు నేను వరుసకు అన్న నవుతాను. వాడిపొగరు చూశారుగా !"

గోవిందగంగూలీ తన గొడుగుక్రిందకు దించి— "ఈ ముండా వాడు నాకు అన్నట—" అన్నాడు.

కలకత్తా వంటవాళ్ళ వంటఆపి యీ తమాషా చూస్తున్నారు. పనిపాటల్లో మునిగివున్న వాళ్ళంతా ఈ గందరగోళం చూసేందుకు అక్కడ చేరారు. పిల్లలంతా ఆటమాని, ఈ ఆటదగ్గర పోగయారు. వాళ్ళందరి ఎదట రమేశు మాత్రం సిగ్గూ—సంభ్రమాశ్చర్యాదులతో నిలుచుని వున్నాడు. అతని నోటంట మాటలేదు. ఏమిటిదంతా ? యిద్దరూ పెద్దవాళ్ళే ! వయసు ముదిరినవాళ్ళే, బ్రాహ్మణులే ! యింత సామాన్య విషయానికి

అలగా వాళ్ళలా తిట్టుకుంటున్నారు. చండీ మండపం వరండాలో కూచుని భైరవాచారి గుడ్డలు చించుతున్నాడు. అంతా వింటు న్నాడు. చూస్తున్నాడు కూడా. అప్పుడు లేచివచ్చి రమేశుతో అన్నాడు—"యిప్పటికి నాలుగువందలు చింపాము. యింకా, ఏమన్నా కావాల్సి వస్తాయా ?"

అందుకు వెంటనే రమేశుని నోటంటమాట పెగలి రాలేదు, అభిభూతుడైన రమేశుని చూసేసరికి భైరవాచారికి నవ్వు వచ్చింది, అతను ఎంతో మెత్తగా మందలిస్తూ అన్నాడు— "ఛీ. గంగూళిమహాశయా ! బాబుగారు ఒక్కసారే నిశ్చేష్టు లయారు. బాబుగారూ ! మీ రా విషయాలు అంతగా పట్టించు కోకండి : యిటువంటి సంగతులు యిక్కడ అప్పుడప్పుడూ జరుగుతూనే వుంటయ్. పెద్ద పెద్ద కార్యాలు చేసే యిళ్ళలో యిటువంటి పోట్లాటలూ — కొట్లాటలూ జరుగుతూనే వుంటయ్ ! చివరకు దెబ్బలాటలు మొదలుకుని, ఖూనీలవరకూ పోతూం టయ్ ! ఆ తరువాత అంతా కలిసి ఒకటవుతారు, సరే యిక లేవండి ఛటర్జిగారూ : యింకా ధోవతులు కావాలేమో కొంచం చూడండి—"

ధర్మదాసు జవాబు చెప్పకముందే, గోవిందగంగూళి యెంతో వుత్సాహంగా లేచినిల్చుని అన్నాడు—"అవును. యిలా జరుగు తూనే ఉంటయ్ ! అప్పుడప్పుడు జరుగు తుంటయ్ ! లేకుంటే యిది 'గొప్ప కర్మ' అని అనిపించుకోదు, లక్ష సంగతులు జరగనిదే పెళ్ళికాదని శాస్త్రాల్లో రాసివుంది, ఆ సంవత్సరం జరిగిన సంగతి నీకు గుర్తేకదు భైరవ్? ముఖర్జీవారి కూతుర్ల

రమ పెళ్ళప్పుడు – రాఘవభట్టాచారీ, హరాన్ ఛటర్జీ తలకాయలు పగులకొట్టు కున్నారు, కాని భైరవన్నయ్యా! రమేశు పని నా కేమీ బావుండలేదు. అలగా వాళ్ళకు గుడ్డలు పంచడం—బూడిదలో నెయ్యి పోయడం వకటే. అందువల్ల బ్రాహ్మణులకు జత ధోవతులు. వారి పిల్లలకు ఒక్కొక్క ధోవతి యిచ్చి నట్లయితే పేరు వస్తుంది. చిన్నబాబుకి యీ పద్ధతి ప్రకారం చేయమని చెపుతున్నాను. ధర్మన్నయ్యా! నీ అభిప్రాయం ఏమిటి....?''

ధర్మదాసు తలూపుతూ—''అవును. గోవిందు ఏమీ తప్పన లేదు. వీళ్ళకు వెయ్యిపంచినా పేరుప్రతిష్టలురావు. లేకుంటే వీళ్ళను అలగా జాతని యెందుకుంటారు? గ్రహించా రమేశ్?'' అని చెప్పాడు.

యింతవరకూ రమేశు మెదలకుండా వున్నాడు. గుడ్డలు పంచే విషయంలో అతనికి చాలా బాధగావుంది, కాని వాళ్ళ యుక్తి-కుయుక్తుల కేమీ బాధపడలేదు. అన్నిటికంటే ఈ సంగతే అతనికి గుర్తుకొస్తూంది. అలగా వాళ్ళనీ, నీచులనీ, యిప్పుడు అన్నవాళ్ళే, యింతమంది అలగా జాతిముందు తాము సిగ్గెగ్గులు లేకుండా దూషించుకున్నారు. ఇంకా భైరవ్ తన ముఖంవేపు చూస్తుండంచూసి రమేశు—''ఇంకా రెండు వందలు చింపి తయారుచేసి వుంచండి—'' అని చెప్పాడు.

''అవును, అన్నిలేకుంటే పనెలాజరుగుతుంది,? పద భైర వన్నయ్యా! నేనూ వస్తాను పద. నువ్వు వంటరిగా యెంతపనని చేస్తావు—?'' గోవిందగంగూళి అని యెవరి అనుమతి అపేక్షించ

కుండా గుడ్డలకుప్పదగ్గరకెళ్ళి కూచున్నాడు. రమేశు లోపలికి వెళదామనుకుంటున్నాడు, ఇంతలో ధర్మదాసు అతన్ని పిల్చి, ఒకప్రక్కకు తీసుకునివెళ్ళి ఏదో గుసగుస చెవిలో చెప్పాడు. అందుకు సమాధానంగా తలూపి రమేశు లోపలికి వెళ్ళిపోయాడు. యీ సంగతి గోవింద గంగూళి క్రీగంట చూశాడు.

యింతలో మీసాలులేని ఓ ముసలి బ్రాహ్మణుడు—"ఏడీ! మా బాబు యెక్కడ?' అంటూ లోపలికి వచ్చాడు.

ఈ బ్రాహ్మణుని వెంట యిద్దరు ముగ్గురు పిల్లలు వున్నారు. అందరికంటే ఆడపిల్ల పెద్దది. ఆమె శరీరంమీద పాతడోరియాల ధోవతివుంది. మిగిలిన యిద్దరిపిల్లకు గోచీలు తప్ప మిగిలిన శరీరమంతా దిగంబరంగానేవుంది. అక్కడున్నవాళ్ళంతా తలెత్తి చూశారు. గోవిందగంగూళి ఆయన్ని ఆహ్వానిస్తూ అన్నాడు-''రా దీనూఅన్నయ్యా! కూచో! మీ చరణ ధూళి మాయింట్లోపడడం మా భాగ్యం పాపం రమేశు చాలా గాబరా పడుతున్నాడు. అందువల్ల మీరంతా.........''

ధర్మదాసు, గోవిందునివేపు తీక్షణంగా చూశాడు. కాని గోవిందు ఆ చూపుల్ని లక్ష్యపెట్టకండానే దీనూతో అన్నాడు— 'అయినా మీరంతా యిటువేపే రాలేదు' అంటూనే అతనిచేతికి హుక్కాయిచ్చాడు. దీనూభట్టాచారి, తన స్థానంలో కూచుని, నిప్పులేని హుక్కాను వ్యర్థంగా రెండుదమ్ములులాగి—"నేనిక్కడ లేను తమ్ముడూ! కోడలిని తీసుకునిరావడానికి వెళ్ళాను. యింతకూ రమేశు ఎక్కడ? చాలా పెద్దఏర్పాట్లు చేస్తున్నారని విన్నానే! దారిలో అవూళ్ళో విన్నాను. భోజనాలయాక, చిన్న

వాళ్ళకూ, పెద్దవాళ్ళకూ లడ్లూ, మాల్పూరీలు పంచిపెడతా రటగా?"

గోవిందుడు కొంచం నిదానంగా—"అంతేకాదు. ఒక్కొక్కరికి ఒక్కొక్క ధోవతికూడా దొరుకుతుంది. అడుగో....యితనే రమేశ్! దీనూఅన్నయ్య కదేచెపుతున్నాను. ఏదో మీబోటి పెద్దల ఆశీర్వాదబలంవల్ల అన్నీ చేసుకుని వస్తున్నాము. కాని, వేణీ మావెంటబడ్డాడు. ఆయన నన్ను పిలవడానికప్పుడే రెండు సార్లు మనిషిని పంపాడు. సరే నాసంగతటుంచండి! నాకూ— రమేశుకూ రక్తసంబంధముంది. కాని, ఈ దీనూ అన్నయ్యా, ధర్మన్నయ్యా వీళ్ళు నిన్నూరికే వదిలిపెట్టరు బాబూ! దీనూ అన్నయ్య దారిలోనే యీసంగతివిని పరుగెత్తుకుంటూ వచ్చాడు. అరే ఓ షష్టీచరణ్: కొంచం పొగాకు తీసుకునిరారా! నాయనా రమేశ్! ఒక్కసారి యిటురా. ఒకసంగతి చెపుతాను" అని అన్నాడు.

రమేశుని ఒకప్రక్కకు తీసుకువెళ్ళి నెమ్మదిగా చెప్పాడు— "అయితే ధర్మదాసు భార్య లోపలవుందా? జాగ్రత్త రమేశ్! అటువంటి పనిమాత్రం చేయవద్దు. అతనెంతచెప్పినా—సామాను గదితాళం మాత్రం యిచ్చేవు? ధర్మదాసుభార్య ఏటువంటి దను కున్నావు? ఆమె నెయ్యీ, పిండీ, నూనే, వుప్పూ—అన్నీ సగంసగం యింటికి చేరవేస్తుంది. నువ్వేమీ విచారపడవద్దు. నేను వెళ్లి మీ వదినెను పంపుతాను. అదివచ్చి నీసామాను గది భారం వహించిందంటే ఓ పూచికపుల్లకూడా పోదు."

రమేశ్ తలూపి—'మీఆజ్ఞ—అలాగే కానివ్వండి' అని మెదల కుండా వూరుకున్నాడు. అయినా అతని ఆశ్చర్యానికి అంతం లేదు, ధర్మదాసు సామానుగది బరువు మోయడానికి తనభార్యను పంపుతానని ఎంతో రహస్యంగా చెప్పాడు. ధర్మదాసు యిలా చెప్పాడని, గోవింద్ ఎలా గ్రహించగలిగాడు ?

దిస్సమొలతో వున్న యిద్దరుపిల్లలూ, పరుగెత్తుకుని వచ్చి దీనూ భట్టాచారి భుజాలు కరుచుకుని—'మిఠాయికావాలి' అని గోలచేస్తున్నారు.

దీనూ ఒకసారి రమేశ్ ముఖంలోకి యింకొకసారి గోవిందుని ముఖంవేపుచూసి—'అరే! మిఠాయి నేనెక్కడనుంచి తీసుకుని రాను ?' అని అన్నాడు.

'అదిగో అక్కడ చేస్తున్నారుగా ?' అని పిల్లలు అటు చూపించారు.

ఇంకా అక్కడున్న నలుగురైదుగురు పిల్లలు యేడుస్తూ అక్కడికి వచ్చి—'మాకుకూడా కావాలిబాబా' అని దీనూ భట్టాచారిని చుట్టేశారు.

రమేశ గాబరాపడుతూ ముందుకువచ్చి—"సరేలే—సరేలే! ఆచార్యులుగారూ! వీళ్ళంతా పగలు మూడోజామున యింటి నుంచి బయలుదేరారుకామోలు. అన్నాలు తినివచ్చారోలేదో—అరేయ్! నీపేరేమిటి ...? ఆపళ్ళెం యిటుపట్టుకునిరా" అని పిల్చాడు.

వంటమనిషి పళ్ళెం తీసుకునిరాగానే పిల్లలంతా విరుచుక పడ్డారు. పంచే అవకాశం యివ్వలేదు. ఆ పిల్లలంతా మిఠాయి,

తింటూవుండడం చూసి, దీనూ శుష్కదృష్టి కూడా సజల మైంది—"ఓ మునియా! తింటే తింటున్నావు. కాని రుచి యెలావుందో చెప్పు." అన్నాడు.

'బాగావుంది' అంటూ మునియ తింటూంది. దీను నవ్వి త లూపుతూ—"మీకూ రుచి తెలుసూ! తియ్యగావుంటేసరి. ఆ....ఏమోయ్! ఆ కళాయి ఎందుకు దించావు? ఏం గోవిందన్నయ్యా! యింకా కొంచం ప్రొద్దున్నట్లుందే" అని అన్నాడు.

వంటవాడు ఎటువేపు చూడకుండా అనేశాడు—"ఎందుకులేదు. యింకా చాలా వ్యవధివుంది. యిప్పుడుకూడా సాయంత్రపు—పూజ........"

"సరే ఏదీ ఒకటి మా గోవిందన్నయ్యకుకూడా యివ్వు! మీ కలకత్తా బ్రాహ్మణులవంట ఎలావుంటుందో రుచి చూస్తాడు. వద్దు....వద్దు....నా కెందుకు....? సరే సగం యివ్వు. సగంకంటే ఎక్కువ యివ్వవద్దు. అరే ఓ షష్టీచరణ్! కొంచం నీళ్ళు తీసుకురా—కాళ్ళూ—చేతులు కడుక్కోవాలి."

యింతలో రమేశ్—"షష్టీచరణ్! లోపల్నుంచి యింకా నాలుగు పళ్ళాలు పట్టుకురా" అని పురమాయించాడు.

యజమాని ఆజ్ఞ అవగానే లోపల్నుంచి మూడు నాలుగు పళ్ళాలు వచ్చినయ్! వాటితోపాటు మంచినీళ్ళ గ్లాసులు. చూస్తూ-చూస్తుండగానే, ఆ మూడు పెద్దపళ్ళాల్లోని మిఠాయి అంతా ఆ ముగ్గురు మలేరియా బ్రాహ్మణులు మధ్యాహ్నపు ఫలహారం క్రింద మాడ్చేశారు. దీననాధుడు తలెత్తి అన్నాడు—"పీళ్ళే

కలకత్తా వంటవాళ్ళంటే. ఏమంటావు గోవింద్ ? ఏమంటావు ధర్మదాస్ ?"

ధర్మదాసు ముందున్న పళ్ళెం యింకా ఖాళీ కాలేదు. అందుచేత నోట్లో మిఠాయివుండ వున్నందువల్ల, అతని గొంతులోంచి మాట పెగలలేదు. కానీ, ఈ విషయంలో అతనికేమీ అభిప్రాయ భేదం లేనట్లుగానే తోచింది.

"అవును. వస్తాదు చెయ్యే—" అంటూ గోవిందు చెయ్యి కడుక్కునేందుకు వుపక్రమించాడు. కానీ వంటవాడు వినయంగా—"పండితులుగారూ ! యింకా పిండివంట లున్నయ్ ! వాటినికూడా రుచిచూడండి" అని అడిగాడు.

"ఏదీ ? పట్టుకునిరా—"

మిగిలిన పిండివంటలుకూడా వచ్చినయ్ ! యింత మిఠాయి తిన్నాకకూడా—యీ కొత్తమిఠాయిని వారు సద్వినియోగం చేస్తుండటం రమేశు మెదలకుండా చూస్తున్నాడు. దీను తన ఆడపిల్లవేపు చూసి చేయిచాపి—"ఓ మునియా ! యిదిగో ! యీ రెండులడ్లు తీసుకో" అన్నాడు.

"యిక నేను తినలేను నాన్నా"

"అరే యెందుకు తినలేవు ? తినగలవు. కొంచం నీళ్ళు త్రాగి గొంతు తడిచేసుకో ! ముఖంమొత్తినట్లుంది. అయినా తినలేకుంటే పవిటచెంగున మూటకట్టుకో ! ప్రొద్దున్నే తిందువుగానీ ! ఆ.... బాగా తినిపించావు. వస్తువులన్నీ అమృతంలా వున్నయ్! మహా గొప్పగా చేశారు. అయితే ఈ రెండు రకాలే చేశారా?"

రమేశు జవాబు చెప్పనవసరం లేకపోయింది. వంటవాడు ఉత్సాహంగా చెప్పాడు—'క్షీరమోహన్—రసగుల్లా !'

దీననాథుడు విస్మయంగా రమేశుని ముఖంవేపు చూచి అన్నాడు—"క్షీరమోహన్ కూడా చేశారా? ఎక్కడ ఏదీ? అది యింతవరకూ తీసుకునిరాలేదేం? క్షీరమోహన్ రాధా నగరంలో బోసుబాబుగారింట్లో తిన్నాను. యిప్పటికింకా నోట్లో వున్నట్లేవుంది, నేను అంటే నమ్ముతావోలేదోగానీ, క్షీరమోహన్ అంటే నాకెంతోయిష్టం."

రమేశు నవ్వి తలూపాడు. ఆమాట నమ్మడం కష్టమనిపించ లేదు. యింతలో రాఖాలుడు ఏదో పనిమీద బయటికి వెళు తున్నాడు. రమేశు అతన్నిపిల్చి—"బహుశా లోపల భైరవా చారి వున్నాడేమో! కొంచెం క్షీరమోహన్ తీసుకురమ్మని అతనికి చెప్పు" అని చెప్పాడు.

చీకటి పడుతూంది. అయినప్పటికీ బ్రాహ్మణులు క్షీరమోహన్ కోసం అలాగే కూచుని వున్నారు. కొంచంసేపయాక రాఖాలు తిరిగి వచ్చి—"యిక యివాళ సామానుగదితలుపు తెరవర్ట" అని చెప్పాడు.

మనసులోనే కొంచం కోపం చెందాడు రమేశ్—"నేను చెప్పినట్లుగా చెప్పు."

గోవిందగంగూళి రమేశుని కోపంచూసి, కళ్లు తిప్పుతూ చెప్పాడు—"దీనూ అన్నయ్యా! భైరవాచారి బుద్ధిచూశావా? తల్లికంటే పినతల్లికి నొప్పి ఎక్కువ అని అంటారు. అందుకే నేననేది........"

కాని, ఆయనమాట వినకుండానే రాఖాలుచెప్పాడు—"భైరవా చారి ఏంచేస్తాడు: ఆ యింటినుంచి అమ్మగారు వచ్చి సామాను గదికి తాళం వేశారు."

ధర్మదాసూ, గోవిందగంగూలీ యిద్దరూ త్రుళ్ళిపడి, ఒకేసారి అడిగారు—"ఎవరూ? అమ్మగా రెవరు?"

రమేశు చకితుడై అడిగాడు—"అయితే పెద్దమ్మ వచ్చిందా?"

"అవునండి. ఆమె వచ్చీరాగానే, చిన్నగదికీ, పెద్దగదికీ రెంటికీ తాళాలు వేసింది."

ఆశ్చర్యానందాలతో రమేశుని నోటినుంచి మాట రాలేదు. ఆయన లేచి గబగబా లోపలికి వెళ్ళాడు.

3

"పెద్దమ్మా"

మాట వినగానే, విశ్వేశ్వరి సామాను గదిలోంచి బయటకు వచ్చింది. వేణీ వయసునుబట్టి చూస్తే, అతని తల్లి వయసు యాభై సంవత్సరాలకు తక్కువ వుండవు. కానీ, చూపులకు మాత్రం నలభై సంవత్సరాలకంటే ఎక్కువ వుండవని అనుకుంటారు. రమేశు అదేపనిగా ఆమెను చూస్తున్నాడు. ఇప్పటికీ, అదే మేలిమిబంగారు వర్ణం--ఒకప్పుడు ఆమె సౌందర్య యిటు ప్రక్కన ప్రసిద్ధిగా చెప్పుకున్నారు. అటువంటి ఆమె అనింద్య సౌందర్యం యీనాటికి కూడా ఆ పుష్టి శరీరాన్నుంచి తొలగి పోలేదు. ఆమె తలవెంట్రుకలు కత్తిరించినట్లు ముఖంమీద పడుతున్నయ్! పెదవులూ, చెక్కిళ్ళూ, లలాటమూ, అధరాలూ, అన్నీ ఎవరో మహాశిల్పి ఎంతో నిపుణంగా మహాప్రయత్నంతో చేసినట్లుంది. అన్నిటికంటే, ఆశ్చర్యకరమైనవి ఆమెకళ్లు. కొంచంసేపు ఆమె కళ్ళకేసి చూస్తే చాలు, సమ్మోహితు లవుతారు.

ఈ పెద్దమ్మ ఒకప్పుడు రమేశుని, అతని పరలోకవాసియైన తల్లినీ, ఎంతో ప్రేమిస్తూండేది. వివాహమయాక యీ తోడి కోడళ్ళిద్దరికీ కొంతకాలం సంతానంలేదు. అప్పుడు అత్తా—ఆడ బిడ్డల బాధలకు భయపడి, యిద్దరూ చాటుగా ఒకచోట కూచుని కన్నీళ్ళు పెట్టుకునేవాళ్ళు. అప్పుడే వీళ్ళిద్దరి స్నేహసూత్రం మొట్టమొదటిసారిగా ముడిపడింది. ఆ తరువాత రెండు సంసా రాలు వేరుపడడం, కోర్టులకెక్కడం, మొదలైన తుచ్ఛ విష యాలు యెన్నో యీ సంసారాల మీదుగా జరిగి పోయినయ్! ఈ పోట్లాటలవల్ల వాళ్ళ స్నేహబంధనం శిథిలమైంది. కాని ఒక్కసారే విచ్ఛిన్నం కాలేదు. చాలాకాలం తరువాత ఆ చిన్న కోడలి సామాను గదిలోకి వెళ్ళి, ఒకప్పుడు తన చేతిమీదుగా సర్దిన, సామాను చూసేసరికి, పెద్దమ్మ కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగినయ్! రమేశు పిలవగానే ఆమె కళ్ళు తుడుచుకుని, బయ టికి వచ్చింది. అయినా ఆమె ఎర్రని నేత్రాలూ, కన్నీటిఛాయలు గల ఆర్ద్ర కనురెప్పలు చూసి, రమేశు కొంచంసేపు విస్మితు డయాడు. పెదతల్లికూడా రమేశుని విస్మయం కనిపెట్టింది. అందుకే పితృవిహీనుడైన రమేశుని చూసేసరికి ఆమె హృదయ మంతా హాహాకారాలతో నిండిపోయింది. కాని ఆమె దాన్ని బయటకు పొక్కనీయలేదు. పైగా నవ్వుతూ—"నన్ను గుర్తిం చావా రమేశ్?" అని అడిగింది.

అందుకు ప్రత్యుత్తరంగా రమేశుని పెదిమలు కంపించి నయ్! తల్లి చనిపోయాక, తను మామగారింటికి వెళ్ళకముందు, ఈ పెద్దమ్మ తనను పెంచింది. అసలు మేనమామగారింటికి

పంపడంకూడా నిరోధించింది. యీ సంగతి యిప్పటికీ తనకు గుర్తుంది. దానితోపాటు నిన్నతను పెద్దమ్మగారింటికివెళ్ళి వాకబుచేసి నప్పుడు ఆమె యింట్లో లేదనిచెప్పారు. ఆమెను కలుసుకోలేక పోయాడు. తరువాత రమ యింటికి వెళ్ళాడు. ఆక్కడ వేణి కనుపించాడు. వేణి ఎదటనే రమ చిన్నమ్మ తనను తిరస్కరించడం, అతను వెళ్ళాకకూడా అవమానించడం జరిగింది. ఈ సంగతు లన్నింటిని చూసి ఈ గ్రామములో 'నా' అనేవాళ్ళు లేరనే నిశ్చయానికి వచ్చాడు తను.

రమేశు ముఖంలోకి కొంచంసేపు చూశాక విశ్వేశ్వరి అన్నది—"కాదు నాయనా! యిటువంటి సమయంలో కొంచం ధైర్యంగా వుండాలి—"

కాని ఆమె కంఠంలో మృదుత్వమనేది ఎక్కడా కనుపించ లేదు. రమేశు తన్నుతాను సంబాళించుకున్నాడు. అభిమానానికి, విలువకానిచోట అభిమానం ప్రకటించడ మంత అజ్ఞానం ప్రపంచంలో యింకొకటి లేదని గ్రహించాడు—"నేను ధైర్యం గానే వున్నాను పెద్దమ్మా! అందుకనే నాకు చాతనైంది చేస్తు న్నాను, అటువంటప్పుడు నువ్వెందుకు వచ్చావు—?"

పెద్దమ్మ నవ్వి అన్నది. "నీవు అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పేందుకు నువ్వు నన్ను పిలుచుకుని రాలేదు రమేశ్? సరే యిటు విను! యిక్కడ కర్మకాండంతా పూర్తికానిదే, సామాను గదిలోంచి ఒక్క వస్తువుకూడా బయటికి రానివ్వను. నేను యింటికి వెళ్ళేప్పుడు తాళాలు నీకు యిచ్చి వెడతాను. రేపువచ్చి మళ్ళీ తీసుకుంటాను. చూడు. తాళాలుమాత్రం యెవరికీ యివ్వ వద్దు. సరేగాని నిన్న మీ పెద్దన్నయ్యను కలుసుకున్నావా ?"

ఈ పెద్దమ్మ ఒకప్పుడు రమేశుని, అతని పరలోక వాసియైన తల్లినీ, ఎంతో ప్రేమిస్తూండేది. వివాహమయాక యీ తోడి కోడళ్ళిద్దరికీ కొంతకాలం సంతానంలేదు. అప్పుడు అత్తా—ఆడ బిడ్డల బాధలకు భయపడి. యిద్దరూ చాటుగా ఒకచోట కూచుని కన్నీళ్ళు పెట్టుకునేవాళ్ళు. అప్పుడే వీళ్ళిద్దరి స్నేహసూత్రం మొట్టమొదటిసారిగా ముడిపడింది. ఆ తరువాత రెండు సంసారాలు వేరుపడడం, కోర్టులకెక్కడం, మొదలైన తుచ్ఛ విషయాలు యెన్నో యీ సంసారాల మీదుగా జరిగిపోయినయ్! ఈ పోట్లాటలవల్ల వాళ్ళ స్నేహబంధనం శిథిలమైంది. కాని ఒక్కసారే విచ్ఛిన్నం కాలేదు. చాలాకాలం తరువాత ఆ చిన్న కోడలి సామాను గదిలోకి వెళ్ళి, ఒకప్పుడు తన చేతిమీదుగా సర్దిన, సామాను చూసేసరికి, పెద్దమ్మ కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగినయ్! రమేశు పిలవగానే ఆమె కళ్ళు తుడుచుకుని, బయటికి వచ్చింది. అయినా ఆమె ఎర్రని నేత్రాలూ, కన్నీటిఛాయలు గల ఆర్ద్ర కనురెప్పలు చూసి, రమేశు కొంచంసేపు విస్మితుడయాడు. పెదతల్లికూడా రమేశుని విస్మయం కనిపెట్టింది. అందుకే పితృవిహీనుడైన రమేశుని చూసేసరికి ఆమె హృదయమంతా హాహాకారాలతో నిండిపోయింది. కాని ఆమె దాన్ని బయటకు పొక్కనీయలేదు. పైగా నవ్వుతూ—"నన్ను గుర్తించావా రమేశ్?" అని అడిగింది.

అందుకు ప్రత్యుత్తరంగా రమేశుని పెదిమలు కంపించినయ్! తల్లి చనిపోయాక, తను మామగారింటికి వెళ్ళకముందు, ఈ పెద్దమ్మ తనను పెంచింది. అసలు మేనమామగారింటికి

పంపడంకూడా నిరోధించింది. యీ సంగతి యిప్పటికీ తనకు గుర్తుంది. దానితోపాటు నిన్నతను పెద్దమ్మగారింటికివెళ్ళి వాకబుచేసి నప్పుడు ఆమె యింట్లో లేదనిచెప్పారు. ఆమెను కలుసుకోలేక పోయాడు. తరువాత రమ యింటికి వెళ్ళాడు. అక్కడ వేణి కనుపించాడు. వేణి ఎదటనే రమ చిన్నమ్మ తనను తిరస్కరించడం, అతను వెళ్ళాకకూడా అవమానించడం జరిగింది. ఈ సంగతు లన్నింటిని చూసి ఈ గ్రామములో 'నా' అనేవాళ్ళు లేరనే నిశ్చయానికి వచ్చాడు తను.

రమేశు ముఖంలోకి కొంచంసేపు చూశాక విశ్వేశ్వరి అన్నది—"కాదు నాయనా! యిటువంటి సమయంలో కొంచం ధైర్యంగా వుండాలి—"

కాని ఆమె కంఠంలో మృదుత్వమనేది ఎక్కడా కనుపించ లేదు. రమేశు తన్నుతాను సంబాళించుకున్నాడు. అభిమానానికి, విలువకానిచోట అభిమానం ప్రకటించడమంత అజ్ఞానం ప్రపంచంలో యింకొకటి లేదని గ్రహించాడు—"నేను ధైర్యం గానే వున్నాను పెద్దమ్మా! అందుకనే నాకు చాతనైంది చేస్తు న్నాను, అటువంటప్పుడు నువ్వెందుకు వచ్చావు—?"

పెద్దమ్మ నవ్వి అన్నది. "నీవు అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పేందుకు నువ్వు నన్ను పిలుచుకుని రాలేదు రమేశ్? సరే యిటు విను! యిక్కడ కర్మకాండంతా పూర్తికానిదే, సామాను గదిలోంచి ఒక్క వస్తువుకూడా బయటికి రానివ్వను. నేను యింటికి వెళ్ళేప్పుడు తాళాలు నీకు యిచ్చి వెడతాను. రేపువచ్చి మళ్ళీ తీసుకుంటాను. చూడు. తాళాలుమాత్రం యెవరికీ యివ్వ వద్దు. సరేగాని నిన్న మీ పెద్దన్నయ్యను కలుసుకున్నావా?"

ఈ ప్రశ్న విని రమేశు యిరుకున పడ్డాడు, తన కొడుకు వ్యవహారం ఆమెకు తెలుసునా—లేదా—అనే సంగతి కూడా తెలుసుకో లేక పోయాడు. ఆయన కొంచం ఆలోచించి—"అప్పుడు పెద్దన్నయ్య యింట్లోలేడు!" అని చెప్పాడు.

అసలు ప్రశ్న అడిగినప్పుడే, పెద్దమ్మ ముఖంలో ఉద్వేగ ఛాయలు కనుపించినయ్! తను చెప్పిన జవాబువల్ల పెద్దమ్మ ముఖంలోని భావం మారిపోవడం గమనించాడు. ఆ ముఖం ప్రసన్నమైంది. ఆమె నవ్వుతూ స్నేహపూర్వకంగా అన్నది—''అయ్యో అదృష్టమా! సరే నాయనా: ఒకసారి కలవలేదు. మరి రెండోసారి వెళ్ళవద్దూ? మీ రంతే వాడికి, సరిపడని సంగతి నాకు తెలుసు. కాని నీ పని నువ్వు చేయాలిగా? వెళ్ళు యింకొక సారి వెళ్ళి వాడికి నచ్చచెప్పు. వాడు నీ కంటే పెద్దవాడు. వాడి ముందు తలవంచవలసి వచ్చినా సిగ్గుపడవలసినపనిలేదు. అంతే గాదు నాయనా! ఇది యెంత దుఃఖసమయం! ఎవరి దగ్గరికి వెళ్ళి కాళ్ళూ చేతులు పట్టుకుని తీసుకురావలసినా—సిగ్గుపడవల సిన సమయంకాదిది. మా తండ్రివి కదూ! యింకొకసారి వెళ్ళిరా! యిప్పుడు వాడు యింట్లోనే వుండవచ్చు.''

రమేశు మాట్లాడలేదు. ఆమె యింత యిదిగా బలవంతం ఎందుకని చేస్తుందో ఆ సంగతి అర్థంకాలేదు. మనసులోని సందేహం దూరమవలేదు. విశ్వేశ్వరి యింకా కొంచం ముందుకు వచ్చి—''ఆ బయట కూచున్న వాళ్ళందర్నీ, నీ కంటే నేను బాగా యెరిగి వున్నాను. నువ్వు వాళ్ళ మాటలు వినవద్దు. వెళ్ళు. నీ పెద్దన్నయ్య వద్దకు ఒకసారి నాతోపాటురా''—అన్నది.

"కాదులే పెద్దమ్మా! అలా జరగదులే! అ బయట వున్న వాళ్ళు యెటువంటివాళ్ళైనా-యీసమయంలో- వాళ్లే నా కందరి కన్నా ఆత్మీయులు—"

అతనింకా ఏమో చెప్పబోతున్నాడు. కాని, పెద్దమ్మముఖం చూసి ఆశ్చర్యపడుతూ మెదలకుండా వూరుకున్నాడు. ఆమె ముఖం అప్పుడే నాల్గువేపులా వ్యాపిస్తున్న సంజచీకటికన్నా నల్లబడిపోయింది. కొంచంసేపయాక పెద్దమ్మచల్లగా నిట్టూర్చి అంది-" సరే అలాగేలే! నువ్వు వాడి దగ్గరకు వెళ్ళడానికే వీలులేనప్పుడు వాడి విషయం నీతో చెప్పడంవల్ల లాభంలేదు. అయినప్పటికీ నాయనా! నువ్వేమీ దిగులుపెట్టుకోవద్దు. నీ పనులేమీ ఆగవు. నేను రేపుదయమే వస్తాను.' అని విశ్వేశ్వరి తన దాసీని పిలిచి, దానితోపాటు వెనకవేపున్న తలుపుగుండా బయటికి వెళ్ళిపోయింది,

ఈమధ్యలో రమేశు—వేణీని కలుసుకున్నాడనీ, యిద్దరికీ ఏదో జరిగి వుంటుందనీ వూహించింది. ఆమె ఏదారంట వెళ్లిందో- కొంచెంసేపటివరకూ రమేశు ఆదారివేపు చూస్తూ నిలుచున్నాడు. ఆ తరువాత, ఉదాసీనముఖంతో బయటికి రాగానే, గోవింద గంగూళి గాబరాతో అడిగాడు-" ఏంనాయనా! పెద్దమ్మగారు వచ్చిందా?"

తలూపుతూ రమేశు—'అవును' అన్నాడు.

"ఆమె సామాను గదికి తాళంవేసీ, తాళాలు వెంటతీసుకుని వెళ్లిందని విన్నాను—"

అందుకు కూడా ఆయన తలూపుతూనే సమాధానం చెప్పాడు. ఆమె వెళ్లిపోయే ముందు ఏమాలోచించిందో- ఏమో-తాళాలు

కూడా తీసుకునివెళ్ళింది. గోవిందుడు అన్నాడు-'చూశావా ధర్మదాసన్నయ్యా! నే నన్నట్లే జరిగింది. ఏం రమేశ్. యిప్పటికైనా గ్రహించావా?

యిప్పటివరకూ రమేశు మనసులోనే కోపంగావున్నాడు. కాని తన నిరుపాయస్థితి తలుచుకుని మెదలకుండా వున్నాడు. దరిద్రుడైన దీనూ,భట్టాచారి యింకావెళ్ళలేదు. అతనికి మెదడు లేదు. తన పిల్లలతో సహా ఎవరి అనుగ్రహంవల్ల కడుపునిండా మిఠాయితిన్నాడో-వారిని ఆశీర్వదించకుండా- వారి ఏడుతరాల వారిని స్తుతించకండా వెళ్ళలేకపోయాడు. ఆ బ్రాహ్మణుడు నిరీహ భావంతో—'యిందులోని రహస్యం తెలుసుకోవడ మేమంత కష్టంబాబూ! తాళాలు వేసి, తాళపుచేతులు వెంటతీసుకుని వెళ్ళిందంటే, యిక ఆ సామానుగదిలో ఎవరిచెయ్యీ పడగూడదన్న మాట. ఆమెకు అంతా తెలుసు!' అని చెప్పాడు.

గోవిందు విసుక్కుంటూ కోపంతో అన్నాడు- 'నీకు సంగతి సందర్భాలు తెలియవు. అటువంటప్పుడు మధ్య మాట్లాడాలని ముందు కెందుకని వస్తావు? నీకీ సంగతులన్నీ యేంతెలుసని అర్థాలు తీయొచ్చావు'

ఈ కోపం చూడగానే, దీను తెలివితక్కువతనం యింకా ఎక్కువైంది. అతను కూడా కోపంగానే అన్నాడు—'అరే! యిందులో తెలుసుకునే దేముంది? సామానుగదికి తాళంవేసి, తాళాలు పట్టుక వెళ్ళిందని విన్నాంగా? దీన్నేమంటారేం?'

గోవిందు మండిపడి—'అరే భట్టాచారీ! నువ్వికి యింటికి వెళ్ళు. ఏ పనికోసం పరుగెత్తుకుని వచ్చావో- ఆపని జరిగి

పోయిందిగా? యింటిల్లాదులూ తిన్నారు. మూటలు కట్టుకున్నారు. యింకా ఎందుకున్నావు? వెళ్ళు; క్షీరమోహన్ ఎల్లుండి తిందువుగాని. ఇక యివాల్టికి ఏమీలేదు. యిక వెళ్ళు. మాకూ చాలా పనులున్నయ్'' అని అన్నాడు.

దీను చాలాసిగ్గుపడ్డాడు. రమేశు కూడా సిగ్గుపడ్డాడు. కానీ కోపంకూడా వచ్చింది.

గోవిందు యింకా ఏమో అనాలని ప్రయత్నిస్తున్నాడు. యింతలో రమేశుని కఠినమైన కంఠం విని ఆగిపోయాడు— ''గంగూళిగారూ! ప్రతివాళ్ళనూ యిలాగే అంటారేం మీరు?''

గోవిందు ముందు విస్మయంపొందాడు. ఆ వెంటనే ఆయన శుష్కంగా నవ్వి—''నే నెవరిని అవమానించాను నాయనా? నేను అన్నది నిజమో- కాదో అతన్నే అడుగు. చూశావా ధర్మన్నయ్యా- యీ దీను సాహసం!''

ధర్మదాసు యేం చూశాడో కానీ, రమేశు మాత్రం, యీ మనిషి, నిర్లజ్జా, దుష్టత్వంచూసి నిశ్చేష్టుడయాడు. అనమయాన దీనూభట్టాచారి రమేశువేపు చూసి అన్నాడు—''కాదునాయనా! గోవిందుడు అన్నది నిజమే! నేను చాలా బీదవాడినని అందరికి తెలుసు. వీళ్ళలా నా వద్ద భూమీ-పొలమూలేదు. ఏదో విధంగా- ఆయవారాలతో- అడుక్కుంటూ వుంటాను. నా పిల్లలకు మిఠాయి కొనిపెట్టుకోగల స్థితి భగవంతుడు నాకివ్వలేదు. అందువల్ల గొప్పగొప్పవారిళ్ళలో, ఏదేని పెద్దకార్యకలాపాలు జరుగుతున్నప్పుడు వీళ్ళను కూడా తీసుకుని వచ్చి తినిపించి బ్రతికి_న్నాను. నాయనా! నువ్వేమీ అనుకోవద్దు, తారిణీ

అన్నయ్య బ్రతికి వున్నప్పుడు మా తిండి చూసి ఎంతో సంతోషించేవాడు. అందువల్ల నాయనా! అయినా మేము మనసార తృప్తిగా తిన్నాం. ఈ సంగతి పైనుంచి చూస్తున్న తారిణీ అన్నయ్య ఎంతో సంతోషిస్తున్నాడని చెప్పగలను-''

ఈ మాటలు అంటుంటే, హఠాత్తుగా శుష్కించిన దీనూ కళ్ళలో నీళ్ళు కనుపించినయ్. అక్కడున్న వారందరూ చూస్తుండగనే. నాలుగైదు కన్నీటి చుక్కలు టపటపలాడుతూ క్రింద పడినయ్! అనేకచోట్ల చినుగులతో మాసివున్న కండువాతో దీను, ఆకన్నీళ్ళుతుడుచుకుని—''నాయనా! యిక్కడున్న నాబోటి బీదవాళ్ళంతా-తారిణీఅన్నయ్య వద్ద చేయిచాపి, వ్యర్థంగా వెళ్ళ లేదు. ఈ సంగతులన్నీ ఎవరెరుగుదురు-బాబూ! ఆయన కుడి చేత్తో చేస్తున్నదానం, ఎడమచేతికి తెలవదు. యిక మిమ్మల్ని వేధించను నాయనా! అయితే అమ్మా మునియా-లేనాయనా హరిధన్-పదండి. యింటికిపదండి-యిక రేపుదయంవద్దాం. నాయనా రమేశ్! నేనేమి చెప్పను. కానీ మీ తండ్రిలాంటి గుణాలు అలవర్చుకుని, చిరకాలం వర్ధిల్లు-''అని బయలుదేరాడు.

ఆయనతో రమేశు కొంతదూరం వచ్చి, ఆర్ద్రమైన కంఠంతో—''భట్టాచార్యులుగారూ! ఈ రెండుమూడు రోజులు మా మీద దయవుంచండి. మీతో చెప్పడానికే నాకు సంకోచంగావుంది. ఒకవేళ నాయింట్లో హరిధన్ తల్లిగారి పాదధూళిపడినట్లయితే, నే నెంతో భాగ్యవంతున్నని అనుకుంటాను-'' అన్నాడు.

దీనూ భట్టాచారి, రమేశుని రెండుచేతులు పట్టుకుని బాధ పడుతూ అన్నాడు—''నాయనా! నేను చాలా బీదవాణ్ణి! నువ్విలా అంటే సిగ్గుతో చచ్చిపోతాను.''

తనపిల్లా—పీచుతో వృద్ధబ్రాహ్మణుడు వెళ్ళిపోయాడు. రమేశ్ తిరిగివచ్చాడు. గంగూళిని ఒకటిరెండు కఠినమాట లన్నాడు రమేశు. ఆ సంగతి గుర్తుకుతెచ్చుకుని ఏదో అందామని నోరువిప్పేసరికి గోవిందుడు ఉద్దీపితుడై—''నాయనా రమేశ్! యిది మా స్వంతపనిలాంటిది. నువ్వు ఒకవేళ పిలవకున్నా—మేమువచ్చి, పనంతా చేయాల్సివుంది. అందుకే నేను వచ్చాను. ధర్మదాసూ—నేనూ అన్నదమ్ములము. నీ పిలుపుకోసం ఎదురు చూస్తూ కూచోలేము'' అని చెప్పాడు.

ఇప్పుడిప్పుడే హుక్కాత్రాగి ధర్మదాసు దగ్గుతున్నాడు. ఆయన తన చేతికర్ర సాహాయ్యంతో నిలుచుని, దగ్గును ఆపు కుందామని ప్రయత్నం చేస్తూ—ముఖం-కళ్ళూ కందగడ్డలా చేసుకుని, చేతులు తిప్పుతూ-''నాయనా రమేశ్! విను! నేను వేణీఘోషాల్‌ను కాను. మేము అసలైన పుట్టుక కలవాళ్ళం'' అని అన్నాడు.

ధర్మదాసన్న యీ కుత్సితమాటలకు రమేశు త్రుళ్ళిపడ్డాడు. కాని కోపం చేయలేదు. శిక్షలేని కారణాన, అభ్యాసదోషంవల్ల వీళ్ళు సంకోచంలేకుండా ఎంత అసహ్యంగా మాట్లాడుతున్నదీ వాళ్ళకే గ్రహింపులేదని ఈ కొద్దివయసులోనే రమేశు గ్రహిం చాడు.

పెద్దమ్మ ప్రేమపూర్వకంగా బ్రతిమిలాడడమూ—బాధపడు తున్న ఆమె ముఖం స్ఫురణకు వచ్చేసరికి, బాధపడ్డాడు. అందరూ వెళ్ళిపోయాక పెద్దన్నదగ్గరకు వెళ్ళేందుకు తయా రయ్యాడు. వేణీగారి చండీమండపందగ్గరకు వెళ్ళేసరికి సరిగ్గా

రాత్రి ఎనిమిదిగంటలైంది. లోపల ఏదో పోట్లాట జరుగుతున్న ట్లుంది. గోవిందగంగూళి అరుపులు—బొబ్బలు ఎక్కువగా వినిపిస్తున్నయ్! బయటకు వినిపించేట్టు పందెం వడ్డి అంటు న్నాడు.—వేణీబాబూ! అతను నాల్గురోజుల్లో, వున్నదంతా నష్టపడకుంటే నన్ను గోవిందగంగూళీ అని పిలవవద్దు. అతని నవాబుదర్జా విన్నావుగా? తారిణీఘోషాల్ డబ్బుయేమీ నిలవ చేయకుండానే చనిపోయాడు. అటువంటప్పుడు యింత గొప్ప ఏర్పాట్లు దేనికి? చేతిలో డబ్బువుంటే చేయవచ్చు. అది లేనప్పుడు ఆస్థి తాకట్టుపెట్టి. తన తండ్రి శ్రాద్ధం చేయగా, నేను ఎవరినీ చూడలేదు. వేణీబాబూ! యితను నందివద్ద మూడువేలు అప్పుగా పుచ్చుకున్నాడని విన్నాను.''

వేణీ ఉత్సాహంగా అన్నాడు—''అందుకే గోవింద్—దీనిలోని, నిజం అంతు లాగాల్సిందే.''

గోవిందు కంఠాన్ని తగ్గించి—''కొంచం ఓపికపట్టు నాయనా! నన్ను అక్కడికి కూడా వెళ్ళనీయ్....ఆ తరువాత........ఎవరా బయటవున్నది? ఎవరూ? రమేశ్? నాయనా—మేమంతా వుండగా యింతరాత్రప్పుడు నువ్వు రావాల్సిన అవసరం ఏముంది బాబూ?'' అని అన్నాడు.

రమేశు అందుకు జవాబు చెప్పకుండానే, కొంచం ముందుకు వెళ్ళి—''పెద్దన్నయ్యా! నేను మీకోసమే వచ్చాను.'' అని చెప్పాడు.

వేణీ తొట్రుపడుతూ—సమాధానం చెప్పలేక పోయాడు. అయినా గోవింద్ వెంటనే అందుకుని అన్నాడు—''మీర్వు

రాకపోతే యెలాబాబూ ? వందసార్లయినా రావాలి. యిదికూడా మీయిల్లేగా ! పైగా పెద్దన్నయ్యంటే తండ్రితో సమానం. అందుకే నేనూ వచ్చాను. తారిణీబాబుతోవున్న పోట్లాటలన్నీ ఆయనతోనే అంతమైనయ్! యిప్పుడు యిక పోట్లాట లెందుకు ? మీ రన్నదమ్ములు ఇద్దరూ ఏకమైనప్పుడు చూచి మేమంతా కళ్లు చల్లపర్చుకుంటాము. ఏమంటావు హల్దార్ మామా ? కాని, నువ్వింకా నిలుచునే వున్నావేం నాయనా ? అరే ఎవర్రా అక్కడ ? ఒకపీటతెచ్చి వేయండి ! కాదు వేణీబాబూ ! నువ్వు పెద్దవాడివి. అంతా మీరే చేయాలి ! నువ్విలా వేరుగావుండడం బావుండలేదు. అయినా అమ్మగారు అక్కడికి వెళ్ళినప్పుడు.... నీకు........''

వేణీ త్రుళ్ళిపడి అన్నాడు—"అమ్మగారు వెళ్ళిందా ?''

ఈ త్రుళ్ళిపడడం గోవింద్ చూసి మనసులోనే సంతోషించాడు. కాని, ఆయన ఆ భావం వ్యక్తమవకుండా, ఎంతో పెద్దమనిషిలా, ఆ సంగతి యింకా పెద్దదిగాచేసి అన్నాడు—"వూరికే వెళ్ళడమేకాదు. సామానుగది బరువంతా తీసుకుని, పనిచేయిస్తూంది. అవును మరి—ఆమె చేయించకుంటే యింకెవరు చేయిస్తారు ?

అందరూ మెదలకుండా వున్నారు. గోవింద్ ఒక నిట్టూర్పు విడిచి అన్నాడు—"ఈవూళ్ళో పెద్దమ్మగారిలాంటి మనిషి యెవరన్నా వున్నారా ? యిక వుండబోతారా ? కాదు వేణీబాబూ ! ముఖంయెదట అంటే ముఖప్రీతి అని అనుకుంటారు. అయినా ఎవరేమనుకున్నా—ఈ గ్రామములో లక్ష్మి వున్నదంటే ఆమె మీ అమ్మగారే ! అటువంటి అమ్మ అందరికీ దొరుకుతుందా ?''

అంతవరకు అని, ఒకసారి పెద్దగా నిట్టూర్చి గంభీర మైయాడు. వేణీ కొంచెంసేపు మెదలకుండా వుండి—'సరే' అన్నాడు.

గోవింద్ వెంటనే అందుకుని—"వూరికే, 'సరే' అన్నంత మాత్రానకాదు వేణీబాబూ! మీ రక్కడికి వచ్చి, పనులన్నీ చేయించాలి. ఈ బరువంతా మీ మీదనే వుంది. సరే; యిప్పుడు మీ రంతా యిక్కడే వున్నారు. ఎవరెవరిని పిలవాలో—అక్కర్లేదో ఒక పట్టీ తయారు చేయించకూడదూ? ఏమంటావు రమేశ్? బాగుందికదూ హల్దార్ మామా? మీరు వూరుకున్నారేం ధర్మదా సన్నయ్యా? ఎవరిని పిలవాలో? ఎవరిని పిలవగూడదో? మీకు బాగా తెలుసు!" అన్నాడు.

రమేశు లేచి నిలుచుని—సహజభావంతో—"పెద్దన్నయ్యా! మీ చరణధూళి నా యింట్లో........" అన్నాడు.

వేణీ గంభీరంగా అన్నాడు—"అమ్మగారు వచ్చినప్పుడు, నేను వచ్చినా—రాకపోయినా...."

గోవిందు సమాధానం చెప్పకముందే రమేశు-"పెద్దన్నయ్యా! మిమ్మల్ని విసిగించేందుకు రాలేదు. యిందులో మీకు యిబ్బంది లేకుంటే ఒకసారి వచ్చి వెళ్ళండి." అని చెప్పాడు.

వేణీ మాట్లాడలేదు. గోవిందు ఏదో చెపుదామని అనుకుంటుండగానే రమేశు లేచి వెళ్ళిపోయాడు. గోవింద్ ఒకసారి బయటికి తొంగిచూసి తరవాత—"వేణీబాబూ! ఆ మాటలతీరు చూశారా!" అన్నాడు.

వేణీ అన్యమనస్కునిలా, ఎదో ఆలోచిస్తూ జవాబు చెప్ప లేధు.

దారంట నడుస్తున్న రమేశు గోవిందుని మాటలు స్మరించి అసహ్యించుకున్నాడు. సగందూరంవెళ్ళి తిరిగి వేణీఘోషాల్ యింట్లోకి వెళ్ళాడు. అప్పటికి కూడా చండీమండపంలో వాదోప వాదాలు జరుగుతూనే వున్నయ్! కోలాహలం ఎక్కువగానే వుంది. అవి వినాలని ఆయనకు లేదు. ఆయన తిన్నగా లోపలికి వెళ్ళి—'పెద్దమ్మా?' అని పిల్చాడు.

అప్పుడు పెద్దమ్మ తన గదిముందున్న వసారాలో చీకటిలో కూచుని వుంది. యింత రాత్రివేళ రమేశు కంఠం విని ఆమె ఆశ్చర్యపడి—'ఏం నాయనా? ఏం?' అని అడిగింది.

రమేశు దగ్గరకు వెళ్ళాడు. ఆమె గాబరాపడుతూ—''కొంచె మాగు నాయనా! దీపం తెస్తానుండు'' అంది.

''దీపం అవసరంలేదులే పెద్దమ్మా! మీరు కూర్చోండి.''

ఆమాట అనికూడా రమేశు అక్కడే ఒకమూల కూచు న్నాడు—''యింత రాత్రప్పుడు వచ్చావేం నాయనా?'' అంది పెద్దమ్మ.

''యింకా ఎవర్నీ పిలవలేదు. ఆ సంగతి మిమ్మల్ని అడగా లని వచ్చాను.''

''నాయనా! నన్ను మంచి యిరుకున వేశావు—వీళ్ళంతా ఏమంటున్నారు? గోవిందగంగూలీ, భట్టాచారి....''

''వాళ్ళేమనేది నాకు తెలవదు పెద్దమ్మా! తెలుసుకోవాలసి కూడా లేదు. మీరేది చెబితే అది జరుగుతుంది.

రమేశు మాటల్లోని ఉత్తాపం గ్రహించి విశ్వేశ్వరి మనసు లోనే విస్మయంచెంది—కొంచంసేపు మెదలకుండా వూరుకుని— —''కాని రమేశ్—'' వీళ్ళే నాకు అందరికంటే ఆత్మీయులని

నాతో చెప్పావు. సరే: నా బోటి ఆడవాళ్ళతో ఏమవుతుంది నాయనా ? ఈ వూళ్ళో—ఈ వూరేమిటి.........అన్ని వూళ్ళలో కూడా వారి పంక్తిన వీరు తినరు. వీరి పంక్తిన వారు కూచోరు. యిలానే జరుగుతూ వుంటుంది. కొంచం కార్యా—కార్యాలు వచ్చాయంటే, వాళ్ళు పడే బాధకు అంతుండదు. ఎవరిని వదిలి పెట్టాలో ? యెవర్ని పిలవాలో ? పల్లెల్లో నిర్ణయించడం చాలా కష్టమైనపని—''

రమేశు ఎక్కువగా ఆశ్చర్యం చెందతేదు. ఎందు కంటే ఈ నాలుగైదు రోజుల్లో చాలా విషయాలు చూశాడు. అయి నప్పటికీ అడిగాడు—''యిలా ఎందుకు జరుగుతూ వుంటుంది పెద్దమ్మా ?''

''చాలా వుంది నాయనా ! ఒకవేళ యిక్కడే వుంటే నీకే తెలుస్తుంది. కొందరికి దోషాలూ అపరాధాలు వున్నయ్ ! మరి కొందరికి అబద్ధపు అపరాధాలు నెత్తిన వేస్తారు. ఆ తరువాత కోర్టులకెక్కడం అబద్ధపు సాక్ష్యం చెప్పించడంవల్ల పెద్ద పెద్ద పార్టీలు ఏర్పడుతుంటయ్ ! రమేశ్ ! నేను రెండురోజుల క్రితం వచ్చినట్లతే యింత గొప్పగా కర్మకాండ తలపెట్టి విచ్చే దాన్ని కాదు. ఆ రోజున యేం జరుగుతూందోనని ఆలోచిస్తున్నాను '' అంటూ పెద్దమ్మ చల్లగా నిట్టూర్చింది. ఆ శ్వాసలోని రహ స్యాన్ని సరిగ్గా రమేశు గ్రహించాడో లేదో తెలియదు. ఎవరివి దోషాలో, ఎవరిమీద అపవాదు లున్నాయో అదికూడా గ్రహించ లేక పోయాడు. పైగా ఉత్తేజంగా జవాబు చెప్పాడు.—

''అయినా—యీ సంగతులకూ నాకూ ఏమీ సంబంధంలేదు.

ఒక విధంగా నేను పరదేశస్థుణ్ణే: నాకు ఎవరితోనూ శత్రుత్వం లేదు, అందువల్ల పెద్దమ్మా! నాకు యిక్కడి పార్టీల కక్షలతో సంబంధములేదు. వాటిని గురించి విచారించను కూడా. యిక్కడున్న బ్రాహ్మణులను—శూద్రులను కూడా పిలుస్తాను. కాని మీ అనుమతి లేనిదే చేయలేను. అందుకని మీ అనుమతి కోసం వచ్చాను—"

పెద్దమ్మ కొంచెం సేపటివరకూ మౌనంగావుండి—ఆ తరువాత చెప్పింది—"కాని రమేశ్! నే నిటువంటి అనుమతి యివ్వలేను. దీనివల్ల చాలా గందరగోళం జరుగుతుంది. నువ్వు చెప్పినది అబద్ధమని నేను చెప్పను. నాయనా! యిది బాగోగుల సంగతికాదు. సమాజం యెవరిని శిక్షించి వేరుచేసిందో—వారిని తిరిగి బలవంతంగా తీసుకునివచ్చి కలుపుకోలేము. సమాజం ఎటువంటిదైనా—దాన్ని ఒప్పుకుని తీరాలి. దాన్ని బాగుచేయాలన్నా—ఓగు చేయాలన్నా ఎవరికీ శక్తిలేదు. రమేశ్! అలా అయితే మనం ఏపనికూడా చేయలేము—"

కొంచెం ఆలోచించి చూచినట్లయితే రమేశు యీ విషయం ఒప్పుకోకుండా వుండేవాడుకాడు. యిప్పుడిప్పుడే ఆ సమాజంలోని కర్తల-దరియొక్క షడీయంత్రాన్నీ—నీచత్వాన్నీ చూశాడు. అది ఆతని హృదయాన్ని దహిస్తూవుంది. అందువల్ల తిరస్కారావేశంలో ఆయన అనేశాడు—"ఈ వూళ్ళోని సమాజమంటే, ధర్మదాసూ—గోవిందగంగూళీ వీళ్ళేగా పెద్దమ్మా? యిటువంటి సమాజానికి ఏమాత్రం పేరుప్రతిష్ఠలు లేకుండా వుండడమే మంచిది."

పెద్దమ్మ అతని కోపంచూసి. శాంతంగానే అన్నది—
"రమేశ్—! వీళ్ళేగాదు. పైగా మీ పెద్దన్నయ్య కూడా ఈ సమాజంలో మహాముఖ్యుడు,"

రమేశు మాట్లాడలేదు, పెద్దమ్మ మళ్ళీ మొదలుపెట్టింది—
"రమేశ్! అందుకనే వీళ్ళందరి అభిప్రాయప్రకారం పనిచేయమని చెపుతున్నాను. యిప్పుడిప్పుడే యీ వూళ్ళోకివచ్చి, వీరికి విరుద్ధంగా మాత్రం పనిచేయవద్దు—"

ఎంతోదూరం ఆలోచించి పెద్దమ్మ అతనికి ఉపదేశించింది. కాని, తీవ్రమైన ఉత్తేజంలోపడి, రమేశు ఏదీ ఆలోచించలేక—
"పెద్దమ్మా! రకరకాలైన కారణాలవల్ల, గ్రామములో యిన్ని పార్టీలు ఏర్పడినట్లు చెప్పావు. ఈ కారణా లన్నిటిలోనూ వ్యక్తిగత దోషమే పెద్ద కారణమని నేననుకుంటాను. అదీకాక నాకు యెవరివి నిజమైన దోషాలో, ఎవరిమీద అపవాదు లున్నాయో తెలవదు. మరి అటువంటప్పుడు కొందరిని పిలవకుండా వుండడం అవమానించినట్లు కాదా—" అని అడిగాడు.

పెద్దమ్మ చిన్నగా నవ్వి—"అరే పిచ్చివాడా! నేను నీకంటే పెద్దదాన్ని. నీ తల్లిలాంటిదాన్ని. నా మాట వినకపోవడం కూడా అన్యాయమే—"అంది.

"నేనేం చేయను పెద్దమ్మా! అందర్నీ పిలవాలని నిశ్చయించుకున్నాను—"

రమేశుని దృఢసంకల్పం విని విశ్వేశ్వరి ముఖంలో అప్రసన్నత కనుపించింది. మనసులో కొంచెం కోపంకూడా వచ్చినట్టుంది—"అటువంటప్పుడు నా అనుమతికోసందావడం, మాట వరుసకన్న మాట—?"

పెద్దమ్మకు కోపం వచ్చినట్లు గ్రహించాడు రమేశు. అయినా అతడు చలిలించలేదు. ఆయన కొంచెంసేపుండి, మెల్లిగా అన్నాడు—"పెద్దమ్మా! అన్యాయం కానటువంటి పనులు నేను చేస్తుంటే, నువ్వు మనసారా దీవిస్తావని నాకు తెలుసు-నా ..." మాట పూర్తికాకముందే, పెద్దమ్మ—"కానీ రమేశ్! నేను నా సంతానానికి విరుద్ధంగా ఏమీ చేయలేనని కూడా తెలుసుకోవాల్సింది" అన్నది.

రమేశుకు ఆమాటతో మనసులో గాయం కలిగింది. యెందువల్లనంటే, నోటితో ఏమన్నప్పటికీ, నిన్నటినుంచి పెద్దమ్మ దగ్గర తనకు కూడా సంతానాధికారంవుందని అతనికి తోచసాగింది. కాని తన అధికారంకంటే చాలాపైగా ఆమె స్వీయసంతానాధికారంవుందని తెలుసుకున్నాడు యిప్పుడు. ఆ తరువాత కొంచెంసేపు మెదలకండావుండి—లేచి నిల్చుని—"నిన్నటి వరకూ అలాగే అనుకున్నాను పెద్దమ్మా: అందువల్లనే, మీతో అప్పుడు. నేను చేయగలిగినంతవరకు నేనే చేసుకుంటానని చెప్పాను, మీరు రావాలనేకష్టం మాత్రం చేయకండి! నిన్ను పిలిచే సాహసంకూడా నాలోలేదు" అభిమానంతోనే అన్నాడు.

అతని కోపం పెద్దమ్మ గ్రహించకపోలేదు. కాని, ఆమెయే మీజవాబు చెప్పలేదు. ఆ చీకటిలో మెదలకండానే కూచుంది, కొంచెంసేపయాక, రమేశు వెడదామని లేచాడు. అప్పుడామే—వుండు రమేశ్—'కొంచెం అగు, నీ సామానుగది తాళాలు యిస్తాను—'అని లేచివెళ్ళి తాళాలు తెచ్చి రమేశుని పాదాల ముందు విసిరేసింది.

రమేశు కొంచెంసేపు మెదలకండా నిశ్శబ్దంగా నిలుచుని ఆ తరువాత గట్టిగా నిట్టూర్చి తాళాలు తీసుకుని బయటికి వెళ్ళాడు. యిప్పుడే కొన్నిగంటల క్రితం—"నాకింకేమీ భయంలేదు. మా పెద్దమ్మ వచ్చింది—" అని అనుకున్నాడు. కాని, యింకా ఒక రాత్రి గడిచీగడవకముందే ఆయన తిరిగి దీర్ఘంగా నిట్టూర్చి—"కాదు. నాకెవరూలేరు. పెద్దమ్మకూడా నన్ను వదిలిపెట్టింది—" అనుకున్నాడు.

4

బయట యిప్పుడిప్పుడే శ్రాద్ధం పూర్తయింది. పీటమీదనుంచి లేచి, రమేశు అభ్యాగతులతో పరిచయం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. యింటిలోపల భోజనాలకు విస్తళ్ళు వేయడం జరుగుతూంది. అదే సమయంలో కొంత గందరగోళం విని రమేశుడు భయపడుతూ అక్కడికి వచ్చాడు. ఆయనతోపాటు యింకా చాలామంది లోపలికివచ్చారు. వంటింటి తలుపుకు ఒక ప్రక్కగా యిరవై అయిదు-యిరవైయారు సంవత్సరాల వితంతువు కుంచించుకపోయిన ముఖంతో వెనకకు నిలుచునివుంది. ఆమెకు దగ్గర్లో యింకొక ప్రౌఢాంగన కోపంతో—కళ్ళూ-ముఖం ఎర్రచేసుకుని, గట్టిగా అరుస్తూ తిడుతూవుంది. ఈ పోట్లాట పరాణ్ హాల్దారుతో జరుగుతోంది. ఆ ప్రౌఢాంగన రమేశుని చూడ్డంతోనే—"ఏం నాయనా! ఈ గ్రామానికి నువ్వే ఒక జమీందారువే! ఈ దోషమంతా క్షేంతీబ్రాహ్మణకూతురి దాక్క

దాని దేనా? మాకు అంటడయెవరూలేరని. ఎన్నిమార్లు శాస్తి చేస్తారు?" అని అడిగి గోవిందునివేపు చూపిస్తూ—"వీరు ముఖర్జీవారింట్లో వృక్షప్రతిష్ఠాపన జరిగిననాడు జుల్మానా పేరుతో స్కూలుకోసం నావద్ద పదిరూపాయలు వసూలు చేయలేదా? వూళ్ళో అమ్మవారి జాతర చేస్తూన్నప్పుడు బలికోసం నావద్ద రెండు జతల మేకల విలువ తీసుకోలేదూ? అటువంటప్పుడు యింకా ఎన్నిసార్లని పీడిస్తారు? ఎందుకింత పోట్లాట? మీరే చెప్పండి" అని అడిగింది.

అనలుసంగతి సందర్భాలు రమేశుకు అంతుపట్టలేదు. యింత వరకూ కూచున్న గోవిందగంగూళి దాన్ని చర్చించేందుకు లేచి నిల్చుని, ఆయనముందు రమేశునీ, ఆ తరువాత ఆ ప్రౌఢాంగన వేపు చూసి గంభీరంగా అన్నాడు—"క్షేంతిపిన్నీ! నాపేరు యెత్తావు కాబట్టి నేను నిజం చెపుతాను. ఈ గోవిందగంగూళీ ఒకరి గౌరవంకోసం, ముఖంయెదట ముఖమాట పడడని, ఈ వూరివారందరికీ తెలుసు. నీ కూతురుకు ప్రాయశ్చిత్తం జరిగి పోయింది. అందుకు సమాజం జుల్మానాకూడా విధించింది. అదంతా నేను ఒప్పుకుంటాను. కాని ఆవిడ యజ్ఞంలో వంట చేయమనీ, మడిపనుల్లోకి రమ్మనమనీ అనుజ్ఞ మేము యివ్వ లేదు. ఒకవేళ ఆమె చనిపోయినప్పుడు అవసరం వుంటే, శ్మశానంవరకూ ఒక భుజం యిస్తాం—కాని...."

"నీ బిడ్డ చచ్చినప్పుడు భుజం కాయరా! నా బిడ్డను గురించి నీకెందుకంత విచారం? గోవింద్! నీగుండెమీద చెయివేసి యెందుకు చెప్పకూడదు? నేనడుగుతున్నాను. చెప్పు? నీచిన్న

మరదలు, యిప్పుడు సామానుగదిలో కూచుని తాంబూలాలు కడుతూండే ఆవిడ నిరుడు రెండునెలల పదిహేనురోజులు, ఏ కాశీలోవుండి—పచ్చని మనిషి ఎందుచేత పిండిబొమ్మమాదిరి అయివచ్చింది? యివె గొప్పవాళ్ళ గొప్పతనం కామాలు? అయినా నాముందు ఎక్కువ లోతుకుదిగి మాట్లాడవద్దు. నేను బండారమంతా బయటపెట్టగలను. మేమూ పిల్లలుగలవాళ్ళమే! మాకన్నీ తెలుసు. మాకళ్ళలో దుమ్మెవరూ కొట్టలేరు" అని గర్జించింది.

గోవిందుడు కోపంతో పిచ్చివాడైపోయి,—'అయితేరావే తప్పుడుముండా' అని ముందుక దుమికాడు.

కానీ, ఆ తప్పుడుముండ కొంచెంకూడా భయపడలేదు. పైగా ఒక అడుగు ముందుకువేసి, చేతులు తిప్పుతూ గంతులేస్తూ— "అయితే నన్ను కొడతావురా! ఈ క్షేంత్రబ్రాహ్మణిని రెచ్చ గొట్టావంటే యీవూరి బండారమంతా బయటపడుతుంది. మా అమ్మాయి వంటింటిలో కాలుకూడా పెట్టలేదు. హోల్దారు తలవని తలంపుగా అవమానం చేసాడు. అయితే అతని వియ్యపురాలికీ, ఆ శెట్టిబలిజీకి సంబంధం వుందని అపవాదులేదూ? నేను యీ నాటిదాన్ని కాను. యింకా యేమైనా చెప్పాలా—యింతటితో చాలా?" అని అడిగింది.

రమేశుడు కొయ్యలా మారిపోయాడు. భైరవాచారి గాబరా పడి, లేచివచ్చి ఆమెచేతులు పట్టుకుని—"యిక చాలు చిన్నమ్మా! యింకా చెప్పనవసరంలేదు. లే సుకుమారీ! నాతోరా! ఆగదిలో కూచుందాం" అన్నాడు.

పరాన్‌హోల్దారు తుండుగుడ్డ బుజంమీద వేసుకుని, తిన్నగా లేచి నిలుచుని చెప్పాడు—"ఎంతవరకు యీ పాడుముండను యీ యింట్లోంచి వెళ్ళగొట్టరో—అంతవరకూ నేనీ యింట్లో నీటి చుక్కకూడా ముట్టుకోను గోవింద్. ముందేచెపుతున్నాను. కాళీ చరణ్! నువ్వు నీ మామకావాలనుకుంటే, లేచిరా! మామా అక్కడికి వెళ్ళవద్దని వేణీఘోషాల్ ముందే అన్నాడు. యిటు వంటి ఛండాలపు ముండలంతా వస్తారని ముందే తెలిసివుంటే, జాతిని భ్రష్టంచేసుకునేందుకు యీ గుమ్మమే త్రొక్కేవాణ్ణికాదు? కాళీ లేచి రారా."

మాటిమాటికీ మామగారు పిలుస్తున్నప్పటికి కూడా, కాళీ చరణుడు తలవంచుకుని అలాగే కూచున్నాడు. అతను జనప నార వ్యాపారం చేస్తుంటాడు. నాలుగేళ్ళక్రితం కలత్తానుంచి పెద్దవ్యాపారస్తుడు వచ్చి అతని విధవచెల్లెల్ని లేవదీసుకుని పోయాడు. ఆమె మామగారింటికి వెళ్ళిందని కొంతకాలం, తీర్థయాత్రలకు వెళ్ళిందని కొంతకాలం, సంగతంతా గుప్తంగా వుంచారు. యిప్పుడాసంగతి యెక్కడ బయటికొస్తుందనే భయంతో కాళీచరణుడు అలాగే తలవంచుకుని వున్నాడు. కానీ గోవిందుని మంట తగ్గలేదు. అతను మళ్ళీ లేచి నిలుచుని అన్నాడు—"ఎవ రెన్ని చెప్పినా—ఈ వూరి సమాజాధిపతులు—వేణీఘోషాల్, పారణహోల్దారు, యదుముఖర్జి కూతురు, మేము ఏవిధంగా కూడా వారిని వదిలిపెట్టము. రమేశబాబు అట్టి సంఘాన్ని కాదని, ఈ సంకరపు ముండల్ని యింట్లోకి ఎందుకు రానిచ్చాడో, దానికి సరైన సంజాయిషీ యివ్వందే యిక్కడ, మేమంతా మంచినీళ్లుకూడా ముట్టుకోము."

చూస్తూచూస్తుండగానే అక్కడున్న యింకా పదిమంది తుండు గుడ్డలు భుజంమీద వేసుకుని, నిలుచున్నారు. వీళ్ళంతా యిక్కడి వాళ్ళే. సమాజిక వ్యవహారాల్లో, ఏఎత్తువేస్తేఅన్నిటికన్నా లాభదాయకమో వీళ్ళకు తెలుసు!

ఆ వచ్చిన బ్రాహ్మణు లంతా తలొకవిధంగా అంటున్నారు. భైరవుడు, దీనూభట్టాచారి యిద్దరు మాత్రం యేడ్చినంతపనైంది. వారు ఒకప్పుడు క్షేంతిపిన్నిని, మరొకప్పుడు ఆమె కూతురును, యింకొకప్పుడు గంగూళి, హాల్దార్ చేతులు, కాళ్ళు పట్టుకుని బ్రతిమిలాడేందుకు తయారైయారు. ఎటుచూసినా, చేసిన ప్రయత్నాలన్నీ భగ్నమవుతాయేమోనని అనుమానంగా వుంది. కాని రమేశు ఒక్కమాటకూడా అనలేదు. ఆకలిదప్పులు అతన్ని దహిస్తున్నయ్! పైగా యీ గందరగోళం జరగడంతో అతని ముఖం తెల్లబడిపోయింది. హతబుద్ధునిలా నిలుచుని చూస్తున్నాడు.

ఇంతలో పిలుపు వినిపించింది—'రమేశ్' అని.

హఠాత్తుగా క్షణంలో అందరి చూపులు విశ్వేశ్వరి ముఖం మీద పడినయ్! ఆమె సామానుగదిలోంచి బయటికి వచ్చి తలుపు ఎదురుగా నిలుచుంది. ఆమె తలమీద పైటకొంగు వుంది. కానీ ముఖంమీద లేదు. పెద్దమ్మ ఎప్పుడో తనంత తానే వచ్చిందని రమేశు గ్రహించాడు. ఆమె తనను యింకా వదలలేదు. ఆమె విశ్వేశ్వరనీ, ఘోషాల్ వంశస్థుల యజమానురాలని అంతా గ్రహించారు.

పల్లెలలో బస్తీలమోస్తరుగా పరదాపట్టింపులు వుండవు. అయినప్పటికీ ఆమె గొప్పింటి స్త్రీ కావడంవల్లనో, యింకే

కారణం వల్లనో, వయసు మీరినప్పటికీ, ఆమె ఎప్పుడూ ఎవరి యెదటకు వచ్చేదికాదు. అందువల్ల యీనా డామెను చూ నేసరికి అందరికీ ఆశ్చర్యం కలిగింది. ఆమెనుగురించి విని, కళ్ళతో చూడనివాళ్ళు మాత్రం ఆమె విలక్షణమైన కళ్ళుచూసి ఆశ్చర్య చకితులయారు. ఆమెకు హఠాత్తుగా కోపం రాగానే బయటికి వచ్చినట్లుంది. అందరి చూపులు అమె మీద పడగానే, ఆమె చటుక్కున స్తంభంచాటుకు వెళ్ళింది. ఆమె పిలుపు వినేసరికిరమే శుని విహ్వాలమంతా ఎక్కడికో ఎగిరిపోయింది. అతను గబ గబా ఆమె దగ్గరకు వెళ్ళాడు. పెద్దమ్మ చాటునవుండే స్పష్టంగా—అందరికి వినపడే విధంగా అన్నది—"రమేశ్, గంగూళీగారితో యీ విధంగా, దబాయించడం, భయపెట్టడం మానమని చెప్పు! అందరినీ నేనే ఆదరపూర్వకంగా పిలుచుకుని వచ్చానని, హోల్దారుతో చెప్పు. సుకుమారిని అవమానించే అవసరంలేదు. మా బోటి పరాయివాళ్ళ యింటిలో, కీచులాటలూ—గంద్రగోళం పనికి రాదని కూడాచెప్పు. యిందులో ఎవరికైనా అభ్యంతరం వుంటే, వాళ్ళు వెళ్ళి యింకొకచోట కూచోవచ్చునని చెప్పు—"

పెద్దమ్మగారి ఆజ్ఞ అందరూవిన్నారు. రమేశు తన నోటితో ఏమీ చెప్పవలసిన అవసరం లేకపోయింది. ఒకవేళ చెప్పాల్సి వున్నా చెప్పలేకపోయేవాడే! అక్కడ నిల్చుని చూడలేక పోయాడు. అతి ప్రయత్నంమీద కన్నీళ్ళు నింపుకుంటూ అతను ఒక గదిలోకి వెళ్ళాడు. అక్కడ అతని కళ్ళనుంచి జరజర లాడుతూ నీళ్ళు ప్రవహించినయ్. ఇవాళ పుదయంనుంచీ, ఆయన పనుల్లో క్షణం తీరికలేకండా వున్నాడు. అందువల్ల, వచ్చినవా

శ్ళెవరో—రానివారెవరోకూడా ఆయనకు తెలవదు. ఎవరు వచ్చినా—రాకపోయినా పెద్దమ్మ వస్తుందని లేదతనికి. లేచి నిల్చున్నవాళ్ళంతా ఒక్కొక్కరే కూచున్నారు. ఆ గుంపులోంచి ఎవరో కూచోరాదా బాబాయ్! భోజనంపెట్టి కూడా, యింటికి తీసుకుని వెళ్ళేందుకు లడ్డూలూ, బొబ్బట్లూ, ఎవరిస్తారేమిటి?" పారణిహోల్దారూ, గంగూళి యింకా నిల్చుని వుండడంచూసి అన్నాడు.

పారణిహాల్దార్ మెల్లిమెల్లిగా బయటికివెళ్ళిపోయాడు. కాని ఆశ్చర్యం ఏమంటే గోవిందగంగూళి నిజంగా కూచోవడమే! అయినా ముఖం మాత్రం యింతలావుచేసుకున్నాడు. భోజనాల కోసం విస్తళ్ళుకోయగానే, వడ్డన నెపంతో పైపెత్తనంచలా యించాలని, పంక్తిలోంచి లేచివెళ్ళాడు. ఈ వ్యవహారాన్ని లక్ష్యపెట్టినవాళ్ళు మాత్రం, గంగూళి, ఎవరినీ సహజంగా వదల దనిమాత్రం మనసులో అనుకున్నారు. ఆ తరువాత ఏమీ అల్లరి జరగలేదు. ఆనాడు బ్రాహ్మణులు భోజనంచేసిన తీరు కళ్ళతో చూడనిదే, నమ్మడం కష్టం! అక్కడవున్న అందరూ తమపిల్లల కోసమని, మూటలుకట్టుకున్నదికూడా తక్కువకాదు. చీకటి పడబోతూండగా అంతా అయిపోయింది. రమేశు వీధివాకిట్లో వున్న నేరేడుచెట్టుక్రింద అన్యమనసుతో నిలుచునివున్నాడు. అతని మనసు మనసులోలేదు. యింతలో దీనుభట్టాచార్యుడు తన పిల్లతో, మూటలు కట్టుకున్న బరువుతో, అందరి చూపుల్ని తప్పించుకుని బయటివస్తూండడం చూశాడా. అంతలోకంటే దుష్టుద్ధి అక్షయ్ క్షాతుర మునియ చూపులు రమేషుమీద పడినయ్!

ఆమె అపరాధిలా నిలుచుని—"బాబా! అక్కడ బాబుగారు నిలుచున్నారు" అంది.

అందరూ తొట్రుపడ్డారు. ఈ ఒక్కమాటతో రమేశు సంగతంతా గ్రహించాడు. ఒకవేళ అక్కడనుంచి తప్పుకునేందుకు వీలుంటే ఆయన స్వయంగా తప్పుకునేవాడే! కాని తప్పుకునేందుకు వీలులేకపోయింది. అందువల్ల ఆయన స్వయంగా ముందుకు వచ్చి. నవ్వుతూ అడిగాడు—"మునియా! యివన్నీ ఎవరి కోసం?" అని.

మునియా దగ్గరున్న చిన్నా-పెద్దా మూటలకు సరైన సమాధానం చెపుతుందో లేదోనని, దీను శుష్కంగా నవ్వుతూ—"నాయనా? మా వీధిలో యింకా అలగాజనం వాళ్ళపిల్లలువున్నారు. ఏదో మిగిలిన, ఎంగిలి మంగలం కొంత తీసుకునివెళ్ళి వాళ్ళకు కూడా యివ్వవచ్చనుకున్నాను. ఏమైనా ఆమెను అందరూ 'పెద్దమ్మగా'రని ఎందుకు పిలుస్తున్నారో యివ్వాళ గ్రహించాను" అన్నాడు.

రమేశు—అందుకేమీ జవాబు చెప్పకుండానే, అతనితో గేటువరకూవచ్చి అడిగాడు-"ఏం భట్టాచార్యులుగారూ! మీకు యిక్కడి సంగతంతా తెలుసు! ఈ గ్రామములో యింత ఈర్ష్య, ద్వేషం ఎందుకున్నాయో మీరు చెప్పగలరా?"

దీను ఏదో చప్పరించినట్లుగా రెండుమూడుసార్లు తలూపి అన్నారు—"నాయనా! యింకా మన కుంవాపురం నయం. మా మునియా అత్తగారి వూరిలో నాలుగురోజులుండి చూసి వచ్చాను. ఏంచెప్పను? అక్కడ బ్రాహ్మణులవీ, కాయస్థులవీ.

మహోవుంటే - యిరవైయిళ్లన్నా లేవు. అయినా అక్కడ నాలుగు పార్టీలు. హరనాథ్ విశ్వాసుడు తనస్వంత మేనల్లున్ని తోటలో రెండుపండ్లు కోశాడని జెయిలుకు పంపారు. బాబూ! అన్ని పల్లెలూ యింతే! యిక అందరూ కోర్టులకెక్కి చితికిపోయారు.... ఆ....మునియా! హరిధన్ చేతిలోని మూట, తీసుకో! వాడు అలసిపోయినట్లున్నాడు-"

"అయితే భట్టాచారిగారూ! యిందుకు ఏమీ ప్రతీకారం లేదా?"

ఒక చల్లని నిట్టూర్పు విడిచి భట్టాచారి అన్నాడు—"యిందుకు ప్రతీకార మేముంది బాబూ? ఇది కలియుగం....అయినా నే నొక సంగతి చెప్పగలను. నేను భిక్షాటనం చేస్తూ చాలా వూళ్ళకు వెళుతుంటాను. చాలామంది నామీద దయగావుంటారు. అయినా నీ బోటి యువకుల్లో దయా ధర్మం వున్న సంగతి కూడా చూశాను. అదే యీ వృద్ధులకు లేదు. వీళ్ళ సమయం చూసి మనిషి గొంతుమీద కాలుపెట్టి, వాడు చచ్చేవరకూ నాలుక సాగదీస్తూంటారు."

అంటూ తను నాలుక బయటపెట్టి ఒక విధంగా చూపాడు. అందుకు రమేశుకు నవ్వు వచ్చింది. ఆ నవ్వులో దీను పాల్గొనకుండానే—"నవ్వే సంగతి కాదుబాబూ! యిది నిజం! నేను కూడా యిప్పుడు చాలా పండుబారి పోయాను. కాని.......... బాబూ చీకట్లో చాలాదూరం వచ్చేశారు." అని అన్నాడు.

"విచారం లేదులెండి! మీరు చెప్పండి—"

"బాబూ ఏం చెప్పను? ప్రతి వూరూ—గ్రామమూ యిలాగే వున్నయ్! ఇక ఈ గోవిందగంగూలీ వున్నాడు. వీడి పాపాల్ని

తెల్పుకుంటే ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. క్షేంతీబ్రాహ్మణి అన్న మాటల్లో తప్పులేదు....కాని వాడికి అందరూ భయపడతారు. మోసం చేయాలన్నా, అబద్ధపుసాక్ష్యం చెప్పడంలో—అబద్ధపు వ్యాజ్యాలు బనాయించడంలో వాడికి సరిపోయేవాడు ఎవడూ లేడు. అయినా వేణీబాబుగారి మద్దత్తువుంది. అందువల్ల వాడికి విరుద్ధంగా ఒక్కమాటకూడా ఎవరూ మాట్లాడలేరు. పైగా యితరులను వెలివేస్తుంటాడు."

చాలా సేపటివరకూ ప్రశ్నించకుండానే, దీను వెంట నడుస్తున్నాడు రమేశు! కోపంతో మండిపోతున్నాడు. దీను చెప్పుకుపోతున్నాడు.—"బాబుగారూ నామాట గుర్తుంచుకోండి! క్షేంతీ బ్రాహ్మణిని సహజంగా వదిలిపెట్టరు. గోవిందగంగూళీ, పారణహాల్దారు యిద్దరూ రెండు కందిరీగలలాంటివాళ్లు. వాటిని రెచ్చకొట్టడం మామూలుసంగతికాదు. అయినా ఏమన్నా అనండి బాబూ! ఆమె ధైర్యస్థురాలు. ధైర్యం ఎందుకుండదు....? ఇంటింటికీ తిరిగి పేలాలు అమ్ముతూవుంటుంది. ప్రతియింటికీ వస్తూ—పోతూవుంటుంది. అందరిసంగతులు తెలుసు. మొత్తం మీద దాన్నేమన్నా అన్నారా—యిక వీళ్ళరంకులు బయటపడి తీరాల్సిందే: అయినా అనాచారం ఏయింట్లోలేదో మీరేచెప్పండి? వేణీబాబుకుకూడా........"

మధ్యలోనే అతన్ని ఆపి—"ఆపండి! పెద్దన్నయ్యగారి సంగతి మన కవసరంలేదు." అని ఆయన విషయంలో ఏమి చెపుతాడో నని భయపడి రమేశు అన్నాడు.

దీనుకూడా అప్రతిభుండై,—సరే ఆ సంగతి వద్దులెండి! పేదవాడికి యిటువంటి మాటలు పనికిరావు. ఒకవేళ యీసంగతి

వేణీబాబుతో ఎవరన్నా చెప్పినట్లైయితే—నాయిల్లు కూడా కాల్పించి...." రమేశు మళ్ళీ అతన్ని ఆపాడు.

"మీయిల్లు యింకెంతదూరముంది?"

"ఎక్కువదూరం లేదుబాబూ! ఈ వంతెన ప్రక్కనే నా పూరిల్లువుంది. ఒకవేళ యెప్పుడన్నా...."

"ఎందుకురాను? తప్పకవస్తాను. రేపుదయం మిమ్మల్ని కలుసుకుంటాను. ఆ తరువాతకూడా మీ పాదధూళి అప్పుడప్పుడూ మాయింట్లో పడేట్లు చేయండి."

అని రమేశు వెనక్కుతిరిగి వచ్చేశాడు. దీనూ భట్టాచారి కూడా తన మనసులోనే ఆశీర్వదించాడు—"దీర్ఘజీవిగా వుండు నాయనా! మీతండ్రిలాకావాలి" అని.

ఆయన తన పిల్లలతో యింటివేపు నడిచాడు.

5

ఈ వూళ్ళో మధుపాల్ చిల్లరదుకాణం ఒక్కటే నదికి వెళ్ళే దారి ప్రక్కగావుంది. తాను యివ్వవలసిన పదిరూపాయలకోసం పది పన్నెండురోజులైనా ఎవరూ రాకపోయేసరికి, రమేశు ఏమాలోచించాడో, ఒకనాటిప్రొద్దున్నే అతని దుకాణందగ్గరకు బయలుదేరాడు. మధుపాల్ ఎంతో వినయంగా, చాప పరిచి చినబాబుగారిని కూర్చోపెట్టాడు. చినబాబుగారు వచ్చినసంగతి తెలుసుకుని చాలా ఆశ్చర్యపడ్డాడు. మధుపాల్‌కు యింతవయసు వచ్చినా—బాకీ, తీర్చేందుకు స్వయంగావచ్చి యివ్వడం, తాను

ఎవరిని చూడలేదు. వినలేదు. ఆ సంగతీ ఈ సంగతీ చాలా మాట్లాడుకున్నాక మధుపాల్—"దుకాణం ఎలా సాగుతుంది బాబూ? రెండణాలు, పావలా, రూపాయి, రూపాయపావలా. ఇలా యాభై అరవై రూపాయల వరకూ బాకీలు వున్నాయ్. ఇదుగో యిప్పుడే యిస్తామని పట్టుకువెళ్ళడమేకాని, రెండు మూడు నెలలైనా యివ్వరు....ఎవరూ....? బెనర్జీగారేనా? నమస్కారాలు—ఎప్పుడు వచ్చారు? అని అడిగాడు.

బెనర్జీగారి కుడిచేతిలో చెంబూ, సీలమండలవరకు బురదా, చెవులమీదకు ఎక్కించిన జంధ్యం, యెడమచేతిలోని ఆకులో నాలుగైదు చిన్నచిన్న చేపలతో ప్రత్యక్షమయ్యారు. ఆయన గట్టిగా వూపిరి పీల్చి అన్నాడు—"నిన్నరాత్రి వచ్చాను. మధూ కొంచెం పొగాకు యిటివ్వవోయ్" అని చెంబుక్రిందపెట్టి, చేతిలోని చేపల్ని ఒక ప్రక్కగాపెట్టి అన్నాడు—"ఆ పల్లెముండ తెలివి చూశావా మధూ? అది చటుక్కున నాచేయి పట్టుకుంది. చూశావా? కాలం ఎలా మారిపోయిందో? ఇవన్నీ ఒక కానీ చేపలట? బ్రాహ్మణున్ని మోసగించి ఎంతకాలం తింటుందిలే? ఇది నాశనమైపోదూ?"

మధు ఆశ్చర్యంగా—"అది ఒక్కసారే, మీచేయి పట్టుకుందా?" అని అడిగాడు.

నాలుగుప్రక్కలా ఒక్కసారి కలియ చూసి—కోపంతో బెనర్జి చెప్పాడు—"దానికి యివ్వవలసిన బాకి డబ్బున్నర. ఈ కొంచెం కోసం, బజార్లో, అందరి యెదటా నాచేయి పట్టుకుంటుందా? చూడనివా శ్యైవరక్కడ? నేను బహిర్దేశానికివెళ్ళి

నదిలో చెంబు తోముకుని, నదిలో కాళ్ళూ—ముఖం కడుక్కుని కొంచెం అటు బజారుకువెళ్ళి వద్దామని బయలుదేరాను. తట్టెడు చేపలు పెట్టుకుని కూచుందక్కడ. కాని నాతో 'మహారాజా! యిప్పుడేమీ లేవు. అన్నీ అమ్ముడుపోయా యని' చెప్పింది. కాని, నా కళ్ళలో దుమ్ముకొట్టగలదా? ఆ తట్టమీది మూత తీసానో లేదో చటుక్కున నాచేయి పట్టుకుంది. అదివరకు యివ్వాల్సింది డబ్బున్నర యిప్పుడు డబ్బు మొత్తం ఈ రెండు కానులన్నరకు వూరువిడిచి పారిపోతానా? ఏమంటావు? నువ్వే చెప్పు మధూ?"

'ఆ....అదేముందిలే....' అన్నాడు మధు.

"అలా అను! అయినా యీ వూళ్ళో ఒక కట్టడి, ఒక శాసనం గాని, ఒక న్యాయంగాని వుందా? లేకుంటే, దానింటికి, చాకలిని, మంగలిని వెళ్ళకుండాచేసి, యిల్లు వూడదీసి పారేయవచ్చుకదా?" అని రమేశు వేపు చూసి—'మధూ! యీ బాబుగా రెవరు?' అని అడిగారు.

మధు గర్వపూర్వకంగా అన్నాడు—"వీరు మన చినబాబు గారి కొడుకు కదూ! సరుకులు పట్టుకువెళ్ళిన పదిరూపాయలు యిచ్చేందుకు వచ్చారు."

బెనర్జి పల్లెదాని సంగతి మర్చిపోయి, కళ్ళుచించుకుని చూస్తూ అన్నాడు—"ఆ! రమేశబాబా! చిరంజీవీభవ! చేయవలసిన విధంగానే చేశారని, రాగానే విన్నాను. యిటువంటి భోజనాలు, ఈ చుట్టుప్రక్కల యిదివర కెవరూ పెట్టించలేదు. [illegible] నాకళ్ళతో చూడలేదే అని విచారంగావుంది. నలుగు[illegible]రి

వలలోపడి నౌకరీకోసమని కలకత్తా వెళ్ళాను. అందువల్లనే ఈ దుస్థితి కలిగింది. అరే రామ రామ. అక్కడ మనుష్య మాత్రు లుంటారా ?"

రమేశు మెదలకుండా బెనర్జీ ముఖంలోకి చూస్తున్నాడు. అక్కడ చేరిన నలుగురైదురు మాత్రం అతని కలకత్తా యాత్రను గురించి సంగతులు తెలుసుకోవాలని ఉత్సాహపడుతున్నారు. మధు హుక్కానింపి ఆయనచేతి కిచ్చి అడిగాడు—"ఆ తరువాత యేమైనది ? నౌకరీ దొరికిందా ?"

"ఎందుకు దొరకదు ? నేను ఎంతకష్టపడి చదువుకున్నానో తెలుసా ? కాని నౌకరీ దొరికినంత మాత్రంలో ఏమవుతుంది ? అక్క డెవరుండగలరు ? ఎంత పొగవుంటుందో అంత బురద మయంగా వుంటుంది. ఒకవేళ బయటికివెళ్ళి, బండ్లక్రిందా, కాళ్లక్రిందా పడి రాకుంటే, అది వాళ్ళ పెద్దలుచేసుకున్న పుణ్య ఫలమే ననుకో !"

మధు ఎప్పుడూ కలకత్తా వెళ్ళలేదు. ఏదో ఒక సాక్ష్యం చెప్పేందుకు వెళ్ళి పట్టణం ఒక్కటిమాత్రం చూశాడు. అందుకని ఆశ్చర్యంగా చూస్తూ—'బాగానే వుందే' అన్నాడు.

బెనర్జీ నవ్వుతూ—"నేను చెప్పేది నిజమో—అబద్ధమో రమేశబాబునే అడుగు. వద్దు మధూ ! అన్నంలేకపోయినా, గుండెలమీద చెయిపెట్టుకుని హాయిగా యింట్లో చనిపోవడం చాలానయం. యిక ఏ పరాయివూరుకూడా వెళ్ళను. నేను చెపితే మీరు నమ్మరు. అక్కడ తోటకూర, అరటిపువ్వూ, కొత్తిమిరీ కూడా కొని తినాలి. అలా కొని ఎంతకాలం తింటావో చెప్పు ?

ఈ ఒక్క నెలకే చూడు—నేను ఓ ఎలకలా తయారయాను. రాత్రిం బగళ్ళూ కడుపులో గుడగుడమంటూ వుండేది. గుండెలోమంట. మనసులో భయం. అందుకే పారిపోయివచ్చాక ప్రాణాల్లోకి ప్రాణాలు వచ్చినయ్! కాదు—కాదు. మనవూళ్ళోనే వుండి ఎదో దొరికింది ఒక్కపూట తిన్నా చాలు. అంతకూ దొరక్కపోయి నప్పుడు పిల్లా—పీచుతో అడుక్కుని తినవచ్చు. బ్రాహ్మణ సంతానానికి అందులో సిగ్గులేదు. ఆ లక్ష్మీకటాక్షం వున్నంత వరకు—నేను పరదేశం వెళ్ళను" అని చెప్పాడు.

ఆకథ విని అందరూ ఆశ్చర్యం పొందారు. ఆ తరువాత ఆయన లేచివెళ్లి గరిటతీసుకుని నూనెడబ్బాలోంచి ఒక చటాకు నూనె తీసుకుని, దాన్ని చేతులో పోసుకుని, కొంత చెవుల్లో, కొంత ముక్కులో వేసుకుని మిగిలినది తలకు పెట్టుకుని మర్దించుకుని—"చాలా ఆలస్యమైంది మధూ! యిక స్నానం చేసి యింటికి వెళతాను. మధూ! ఒక కానీ వుప్పు కట్టు—సాయంకాలం వచ్చి యిస్తాను."

"మళ్ళీ సాయంకాలమా? అంటూ మధు వుప్పుకట్టేందుకు లేచాడు. బెనర్జి మెడసారించి చూసి, విస్మయంగా—"మీరంతా యిలా మారిపోయారేం? ముఖం పగలకొట్టి డబ్బు వసూలు చేసేట్లున్నారే!" అని స్వయంగా పిడికిలినిండా వుప్పుతీసుకుని, మధు కట్టిన పొట్లంలోవేసి, పొట్లం అందుకున్నాడు. ఆ తరు వాత చెంబు పుచ్చుకుని, రమేశు వేపుచూసి అన్నాడు—"మీరు కూడా అటేవస్తారుగా....? రండి! మాట్లాడుకుంటూ వెళదాం"

"పదండి—" అంటూ రమేశు లేచి నిల్చున్నాడు. మధు కొంచెం దూరంలోవుండి ఎంతో వినయంగా...."బెనర్జీగారూ!

ఆనాటి గోధుమపిండి అయిదున్నరఅణాలు........." అని అన్నాడు.

బెనర్జీకికోపంవచ్చింది—"ఏం మధూ? యిప్పుడు రెండు పూటలా కన్పిస్తుంటానుగా? మీకళ్ళకేమైనా చత్వారం వస్తుందా? యిప్పుడే ఆవెధవల జిత్తుల్లోపడి కలకత్తా వెళ్ళిరావడానికి అయిదు రూపాయలు నష్టేటిలో పోశాను. యిదేనా నువ్వుతగాదా పెట్టుకునే సమయము. అందుకే పెద్దలంటారు. ఒకరికి సర్వనాశనం, యింకొకరికి ఆనందం. వీళ్ళ వ్యవహారం చూస్తున్నావా రమేశ్—?"

మధు సంకుచితంగా—మెల్లిగా అన్నాడు—"చాలాకాలం...."

"చాలా రోజులు అయితే కావచ్చు. కానీ, అంతా యిలా పీక్కుతింటే, యీవూళ్ళో వుండడం కూడా కష్టమే"

అని ఒక విధంగా కోపంగానే తన సామాను తీసుకుని వెళ్ళిపోయాడు.

రమేశు అక్కడనుంచి తిన్నగాయింటికి వచ్చి, గుమ్మంలో కాలుపెట్టాడోలేదో, పెద్దమనిషి ఒకాయన గాబరాతో, త్రాగుతున్న హుక్కా ఆవలపెట్టి, లేచి వచ్చి అతని పాదాలకు నమస్కరించాడు. ఆయనలేచి నిల్చుని—"నా పేరు వనమాలిపాండే! నేను మీవూరి స్కూలుకు హెడ్మాష్టరును యిప్పటికి రెండు మార్లు వచ్చాను. కాని తమ దర్శనంకాలేదు. అందుకని...."

అని అంటుంటే రమేశ్ ఆయన్ని ఆదరపూర్వకంగా కుర్చీలో కూచోమని చెప్పాడు. అందుకాయన నిలుచునే అన్నాడు—

"నేను తమ నౌకరును"

ఒకటి ఆయన వయస్సు పెద్దది. పైగా ఒక విద్యాలయపు ప్రధానోపధ్యాయుడు. ఆయన అతివినయమూ, బెరుకుచూచేసరికి రమేశుని హృదయంలో అనాదరణ కలిగింది. ఆయన కుర్చీలో కూచునేందుకు నిరాకరించి, నిల్చునే, చెప్పడం మొదలుపెట్టాడు. —"ఈ చుట్టుప్రక్కల యిదొక్కటే చిన్నబడి. ముఖర్జీ-ఘోషాల్‌ల ప్రయత్నాలవల్ల స్థాపించబడింది. యిందులో ముప్పది. నలుబదిమంది పిల్లలు చదువుకుంటున్నారు. రెండు మూడుకోసుల దూరంనుంచికూడా పిల్లలు వస్తుంటారు. కొద్దో-గొప్పో గవర్నమెంటువారి సహాయ్యం కూడా లభిస్తుంది. అయినప్పటికీ బడిసాగేటట్లులేదు—"చిన్నప్పుడు తనుకూడా యీ బడిలో చదువుకున్న సంగతి రమేశుకు గుర్తువచ్చింది—" ఆ బడి, తిరిగి కప్పించకుంటే, ఈ వర్షాకాలంలో ఎవరూ లోపల కూచోలేరు. కాని యీ విషయం తరువాత చూడవచ్చు. అంతకన్నా ముఖ్యమైంది యిటు మూడు నెల్లనుంచీ మాష్టర్లకు జీతాలు అందలేదు. అందువల్ల తన యింట్లో తిండితింటూ-యీ పని యెవరూ చేయరు" అని కూడా పాండేయ చెప్పాడు.

స్కూలు విషయంలో రమేశు చాలా శ్రద్ధ చూపించాడు. ఆయన హెడ్‌మాష్టరుగారిని హాలులోకి తీసుకుని వెళ్ళి-అక్కడ ఒక్కొక్కటే అడిగాడు. ఆ స్కూలుకు నలుగురు ఉపాధ్యాయులు. ఈ నలుగురు మాష్టర్లు ఎంతో కష్టపడి చదువు చెప్పినా, ప్రతిసంవత్సరం యిద్దరికంటె ఎక్కువ మైనరుక్లాసులు ప్యాసవడంలేదు. వారిపేర్లు కూడా కంఠతా వప్పగించినట్లు అప్పగించాడు. పిల్లలవద్ద వసూలుచేసే డబ్బుతో క్రింది తరగతి యిద్దరి

మాష్టర్లజీతాలు సరిపోతయ్! సర్కారుగ్రాంటు ఒక మాష్టరుకు సరిపోతుంది. ఒక్కమనిషికి మాత్రం వూరంతా చందా ప్రోగు చేస్తుంటారు. ఈ చందావసూలుచేసే భారం కూడా మాష్టర్లమీదనే వుంది. ఒక్కొక్కయింటికి, పదిపన్నెండుమార్లు తిరగాల్సి వస్తుంది. యిప్పటికి నాలుగు నెలలనుంచి తిరుగుతున్నా నెల జీతం వసూలు కాలేదు. యిప్పటికి ఏడుంబావలా వసూలయింది?

ఈసంగతులు విని రమేశు స్థభించిపోయాడు. అయిదారు వూళ్ళకు యిదొక్కటే బడి, ఈ అయిదారు వూళ్ళలో నాలుగు మాసాలు తిరిగినా-వసూలైంది ఏడుంబావలా!—''మీకు జీత మెంత?''

''రశీదు మాత్రం యిరవై ఆరు రూపాయలకు యిస్తారు. మాకు ముట్టేది పదహారు పదిహేనులు అణాలు-''

ఈ రహస్యం గ్రహించలేక రమేశు అతని ముఖంలోకి చూస్తు న్నాడు. ఆయన మనసును గ్రహించి, మాష్టరుగారు చెప్పారు— "గవర్నమెంటు రూలు అంతే! అందువల్ల యిరవై ఆరురూపాయ లకురశీదు వ్రాసి స్కూళ్ళ డిప్యూటీ యిన్స్పెక్టరుకు చూపించాలి. లేకుంటే గవర్నమెంటు గ్రాంటు ఆగిపోతుంది. అది అందరికి తెలుసు! మీరు ఏ విద్యార్థిని అడిగినా- నేను చెప్పింది అబద్ధం కాదని తెలుసుకుంటారు''

కొంచెంసేపు మెదలకండావుండి రమేశు అడిగాడు—'దీని వల్ల మీకు విద్యార్థులలో గౌరవమేముంటుంది?''

మాష్టరుగారు సిగ్గుపడుతూ చెప్పాడు—మరేంచేయమంటారు రమేశబాబూ? వేణీబాబుగారు అది యివ్వడానికి యిష్టపడడు''

"అయితే ఆయనే దానికి యజమాని అనుకుంటాను"

మాష్టరుగారు సంకోచంలో పడినమాట వాస్తవమే! అయినా 'కాదు' అని అసలేక మెల్లమెల్లగా—"ఆయన శెక్రటరీ! కాని తన డబ్బు ఒక్కకాని కూడా ఖర్చుపెట్టరు. ఆ....యదుముఖర్జి గారి కూతురు లక్ష్మిలాంటిది. ఆమెగారి దయేలేకుంటే ఎప్పుడో బడి ఆగిపోయివుండేది. ఆమెగారు యీసంవత్సరము కప్పిస్తానని అన్నది. అంతలో ఎందుకో ఆమెచేతిని వెనక్కులాగి సాహాయ్యమంతా ఆపేసింది" అని చెప్పాడు.

రమ విషయం అడిగి తెలుసుకుని చివరకు—"ఆమె తమ్ముడు యీ స్కూలులోనే! చదువుతున్నాడు కదూ?" అని అడిగాడు.

"యతీన్ కదండీ? అవును చదువు తున్నాడు."

"సరే మీకు స్కూలు సైమయింది. యికమీరు వెళ్ళండి రేపు మీ స్కూలుకు వచ్చి సూస్తాను."

"తమదయ." అంటూ మాష్టరుగారు బలవంతంగా రమేశుని పాదధూళి తీసుకుని తలమీద జల్లుకుని వెళ్ళిపోయాడు.

6

ఆనాటి విశ్వేశ్వరి పని ఆ చుట్టుప్రక్కల పదిగ్రామాల్లో వ్యాపించిపోయింది. వేణీ స్వయంగా ఎవరి ఎదట కూడా కఠినంగా మాట్లాడలేదు. అందువల్ల ఆయనవెళ్ళి రమ చిన్నమ్మను పిలుచుకుని వచ్చాడు. పూర్వం తక్షకుడనే పాము తన విషంతో ఓ గొప్ప మర్రివృక్షాన్ని కాల్చి చంపి వేశాడట. ఈ చిన్నమ్మ

కూడా ఆనాడు ఉదయాన్నే వచ్చి విశ్వేశ్వరిమీద కక్కిన విషం, రక్త-మాంసాదులతో నిండివున్న ఆమె శరీరం, కొయ్యకాదు పైగా ఆకాలానికీ ఈకాలానికీ అంతరం వుంది కాబట్టి భస్మం కాలేదు. విశ్వేశ్వరి అవమాన మంతా సహించింది. ఎందుకంటే, యిది జరిగింది తన కొడుకువల్లనే: తను నోరు విప్పి ఒక్కమాటకు జవాబు చెప్పినట్లయితే, ముందుగా తన కొడుకు సంగతి బయటపడుతుంది, ఆ విషయం రమేశుని చెవుల్లో పడుతుంది. ఆ భయంతో విశ్వేశ్వరి ఆ కొంచెంసేపూ-కొయ్యలామారి వూరుకుంది,

కాని గ్రామాల్లోనూ, పల్లెల్లోనూ ఏసంగతీ దాగదు, రమేశు కూడా విన్నాడు. తన పెద్దమ్మ విషయంలో మొదటినుంచీ అతనికి ఉత్కంఠగానే వుంది. తనవల్ల తల్లీ, కొడుకు లిద్దరి మధ్య పోట్లాటలు జరుగుతాయని అతను అనుమానిస్తూనే వున్నాడు. కాని వేణీ బయటి మనిషిని పిలిపించి, తన తల్లిని అవమానించడం, తన దృష్టిలో ఎక్కడా చూడలేదు, ఆ తరువాత అతని కోపానికి అంతులేక పోయింది. యీ సమయంలో తను వెళ్ళి వేణీ ముఖం ఎదటనే, తల్లిని దూషించి నందుకు నాలుగు తిట్టి వద్దామని అనుకున్నాడు. ఎందువల్లనంటే తల్లిని యిలా అవమానించిన వాడిని అవమానించడానికి వెనకా ముందూ చూడవలసిన పనిలేదు. కాని అలా చేయకూడదని ఆ మరుక్షణంలోనే అనుకున్నాడు. యిందువల్ల పెద్దమ్మకు అవమానం యింకా ఎక్కువవుతూందేగాని తక్కువకాదు. ఆనాడు దీను నోటంటా, యీ రోజు మాష్టరుగారి మాటల

ద్వారా, రమను గురించి విన్నందువల్ల, ఆమె మీద అతని మనసులో ఒక విధమైన శ్రద్ధాభక్తులు గలిగినయ్! నాలుగు ప్రక్కలా మూఢత్వమూ—కుత్సితమూ వ్యాపించిపోయిన ఆ గ్రామములో ఒక్క పెద్దమ్మ హృదయంలో తప్ప, మిగిలిన గ్రామమంతా అహంకారమనే అంధకారంలో మునిగి వుందనే నమ్మకం కలిగాక, ఈ ముఖర్జీగా రింటివేపు చూసి నప్పుడు మాత్రం, కొంచెం వెలుగు కన్పించ సాగింది. ఆ వెలుగు ఎంత క్షుద్రమైనా- నీచమైనాసరే అతనికి ఆనందం కలిగించింది. కాని యివాళ జరిగిన సంఘటనతో, ఆ భావానికి విరుద్ధంగా, అతని మనసంతా, అసహ్యంతో- విరక్తితోనూ, నిండిపోయింది. యీ యిద్దరూ కూతురు- చిన్నమ్మలు కలిసి, వేణీతో కుట్రచేసి అన్యాయం చేసివుంటారని గ్రహించాడు. కాని యీ యిద్దరి స్త్రీలను, వేణీని ఏమని దండించాలా అని ఆలోచించినా- ఏమీ తోచలే దతనికి.

ఈ మధ్యలో యింకొకసంఘటన జరిగింది. ముఖర్జీ-ఘోషాల్ వంశస్తులకు యింకా పంపకం కానిఆస్తి కొంతవుంది. ఆచార్యుల యింటివెనక 'గుంట' అని పిలబడే చెరువువుంది. అదికూడా యిటువంటి పంపకంకాని ఆస్తే: ఒకా నొకప్పుడు అది చాలా పెద్ద చెఱవే! కాని మరమత్తూ- అవి చేయించనందువల్ల, పూడి పోయి చివరకు చిన్నగుంటలా తయారైంది. మంచి మంచి చేపలను తెచ్చి దానిలో వదలనూవదలరు. అందులో వుండనూ వుండవు. ఏదో మామూలు చేపలు అందులో వాటంతట అవే పుడుతూవుంటయ్! భైరవాచారి పగర్చుకుంటూ వచ్చాడు.

బయట చండీమండపంవద్ద ఆ యింటి గుమాస్తా గోపాల్‌సర్కారు కూచుని లెక్కలు వ్రాసుకుంటున్నారు. భైరవాచారి భయపడుతూ—"గోపాల్ సర్కారుగారూ! మీరు మీ మనుష్యుల్ని పంపలేదా? ఆ గుంటలో చేపలు పడుతున్నారు—" అని చెప్పాడు.

సర్కారు చెవులసందున కలం యిరికించి తలెత్తి చూసి—"పట్టుకునే దెవరు?" అని అడిగాడు,

"యింకెవరు పట్టుకుంటారు? వేణీబాబు నౌకరు నిల్చుని వున్నాడు. ముఖర్జీగారి హిందుస్తానీ దర్వాను కూడా వున్నాడు. నేను చూసి యిప్పుడే వస్తున్నాను. మీ మనుష్యులు ఎవరూ లేరు, ఎవరినన్నా తొందరగా పంపండి—"

గోపాల్‌సర్కారు చంచలత ఏమీ ప్రకటించలేదు—"మా బాబుగారు, మాంసం, చేపలు ముట్టుకోరు—"

"ఆయన తినకుంటే ఏం? కాని, మనభాగం మనం తీసుకోవాలి—",

"మా అందరికీ తీసుకోవాలనే వుంది. అయినా పెదబాబుగారు బ్రతికివుంటే కావాల్సివుండేవి, కాని రమేశబాబు అదొక రకమైన మనిషి!"

ఈ మాటతో భైరవాచారి ముఖంలో ఆశ్చర్యచిహ్నాలు చూసి, గోపాల్‌సర్కారు నవ్వుతూ చెప్పాడు—"ఆచారిగారూ—యివి ఏవో నాలుగు కుళ్ళిపోయిన చేపలసంగతి! ఆనాడు ఉత్తరవీధిలోని ఆ పెద్ద చింతచెట్టు కొట్టించారు. ఆ రెండిళ్ళవాళ్ళే చెరిసగం పంచుకున్నారు. మాకు ఒక పుల్లకూడా యివ్వలేదు. నేను ఆ

వెంటనే వచ్చి, బాబుగారితో సంగతంతా చెప్పాను. ఆయన ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. ఆయన ఒక్కసారి తలెత్తిచూసి నవ్వి—మళ్ళీ పుస్తకం చదవడంలో లీనమయ్యారు. ఏంచేయమంటారని అడిగాను నేను? కాని మా రమేశబాబుగారికి, తలెత్తేందుకే వీలులేకపోయింది. నేను ఎంతో బ్రతిమిలాడి, ఎన్నో చెప్పాక—ఆయన పుస్తకం మూసి ఆవులిస్తూ—'కష్టైలా? అయితే మనకేమీ చింతచెట్లులేవా?' అని అడిగారు. విన్నారా ఆమాట? 'ఎందుకులేవు?' అయినా మనభాగం మనం పంచుకోవాలి! అని చెప్పాను. అప్పుడాయన ఏమన్నాడో చూశారా? 'వెధవ నాలుగు పుల్లలకోసం పోట్లాడలేను' అని."

భైరవుడు చకితుడై—'అరె! మీరనేది నిజమేనా?' అని అడిగాడు.

గోపాల్‌సర్కారు కొంచెం నవ్వి తలూపుతూ—"ఆచార్యులుగారూ! నేను చెప్పేదంతా నిజమే! నేనా రోజునే అంతా గ్రహించాను. ఇప్పుడు మాటిమాటికీ వ్యర్థంగా ఎందుకు చెప్పాలి? ఈ చిన్నయింటి లక్ష్మి, తారిణీఘోషాల్‌తోనే అంతర్థానమైంది." అని అన్నాడు.

భైరవుడు కొంచెంసేపు మెదలకుండావుండి అన్నాడు—"అయినా—ఆగుంట మాయింటివెనక వుంది. అందుకు నేను వచ్చి కబురుచెప్పాలిగా?"

"అటువంటప్పుడు మహరాజా! మీరే వెళ్ళి ఆ కబురు చెప్పండి! రాత్రింబవళ్ళు పుస్తకాలు చదువుతూ కూర్చుని, భాగస్తులకు భయపడుతుంటే, ఆస్థి సురక్షితంగా వుంటుందా?

ముఖర్జీగారి కూతురు ఆడది. ఈ మాటలువిని ఆమెకూడా నవ్వింది. ఒకనాడు ఆమె గోవింద్‌గంగూలీని పిలిచి పరిహాసం చేస్తూ అన్నదట—రమేశబాబును నెలకింత తీసుకుని ఆస్తిని తనకు అప్పగించమని. ఇంతకంటే సిగ్గుపడాల్సిందేముంది?'' అని గోపాల్‌సర్కారు, ఆ తరువాత తన పనిలో లీనమయాడు.

ఇంట్లో ఆడదక్షత లేదు. తలుపులన్నీ తెరిచేవున్నాయ్! భైరవుడు లోపలికి వెళ్ళాడు. రమేశు పడకకుర్చీలో పడుకుని వున్నాడు. రమేశుని కర్తవ్యపథంవేపు తిప్పేందుకు ఉత్తేజితున్ని చేయడానికి. ఆస్థిని రక్షించుకునే విషయం ప్రారంభించి, ఈ సంగతి ఎత్తగానే, రమేశు నిద్రపోతూ తుపాకి గుండుదెబ్బ తిన్న పులిలాలేచి గావుకేకపెట్టాడు—''రోజురోజుకూ యిదొక తమాషా చేస్తున్నారే? భజువా?''

తలవని తలంపుగా కలిగిన అతని కోపానికి భైరవాచారి కంగారుపడ్డాడు. తమాషా యెవరిదో అర్థంకాలేదు. భజువ గోరఖ్‌పూరునివాసి. రమేశునికి ఆంతరంగిక బంటు. మంచి బలాఢ్యుడు. విశ్వాసపాత్రుడు. సాములో రమేశుని శిష్యుడు. తను సాము చేర్చుకుని, రమేశు దాన్ని వృద్ధిచేసుకుందామని ఆ విద్య భజువాకు కూడా, నేర్పాడు. భజువ రాగానే, రమేశు వాడితో చెప్పాడు—''మొత్తం పట్టిన చేపలన్నీ లాక్కురిరా! ఒకవేళ ఎవడన్నా అడ్డంవస్తే జుట్టుపట్టుకుని యిక్కడకు యీడ్చుకునిరా! అలాకూడా వీలులేకుంటే కనీసం వాళ్ళ పళ్ళయినా వూడగొట్టిరా'' అని కఠినమైన ఆజ్ఞ యిచ్చాడు.

అదే భజువ కోరుకున్నది. వాడు తన నూనెపట్టిన కర్ర కోసం మెదలకుండా లోపలికి వెళ్ళాడు. అది చూసి భైరవుడు

భయంతో వణకిపోయాడు. వాడు బెంగాల్ దేశపు సీరు వంట పట్టినవాడు. అరుపులు, పెడబొబ్బలకు జంకడు. అటువంటి దృఢకాయుడు యజమాని ఆజ్ఞ విని, ఒకసారి తలపంకించి, యింకేమీ మాట్లాడకుండా—కర్రకోసం యింట్లోకి వెళ్ళాడు. ఆ దృశ్యం చూసేసరికి భైరవుని దవడలు పీక్కుని పోయాయ్! మొరగనికుక్క కరుస్తుందని అతనికి గుర్తువచ్చింది. భైరవుడు వాస్తవంగా శుభచింతకుడు. సరైన సమయానికి వెళ్ళి ఏదో నాలుగు కూకలేసి, కొన్నిచేపలు తెచ్చుకుంటారేమో నని చెప్పేందుకు వచ్చాడు. ఇందులో తనూ కొంచెం సాయపడదామని భైరవుడు వచ్చాడు. కాని యెక్కడా ఏమీ జరగలేదు. తిట్లజోలికి యెవరూ పోలేదు. యజమాని కొంచెంగా హుంకరించాడు. నౌకరు నోరు విప్పకండా, తిన్నగా లాఠీకోసం, లోపలకు వెళ్ళాడు. భైరవుడు చాలా బీదవాడు. కోర్టుల కెక్కడం—సాక్ష్యం చెప్పడమంటే అతనికి భయం, యిష్టంకూడా లేదు. కొంచెంసేపట్లో భజువ లాఠీతో బయటకు వచ్చాడు. ముందు వాడు లాఠీని ముద్దు పెట్టుకుని, ఆ తరవాత రమేశుకు నమస్కరించి వెళుతున్నాడు. హఠాత్తుగా భైరవుడు ఏడుస్తూ—రమేశుని రెండుచేతులు పట్టుకుని—"ఒరేయ్ భజువా ఆగరానాయనా! వెళ్ళద్దు. రమేశు బాబూ క్షమించండి! నేను బీదవాణ్ణి నాప్రాణాలుకూడా దక్కవు" అన్నాడు.

రమేశు కోపంతో చేతులు విదుల్చుకున్నాడు. అతని ఆశ్చర్యానికి అంతులేదు. భజువ తిరిగివచ్చి నిశ్చేష్టుడై నిలుచున్నాడు. భైరవుడు రుద్ధకంఠంతో—"నాయనా! ఈ సంగతి

దాగదు. వేణీబాబుకు కోపంవ స్తే ఒక్కనాటికీ బ్రతకను. నాయిల్లూ—వాకిలీ కాల్చిపారేస్తారు. అప్పుడు ఆ విష్ణు, మహేశ్వరుడు కూడా నన్ను రక్షించలేరు !" అని చెప్పాడు.

రమేశు తలొంచుకుని, నిశ్శబ్దంగా నిలుచుని వున్నాడు. ఈగోల విని, గోపాల్‌సర్కారు లెక్కలు వదిలి అక్కడికివచ్చి నెమ్మదిగా చెప్పాడు—'అవును నాయనా ! యితను అన్నది నిజమే."

రమేశు జవాబేమీ చెప్పలేదు. చేతితో ఘటవాసు లోపలికి వెళ్ళమని చూపించాడు. తాను మెదలకుండా లోపలికి వెళ్ళాడు. అతని హృదయంలో భైరవుని భయమూ, పిరికిమాటలూ, ఎంతగా కలవరపెట్టాయో, అది అంతర్యామికే తెలుసు !—

7

"ఏరా యతీన్—ఆడుకుంటున్నావేం ? స్కూలుకు వెళ్ళవాయేం ?"

"మాకు యివాళ, రేపు సెలవులు అక్కయ్యా"

ఈమాట విని రమ చిన్నమ్మ తన కుత్సిత ముఖాన్ని—యింకా వికృతంగాపెట్టి అన్నది—"మండినట్లే వుందిలే ఆస్కూలు. నెలకు పదిహేనురోజులు సెలవు. అయినప్పటికీ నువ్వు దానికి బోలెడు డబ్బు తగలేస్తున్నావు. నేనైతే నిప్పు పెట్టేదాన్ని."

ఆమాట అని ఆమె తన పనికి వెళ్ళిపోయింది. ఎవరైతే రమ చిన్నమ్మను పదహారు అణాల మిథ్యావాది అని అంటారో

వాళ్లు పొరపాటు పడ్డారని చెప్పవచ్చు. ఆమె యిటువంటివే ఒకటీ రెండు నిజమైన సంగతులు కూడా చెప్పుతూండేది. అవసరం వచ్చినప్పుడు ఆ సంగతులు యితరులముందు చెప్పేందుకు కూడా వెనుకాడేదికాదు.

రమ తమ్ముణ్ని దగ్గరకు లాక్కుని అడిగింది—"ఏరా, యతీన్ ! సెలవు మెందుకురా ?"

యతీంద్రుడు తన అక్కగారి వొడి దగ్గరలో నిలుచుని చెప్పాడు—"మా స్కూలును కప్పిస్తున్నా రక్కయ్యా ! ఆ తరువాత సున్నంకూడా వేస్తారట. ఎన్నోపుస్తకాలు వచ్చినయ్. అయిదారు కుర్చీల్లు, టేబులు, పెద్దబీరువా, ఓ గడియారం కూడా వచ్చింది. అక్కయ్యా ! ఒకనాడు వచ్చి చూడరాదూ ?"

రమ చకితురాలై అన్నది—'యిదంతా నిజమేరా ?

"అవు నక్కయ్యా ! నిజమే ! రమేశబాబు వచ్చాడు. ఆయనే యివన్నీ తెప్పించారట—"

ఆ తరువాత యింకా అత నేదో చెప్పబోతున్నాడు. ఎదురుగా చిన్నమ్మ రావడంచూసి, రమ తమ్ముణ్ని తీసుకుని తనగదిలోకి వెళ్ళిపోయింది. ఆమె అతన్ని దగ్గర కూచోపెట్టుకుని, అతన్ని అడిగి రమేశుని, స్కూలువిషయం అన్నీ ఒక్కొక్కటే తెలుసుకుంది. ఆయన ప్రతిరోజూ వచ్చి, గంటా, రెండుగంటలు పిల్లలకు చదువు చెపుతుంటాడని కూడా విన్నది. ఆ తరువాత హఠాత్తుగా అడిగింది—"అయితే యతీన్ ! ఆయన నిన్ను గుర్తించాడురా !"

తలఊపుతూ అతను—"ఆ........" అన్నాడు.

"నువ్వు అయన్ను ఏమని పిలుస్తున్నావు ?"

యతీంద్రుడు కొంచెం కష్టంలో పడ్డాడు. ఎందుకంటే యింకా అంతవరకూ పోలేదు సంగతి సందర్భాలు. పైగా ఆయన స్కూలు లోకి, రాగానే దుర్దాండ ప్రతాపుడైన హెడ్‌మాష్టరుగారు కూడా కుర్చీలోంచి లేచి ఒక ప్రక్కగా నిలుచుంటాడు. అదిచూసి విద్యార్థులకు భయం ఆశ్చర్యం కూడా కలిగేది. ఆయన్ని పిలవడం అటుపుంచి, ఆయనవేపు కన్నెత్తి కూడా చూడలేక పోయేవారు. అక్క దగ్గర యీ సంగతి ఒప్పుకోవడం కూడా సహజంకాదు. మాష్టర్లంతా ఆయన్ను "చిన బాబుగారు," అని పిలవడం విద్యార్థులంతా విన్నారు. అందువల్ల యతీంద్రుడు కొంచెం బుద్ధి నుపయోగించి చెప్పాడు—"చిన బాబుగారూ— అని పిలుస్తాను—"

కానీ వాడిముఖంలోని భావంచూసి రమ అంతా గ్రహించింది ఆమె తమ్ముణ్ని యింకా తన దగ్గరకు వాడిలోనికి తీసుకుని నవ్వుతూ—"చినబాబుగా రెందు కవుతారురా ? అతను నీకు అన్నయ్య అవుతాడు. ఏవిధంగా వేణీ బాబును పెద్దన్నయ్యా అని పిలుస్తుంటావో—అదే విధంగా ఆయన్ని చిన్నన్నయ్యా అని ఎందుకు పిలవగూడదు ? అని అడిగింది,

ఆ పిల్లవాడు విస్మయానందాలతో విస్మితుడై—"అయితే ఆయన నాకు అన్నయ్య అవుతాడా ? నిజమేనా అక్కా—?" అడిగాడు.

"అవును ! అన్నయ్య అవుతాడు"

అని రమ కొంచెం నవ్వింది. కాని యతీంద్రుని ఆపడం కష్టమై పోయింది. ఎంత తొందరగా పిలుంటే, అంత తొంద

రగా యీ సంగతి తన స్నేహితులకు చెప్పాలని ఉబలాటం కలిగింది. కాని బిడిసెలపు. ఈ రెండురోజులు ఎలాగైనా ధైర్యంతో వోపికగా వుండాలి. అయినప్పటికీ ఆ చుట్టు ప్రక్కల పిల్లలకు చెప్పకుండా యెలా వుండగలడు ? బయటికి వెళ్ళాలని తంటాలు పడుతూ—" అయితే యిక వెళ్ళ మంటావా అక్కయా ?" అని అడిగాడు.

"యిప్పు డెక్కడికి వెళతావు ?" అని రమ అడిగింది. అందువల్ల యింతముఖం చేసుకుని, మెదలకుండా కొంచెం సేపుండి—"మరి యింతకాలం యెక్కడున్నారు—?" అని అడిగాడు.

" యింతకాలం చదువుకునేందుకు పరదేశం వెళ్ళారు. నువ్వు పెద్దవాడి వయాక, అలానే పరదేశంవెళ్ళి చదుకోవాలి. నువ్వు నన్ను వదిలి యింకొక దేశంలో వుండగలవా యతీన్ ?"

ఈ మాట అని ఆమె తమ్ముణ్ని కౌగిలిల్లోకి తీసుకుంది. యతీన్ చిన్నవాడైనప్పటికీ అక్కగారి కంఠస్వరంలోని పరివర్తనం. గమనించి, ఆశ్చర్య పూర్వకంగా ఆమె ముఖంలోకి చూస్తూ వుండిపోయాడు. రమ తన తమ్ముణ్ని ప్రాణాలతో సమానంగా ప్రేమిస్తుంది. అయినప్పటికీ. ఆమె మాటల్లోకాని చేతల్లోకాని యింత ఆవేగమైన ఉఛ్ఛ్వాసనిశ్వాసము యింతకు ముందెప్పుడూ చూడలేదు.

"అక్కయ్యా! చిన్నన్నయ్య చదువంతా పూర్తయిందా ?"

ప్రేమ పూర్వకంగానే—"అవును! చదువంతా పూర్తిచేసుకునే వచ్చారు—" చెప్పింది.

"నీ కెలా తెలిసింది?"

అందుకు జవాబుగా ఓ చల్లని నిట్టూర్పు విడిచి రమ తలూపింది. వాస్తవంగా యీ విషయంలో ఆమెకుగాని, యీ వూళ్ళో వాళ్ళకు గాని ఏమీ తెలవదు. తను అనుకున్నది నిజమో కాదో కూడా తెలవదు. అయినప్పటికి కూడా, యితర పిల్లలకు చదువు చెప్పేందుకు యింత శ్రద్ధ కనుపరిచిన వ్యక్తి సామాన్యుడు కాడనిమాత్రం గ్రహించింది.

యతీంద్రుడు ఆ విషయంలో ఏమీ ప్రశ్నించలేదు. యీ మధ్యలో అతనికి ఒక ప్రశ్న తట్టింది. చటుక్కున అడిగాడు—"ఏం అక్కయ్యా! చిన్నన్నయ్య మనింటికి ఎప్పుడూ రాడేం? పెద్దన్నయ్య రోజూ వస్తుంటాడుగా?"

ఈ ప్రశ్న ఆమెకు తీవ్రమైన బాధ కలిగించింది. శరీరానికి విద్యుత్ప్రసారం సోకినట్లయింది. అయినప్పటికీ ఆమె నవ్వుతూ —అతన్ని నువ్వు ఎందుకని తీసుకుని రాగూడదు?" అని అడిగింది.

'అయితే వెళ్ళమంటావా అక్కయ్యా—?' అంటూ వెంటనే లేచి నిలుచున్నాడు.

'సరే! నువ్వు వట్టి పిచ్చివాడివిరా—!' రమ తన భయవ్యాకులమైన చేతులతో అతన్ని పట్టుకుంది. అతన్ని హృదయానికి హత్తుకుంటూ అన్నది—'యతీంద్ర్ కొంపతీసి ఆ పని మాత్రం చేశావ్?'

యతీంద్రుడు చిన్నవాడే: అయినప్పటికీ, అక్కగారి గుండె వేగంగా కొట్టుకోడం గమనించాడు. ఆశ్చర్యంగా ఆమె ముఖం

లోకి చూస్తూన్నాడు. ఒకటి, ఆమె యిలా చలించిపోవడం. రెండోది, చినబాబుగారు చిన్నన్నయ్య అవుతాడని చెప్పగా విని, మనసులో సంతోషం కలిగింది. మ రటువంటప్పుడు, అక్కగారు తన నెందు కింత యిదిగా భయపెడుతుందో అర్థం కాలేదా చిన్నబుర్రకు. అదే సమయంలో చిన్నమ్మ పిలుపు విని, యతీంద్రుని విడిచిపెట్టి రమ లేచి నిల్చుంది, కొంచెం నేపట్లో చిన్నమ్మ వాకిట్లోకి వచ్చి "అరే! నువ్వు నదికి స్నానానికి వెళ్ళావను కున్నాను. యివాళ ఏకాదశి కదూ? యింత ప్రొద్దెక్కినా యింకా తల తడపకుండా వుంటారా? చూడు ముఖమంతా వాడి ఎలా నల్లబడిందో—' అన్నది.

రమ కొంచెం గట్టిగా నవ్వి అన్నది—"నేను వస్తానులే నువ్వు పద చిన్నమ్మా?"

"ఇంకా ఎప్పుడువచ్చేది? బయటికి వచ్చిచూడు. భాగాలు పంచడానికి వేణీ చేపలు పట్టించుకుని వచ్చాడు."

చేపలమాట వినగానే యతీంద్రుడు అక్కడనుంచి పారిపోయాడు. రమ చిన్నమ్మకు కనపడకుండా, పైటకొంగుతో ముఖమంతా ఒక్కసారి తుడుచుకుని ఆమె వెనకనే బయటకు వచ్చింది. అంగనంలో మహా కోలాహలంగావుంది. పట్టుకున్న చేపలు తక్కువకావు. ఓ పెద్ద గంపనిండా వున్నయ్! వాటిని పంచడానికి స్వయంగా వేణీబాబు అక్కడికివచ్చాడు. ఆ వీధిలోని పిల్లలంతా అక్కడచేరి గోలచేస్తున్నారు.

ఇంతలో ఎవరో దగ్గుతుండడం వినిపించింది. ఆ వెంటనే ధర్మదాసు చేతికర్ర వూతతో వస్తూ—'వేణీ, యివాళ చేపలు పట్టారాయేం?' అన్నాడు.

వేణీముఖం మార్చుకుని—'ఏమంత ఎక్కువ పట్టలేదు' అంటూ పల్లెవాళ్ళను పిలిచి—'ఎందుకింకా ఆలస్యం. తొందరగా రెండు భాగాలు చేయండి' అన్నాడు.

పల్లెవాళ్లు భాగాలు వేస్తున్నారు. ఇంతలో గోవిందగంగూళి అక్కడికివచ్చి—"ఏమిటిదంతా రమా! నేనిటువేపురాక చాలా రోజులైంది. నిన్ను ఒకసారి చూసి మాట్లాడించి వెళదామని వచ్చాను" అన్నాడు.

'రాండి' అని రమ పల్కరించింది.

'ఏమిటిగుంపు?' అంటూ గంగూళి ఆ వెంటనే ఆశ్చర్యం ప్రకటిస్తూ—"ఓ అదా సంగతి? చేపలు తక్కువ పడినట్లుందే! పెద్ద చెఱువులో వలవేసినట్లున్నారే!" అన్నాడు.

ఈ ప్రశ్నలన్నిటికి జవాబుచెప్పడం నిరర్థకమని అక్కడున్నవాళ్ళంతా అనుకున్నారు. అందరూ చేపలను పంచుతున్నారు. కొంచెం సేపట్లో ఆపని పూర్తయింది. వేణీ తనవంతు చేపలనన్నిటినీ నౌకరు నెత్తికెత్తి, పల్లెవాళ్ళకు ఏదో సైగచేసి వెళ్ళిపోతున్నాడు. ముఖర్జీలవారికి ఎక్కువ అవసరంలేదు. అందువల్ల రమ తన భాగానికివచ్చిన చేపలలో అక్కడున్న అందరకూ యోగ్యతలను బట్టి తలోకొంచెం పంచింది. వాళ్ళుకూడా యిళ్లకు వెళ్ళబోతున్నారు. ఇంతలో రమేశు హిందూస్తాని నౌకరు తన నిలువెత్తు కర్రతోసహా అంగనంలోకి రాగానే అందరూ ఆశ్చర్యచకితులయారు. వీడిముఖంచూసి ఆజన్మాంతం మరిచిపోయేవాళ్ళుండరు. అంత భీషణంగా వుంటుందా ముఖం. వూళ్ళో చిన్నా—పెద్దా అందరూ వాడిని గుర్తుపట్టగలరు. అంతే

గాదు వీణ్ణిగురించి రకరకాల కథలు మొదలుపెట్టారు. ఇంత మందిలో రమే యజమానురాలని ఎలాగుర్తించాడో అది వాడికే తెలుసు! వాడు అల్లంతదూరంనుంచే 'అమ్మగారూ!' అని పెద్ద సలాంచేసి, దగ్గరకువచ్చి నిలుచున్నాడు. వాడిముఖం యెలా వున్నా—కంఠస్వరంమాత్రం భీకరంగావుంది. వాడు యింకొకసారి సలాంచేసి—బెంగాలీ—హిందూస్థానీ భాషను కలగాపులగంగా చేసి తాను రమేశబాబు నౌకరునని, చేపల్లో మూడోభాగం పట్టుకుని వెళ్ళేందుకు వచ్చానని, చెప్పాడు. రమ విస్మయంతో నైతేనేం—వాడి ప్రశ్నలకు జవాబు ఆలోచిస్తుండడం వల్లనైతేనేం—తొందరగా వాడికి జవాబుచెప్పలేకపోయింది. భజువ చటుక్కున వెనకకు తలత్రిప్పి వేణీనౌకరుతో—'అరేయ్! ఇప్పుడు వెళ్ళవద్దు' అని పెద్దగొంతుకతో అన్నాడు.

భయంతో నౌకరు నాలుగడుగులు వెనక్కువచ్చి నిలుచున్నాడు. అరనిముషంవరకూ ఎవరినోటంటా మాటలేదు. ఆ సమయంలో వేణీబాబు కొంచెం సాహసించి అన్నాడు—'ఏం భాగం?'

భజువ ఆయనకు కూడా సలాంపెట్టి వినయంగా—'బాబుగారూ! మిమ్మల్ని అడగలేదు" అన్నాడు.

రమ చిన్నమ్మ వరండాలోంచే అన్నది "ఏరా! కొడతావా యేమిటి?"

ముందు భజువ కొంచెంసేపటివరకూ చిన్నమ్మవేపు చూశాడు. ఆ మరుక్షణంలో యిల్లంతా అదిరిపోయేట్లు నవ్వాడు. కొంచెం సేపయాక నవ్వు ఆపుకుని, కొంచెం సిగ్గుపడి, రమవేపు చూసి అన్నాడు—'అమ్మగారూ!'

భజువ మాటల్లోనూ, వ్యవహారంలోనూ ఎక్కువ వినయం వున్నప్పటికీ నిర్లక్ష్యం వుండడం గమనించింది. ఆసంగతి వూహించి రమ కోపంతో—'మీబాబుగారికి ఏంకావాలి?' అన్నది.

ఆమె కోపంచూసి. భజువ క్రుంగిపోయాడు. అందువల్ల తనకర్కశకంతాన్ని సాధ్యమైనంతవరకు కోమలంగాచేసి తన ప్రార్థన తిరిగి చెప్పాడు. కాని చెప్పినంత మాత్రాన లాభమేమిటి? పంపకం పూర్తయింది. యింతమందిలో రమకు చిన్న పోవడం యిష్టంలేదు. అందువల్ల ఆమె కఠినంగా చెప్పింది. "మీబాబుగారికి ఈచేపల్లోభాగంలేదు, వెళ్లిచెప్పు. చేతనైతే పని చేసుకోమనిచెప్పు."

"సరే అలాగే అమ్మగారూ!" అంటూ వేణీ నౌకరును వెళ్ళమని సౌంజ్ఞచేసి, ఏమీ మాట్లాడకుండా తానుకూడా వెళ్ళడానికి తయారయాడు. వెళ్ళిపోతున్నవాడల్లా తిరిగిరావడం చూసి అక్కడున్నవాళ్ళందరి ఆశ్చర్యాకి అంతులేకపోయింది. వాడు మళ్ళీ రమకేసి తిరిగి చూసి—సలాంచేసి, బెంగాళీ, హిందూస్థానీభాష కలగాపులగంగాచేసి-"అమ్మగారూ! అందరూ చెప్పగావిని, చెఱువువద్దనే చేపలులాక్కుని రమ్మని బాబుగారు చెప్పారు. మా బాబుగారు మాంసం, చేపలు ముట్టుకోరు. నేను కూడా తినను. కానీ ..." అని వక్షస్థలంమీద చేయిపెట్టుకుని— "బాబుగారి హుకుంవల్ల యివాళ చెఱువుదగ్గరే యీ ప్రాణాన్ని విడిచేవాణ్ని. కానీ రాముడు రక్షించాడు. బాబుగారి కోపం తగ్గిపోయింది. ఆయన నన్ను పిలిచి చెప్పారు. 'భజువా, నువ్వెళ్ళి చెఱువులో మనకు భాగముందో లేదో అమ్మగారిని అడిగిరా"

అంటూ లాఠీతోసహా చేతులెత్తి నమస్కరించి- 'భజువా! ఎవ రేమన్నా-అమ్మగారి నోటితో అబద్ధం చెప్పదని నాకు నమ్మకం. ఆమె పరాయివస్తువు ముట్టుకోదు.' అని కూడా చెప్పారమ్మా-" అని ఎంతో వినయంగా వెళ్ళిపోయాడు.

వాడు వెళ్ళిపోగానే వేణీ ఎగిరిగంతేసి, ఆడంగి గొంతుతో— "అంతే- యిలానే వాడు ఆస్థిని సంరక్షించుకుంటాడు. మీ అందరి ఎదట చెప్పుతున్నాను. యివాళనుంచి వాడికి చెఱువులో ఓచేప పిల్లనుకూడా దక్కనీయను. రమా! తెలిసిందా?" అంటూ పకపకనవ్వాడు.

కాని యీ మాటలు రమ చెవుల్లోకి పోలేదు. మాటి మాటికీ, భజువ అన్నమాటలు చెవుల్లో గింగిర్లాడుతున్నయ్. 'అమ్మగారి నోటినుంచి అబద్ధమెన్నడూ రాదు.' ఆమె ముఖం తెల్లపడి పోయింది. నెత్తురుచుక్కన్నా ఆముఖంలోలేదు. ఈ ఈముఖం మీద యెవరిచూపులు పడకూడదని మాత్రం ఆమెకు గుర్తుంది. అందుచేత తలమీదున్న ముసుగు యింకొంచెం ముందుకు లాగు కొని, తొందరగా యింట్లోకి వెళ్లిపోయింది.

8

"పెద్దమ్మా!"

"ఎవరూ? రమేశ్? రానాయనా! లోపలికిరా."

విశ్వేశ్వరి తొందరగా ఒకచాప పరిచింది. లోపలికి అడుగు పెడుతూనే రమేశ ఆశ్చర్యపడ్డాడు. ఎందుకంటే తన పెద్దమ్మ

దగ్గరకూచునివున్న స్త్రీముఖం తను చూడకపోయినా రమ అని గ్రహించాడు. ఆయనకు కోపంవచ్చింది. వీళ్ళంతా కలిసి, పెద్దమ్మను అవమానిలచేందుకు ప్రయత్నించారు. అవమానించారుకూడా! అయినప్పటికీ యిప్పుడు సిగ్గెగ్గులులేకుండా ఏకాంతంగా పెద్దమ్మ దగ్గరకు వచ్చి మాట్లాడుతూంది. ఇటు రమేశు హఠాత్తుగా రావడం చూసేసరికి రమకూడా యిరుకున పడింది. యిందుకుకారణం ఆమెకేవలం పల్లెటూరి పిల్లకావడమే కాదు. రమేశుకూ ఆమెకూవున్న సంబంధంకూడా చిత్రమైనది. ఆమె రమేశుని ఎదట అపరిచితునిలా, తలమీద ముసుగువేసుకునేందుకు, కూడా సిగ్గుకలిగేది. ముసుగువేసుకోకుండా వుండలేకపోయేది. అంతేకాదు. చేపలకోసం అనాడు పోట్లాట జరిగింది. అందువల్ల అన్నివిషయాలనూ, తలచుకుని, వీలైనంతవరకు చాటున కూచుంది. రమేశుడు ఆమెవేపు చూడలేదు. అసలు గదిలో యింకొకమనిషి వున్నట్లు కూడా తలచలేదు. అచాపమీద కూచుని—''అన్నాడు.

"ఏరా రమేశ్. యింతమధ్యాహ్నపువేళ వచ్చావేం?"

''మధ్యాహ్నం రాకుంటే, యిక నీ వద్దకూచునేందుకు వీలు యెక్కడ చిక్కుతుంది? నీకు పనులేమీ తక్కువ వుండవు''

పెద్దమ్మ ఆమాటకు ప్రతివాదంచేయలేదు. కానీ చిరునవ్వు మాత్రం నవ్వి వూరుకుంది. రమేశ్ నవ్వుతూ- "చాలాకాలం క్రిందట, నేను చిన్నవాడిగా వున్నప్పుడు నీ వద్ద సెలవు పుచ్చుకునేందుకు వచ్చాను. యిప్పుడు తిరిగి సెలవు పుచ్చుకునేందుకు వచ్చాను. ఇదేనా ఆఖరి సెలవనుకుంటాను పెద్దమ్మా? అన్నాడు.

రమేశుని పెదిమలమీద చిరునవ్వువున్నా, అతని కంఠస్వరం లోని బరువునూ, హృదయంలోని బాధను అక్కడున్న యిద్దరూ చూసి, విస్మయంతో త్రుళ్ళిపడ్డారు.

"నువ్వు చిరంజీవిగా వుండాలి నాయనా! ఏమిటి నువ్వంటున్నది—?" విశ్వేశ్వరి కళ్ళల్లో నీళ్ళు కనుపించినయ్!

రమేశు కొంచెం నవ్వాడు. విశ్వేశ్వరి—"ఏం నాయనా! నీకు యిక్కడ శరీరం బాగా వుండడంలేదా?" అని అడిగింది.

బాగాబలిసి, కండలు తీరిన తన శరీరంవేపు ఒకటి రెండు సార్లు చూసుకుని చెప్పాడు—"పెద్దమ్మా! యిది పడమటి దేశపు రొట్టెతో—పప్పుతో పెరిగిన శరీరం. యిది అంత తొందరగా చెడిపోతుందా? కాదు. నాశరీరం చాలాబాగానేవుంది. కాని యిక యిక్కడ ఒక్కక్షణం కూడా వుండలేను. నా కేమిటో ప్రాణ మంతా సుడిపడినట్లుంది."

రమేశుని శరీరంలో బాగానే వుందనని తెలుసుకున్నాక పెద్దమ్మకు ధైర్యం కలిగింది. ఆమె నిశ్చింతగా అడిగింది—"ఇది నీ జన్మభూమి నాయనా! ఉటువం టప్పుడు నువ్వు యిక్కడెందు కుండవు?"

రమేశు తలూపి—"ఆ సంగతి నేను చెప్పను పెద్దమ్మా! నీ కంతా తెలుసనుకుంటాను" అన్నాడు.

విశ్వేశ్వరి కొంచెంసేపు మెదలకుండా వుంది. ఆ తరువాత, గంభీరంగా అన్నది—"అంతాకాదు. అయినా కొంతవరకు తెలుసు! కానీ రమేశ్! అందువల్లనే నువ్విక్కడ వుండకుంటే జరగదంటున్నాను."

"యెందుకు పెద్దమ్మా ! ఎందుకని జరగదు ? యిక్కడెవరూ నన్ను కోరడంలేదుగా ?"

"ఎవరూ కోరడంలేదుకాబట్టే, నేను నిన్ను వెళ్ళనీయనంటున్నాను. హిందుస్తానీ రొట్టె, పప్పుతో పెంచిన నీశరీరం పారిపోయేందుకేనా ?"

రమేశ్ మాట్లాడలేదు. ఇవాళ అతనికి యీ వూరంటే ఎందుకంత మంటగావుందో, అందుకు ఒక కారణం వుంది. గ్రామమునుంచి తిన్నగా స్టేషన్‌కువెళ్ళే రోడ్డు—పదిపన్నెండు సంవత్సరాలక్రితం వర్షాలవల్ల ఒకచోట గండిపడింది. అప్పటినుంచీ ఆ గండి రానురాను పెద్దదైపోయింది. అక్కడ నీళ్ళుకూడా నిలిచేవుంటయ్ ! దాన్ని దాటాలంటే అందరికీ కష్టంగానే వుంది. కొంతకాలం ఎలాగో జాగ్రత్తగా దాటేవాళ్ళు. కాని వర్షాకాలంలో ఆ గ్రామస్తుల యిబ్బందికి లెక్కలేదు. ఒక్కొక్కసంవత్సరం దానిమీద బొంగులువేసి, మరొక సంవత్సరం తాడిబొందవేసి, ఏదోవిధంగా, కొందరు పడుతూ—కాళ్ళు విరగ్గొట్టుకుంటూ కాలం వెళ్ళదీసేవాళ్ళు. యింతకష్టపడుతున్నా గ్రామస్తులు దాన్ని బాగుచేయిద్దామని ప్రయత్నించలేదు. అది మరామ్మత్తు చేయడానికి కొంత డబ్బు అవసరం. ఈ డబ్బు రమేశు తన స్వంతం ఖర్చుపెట్టకండా—చందా వసూలుచేద్దామని, పదిరోజులనుంచి గ్రామ మంతా తిరిగాడు. కాని, పదికానులుకూడా వసూలు చేయలేకపోయాడు. అంతేకాదు. యీ రోజుకూడా చందాకోసం బయలుదేరి తిరిగి వస్తున్నప్పుడు దారిలో, ఒక కోమటి దుకాణంలో కొంతమంది యీ విషయంలోనే మాట్లాడుకుంటున్నారు, బయట

నిలుచుని వింటున్నాడు. ఎవరో ఒక మనిషి—యింకొక మనిషితో నవ్వుతూ అంటున్నాడు.—"మీరంతా వక్క దమ్మిడీకూడా యివ్వవద్దు. దాని మరామ్మత్తు ఎక్కువగా అతనికే అవసరం. ఒకళ్ళైనా మీరివ్వకుంటే తన స్వంతడబ్బుతోనే బాగుచేయిస్తాడు. బూట్లు తొడుక్కుని చటచట నడుస్తుంటాడుకదూ? ఇంతకాలం నుంచీ ఆయన యిక్కడలేడు. అయినా మనం స్టేషన్‌కు వెళ్ళడం ఆగిపోయిందా?"

ఇంకెవరో మనిషి అంటున్నాడు. "అరే కొంచెం ఓపిక పట్టవోయ్! రమేశు నెత్తినచేతులుపెట్టి అమ్మవారి గుడికూడా బాగుచేయించాలని ఛటర్జీగారన్నారు. ఆయన్ని కొంచెం పొగిడామంటేచాలు....పని జరిగిపోయిందన్నమాటే?"

ఈ రెండువిషయాలు, రమేశుని హృదయంలో మంటపుట్టించినయ్! పెద్దమ్మకూడా అదే విషయం ఎత్తి గాయాన్ని మరింత రేపింది.—"నువ్వు ఆదారిబాగుచేయించే విషయం ఏంచేశావు?"

రమేశు విసుక్కుంటూ చెప్పాడు—"యింకా దారి బాగుపడదు. ఒక్కదమ్మిడీ చందా ఎవడూ యివ్వలేదు—"

విశ్వేశ్వరి నవ్వి అన్నది—"యివ్వరు అంటే పనెల్లా జరుగుతుంది? మీ నాన్న నీకు చాలా డబ్బు యిచ్చి వెళ్ళాడు. ఈ కొద్ది రూపాయలు నువ్వొక్కడివే యివ్వగలవు—"

రమేశు మండిపడుతూ చెప్పాడు—"నే నెందుకు యివ్వాలి? సంగతి సందర్భాలు తెలుసుకోకుండా, యిప్పటికే వీళ్ళ స్కూలుకు చాలా డబ్బు పాడుచేశాను. అందుకు నాకు చాలా కష్టంగా వుంది. యీ గ్రామములోపు, మనిషన్నవాడికి ఏమీ సాహాయ్యం

చేయకూడదు" అని మళ్ళీ రమ వేపు చూసి—"వీళ్ళకు కొంచెం ధర్మం చేశామంటే, మనల్ని మూర్ఖుని క్రింద జమకడ తారు. వీళ్ళకు మేలుచేస్తే—అందులో ఏదో స్వార్థముం దంటారు. వీళ్ళను క్షమించడంకూడా మహాపాపమే! ధైర్యం లేక వెనక్కు తగ్గిపోయా డంటారు—"

పెద్దమ్మ బాగా నవ్వింది. కాని రమ ముఖం ఎర్రబడింది. రమేశు కోపంతో అడిగాడు—"నవ్వతా వెందుకు పెద్దమ్మా?"

"నవ్వకుంటే ఏం చేయమంటావు నాయనా?' ఒక్క నిట్టూర్పువిడిచి—"కాని, నువ్విక్కడ వుండడమే ముఖ్యమని నే నంటాను. రమేశ్! కోపంతో జన్మభూమిని వదిలిపెట్టి వెళదామను కుంటున్నావా? అయినా నువ్వు కోపించ దగ్గ మనుష్యులు యిక్క డెవరున్నారు?" అని కొంచెం సేపుండి తనలో తను అను కున్నట్లుగానే అన్నది—"రమేశ్! వీళ్ళు ఎంత బీదవాళ్ళో—ఎంత దుర్బలులో నువ్వు గ్రహించి నట్లయితే, నువ్వే సిగ్గు పడేవాడివి. నాయనా! భగవంతుడు దయదలచి. నిన్నిక్కడకు పంపించాడు. అటువంటప్పుడు నువ్వు వెళ్ళి మధ్యనే వుండాలి—'

"కాని పెద్దమ్మా! వీళ్లు నన్ను కావాలనడంలేదు."

"అటువంటప్పుడు, నువ్వు అభిమానం చూపడానికీ వీళ్ళెంత అయోగ్యులో నీకు తెలవడం లేదా? యిదేకాదు. నువ్వు ఏ గ్రామమైనా తిరిగిరా! ఎక్కడ చూసినా యిదే పరిస్థితి" అని ఆమె రమవేపు తిరిగి—"నువ్వు యిందాకటినుంచీ తలొంచుకునే కూచున్నావేమమ్మా? ఏం రమేశ్! మీ యిద్దరన్నాచెల్లెళ్ళు

మాట్లాడుకోరా ? అమ్మాయీ -అలాకాదు. వీడి తండ్రితో మీ కున్న పోట్లాటలన్నీ ఆయనతోనే అంతరించిపోయినయ్ ! మీ రిద్దరింకా వాటిని పట్టుకుని మనస్పర్ధలు పెట్టుకోవడం మంచిది కాదు." అని అన్నది.

రమ తలొంచుకునే అన్నది— 'నేనేమీ మనస్పర్ధలు పెట్టుకో వాలనుకోవడంలేదు పెద్దమ్మా-రమేశ అ........''

అకస్మాత్తుగా రమకోమల స్వరాన్ని, రమేశుని గంభీర కంఠస్వరం వినబడకుండాచేసింది. ఆయనలేచి నిలుచుని— "పెద్దమ్మా-నువ్వు వీళ్ళమధ్యలో పడవద్దు. ఆనాడు యీామెగారి చిన్నమ్మచేతుల్లోంచి ఎలాగో ప్రాణాలు రక్షించుకున్నావు. యివాళ యీసంగతి తెలిసిందంటే ఆవిడ నిన్ను నమిలిగాని వదలదు.'' ఆ తరువాత వాద-ప్రతివాదాలకు ఎదురు చూడకుం డానే గబగబా బయటికి వెళ్ళిపోయాడు.

విశ్వేశ్వరి అతన్ని పిలిచి అన్నది—"వెళ్ళకు రమేశ్ ! ఒక మాట వినివెళ్ళు."

రమేశు తలుపుబయటినుంచే జవాబు యిచ్చాడు—"కాదు పెద్దమ్మా ! ఎవరైతే అహంకారంతో నిన్ను కూడా కాళ్ళతో పట్టాలని చూశారో-వాళ్ళ తరపున నువ్వేమీ మాట్లాడవద్దు.'' అని యిక విశ్వేశ్వరి రెండవసారి బ్రతిమిలాడకముందే వెళ్ళిపో యాడు. రమవిహ్వలంగా కొంచెంసేపు విశ్వేశ్వరిముఖంలోకిచూసి ఏడ్చింది—''పెద్దమ్మా ! చివరకు యీకళంకం నామీద ఎందుకని మోపుతున్నారు ? అయితే చిన్నమ్మకు నేను చెప్పిపంపానా ? అందుకు, నేనే, బాధ్యురాలినా ?''

పెద్దమ్మ రమచేతుల్ని తనచేతుల్లోకి, తీసుకుని, స్నేహ పూర్వకంగా తన వద్దకు లాక్కుని—''నువ్వు నేర్పనిమాట నిజమే! కాని, చిన్నమ్మమాటలకు కొంత బాధ్యత నీకూ వుందిరమా-'' అని చెప్పింది.

రమ తన రెండోచేతితో కళ్ళు తుడుచుకుని, అభిమానంతో- పెద్దమ్మ మాట వొప్పుకోకుండా——''నేనెందుకు బాధ్యురాల నవుతాను? ఎప్పుడూ కాను. ఈ విషయంలో నాకేమీ తెలవదు పెద్దమ్మా! అటువంటప్పుడు నామీద అబద్ధపు కళంకం ఎందుకు మోపి వెళ్ళాడు?'' అని అడిగింది.

అందుకు విశ్వేశ్వరి తర్కవితర్కం చేయలేదు. మెల్లిగా అన్నది—''అమ్మాయీ! అందరూ ఆంతరంగిక విషయం గ్రహించలేరు. అయినా, వాడు నిన్ను అవమానించాలని ఎప్పుడూ అనుకోడని, నేను గట్టిగా చెప్పగలను. నీ మీద వాడి కెంత శ్రద్ధా భక్తులున్నాయో. నీకు తెలవదు. నేను గోపాల్ సర్కారువల్ల విన్నాను. ఆనాడు మీరు చింతచెట్టు కొట్టించి యిద్దరే పంచుకున్నారు. ఆ సంగతివాడికి తెలిసింది. ఎవరెన్ని చెప్పినా వినలేదు. అందులో వాడికీ భాగముంది. వాడేమన్నాడో తెలుసా? అందరి ఎదటా? 'విచారించవలసిందేమీలేదు. రమ అక్కడున్నప్పుడు, నా భాగం నాకు వచ్చే తీరుతుంది. ఆమె ఎప్పుడూ పరాయివస్తువును అంటుకోదు.' అన్నాడట. అమ్మాయీ! యింత పోట్లాట-కాట్లాటలు జరిగినప్పటికి వాడు నీ మీద మొదటి లానే విశ్వాసముంచాడు. అయినా ఆనాడు చెఱువు చేపలవిష యంతో.......'' అని విశ్వేశ్వరి ఒక్కసారిగ ఆగి రమ ముఖం

లోకి చూసి చెప్పింది—"అమ్మాయీ రమా ; యివాళ నీకొక సంగతి చెపుతున్నాను. నీ ఆస్థిపాస్తుల రక్షించుకునే విలువ ఎంతదైనప్పటి, రమేశుని ప్రాణాల విలువ అంతకంటే ఎక్కువైంది. అందువల్ల ఎవరి మాటలకు లోబడిగానీ, ఏదైనా వస్తువుకు భ్రమించిగాని, వాన్ని నాశనం చేయవద్దు. అందువల్ల దేశానికెంతహానికలుగుతుందో తరువాత దాన్ని పూర్తిచేసుకోలేమని మాత్రం నేను నిశ్చయంగా చెప్పగలను."

రమ మాటాడలేదు. ఆమె ఏమి ప్రతిగా వాదించలేదు. విశ్వేశ్వరికూడా ఏమీ మాటాడలేదు. కొంచెంసేపయాక రమ అస్పష్టంగా కోమలస్వరంతో-''పెద్దమ్మా ! చాలా ఆలస్యమైంది. యింటికి వెళతాను.'' అని ఆమె పాదాలకు నమస్కరించి వెళ్ళిపోయింది.

9

పెద్దమ్మ వద్దనుంచి, రమేశు ఎంతకోపంతో వచ్చినప్పటికీ, యింటికివచ్చేసరికి నీరైపోయాడు. మాటిమాటికి మనసులో అనుకుంటున్నాడు. ఈ సామాన్యవిషయాన్ని అర్థంచేసుకోలేకతనెంత బాధపడ్డాడు ? వాస్తవంగా తనకోపం ఎవరిమీద ? సంకుచితస్వార్థపరులు తమ అజ్ఞానంలో పడిపోయి-నిజానికి మంచేదో, చెడ్డేదో, గ్రహించలేని అంధులై—తమ యిరుగు పొరుగువారి బలాన్ని నాశనంచేయాలని చూసేవాళ్ళమీదా, మంచిచేస్తున్నప్పుడు సందేహించే మూర్ఖులమీద కోపమూ—అభిమానం తెచ్చుకునేంతభ్రమ

యింకొకటి లేదు. పల్లెటూళ్ళకు దూరంగా యెక్కడో పట్టణంలో వుంటూ—పుస్తకాలు చదివీ—వాళ్ళూ—వాళ్ళూ చెప్పగా విని, కల్పించుకున్న వూహలు—పటాపంచ లైపోయినయ్! 'తన బెంగాళీజాతికి ఏమివున్నా—లేకపోయినా—ఏకాంతంగా వుంటున్న పల్లెల్లో తన జాతి శాంతి సౌఖ్యాలు యింకా సమసిపోలేదు. జనసంకీర్ణమైన పట్టణాల్లో అదిమాత్రం కనుపించలేదు. యీ అల్పసంతోషులైన పల్లెవాసులలో సానుభూతి వున్నది. ఒక మనిషి కష్టాల్లో వుంటే రెండోమనిషి ఆదుకుంటాడు. ఒక మనిషి సుఖంగావుంటే యింకొకడు పిలవకుండావచ్చి, పండుగ చేసుకుంటాడు. అక్కడ మాత్రమే, ఆ పల్లెవాసుల హృదయాల్లోనే మన బెంగాళీజాతి, సంపద అక్షయంగా నిలిచివుంది.' కానీ అదంతా భ్రాంతిగా మారిపోయింది. బస్తీలలోకూడా యిన్ని విరోధాలూ, యితర్లసంపదచూసి ఓర్వలేకపోవడమూ, తనెక్కడా చూడలేదు. ఆమాట తలుచుకోగానే తన శరీరమంతా జెర్రులు ప్రాకినట్లయింది. పట్టణంలో రోడ్లప్రక్క ఎప్పుడైనా—ఏదైనా పాపపుపని చూసినప్పుడు—ఏదో విధంగా తన పల్లెకుపోతే ఈ పాపకృత్యాలు కంటపడవుకదా అని అనుకునేవాడు. పైగా అన్నిటికంటే గొప్పదైన ధర్మం—చరిత్ర యింకా పల్లెల్లో అక్షయంగా వుందనుకునేవాడు. అయ్యో భగవంతుడా! ఆచరిత్ర యెక్కడుంది? ఆ ధర్మం ఏదీ? ధర్మానికి ప్రాణం లాగేసి, దాని శరీరాన్ని వుంచావెందుకు? ఈ అభాగ్యులైన గ్రామవాసులు, వికృతమైన వివర్ణ శరీరాన్ని నిజమైన ధర్మమని పట్టుకుని వేళ్ళాడుతూ—దాని విషయుక్తమైన దుర్గంధాన్ని

సేవిస్తూ—అధఃపతన మవుతున్నారు. అన్నిటికంటే పరిహాస పాత్రమైన విషయం ఏమంటే—పట్టణంలో జాతిభేదం లేదని వారియెడ వీరికి అంతులేని అసహ్యం.

రమేశు తనయింటికి వచ్చి చూసేసరికి, ఎవరో ఒక ప్రౌఢ స్త్రీ పదకొండు—పన్నెండేళ్ళ కుర్రవాడి చేయి పట్టుకుని ఒక మూల వొదిగి వుండడం చూశాడు. ఆమె లేచి నిలుచుంది. ఏమీ తెలియకపోయినా, ఆ కుర్రవాడి ముఖంచూసేసరికి, రమేశుకు ఏడుపు వచ్చినంత పనైంది. చండీమండపం వసారాలో కూచుని లెక్కలు వ్రాసుకుంటున్న గోపాల్‌సర్కారు వచ్చి చెప్పాడు—"ఈ కుర్రవాడు దక్షిణపాడ్ వీధిలోని ద్వారిక్ పండితుని కొడుకు. మీవద్దకు యాచనకోసమై వచ్చాడు."

'యాచన' అనే పేరు వినగానే రమేశు మండిపడుతూ—"అయితే నేను దానం చేయడానికే యింటికి వచ్చానా? యిక గ్రామములో ఎవరూ లేరా?" అని అడిగాడు.

గోపాలసర్కారు కొంత అప్రతిభుడై—"అవును బాబూ! అది నిజమే! పెద్దబాబుగా రున్నప్పుడు యిక్కడనుంచి యెవరూ వట్టిచేతులతో తిరిగి పోయేవాళ్లుకాదు. అందువల్ల కష్టాల్లోవున్నవాళ్ళంతా ముందు యిక్కడికే వచ్చేవాళ్లు—తిరిగి ఆ పిల్లవాడివేపు చూసి, ఆ ప్రౌఢస్త్రీతో--"కామినీతల్లీ! వీళ్ళతప్పుకూడా తక్కువ కాదు. ఆయన బ్రతికివున్నప్పుడే ప్రాయశ్చిత్తం చేసుకుంటే బాగుండేది. యిప్పుడు శవాన్ని తీసుకువెళ్ళడానికి ఎవరూ రాక పోయేసరికి యిప్పుడు యింటింటికీ డబ్బుకోసం పరుగెత్తవలసి వస్తూంది. అయితే యింట్లో చెంబూ తప్పేళా ఏమీలేవా?" అని అడిగాడు.

కామినీతల్లి గొల్లది. ఈ కుఱ్ఱవాడి యింటిప్రక్కనే వుండేది. ఆమె తలవంచుకుని—"అంత నమ్మకం లేకుంటే తమరు వచ్చి చూడండి! యింట్లో ఏమన్నా వున్నట్లయితే, తండ్రి శవాన్ని అలా వుంచి యాచనకు తీసుకుని వస్తానా? మీరు కళ్ళతో చూడకపోయినా—అంతా వినేవుంటారు? ఆరుమాసాలనుంచీ మా కున్నదంతా వారికే పెట్టాము బాబూ! ప్రక్కయింటి బ్రాహ్మణ పిల్లలను ఆకలితో చావనిస్తామా?" అని చెప్పింది.

రమేశు యిప్పుడు సంగతి కొంతవరకు గ్రహించినట్లున్నాడు. గోపాలసర్కారు కొన్ని విషయాలు చెప్పాడు—"ఈ కుఱ్ఱవాడి తండ్రి ద్వారికాచక్రవర్తి ఆర్నెల్లించి గుండెజబ్బుతో మంచంలో వుంటున్నాడు. యివాళ ఉదయం చనిపోయాడు. అతనికి ప్రాయశ్చిత్తం. (బెంగాలుదేశంలో గుండెజబ్బువున్న రోగులు ప్రాయశ్చిత్తం చేసుకోవాలనే నియమము వుంది.) కాలేదు. అందువల్ల శవాన్నెవరూ ముట్టుకునేందుకు రాలేదు. యిప్పుడు ప్రాయశ్చిత్తం చేయడం ముఖ్యం. కామినీతల్లి రమారమి ఆర్నెల్ల నుంచీ, తనకు వున్నది యీ బీదబ్రాహ్మణపరివారానికే పెట్టింది. ఇప్పుడు ఆమె చేతిలో ఏమీలేదు. అందువల్ల కుఱ్ఱవాన్ని తీసుకుని తమ దగ్గరకు వచ్చింది."

కొంచెంసేపు మౌనంగా వున్నాక రమేశు—"యిప్పుడు రెండుగంట లవబోతూంది. ప్రాయశ్చిత్తం జరక్కుంటే శవం అలా వుండవలసిందేనా?" అని అడిగాడు.

సర్కారు నవ్వుతూ చెప్పాడు—"బాబుగారూ! యిక ఉపాయమేముంది? శాస్త్రానికి విరుద్ధంగా పనిజరగదు. ఈ విష

యంలో వూళ్ళోవాళ్ళదే తప్పని ఎవరనగలరు? ఏదేమైనా—శవం అలా వుండదు. ఎలాగైనా—ఆ పని, వాళ్ళవల్లనే జరగాలి. అందుకే యాచన..............ఆ.........కామినీ తల్లీ—? యిం కెక్కడికైనా వెళ్ళివచ్చారా—?"

పిల్లవాడు పిడికిలి విప్పి చూపాడు. ఒక పావలాబిళ్ళ నాలుగు కానులు వున్నయ్! కామిని తల్లి అన్నది—"ఈ పావల ముఖర్జీగారింటిలో—ఈ నాలుగు కానులు హల్దార్‌గారు యిచ్చారు. కాని తొమ్మిది పావలాలు లేనిదే పని జరగదు. అందుకు బాబుగారేమ.............."

"సరే మీరు యింటికి వెళ్ళండి! యింకెక్కడికి వెళ్ళనవసరం లేదు. నేను అన్ని ఏర్పాట్లతో మనిషిని పంపుతాను.—" అని రమేశు చెప్పాడు.

రమేశు వాళ్ళనుపంపి—కొంచెంసేపు గోపాల్‌సర్కారు ముఖంవేపు చూసి అడిగాడు—"సర్కారుగారూ! యీ వూళ్ళో యిటువంటి బీదవారియిళ్ళు ఎన్ని వున్నాయో మీకు తెలుసా—!"

"ఎక్కువ లేవు. రెండు—మూడు వుండవచ్చు. వీళ్ళకూ తింటానికీ వుంటానికి లోటులేదు. కాని ఒకచెట్టు విషయంలో ద్వారికా చక్రవర్తి—సనాతన హాజరాం, యిద్దరూ కోర్టుల కెక్కి డబ్బు తగలేసి, అయిదేండ్లు గడిచినా దాని అంతు లేదు." కొంచెం స్థాయి తగ్గించి—"బాబుగారూ యింత దూరం వచ్చేది కాదు. మన పెద్దబాబుగారూ—గోవిందగంగూళి వాళ్ళను పురికొల్పారు. ఆ తరువాత వాళ్ళిద్దరి దగ్గరున్నదంతా పెదబాబుగారి వద్దకు తాకట్టుకు వచ్చింది. పోయిన సంవత్సరమే వడ్డీతో—

సహా లెక్కకట్టి యిద్దరి ఆస్తి మన పరంచేసుకున్నారు. అయినా కామిని తల్లిమాత్రం ధన్యురాలు. యిటువంటి ఆపదల్లో బ్రాహ్మణులకు సాహాయ్యం చేయడం ఎక్కడా చూడలేదు—'' అని చెప్పాడు.

రమేశు ఒక్క నిట్టూర్పు విడిచి వూరుకున్నాడు. కొంచెం సేపయాక గోపాలసర్కారును అక్కడి విషయమంతా చూడమని చెప్పి మనసులోనే—"పెద్దమ్మా! మీ ఆజ్ఞ శిరసావహిస్తాను. యిక్కడ ఒక వేళ చచ్చిపోయినా మంచిదే కాని, ఈ దౌర్భాగ్యపు వూరును విడిచిపెట్టి వెళ్ళను—'' అని అనుకున్నాడు.

10

మూడు మాసాల తరువాత ఒక నాటి వుదయం రమేశు తారకేశ్వరంలోని—'పాలసాగరం' అని పిలవబడే కొలను మెట్లమీద ఒకస్త్రీకి ఎదురుపడ్డాడు. అనాచ్ఛాదితంగా వున్న ఆమె ముఖంవేపు మర్యాద లేనివాడిలా ఒక్కక్షణంసేపు విస్తుబోయి చూస్తూ నిలుచున్నాడు. దారి తప్పుకోవాలనే ధ్యాసకూడా లేదతనికి. ఆమెకు యిరవై సంవత్సరాలు వుండవచ్చు. ఆమె స్నానం చేసి పైకి వస్తూంది. ఆమె చేతిలోని నీళ్ళబిందెను క్రిందకు దించి తడిసిన బట్టలపైన రెండు చేతులతో హృదయాన్ని కప్పుకుని మెల్లిగా—"మీ రిక్కడ వున్నారేం—?'' అని అడిగింది.

రమేశుని ఆశ్చర్యానికి అంతులేదు. కాని అతని విహ్వలత మాయమైంది. ప్రక్కకు తప్పుకుని—"మీరు నన్ను యెరుగుదురా—?" అని అడిగాడు.

"ఆ..........యెరుగుదును. మీరు తారకేశ్వరం ఎప్పుడు వచ్చారు—?"

'యివాళ పుదయమే! మా మామగారింటి వద్దనుంచి ఆడవాళ్ళు రావాల్సింది. కాని వాళ్ళెవరూ రాలేదు.'

"ఈ వూళ్ళో ఎక్కడ బసచేశారు?'

'ఎక్కడాలేదు. యింతకు ముందు యిటువేపు యెప్పుడూ నేను రాలేదు. యివాళ యిల్లా యిక్కడెక్కడోవుండి వాళ్ళకోసం చూస్తుండాలి. ఆ తరువాత యెక్కడో ఒకచోట బస వెదకాలి—'

'మీ వెంట నౌకరు వున్నాడా?'

"లేదు నేను ఒక్కణ్ణే వచ్చాను—'

'సరే—' అంటూ నవ్వి తలపై కెత్తేసరికి యిద్దరి చూపులు కలుసుకుని నాలుగైనయ్! ఆమె మళ్ళీ తలదించుకుని మనసులోనే కొంచెం సంకోచంగా—'అయితే నాతోపాటు రాండి—' అని బిందె యెత్తుకుని నడక సాగించింది.

రమేశుడు సంకటంలో పడ్డాడు—'నేను మీతో రాగలను. ఎందుకంటే యిందులో దోష మేమన్నా వుంటే మీరు పిలిచే వారేకాదు. అంతేకాదు, నేను మిమ్మల్ని యెరుగక పోలేదు. అయినా జ్ఞాపకం రావడంలేదు, మీ పరిచయాన్ని కాస్త గుర్తు చేస్తారా?'

'సరే కొంచెంసేపు మీ రిక్కడే వుండండి! నేను పూజచేసి వస్తాను. ఆ తరువాత వెళుతూ నా పరిచయాన్ని తెలియ చేస్తాను—' అంటూ ఆమె దేవాలయేం వేపు వెళ్ళింది. రమేశు ముగ్ధునిలా చూస్తూన్నాడు. ఆమె యవ్వనశోభ తడివస్త్రంలోంచి బయటికి పొడుకుని రావాలని చూస్తూవుంది. ఆమె ముఖం—అవయవ నిర్మాణమూ—ఆ నడక తీరూ—అంతా రమేశునికి పరిచితంగానే వుంది. కాని అతని స్మృతి అనే తలువు చాలా కాలంనుంచి మూసివుండడంవల్ల సరిగ్గా గుర్తించలేక పోతు న్నాడు. ఒక అరగంటయాక పూజ ముగించుకుని వచ్చాక రమేశు యింకొకసారి ఆమె ముఖాన్ని చూశాడు. కానీ యిప్పుడు కూడా అపరిచితురాలుగానే కనిపించింది. యిద్దరూ నడుస్తున్న ప్పుడు రమేశు అడిగాడు—'మీతోపాటు మీ వాళ్ళు ఎవరూ లేరా?'

"లేరు. దాసిమాత్రంవుంది. అది యింట్లో పనిచేస్తూవుంది. నేను అప్పుడప్పుడు యిక్కడికి వస్తుంటాను. యిక్కడ నాకు అంతా తెలుసు!

"మరి నన్నెందుకు మీతో తీసుకుని వెళుతున్నారు?"

కొంచెంసేపు మెదలకుండా నడిచాక—"లేకుంటే మీకు భోజ నానికి చాలా యిబ్బందిగా వుంటుంది. నేను రమను" అని చెప్పింది.

*   *   *   *

రమ ఎదట కూచుని రమేశుకు భోజనంపెట్టి ఆకు వక్కలు తెచ్చి యిచ్చింది. ఆ తరువాత పడుకునేందుకు స్వయంగా ఒక

చాపతెచ్చి పరిచి మరొక గదిలోకివెళ్ళింది. రమేశు ఆ చాప మీదనే కళ్ళుమూసుకుని పడుకున్నాడు. తన యిరవైమూడు సంవత్సరాల జీవితం ఒక్కసారే మారిపోయిన ట్లనిపించింది. చిన్నతనంనుంచీ అతను పరాయివూళ్ళలో యితరుల ఆశ్రయంలో పెరిగాడు. భోజనం చేయడంలో ఆకలి తీరడంతప్ప మరొక అనుభవం వుంటుందని అతను ఎరుగనే యెరుగడు. అందుచేత యివాళ యీ అచింతనీయమైన పరితృప్తితో అతని మనస్సంతా విస్మయం—మాధుర్యంలో మునిగిపోయింది. తన భోజనం కోసం రమ ప్రత్యేకించి వస్తువులనేమీ సేకరించలేదు. సాధారణపు భోజనమే పెట్టింది. అతని భోజనం విషయంలో ఆమెకు చాలా విచారంగానేవుంది. అతను తృప్తిగా భోజనం చేయకుంటే—ఆ సంగతి తెలుసుకుని లోకు లేమనుకుంటారో? అనుకుంటే అను కున్నారు. ఆమె హృదయాంతరాళంలోంచి, ఈ ఆలోచన పైకి వచ్చి, ఆమె సంకోచాన్నంతటినీ యెగరగొట్టి చివర కతడు భోజనం చేసేచోటికి తీసుకునివచ్చి చేర్చింది. ఈ సంగతి ఆమె ఏ విధంగా దాచగలదు? ఇవాళ ఆమె సిగ్గుతోకూడా. అతనికి దూరంగా కూచోలేకపోయింది. ఆహారపదార్థాల కొరతను ఆద రించైనా పూర్తిచేయాలని దగ్గరకూచుంది. నిర్విఘ్నంగా భోజన మయాక, ఆమె విడిచిన నిట్టూర్పు రమేశు వినకపోయినా-అన్నీ యెరిగున్న ఆ భగవంతుడుమాత్రం తెలుసుకున్నాడు.

రమేశుకు పగలు నిద్రపోయే అలవాటులేదు. అతనికి యెదు రుగావున్న చిన్న కిటికీబయట బూడిదవర్ణంతో శోభిస్తున్న నవవర్షమేఘాలు ఆకాశాన్ని అల్లుకుంటున్నయ్! రమేశుడు

వాటిని చూస్తూ పడుకున్నాడు. తన బంధువులు వస్తారనే సంగతే గుర్తులేదాయనకు. హఠాత్తుగా రమ కోమలస్వరం అతని చెవుల్లో పడింది. ఆమె తలుపు బయటినుంచే అంటూవుంది—"యివాళ మీరు యింటికి ఎలాగూ వెళ్ళలేరు. అటువంటప్పుడు యిక్కడే యెందుకు వుండగూడదు?"

రమేశు తొందరగాలేచి కూచుని—"కాని యీ యింటివా రెవరో యింతవరకూ కనుపించలేదు. వారికి చెప్పనిదే ఎలా వుండడం?" అన్నాడు.

రమ అక్కడనుంచే జవాబుచెప్పింది—"యింటియజమానే వుండమంటూవుంది. యీ యిల్లునాదే."

రమేశుడు ఆశ్చర్యపడుతూ—"యిక్కడ యీ యిల్లెందుకు కొన్నారు?" అని అడిగాడు.

"—ఈ ప్రదేశం నాకెంతో యిష్టం. నేను అప్పుడప్పుడూ యిక్కడకు వస్తుంటాను. ఇప్పుడంటే యిక్కడ ఎవరూలేరు. కాని ఒక్కొక్కప్పుడు కాళ్ళుచాపి పడుకునేందుకే వీలుండదు."

"అటువంటప్పుడు ఆ సమయంలోనే ఎందుకురాగూడదు?"

రమ నవ్వింది. మాట్లాడలేదు.

"మీకు తారకనాథునిమీద భక్తి ఎక్కువనుకుంటాను. అంతే కదూ?"

"అంతమాత్రం భక్తి ఎక్కడుంది? కాని బ్రతికివున్నంత కాలం ప్రయత్నించాలి."

రమేశుడు యింకేమీ ప్రశ్నించలేదు. రమ అక్కడే గుమ్మానికి ఆనుకుని కూచుని అడిగింది—'రాత్రికి మీరేంతింటారు?'

రమేశు నవ్వుతూ చెప్పాడు——"ఏదిదొరికితే అదే; భోజనానికి కూచునే క్షణం ముందువరకూ అసలు భోజనసంగతే గుర్తుండదు. వంటవాడు ఏదిచేసిపెడితే అదే తింటుంటాను."

"ఎందుకంత వైరాగ్యం?"

ఆ మాటల్లో దాగివున్నది, దెప్పిపొడుపో—లేక పరిహాసమో, ఏమీ రమేశుకు అర్థంకాలేదు——'అదేమీకాదు. సోమరితనము.'

"కాని యితరులకు చేయవలసిన పనిలో మీకు సోమరితనం లేదనుకుంటాను."

"అందుకు కారణంవుంది. ఇతరులపనుల్లో సోమరితనంగా వుంటే భగవంతునియెదట తప్పుచేసినవాళ్ళమవుతాము. స్వంత పనుల్లోకూడా అంతేననుకో! అయినా అంత ఎక్కువగా జవాబు దారి వహించవలసినపని వుండదు."

రమకొంచెంసేపు మెదలకుండావుండి——ఆ తరువాత మెల్లిగా అన్నది—"మీవద్ద డబ్బువుంది. అందువల్ల యితరుల విషయంలో కావాల్సినంత శ్రద్ధపుచ్చుకుంటారు. కాని డబ్బులేనివాళ్ల సంగతో"

"రమా! వాళ్ళసంగతి నాకు తెలవదు. ఎందుకంటే డబ్బుండడానికైనా ఇంతని పరిమాణంలేదు. ఇక మనసులో వాళ్ళకు సహాయపడాలనే నియమముకూడాలేదు. డబ్బువుండడమూ-లేక పోవడమూ ఆ లెఖ్ఖలన్నీ యిహ-కాల-పరకాలాల భారం వహించిన ఆ భగవంతునికే తెలియాలి."

రమ కొంచెంసేపు మెదలకుండావుండి——'కాని పరలోకాన్ని గురించి ఆలోచించే వయసు మీకింకారాలేదు. మీకు నాకంటే మూడేళ్ళేపెద్ద-' అన్నది.

"అంటే, ఆపరకాలాన్ని గురించి యోచించే వయసు నీకు రాలేదనేగా? భగవంతుడు అలాగే చేయనీ! నువ్వు దీర్ఘ జీవికావాలని కోరుతున్నాను. కాని నావిషయంలో నాకేరోజూ ఆఖరిరోజుకాదని నేనింతవరకూ అనుకోకుండా వుండలేను."

రమేశుడన్న యీమాటల్లో ఎత్తిపొడుపు కొంతవరకు పని చేసింది. రమ కొంచెంసేపు స్థిరంగావుండి అడిగింది—"మీరు సంధ్యాపూజ చేయడం నేను చూడలేదు. మీరు గుడికి వెళ్ళి అక్కడేమివున్నది ఏమిలేనిది కూడా చూడలేదు. కాని భోజనం ముందుకూచున్నడు ఆచమనం కూడా మరిచిపోయారా?"

రమేశుడు మనసులోనే నవ్వుకున్నాడు—"మరిచిపోలేదు. కాని మరిచి పోయినా వచ్చేనష్టంలేదు. అయినా యిప్పుడెందుకీ సంగతి అడుగుతున్నావు?"

"మీకు పరకాల చింత ఎక్కువగనుక అడుగుతున్నాను."

కాని రమేశుడు యీ మాటకు జవాబు యేమీ చెప్పలేదు. ఆతరువాత యిద్దరూ కొంచంసేపు మెదలకుండా వున్నారు. ఆ తరువాత రమ మెల్లిగా అన్నది—"చూడండి! మీరు నన్ను దీర్ఘజీవిగా వుండమని ఆశీర్వదించడం శాపంలాంటిది. మన హిందువుల యిళ్ళలో విధవను దీర్ఘజీవిగావుండాలని ఎవరూ కోరరు." అని కొంచెంసేపు మెదలకుండా వూరుకుని—"నేను చనిపోయేందుకు సిద్ధంగావున్నానని అనడంలేదు. కాని ఎక్కువ కాలం బ్రతకాలేమోననే సంగతి గుర్తుకొచ్చేసరికి భయంవేస్తూంది. కాని మీ విషయంలో అలాకాదు. నేను ఏసంగతైనా గట్టిగా చెపితే అది బడాయిక్రిందకు వస్తుంది. కాని ప్రపంచంలో, పరుభ

కోసం తలలు పగులకొట్టుకోవడం శుద్ధతెలివి తక్కువని గుర్తు కొచ్చినప్పుడు మాత్రం నామాటలు గుర్తుతెచ్చుకోండి.' అని అన్నది.

అందుకు జవాబుగా రమేశు ఒక్కనిట్టూర్పు విడిచాడు. కొంచంసేపుండి మెల్లిగా రమచెప్పినట్లుగానేచెప్పాడు—"నిన్ను గుర్తుతెచ్చుకునే అంటున్నాను. యీ సమయంలో నాకా సంగతి గుర్తుకు రాదసలు. రమా! నేను నీకేమీకాను. పైగా నీదారికి కంటకంగావున్నాను. అయినప్పటికీ నీకు పొరుగింటివాడి ననే భావంతో-యివాళ నీవద్ద ఏ ఆతిథ్యాన్ని పొందానో, యిట్టి ఆతిథ్యాన్ని ప్రపంచంలో ప్రవేశించాక, ఏమనిషి తన బంధువుల దగ్గర అనుదినం ఆతిథ్యంపొందుతూ-యితరుల కష్టాలుచూసి, పిచ్చివాళ్ళుగా మారిపోవడంలో విశేషమేమీ లేదనిపిస్తూంది. నేనిప్పుడు వొంటిరిగాకూచునిఆలోచిస్తున్నదేమంటే, ఒక్కపూటలో నువ్వునాజీవితాన్ని మొదటినుంచి, చివరవరకూ మార్చేశావని. ఈ విధంగా నాకింతవరకూ ఎవరూ భోజనం పెట్టలేదు. యింత ప్రేమాదరణలతో నాకెవరూ భోజనం తినిపించలేదు. రమా! భోజనంలో కూడా యింత హాయి వుంటుందని యివాళ మొట్ట మొదటిసారిగా నీవద్ద తెలుసుకున్నాను."

ఈ మాట వినేసరికి రమ శరీరమంతా రోమాంచితమైంది. అయినా వెంటనే స్థిరపడి అన్నది—"కానీ యీసంగతి మర్చిపోవడానికి మీకు ఎక్కువకాలం పట్టదు. ఒకవేళ యెప్పుడైనా గుర్తుకువస్తే, అదేదో స్వల్పవిషయంగా తోస్తుంది."

రమేశు జవాబు చెప్పలేదు. రమ మళ్ళీ అన్నది—"యింటికి వెళ్ళాక, నన్నవమానించకుండావుంటే అదే నాకు భాగ్యమనుకుంటాను."

ఒక నిట్టూర్పు విడచి రమేశు అన్నాడు....‘‘లేదు-రమా ! నిన్ను నిందించను. పైగా పొగడుతూ ప్రచారంచేయను. యీ రోజు నాజీవితంలో నిందా పొగడ్తలకు, రెంటికి అతీతమైంది.’’

రమ యేమీ జవాబుచెప్పలేదు. కొంచెంసేపుండి లేచి తన గదిలోకి వెళ్ళిపోయింది. అక్కడ ఆ నిర్మానుష్యమైన గదిలో ఆమె కళ్ళంట పెద్దపెద్ద నీటిచుక్కలు రాలిపడ్డ :

11

ఎడతెరిపిలేకుండా రెండురోజుల్నుంచి వర్షం కురిసి, యివాళ మధ్యాహ్నం కొద్దిగా తెరిపియిచ్చింది. ఆకాశంమీద మబ్బులు లేవు. చండీమండపం హాల్లో గోపాలుసర్కారువద్ద కూచుని రమేశు లెక్కలుచూస్తున్నాడు. హఠాత్తుగా యిరవైమంది రైతులు యేడుస్తూవచ్చి-‘‘చినబాబుగారూ ! యీమారు మమ్మల్ని రక్షించండి ! ఒకవేళ మీరు రక్షించకుంటే మేము పెళ్ళాం— బిడ్డలతో వీధివీధి ముష్టికి బయలుదేరాలి బాబూ’’ అని చెప్పారు.

రమేశుడు విశ్చేష్టుడై—‘ఏమిటిసంగతి ?’ అని అడిగాడు.

రైతులు గోలపెట్టారు—‘‘వందయకరాలు నీటిలో మునిగి పోయింది. నీళ్ళు వదిలిపెట్టకుంటే పంటంతా నాశనమవుతుంది బాబూ ! యీ వూరంతా మాడి చావాల్సిందే.’’

రమేశుకు ఏమీ అర్థంకాలేదు. గోపాలుసర్కారు వాళ్ళను రెండుమూడు ప్రశ్నలు అడిగి రమేశుకు విపులంగా వివరించి చెప్పాడు. ‘‘వందయకరాల పంటే యీవూరికి ఆధారం. ఇక్క-

డున్న రైతులందరికి అందులో తలాకాస్త భూమివుంది. దానికి తూర్పున సర్కారువారి పెద్ద అడ్డకట్టవుంది. పశ్చిమ—వుత్తరాన ఎత్తైన గ్రామముంది. దక్షిణానవున్న అడ్డకట్టమాత్రం ఘోషాల్-ముఖర్జీల వుమ్మడిది. అటువేపునుంచే నీరు పోవడానికి అధారముంది. కాని ఆ అడ్డుకట్ట నానుకుని ఒక చెఱువువుంది. ప్రతి సంవత్సరం అందులోంచి రెండువందల రూపాయల చేపలు పట్టి అమ్ముతుంటారు. అందువల్ల అక్కడ వేణీబాబు కఠినమైన కాపలా పెట్టాడు. వీళ్ళంతా ఉదయంనుంచీ వేణీబాబుదగ్గర బ్రతిమాలుతూ వున్నారు. ఇప్పుడిప్పుడే యేడుస్తూ అక్కడనుంచి యిక్కడకు వచ్చారు.'' రమేశు యింకేమీ వినాలని అపేక్షించకుండా అక్కడనుంచి లేచివెళ్ళాడు. వేణీబాబుగారింటికి వెళ్ళేసరికి చీకటిపడబోతూవుంది. వేణీబాబు దిండ్లకు ఆనుకుని హుక్కా త్రాగుతున్నాడు. ఆయనకు దగ్గరగానే హాల్దారు కూచునివున్నాడు. ఈ సంగతే బహుశా మాట్లాడుకుంటున్నారలావుంది.

ఉపోద్ఘాతం ఏమీ లేకుండానే రమేశు అన్నాడు—"ఆచెఱువు కట్ట అలా వుంచినందువల్ల పని జరగదు. ఇప్పుడు దాన్ని తెగగొట్టాలి.''

వేణీ హుక్కాను హాల్దారు చేతిలోపెట్టి తలెత్తి—'ఏఅడ్డకట్ట?' అని అడిగాడు.

రమేశుడు అసలే ఉత్తేజితుడై వచ్చాడు. ఆయన కోపంగానే చెప్పాడు. "ఎన్ని అడ్డకట్టలు వున్నయో పెద్దన్నయ్యా? ఆ చెఱువు అడ్డకట్ట. ఆ అడ్డకట్ట తెగగొట్టకుంటే, వందయకరాల పంటంతా మునిగిపోతుంది. నీరు వదిలేందుకు ఆజ్ఞయివ్వండి.''

"ఆ నీళ్ళతోపాటు రెండుమూడు వందల రూపాయల చేపలు కూడా కొట్టుకునిపోయేసంగతి నీకు తెలుసా? ఈడబ్బు ఎవరిస్తారు? రైతులా—నువ్వా?"

రమేశు కోపాన్ని ఆపుకుంటూ-"రైతులు బీదవాళ్ళు. వాళ్ళేమి యివ్వగలరు? ఇక నేనంటారా? నేనెందుకివ్వాలో అర్థం కావడంలేదు?" అన్నాడు.

"అటువంటప్పుడు యింత నష్టం నేనెందుకు భరించాలో నాకూ, అర్థంకావడంలేదు?" ఆ తరువాత హోల్దార్ వేపుచూసి-"బాబాయ్! ఈ విధంగానే మా తమ్ముడు తన జమీందారీని కాపాడుకుంటాడు. రమేశ్! ఆ వెధవలు ఉదయంనుంచీ యిక్కడపడి యేడ్చి—యేడ్చి వెళ్ళారు. నాకంతా తెలుసు! అయితే నీవద్ద ఎవడూ దర్వానులేడా? లేకుంటే చెప్పులు లేకపోయాయా? వెళ్లు యింటికి. వెళ్ళి అందుకు తగిన శ్రద్ధపుచ్చుకో! ఇక నీరు దానంతట అదే పోతుంది!" అని చెప్పాడు.

రమేశు సహించలేకపోయాడు. అయినా ఎంతో ఓరిమిగా తనను తాను అణచుకుని వినయంగా—"పెద్దన్నయ్యా! మీరు బాగా ఆలోచించిచూడండి: మన మూడిళ్ళకు మూడువందలు నష్టం పూడ్చుకుందామంటే, ఈ బీదవాళ్ళకు సంవత్సరమంతా సరిపోయే ధాన్యం చెడిపోతుంది. అది అయిదారువేల రూపాయల నష్టం అవుతుంది." అని చెప్పాడు.

వేణీ చేతులు తిప్పుతూ—"అయితే అవనీయ్: వాళ్ళకు అయిదువేలు నష్టంరానీ, యాభైవేలు నష్టంరానీయ్: వాళ్ళ కోసం నేను రెండువందలు నష్టపడతానా?" అని అన్నాడు.

ఆఖరిసారిగా రమేశు—"అయితే వీళ్ళు సంవత్సరమంతా ఏం తింటారు?" అని అడిగాడు.

రమేశుడు పరిహాసాస్పదంగా మాట్లాడాడు. వేణీబాబు చేతులు తిప్పుతూ—నవ్వుతూ—ఛూ-ఛూ-అని రెండుసార్లు వుమ్మి వేసి, చివరకు—"ఏంతింటారా? చూస్తూవుండు. వీళ్ళంతా వున్నది తాకట్టు పెట్టేందుకు మనదగ్గరకే వస్తారు. తమ్ముడూ! నీబుద్ధిని కొంచెం చల్లబర్చుకుని పనిచేయ్! మనపెద్దలు ఏదో మనికింత ఎంగిలి మంగలం కూడబెట్టి వెళ్ళారు. మనంకూడా దీన్ని యింకా ఎక్కువచేసి, ఏదో యింత తింటూ—కొంత మన పిల్లలకు వదిపెట్టాలి. నువ్వేమో వాళ్ళేమి తింటారని అంటావు? అప్పుతెచ్చుకుని తింటారు. లేకుంటే వీళ్ళను హీన జాతివాళ్ళని యెందు కంటారు?" అన్నాడు.

అసహ్యం, సిగ్గు, క్షోభతో రమేశుని ముఖం ఎర్రబడింది. అయినా తన స్వరాన్ని తగ్గించుకుని అన్నాడు—"వీళ్ళకోసం మీరేమీ సాహాయ్యం చేయరని, నిశ్చయించుకున్నప్పుడు యిక్కడ తర్క వితర్కాలతో లాభంలేదు. నేను రమవద్దకు వెళుతున్నాను. ఆమె వొప్పుకుంటేమాత్రం మీ అనంగీకారం ఏమీ పనిచేయదు."

వేణీ ముఖం గంభీరమైంది—"సరే! వెళ్ళిచూడు. ఆమె అభిప్రాయం నాకు భిన్నంగా వుండదు. ఆమె సాధారణమైన ఆడదికాదు తమ్ముడూ! ఆమెను మార్చడం అసాధ్యం. నువ్వింకా కుర్రాడివి. నీ తండ్రినే ముప్పుతిప్పలు పెట్టి మూడుచెఱువుల నీళ్ళు తాగించింది....ఏమంటావు బాబాయ్!"

బాబాయ్ అభిప్రాయంతో రమేశుకు నిమిత్తం లేకపోయింది. వేణీ అన్న అవమానజనకమైన మాటకు జవాబుకూడా చెప్పడం వ్యర్థ మనుకున్నాడు. ఆయన జవాబు చెప్పకుండానే బయటికి వెళ్ళాడు.

రమ తులసికి దీపారాధన చేసి, నమస్కరించి తలెత్తిచూసి నిశ్చేష్టురాలైంది. ఆమె ఎదట రమేశు నిల్చుని వున్నాడు. తలమీదకొంగు మెడకు చుట్టుకునివుంది. ఇప్పుడే రమేశునికి నమస్కరించి లేచి నిల్చున్నట్లుంది. ఇక్కడకు రావద్దని రమ చిన్నమ్మ అన్నమాటలు, యిప్పుడు రమేశుకు జ్ఞాపకంలేవు. అందువల్లనే అతను మెదలకుండా లోపలికి వెళ్ళి రమయెదట నిల్చున్నాడు. ఆ యిద్దరూ నెలరోజు లయాక కలుసుకున్నారు.

"మీరు అంతా వినేవుంటారు. నేను ఆ చెఱువులోని నీళ్ళు వెళ్ళగొట్టేందుకు మీ అనుమతికోసం వచ్చాను."

రమ కున్న ఆశ్చర్యం దూరమైంది. తలమీదికి ముసుగు లాక్కొని అన్నది—"అదెలా జరుగుతుంది? పెద్దన్నయ్యగారి అనుమతికూడా లేదు."

"లేదని తెలుసు! అయినా ఆయన వొక్కడి అనుమతి లేక పోయినా ఫర్వాలేదు."

కొంచెం ఆలోచించి, రమ అన్నది—"చెఱువులోని నీళ్ళు బయటకు వెళ్ళదీయాల్సిందే. కాని వాటిలోని చేపల్ని యెలా ఆపగలరు?"

"అంతనీటిలో ఏమీ వుపాయం చేయలేం! ఈ సంవత్సరం మనకు జరిగే నష్టాన్ని మనమే భరించాలి. లేకుంటే వూరంతా తిండికి చచ్చిపోతుంది."

రమ మాట్లాడలేదు.

"అయితే మీరు అనుమతి యిచ్చినట్లేగా ?"

రమ కోమలంగా అన్నది—'కాదు. నేనంత డబ్బు నష్ట పడను."

ఆశ్చర్యంతో రమేశు హతబుద్ధి అయాడు. అలా జవాబు యిస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. తను వినయపూర్వకంగా అడిగితే, రమ కాదని చెప్పదని నమ్మాడు. రమ తల యెత్తకుండానే అతని మనసును గ్రహించింది—"అంతేకాదు ఈ సంపదంతా మా తమ్ముడిది. కేవలం అజమాయిషిమాత్రం నామీద వుంది."

"కాదు. అందులో నీకూ సగభాగం వుంది."

"పేరుకు మాత్రం! చిట్టచివరకు ఆస్థంతా యతీంద్రునిదేనని మానాన్నకు తెలుసు! అందువల్ల సగం నాపేర వ్రాశారు."

అయినప్పటికీ రమేశు అనునయ వినయాలతో చెప్పాడు—"రమా! యిది ఎంత నష్టం? అదీగాక, నీస్థితి అంతా అందరికీ తెలుసు! నీకు యీ నష్టం ఒక పెద్దనష్టంకాదు. నేను నిన్ను ప్రార్థిస్తున్నాను. రమా! ఈ కొద్దిలాభానికి యింతమంది నోటి దగ్గర తిండి లాక్కోవద్దు. నువ్వింత నిష్ఠూరంగా వుంటావని నేను కలలోకూడా అనుకోలేదు."

రమ ఆవిధంగానే కోమలంగా చెప్పింది—"నేను నష్ట పడను. అందుకు నేను నిష్ఠూరం పడవలసి వచ్చినా లెక్క చేయను. ఒకవేళ మీ కంత దయవుంటే—మీరే ఆ నష్టాన్ని ఎందుకు భర్తీ చేయలేరు?"

ఈ కోమలమైన స్వరంలో ఎత్తిపొడుపు వున్నట్లు గ్రహించి రమేశు మండిపడ్డాడు—'మనిషియొక్క ఉదాత్తత, ఒక్క డబ్బు విషయంలో తేలిపోతుంది, పైపై మోసాలన్నీ ఈసంగతి వచ్చే సరికి తొలగి పోతాయ్! అప్పుడు మనిషి నిజస్వరూపం బయట పడుతుంది. యివాళ నిజస్వరూపంకూడా బయటపడింది. కాని నువ్వు యిలాంటిదాని వనుకోలేదు. చాలా రోజుల్నుంచీ, వీళ్ళందరికంటే గొప్ప బుద్ధిగలదాని వనుకున్నాను. కాని అటువంటి దానివి కాదు. నిన్ను కఠినాత్మురాలి వనడంకూడా పొరపాటే! నువ్వు ఎంతో నీచురాలివి. చాలా అల్పురాలివి.'

భరింపరాని విస్మయంతో రమ కళ్ళు చించుకుని—'నన్నే మన్నావ్—' అని అడిగింది.

'నువ్వు నీచురాలివి—హీనురాలివి. నే నెంత వ్యాకులంగా వున్నానో నువ్వెరుగుదువు. అందువల్లనే నష్టం పూర్తిచేయమని నన్ను అడిగావే, పెద్దన్నయ్యకూడా యీ మాట అడగలేక పోయాడు. ఏ మాట పురుషుని నోటంట బయటికి రాలేదో—అదే స్త్రీవైన నీ నోటినుంచి బయటికి వచ్చింది, అంతకంటే ఎక్కువ నష్టంకూడా పూర్తి చేయగలను. కాని, రమా! యివాళ నీ కొక సంగతి చెప్పి వెళతాను. ప్రపంచంలో అనేక రకాలైన పాపాలున్నాయి! కాని, అన్ని పాపాలకన్న—మనిషిలోని దయా స్వభావంమీద అత్యాచారం చేయడం మహాపాపం! యివాళ నువ్వు అలాచేసి, నా దగ్గర డబ్బు వసూలు చేయాలని చూశావు—'

రమ హతబుద్ధురాలై కళ్ళప్పగించి చూస్తూవుంది. ఆనోటంట ఒక్క మాటకూడా పెగిలిరాలేదు. రమేశు ఆ విధంగానే శాం

తంగా—ధృఢమనసుతో చెపుతున్నాడు—'నాకు దుర్బలం ఎక్కడుందో—మీకు తెలుసు! కాని యికమీద అక్కడనుంచి ఒక చుక్కయినా ద్రవించదు. ఈ విషయం ముందుగానే చెపుతున్నాను. దానితోపాటు నేను చేయబోతూన్న పనికూడా చెపుతున్నాను. నే నిప్పుడే వెళ్ళి బలవంతంగా కట్ట తెగ గొట్టిస్తాను. మీకు చేతనైతే అడ్డుకోవచ్చు—' అని వెళ్ళబోతూన్న రమేశుని వెనకకు పిల్చింది రమ. అతను దగ్గరకు వచ్చి నిలుచున్నాడు—'నా యింట్లో నిలుచుని. నన్నవమానం చేశావు. అందుకు నే నేమీ జవాబు చెప్పను. కాని, మీరాపని మాత్రం తలపెట్టవద్దు' అని చెప్పింది రమ.

"ఎందుకని—?"

"మీ రింతగా అవమానించి నప్పటికీ, మీతో పోట్లాట నాకు యిష్టంలేదు."

ఆ మాట చెపుతున్నప్పుడు ఆమె ముఖం అస్వాభావికంగా ఎంతలో తెల్లబడి పోయిందో—మాట్లాడు తున్నప్పుడు పెదవులు యెలా వణకిపోయినయో—ఆ చీకటిలో కూడా రమేశు చూడగలిగాడు. కాని ఆ సమయాన ఆమె మన స్తత్వాన్ని పరిశీలించడానికి అవకాశంగాని, ప్రవృత్తిగాని లేదతనికి. అందువల్ల ఆయన వెంటనే జవాబుచెప్పాడు—"పోట్లాట కొట్లాటలంటే నాకూ యిష్టంలేదు. ఏమైనా—తర్క వితర్కాలువల్ల పనిలేదు-నేను వెళుతున్నాను—"

అప్పుడు రమ చిన్నమ్మ ఠాకూరు గదిలో పూజచేసు కుంటూ వుంటి. ఈ సఙ్గతి ఆమెకు తెలియదు. క్రిందకు వచ్చి చూసే

సరికి రమ దాసీని తీసుకుని బయటికి వెళ్ళబోతూండడం చూసి —"ఈ బురదలో యెక్కడికి వెళుతున్నావు రమా?" అని అడిగింది—

"ఒకసారి పెద్దన్నగారి దగ్గరకు వెళ్ళివస్తాను చిన్నమ్మా—"

"దారంట ఎక్కడా కొంచెం కూడా బురద లేదమ్మగారూ! చినబాబుగ్గారు రోడ్డువేయించారు. ఎక్కడైనా కొంచెం కుంకం వొలికినా ఎత్తుకోవచ్చు. భగవంతు డాయనకు వెయ్యి సంవత్స రాలు ఆయుర్దాయం యివ్వాలి. పాములవల్ల బీదవాళ్లు రక్షింప బడ్డారు—" అని దాసి అన్నది.

◆ ◆ ◆ ◆

రాత్రి పదకొండు గంటలవుతుంది. వేణీ బాబుగారి చండీ మండపం హాల్లో చాలామంది మెల్లి మెల్లిగా మాట్లాడుకుంటున్న ధ్వని వినపడుతూంది. ఆకాశంనుంచి చాలా మేఘాలు తప్పు కున్నయ్! త్రయోదశి చంద్రుడు వేణీబాబుగారి ఆంగనంలో ప్రకాశిస్తున్నాడు. అక్కడే ఒక స్థంభానికానుకుని భయంకరమైన ఆకృతిగల ముసల్మాను కళ్లుమూసుకుని కూచుని వున్నాడు. అతని ముఖంమీద నెత్తురు గడ్డల్లావుంది. గుడ్డలమీద కూడా రక్తపు మరకలున్నయ్! కాని అతను మెదలకుండానే కూచుని వున్నాడు. వేణీ ఎంతో మెల్లగా బ్రతిమాలుతున్నాడు— "అక్బర్! నా మాట విను. పోలీసుస్టేషన్‌కు పోదాం. పద. వాణ్ణి యేడేళ్ళు జెయిలుకు పంపకపోతే—నేను ఘోషాల్ వంశీయున్ని కాను." అని వెనకకు తిరిగిచూసి—"రమా! నువన్నా చెప్పు. మెదలకుండా వూరుకున్నావే—?" అన్నాడు,

కాని రమ కొయ్యబారినట్లు కదలకుండా నిలుచునివుంది.

ఈమారు అక్బరాలి కళ్ళుతెరిచి, లేచి సరిగ్గా కూచుని— "శభాష్ చినబాబుగారూ! నిజంగా ఆ తల్లిపాలు త్రాగినవాడివి. కర్రసాము చేయాలంటే నువ్వే చేయాలి" అన్నాడు.

వేణీ కలవరపాటుతోనూ—కోపంతోనూ అన్నాడు—"అక్బర్! నిన్నాసంగతే చెప్పమంటున్నాను. ఎవరి లాఠీతో నీకు దెబ్బలు తగిలినయ్? వాడిచేతిలోనా? వాడి పడమటి నౌకరుచేతిలోనా?"

అక్బరు ముఖంలో నవ్వు కనుపించింది—"ఆ పొట్టివాడి చేతి లాఠీతోనా? పెద్దబాబూ! వాడికి లాఠీపట్టడం ఏం చేతనవును? ఏం గౌహర్? వాడు నీ మొదటిదెబ్బకే పడిపోలేదూ?"

అక్బరు కొడుకు లిద్దరూ ఆ దగ్గర్లోనే ముడుచుకుని కూచున్నారు. వాళ్ళకు కూడా దెబ్బలుతగిలాయ్! గౌహర్ మాట్లాడకుండా హుంకరించాడు. కాని నోటితో ఏమీ చెప్పలేదు. అక్బరు చెప్పడం మొదలుపెట్టాడు—"ఒకవేళ నా చేతిదెబ్బ తగిలినట్లయితే వాడు బ్రతికేవాడుకాడు. వాడు గౌహర్ లాఠీదెబ్బతో 'బాబోయ్' అని కూచున్నాడు పెదబాబూ."

రమలేచి వాళ్ళదగ్గరకు వచ్చింది. అక్బరు పీర్‌పురంలో ఆమె పొలం చేస్తున్నరైతు. అదివరకు తన చేతికర్రతో చాలా ఆస్థి వీళ్ళకు చెందేట్లు చేశాడు. అందుచేతనే యివాళ సాయంకాలం క్రోధం అభిమానంతో రెచ్చిపోయి, ఆమె అతన్నిపిల్చి, అడ్డకట్టకు కాపలావుంచింది. అదిగాక రమేశు, అతని పడమటి దేశపు నౌకరు సాహాయ్యంతో కట్ట యెలా తెగగొట్టించగలడో చూద్దామనుకుంది. కాని రమేశు కర్ర తిప్పడంలో యింత నేర్పరని యెన్నడూ వూహించలేకపోయింది.

అక్బరు రమ వేపుచూసి అన్నాడు—''అమ్మగారూ! అప్పుడు చినబాబుగారు వాడిచేతిలోని కర్ర తీసుకుని కట్టమీద నిలబడ్డారు. మేము తండ్రికొడుకులు ముగ్గురం కూడా వారిని అక్కడనుంచి కదిలించలేకపోయాం. ఆ చీకట్లో ఆయనకళ్ళు పులికళ్ళలా మెరిసినయ్! ఆయన—'అక్బర్! నువ్వు ముసలివాడివి. తొలగిపో! ఈ కట్ట తెగగొట్టకుంటే గ్రామమంతా ఆకలితో చచ్చిపోతుంది. అందుకని దీన్ని ఎలాగైనా తెగగొట్టితీరాలి. నీవూళ్ళో నీకూ పొలముంది. అది యిలాచెడిపోతూంటే మీకెలావుంటుంది?' అని అన్నారు. అప్పుడాయనకు సలాంచేసి—''చినబాబుగారూ! భగవంతునితోడు! మీరు ఒక్కసారి తప్పుకోండి! మీచాటున నిలుచుని, గడ్డపారలతో కట్ట తెగగొట్టుతున్నవాళ్ళ తలల్ని తెగవేస్తాను'' అన్నాను.

వేణీ తనకోపాన్ని ఆపుకోలేకపోయాడు. మధ్యలోనే అడ్డువచ్చి—''విశ్వాసఘాతకుల్లారా! అక్కడవాడికి సలాములు చేసి వచ్చి, యిక్కడ బడాయిలు కొడుతున్నారా?'' అని అన్నాడు.

తండ్రికొడుకు లిద్దరు ఒక్కసారి చేతులెత్తారు. అక్బర్ కర్కశంగా అన్నాడు—''జాగ్రత్త పెదబాబుగారూ: విశ్వాసఘాతకులని అనవద్దు. మేము ముసల్మానులము. అంతా సహించగలం కాని యీమాట సహించలేము.''

ఆ తరువాత అక్బరు తన తలమీది రక్తాన్ని తుడుచుకుని, రమవేపు చూసి—''అమ్మగారూ! యింకా విశ్వాసఘాతకులమని అంటారేమమ్మా! పెద్దబాబుగారు యిక్కడ యింట్లో

కూచుని విశ్వాసఘాతకులమని అంటున్నారు. ఒకవేళ అక్కడికి వచ్చి కళ్ళతో చూసినట్లయితే చినబాబుగారు ఎటువంటివారో తెలిసేది ?''

వేణీ ముఖాన్ని వికృతంగాపెట్టి—"అందుకే చినబాబుగారెటువంటివారో స్టేషనుకు వెళ్ళి చెప్పమంటున్నాను. ఏమీలేదు, అడ్డుకట్టకు కాపలాకాస్తుంటే చినబాబుగారు వచ్చి కొట్టారని చెప్పండి'' అన్నాడు.

అక్బరు నాలుక కొరుక్కుని—"రామ రామ. పెదబాబుగారూ ! మీరు రాత్రిని పగలు—పగలును రాత్రి చేయమంటారేం ?'' అన్నాడు.

"సరే ! అలాకాకుంటే మరొకలా చెపుదాం ! ,యివాళవెళ్ళి ముందు దెబ్బలు చూపించిరా ! రేపు వారంటు తీసుకుని వచ్చి వాళ్ళను జెయిలుకు పంపిద్దాం ! రమా ! నువ్వుకూడా యితనికి కొంచెం నచ్చచెప్పు ! యిటువంటి అదును యిక తిరిగిరాదు.''

రమ ఏమీ జవాబు చెప్పలేదు. ఒక్కసారి మాత్రం అక్బరు ముఖంవేపు చూసింది అక్బరు తలూపి—"కాదమ్మా ! అలా నాచేతకాదు'' అని చెప్పాడు.

వేణీ దబాయిస్తూ—'ఎందువల్లకాదు' అని అడిగాడు.

ఈమారు అక్బరుకూడా గట్టిగా—"పెదబాబుగారూ ! మీరనేదేమిటి ? నాకేమీ సిగ్గు లేదనుకుంటున్నారా ? ఈ చుట్టుప్రక్కల గ్రామాల్లో నన్ను సర్దార్ అనిపిలవడంలేదూ ? అమ్మగారూ ! మీరుచెప్పినట్లయితే ముద్దాయిగా బోనులో నిలబడతాను. కానీ వెళ్ళి ఏముఖంతో ఫిర్యాదు చేయమంటారు ?'' అని అడిగాడు.

రమ కోమలంగా ఒక్కసారి మాత్రం అడిగింది—'అయితే అక్బరు! స్టేషన్‌కు వెళ్ళలేవా?'

అక్బరు తలూపుతూ అన్నాడు—"లేదమ్మగారూ! ఏపనైనా చేయగలను. కాని స్టేషనుకు వెళ్ళి గాయాలు మాత్రం చూప లేను. లే, గౌహర్! యింటికి వెళ్దాంపద—కేసుపెట్టడం మావల్లకాదు" అంటూ అందరూ లేవబోయారు.

వేణీ కోపంతోనూ, నిరాశతోనూ, వాళ్ళవేపుచూసి, కళ్ళ లోంచి నిప్పులు గురిపిస్తూ—అనరాని మాటలని, తిట్టరాని తిట్లన్నీ తిట్టాడు మనసులోనే: రమ యీ విధంగా, విరుద్ధామ స్థబ్ధతలోని అర్థము తెలియక, కోపంతో కుమిలిపోతున్నది. వేణీ అనునయ వినయాలనూ, బెదరింపులను, కోపాన్ని లెక్కచేయక అక్బరాలి తన కొడుకులను తీసుకుని బయటికి వెళ్ళగానే, రమ హృదయాన్ని భేదించుకుని ఓ గంభీరమైన నిట్టూర్పు బయటికి వచ్చింది. అకారణంగా ఆమె కళ్ళు నీళ్ళతో నిండిపోయినయ్!

ఇవాళ యింత పెద్ద అవమానమూ—పరాజయమూ తటస్థిం చినా ఏమిటో తన గుండెలమీదనుంచి పెద్దబరువు దించిన ట్లయింది. ఇలా ఎందుకయిందో ఆమె తెలుసుకోలేకపోయింది. ఆ రాత్రంతా ఆమెకు నిద్రపట్టలేదు. ఆనాడు తారకేశ్వరంలో రమేశుకు భోజనం పెట్టిన దృశ్యం కళ్ళకు కన్పించింది. సుందర మైన అతడి సుకుమారమైన శరీరంలోపల యింత దయా, యింత తేజమూ ఏవిధంగా, ప్రచ్ఛన్నంగా, అణిగి వున్నాయా అని ఆలోచించే సరికి కన్నీళ్ళతో ఆమె ముఖం తడిసి పోయింది.

12

రమేశు చిన్నతనంలో ఒకప్పుడు రమను ప్రేమించాడు. అది చిన్ననాటి ప్రేమ అనడంలో సందేహంలేదు. అది ఎంత కఠినమైనదో మొట్టమొదటి సారిగా తారకేశ్వరంలో అనుభవించి వచ్చాడు. అదిగాక అదియింకా ఎంత గంభీరమైనదో—ఆనాటి సాయంకాలం రమతోవున్న పరిచయమంతా తుడిచివేసి వచ్చి నప్పుడు కూడా తెలుసుకున్నాడు. ఆ తరువాత ఆనాటి రాత్రి జరిగిన దుర్ఘటన రమ విషయం అతనికి మరుభూమిలా సూన్యంగా కనుపిస్తూంది. కాని అందువల్ల తన పనిపాటలూ, పడుకోవడం, కూచోవడమూ, అలా చివరకు ఆలోచనలూ, అధ్యయనం, అన్నీ యింతరుచి తప్పిపోతాయని అనుకో లేదు. యీ గృహ విచ్ఛేదమూ, సర్వత్రా వ్యాపించి ఆ నాత్మీ యమూ వల్ల యిక ఒక క్షణంకూడా యీ వూళ్ళో వుండగూడ దని నిశ్చయించు కున్నాడు. కానీ యీ మధ్యలో జరిగిన ఒక సంఘటనవల్ల మళ్ళీ నిలబడాల్సి వచ్చింది.

చెఱువుకు ఆవలనున్న పీర్‌పుర గ్రామముకూడా వాళ్ళ జమీందారీ లోనిదే: అక్కడ ఎక్కువగా ముసల్మానులు వుండే వాళ్ళు. ఒకనాడు వాళ్ళంతా కట్టకట్టుకుని రమేశు దగ్గరకు వచ్చారు. వాళ్ళంతా ఒక్కసారిగా—"మేమూ మీ ప్రజలమే! అయినప్పటికీ మేము ముసల్మానులం, కావడంవల్ల మా పిల్లల్ని తమ బడిలో చేర్చుకోవడం లేదు. మేము చాలాసార్లు ప్రయత్నిం చాము కాని, విఫలమనోరథుల మయాము. మాష్టర్లు మా పిల్ల లను బడిలో చేర్చుకునేందుకు యిష్టపడ్డంలేదు," అని చెప్పారు.

రమేశు విస్మయం—కోపంతో—"ఇటువంటి అన్యాయమూ అత్యాచారమూ నే నెప్పుడూ వినలేదు. మీరు మీ పిల్లల్ని తీసుకుని రాండి! నేను దగ్గరుండి అందర్ని చేరుస్తాను—" అని చెప్పాడు.

"మేమూ మీ జమీందారీలోని ప్రజలం—సుంకం చెల్లించి భూమి దున్నుకుంటున్నాము. అందువల్ల హిందువుల్లా మేము జమీందారులకు భయపడము. అయినా యీ విషయంలో వివాదం పడినందువల్ల లాభంలేదు. ఎందుకంటే దీనివల్ల పోట్లాట పెరగడమేకానీ. వాస్తవికంగా లాభమేమీ వుండదు. అందువల్ల మా వూళ్ళోనే ఓ చిన్నస్కూలు పెట్టుకోవాలని చూస్తున్నాము. అందుకు తమరేమైనా సాహాయ్యం చేస్తే పని జరిగిపోతుంది." అని అంతా ఒక్కసారి చెప్పారు.

పోట్లాటలన్నా, తగాదాలన్నా, రమేశుకూడా ఒకవిధంగా విసిగిపోయాడు. అందువల్ల ఆ విషయాన్ని ఎత్తకుండా, దాన్ని వృద్ధిచేయకుండా, వాళ్ళన్నదే బాగుందని, వాళ్ళకు హామీ యిచ్చాడు. అప్పటినుంచీ ఆయన క్రొత్తస్కూలు వాళ్ళకోసం పెట్టించాలనే ప్రయత్నంలో వున్నాడు. వీళ్ళ సంపర్కంలోకి వచ్చాక రమేశు మానసికంగా స్వస్థుడవడమేకాకుండా—యిటు సంవత్సరమునుంచీ క్షీణించిపోయిన బలాన్ని తిరిగి సంపాయించాడు. వీళ్ళు తన కుంవాపురంలోని హిందువుల్లా మాటిమాటికి తగవులాడుకోరు. ఒకవేళ పోట్లాడుకున్నా, దాన్ని తీర్పు చెప్పేందుకు కోర్టులకు వెళ్ళరు. పైగా యిష్టంకాని, అయిష్టంకాని, ఏమైన వూళ్ళోని పెద్దలు చెప్పినట్లు నడుచుకుననే

వాళ్ళు. అందులో విశేషించి, ఆపదలసమయంలో మనస్ఫూర్తిగా ఒకరి నొకరు ఆదరించుకునేవాళ్ళు. ఈ విషయం హిందువులలో తనెక్కడా చూడలేదు.

జాతిభేదాలంటే రమేశుకు యిష్టంలేదు. పైగా ఈ దగ్గరదగ్గర వుండే రెండువూళ్ళను .ఒకదాని ప్రక్కన ఒకదాన్ని వుంచి చూసే సరికి, ఆయనకు మరింత అయిష్టత కలిగింది. హిందువులలో వుండే, ధార్మికంగా, సమాజికంగావున్న విషమత్వమే, యీ ఈర్ష్యకూ, ద్వేషానికీ కారణమని గ్రహించాడు. ముసల్మానులలో ధర్మవిషయంగా అంతా సమానులే; అందువల్లనే వాళ్ళలో వుండే సంఘీభావం హిందువుల్లోలేదు. ఉండబోదుకూడా. ఎప్పుడైతే జాతిభేదము దూరంచేసేందుకు వుపాయంలేదో—చివరకు దాన్నిగురించి ప్రసంగించడంకూడా అసంభవమైనప్పుడు, వాళ్ళలోని పోట్లాటలన్నీ పోగొట్టి, ప్రేమించడం నేర్పడమనేది వృథా శ్రమపడడమే అవుతుంది. ఇటు కొన్నిసంవత్సరాల నుంచి తన గ్రామములోని ప్రజలకోసం వృథాగా శ్రమపడినందుకు రమేశు పశ్చాత్తాపం కలిగింది. వీళ్ళెప్పుడూ యిలా కొట్టుకుంటూ, తిట్టుకుంటూ వుంటూ, రోజులు గడుపుతుంటారని, యికముందుకూడా యిలానే గడుపుతారని రమేశుకు బాగా అర్థమైపోయింది. వీళ్ళుమాత్రం యిలావుంటే ఏనాటికీ బాగుపడతారో, లేదో పరీక్షించి తెలుసుకోవాలని అనుకున్నాడు.

కొన్ని కారణాలవల్ల, కొన్నిరోజులనుంచీ, పెద్దమ్మను కలుసుకోలేదు. ఆనాడు పోట్లాట జరిగాక, ఒకవిధంగా వెళ్ళగూడదన్నే అటువెళ్ళలేదు. యివాళ ఉదయమే లేచి వాళ్ళింటికి

వెళ్ళాడు. పెద్దమ్మ తెలివితేటలమీదా— లోకజ్ఞానంమీదా— అతనికున్న నమ్మకమెంతో అతనికే తెలియదు. పెద్దమ్మ అప్పటికే లేచి స్నానసంధ్యలు నిర్వ_ర్తించుకుని, యింటిపను లన్నీ చేసి, అస్పష్టంగావున్న ఆ వెలుతురులో—తనగదిలో చాపమీద కూచుని, కళ్ళద్దాలు పెట్టుకుని, ఏదో పు_స్తకం చదు వ్తూ వుండడంచూసి రమేశుడు ఆశ్చర్యం పొందాడు. రమేశుని చూసి ఆమెకూడా ఆశ్చర్యపడింది. ఆమె పు_స్తకంమూసి రమేశుని ఆదరపూర్వకంగా లోపలికి పిల్చి కూచోపెట్టి—అతని ముఖంవేపు చూసి—'యింత ఉదయాన్నే వచ్చావేం నాయనా?' అని అడిగింది.

"నేను చాలా రోజుల్నుంచి నిన్ను చూసేందుకు వీలుపడ లేదు పెద్దమ్మా! నేను పీఠపురంలో ఒకస్కూలు పెట్టిస్తు న్నాను."

"అవును! నేనూ విన్నాను. కాని ప్రస్తుతం మనస్కూలులో పాఠాలు చెప్పేందుకు రావడంలేదేం?"

"ఆ విషయం చెప్పడానికే వచ్చాను పెద్దమ్మా! వీళ్ళ మంచికోసం ప్రయత్నించడం వట్టిశ్రమ పెద్దమ్మా! ఒకరిమంచి ఒకరు చూడలేనివాళ్ళూ—ఎక్కువగా అభిమాన అహంకారాలు గలవాళ్ళకోసం కష్టపడి—ప్రాణం యిచ్చినాకూడా లాభముండదు. పైగా వీళ్ళంతా యింకా ఎక్కువగా శత్రుత్వం చూపుతారు. ఇప్పుడు ఎవరికి మంచిచే_స్తే—అది మంచిదవుతుందో వాళ్ళ కోసమే ప్రయత్నిస్తాను."

"యిదేమంత కొ_త్తసంగతికాదు రమేశ్? ప్రపంచంలో మంచికోసం ప్రయత్నించే ప్రతివారికీ శత్రువులు ఎక్కువవ్వ

తుంటారు. అందువల్ల భయపడి వెనకకు వెళ్ళేవారిలో నువ్వూ కలుస్తావా? అటువంటప్పుడు పనెలా జరుగుతుంది రమేశ్? భగవంతుడు యీ కష్టమైన భారాన్ని నీకు వప్పగించాడు. నువ్వు తలమీద పెట్టుకుని మోయక తప్పదు. ఏం రమేశ్? అయితే నువ్వు వాళ్ళచేతి నీళ్ళుకూడా త్రాగుతున్నావా?''

"చూడు పెద్దమ్మా! ఈ సంగతి నీకప్పుడే తెలిసింది? అయినా యింతవరకూ నేను త్రాగలేదు. త్రాగినందువల్ల దోషం కూడా లేదనుకుంటాను. నేను కులభేదాలు కూడా పాటించను."

పెద్దమ్మ ఆశ్చర్యపడుతూ—"కులభేదాలు వొప్పుకోవూ? అయితే కులభేదాలు లేవా? కులభేదం వుందని నువ్వు వొప్పుకోవన్నమాట?" అని అడిగింది.

"పెద్దమ్మా! ఆ సంగతి తేల్చుకోవాలనే నేను వచ్చింది. కులభేదాలు వున్నాయని వొప్పుకుంటాను. కాని అదంత మంచిది కాదంటాను నేను."

"ఎందుకని?"

రమేశుడు కొంచెం వుత్తేజితుడై—"ఈ సంగతి కూడా నీకు చెప్పాలా? వీటిమూలానే, యిన్ని మనస్పర్థలూ, పోట్లాటలు కలుగుతున్నాయని నీకు తెలవదూ? సంఘంలో ఎవరిని తక్కువ జాతివారని దూరంగా వుంచుతామో—వాళ్ళు అగ్రజాతివాళ్ళను ద్వేషించడమూ—తమ తక్కువ తనాన్ని పోగొట్టుకునేందుకు విద్రోహం తలపెట్టడమూ, తమ నీచత్వాన్నుంచి బయట పడేందుకు ప్రయత్నించడం వాళ్ళ స్వభావమేకదమ్మా! హిందువులకు సంఘీభావం తెలియదు. వీళ్ళకు తెలిసింది దూరంగా

వుంచడమే! తననూ, తన జాతినీ, రక్షించుకోవాలనీ, వృద్ధి చేయాలనీ, వున్న ప్రపంచ నియమాన్ని వీళ్లు స్వీకరించరు. అందువల్లనే రోజు రోజుకూ క్షీణించిపోతున్నారు. జనాభా లెక్కలను మనం గమనించామంటే, భయంవేస్తుంది పెద్దమ్మా! తన తోడి మానవుడ్ని తక్కువ వాడని, అవమానించినదానికి ప్రతిఫలం మనకు ప్రతివిషయంలోనూ కనిపిస్తూంది. నానాటికీ హిందువులసంఖ్య క్షీణించి ముసల్మానులసంఖ్య పెరుగుతున్నా— మనవాళ్ళకు జ్ఞానం రావడంలేదు." అన్నాడు.

విశ్వేశ్వరి నవ్వుతూ చెప్పింది—"రమేశ్! నీ మాటలు విన్నాక కూడా నాకాజ్ఞానం కలగలేదు. నువ్వన్న జనాభా లెక్కలు వేసేవాళ్ళు—ఎంతమంది హీనజాతివాళ్ళు. తమ కులాన్నీ, ధర్మాన్నీ, ఈ భయంవల్లనే వదులుకున్నారని చెప్పితే బావుండేది. హిందువులు నానాటికీ క్షీణించి పోతున్నారన్నావు. అది బాగానేవుంది. కాని అందుకు కూడా వేరే కారణం వుంది. నిజంగా అదికూడా సంఘం పొరపాటే; కాని తక్కువ జాతి వాళ్ళు తమ జాతిని వదులుకోడానికి కారణం అదికాదు. తాను తక్కువజాతివాడి నని, యేహిందువూ తన జాతినీ, ధర్మాన్ని పోగొట్టుకోడు."

రమేశు సందిగ్ధంగా—"కాని పెద్దమ్మా! పండిత పామరులు అలానే అంటున్నారు" అని చెప్పాడు.

"పండితుల వూహలకు విరుద్ధంగా తర్కించలేము. ఫలానా గ్రామంలో యింతమంది, యీ కారణంవల్లనే తమ ధర్మాన్ని వదులుకున్నారని చూపించినట్లయితే పండితుల మాట వొప్పు

కుంటాను. కాని అలా ఎవరూ చెప్పలేరని మాత్రం నాకు తెలుసు."

"కాని పెద్దమ్మా! తక్కువజాతివాళ్ళంతా—అగ్రజాతి వాళ్ళను ద్వేషిస్తారని నేను చెప్పగలను."

ఈ వుత్తేజిత పూర్వకమైన మాటమీద విశ్వేశ్వరి నవ్వి—"నిజంకాదు బాబూ! అది నిజంకాదు. ఇది పట్టణంకాదు. ఈ పల్లెలో తనది తక్కువ కులమనీ, తనది ఎక్కువ కులమనీ, ఎవరూ అనుకోరు. తమ్ముడు అన్నకంటే రెండుమూడు సంవత్సరాలు చిన్నవాణ్ణనీ అన్నమీద తమ్మునికి ఏవిధంగా మనసులో క్షోభగాని, ద్వేషంగాని వుండదో అలాగే యీ పల్లీయుల స్థితి వుంది. ఇక్కడ కాయస్తులకు మేము బ్రాహ్మణులంకాలేకపోయామనే చింతే వుండదు. పల్లెవాడు, తాను కాయస్థున్ని కావాలని కోరడు. ఏవిధంగా పెద్దన్నకు నమస్కరించడంలో తమ్మునికి లజ్జాభిమానాలు కలగవో—ఆవిధంగానే కాయస్తుడు—బ్రాహ్మణుల పాదధూళి తీసుకునేందుకు కష్టపడడు. నాయనా! యీ జాతిభేదాలు యీర్ష్యా ద్వేషాలకు కారణాలు కావు. ఎంతలేదన్నా మన బెంగాళీ పల్లెల్లోనయినా కావు" అని చెప్పింది.

రమేశు ఆశ్చర్యంగా ఆమె ముఖంలోకి చూసి—"అట్లువుంటప్పుడు ఇదెలా జరుగుతుంది పెద్దమ్మా! ఆ వూళ్ళో ఎన్నో ముసల్మానుల యిళ్ళున్నయ్! వాళ్ళ కిన్ని పోట్లాటలు లేవు. ఎవరైనా అక్కడ ఆపదల్లో వున్నప్పుడు యిక్కడిలా గొంతుకు కోయాలని చూడరు. ఆనాడు ద్వారకాపండితుని శవాన్ని ప్రాయశ్చిత్తం కాలేదని ఎవరూ ముట్టుకోని సంగతి నీకు తెలుసుగా" అని అడిగాడు.

"తెలుసు నాయనా! అంతా తెలుసు! అందుకుకారణం జాతి భేదంకాదు. అసలుకారణం ఏమంటే ముసల్మానుల్లో ధర్మ ముంది. మనలో అదిలేదు. దేన్ని వాస్తవంగా ధర్మమని అంటారో, అది పల్లెల్లో అంతరించిపోయింది. యిక మిగిలిందల్లా, ఆచార—నియమాలూ—కుసంస్కారాలూ—వాటివలన వచ్చేవి వృధాగా తెచ్చుకునే వివాదాలు."

రమేశుడు హతాశుడై నిట్టూర్పువిడిచి "పెద్దమ్మా! యిందుకు ప్రతీకారం ఏమీ లేదా?" అని అడిగాడు.

"ఎందుకు లేదు నాయనా! అందుకు జ్ఞానంతోనే ప్రతీకారం చేయాలి. నువ్వు అడుగుపెట్టిన మార్గమే దానికి సుమార్గం. అందువల్లనే, నీవు జన్మభూమిని వదిలిపెట్టి వెళ్ళవద్దని మాటి మాటికీ చెపుతున్నాను."

అందుకు రమేశు ఏదో చెప్పబోతూంటే విశ్వేశ్వరి, అతన్ని మధ్యలో ఆపి—"ముసల్మానుల్లోనే ఎక్కువగా అజ్ఞానం వుంటుందని నువ్వనబోతున్నావు. వున్నది. కానీ వాళ్ళ సజీవమైన ధర్మమే వాళ్ళ నన్నివిధాలా రక్షిస్తూంది. రమేశ్! ఒక సంగతి చెపుతున్నాను. పీరుపురంలో నువ్వు వినే వుంటావు. అక్కడ జాఫర్ అనే ఓ ధనికున్ని అందరూ కలిసి జాతిలోంచి దూరంచేశారు. ఎందుకంటే అతను తన విధవ అయిన సవితి తల్లికి అన్నం పెట్టలేదట. కాని యిక్కడ మన గోవిందగంగూళీ తన వదినెను చచ్చేట్లుకొట్టి వెళ్ళగొట్టాడు. కాని సంఘంలోంచి దూరం చేయకపోవడ మటుంచి—ఆయన యిప్పుడు సంఘంలో పెద్దమనిషిగా వ్యవహరిస్తున్నాడు. మనలో యిటువంటి అప

రాధాలన్నీ, కేవలం వ్యక్తిగత పాపపుణ్యాలని అంటారు. యిటువంటివాటికి శిక్ష వేయాలంటే ఆ భగవంతుడే వేయాలి. లేకుంటేలేదు. అయినా మనపల్లె సమాజం వాళ్ళకు విరుద్ధంగా ప్రభూక్షేపంకూడా చేయలేదు."

యీ క్రొత్తసంగతి విని, రమేశు ఆశ్చర్యపోయాడు. పైగా యిది నిజమని నమ్మడానికి సందేహం కలిగింది. విశ్వేశ్వరి ఆయన మనసులో భావం కనిపెట్టి—"నాయనా! ఫలిమే వుపాయమని పొరపడవద్దు. ఏ కారణంతో నీమనసులోని సందేహం తొలిగిపోలేదో—గొప్పజాతి—నీచజాతి అని పోట్లాడు కోవడం ఉన్నతికి లక్ష్యం కావచ్చు. కాని కారణంమాత్రం అది కాదు. అన్నిటి కంటే ముందు అదిబా గవందే పనిజరగదని, దానికోసం ప్రయత్నించావంటే రెండు విధాలుగా చెడుగు కలుగుతుంది. నా మాట యధార్ధమో—కాదో—చూడాలనుకుంటే, పట్టణానికి దగ్గర్లోవున్న రెండు మూడు గ్రామాల్లో తిరిగిరా! ఆ తరువాత మన కుంవాపురాన్ని చూచు, నీ అంత నీకే తెలుస్తుంది—" అని చెప్పింది.

కలకత్తాకు దగ్గరలోవున్న ఒకటి రెండు గ్రామాలతో రమేశుకు పరిచయముంవుంది. ఆ గ్రామాలను గుర్తుకు తెచ్చుకోగానే, అతని కళ్ళముందునుంచి ఏదో నల్లనితెర తొలిగిపోయినట్లనిపించింది. ఆయన గంభీరాశ్చర్యాదులతో విశ్వేశ్వరి ముఖంలోకి చూస్తున్నాడు. కాని ఆమె అతనివేపు చూడకుండానే తన ధోరణిలో తాను చెప్పుకు పోతూవుంది.—"నాయనా! అందుకే మాటి మాటికీ జన్మభూమిని వదిలి వెళ్ళవద్దని చెపుతున్నాను.

రాధాలన్నీ, కేవలం వ్యక్తిగత పాపపుణ్యాలని అంటారు. యిటువంటివాటికి శిక్ష వేయాలంటే ఆ భగవంతుడే వేయాలి. లేకుంటేలేదు. అయినా మనపల్లె సమాజం వాళ్ళకు విరుద్ధంగా భ్రూక్షేపంకూడా చేయలేదు."

యీ కొత్తసంగతి విని, రమేశు ఆశ్చర్యపోయాడు. పైగా యిది నిజమని నమ్మడానికి సందేహం కలిగింది. విశ్వేశ్వరి ఆయన మనసులో భావం కనిపెట్టి—"నాయనా! ఫలమే వుపాయమని పొరపడవద్దు. ఏ కారణంతో నీమనసులోని సందేహం తొలగిపోలేదో—గొప్పజాతి—నీచజాతి అని పోట్లాడు కోవడం ఉన్నతికి లక్ష్యం కావచ్చు. కాని కారణంమాత్రం అది కాదు. అన్నిటి కంటే ముందు అదిబాగవందే పనిజరగదని, దానికోసం ప్రయత్నించావంటే రెండు విధాలుగా చెడుగు కలుగు తుంది. నా మాట యథార్థమో—కాదో—చూడాలను కుంటే, పట్టణానికి దగ్గర్లోవున్న రెండు మూడు గ్రామాల్లో తిరిగిరా! ఆ తరువాత మన కుంవాపురాన్ని తూచు, నీ అంత నీకే తెలుస్తుంది—" అని చెప్పింది.

కలకత్తాకు దగ్గరలోవున్న ఒకటి రెండు గ్రామాలతో రమేశుకు పరిచయముంవుంది. ఆ గ్రామాలను గుర్తుకు తెచ్చుకోగానే, అతని కళ్ళముందునుంచి ఏదో నల్లనితెర తొలగిపోయినట్లని పించింది. ఆయన గంభీరాశ్చర్యాదులతో విశ్వేశ్వరి ముఖంలోకి చూస్తున్నాడు. కాని ఆమె అతనివేపు చూడకుండానే తన ధోరణిలో తాను చెప్పుకు పోతూవుంది.—"నాయనా! అందుకే మాటి మాటికీ జన్మభూమిని వదిలి వెళ్ళవద్దని చెపుతున్నాను.

తూంది. అతని గదిలోని తూర్పువేపు కిటికీ తెరిచేవుంది. వాని కెదురుగా నిలుచుని. స్తబ్ధంగా ఆకాశంవేపు చూస్తున్నాడు. హఠాత్తుగా ఎవరో పిల్లవాడి పిలుపువిని వెనక్కి తిరిగి చూసే సరికి రమ తమ్ముడు యతీంద్రుడు బయట నిలుచుని— "చిన్నన్నయ్యా! చిన్నన్నయ్యా—" అని పిలుస్తున్నాడు.

రమేశు దగ్గరకు వెళ్ళి అతని చేయిపట్టుకుని—"ఎవర్ని పిలుస్తున్నావు యతీన్—?" అని అడిగాడు.

"మిమ్మల్నే—"

"నన్నా: నన్ను చిన్నన్నయ్య అని పిలవమని ఎవరు చెప్పారు నీకు—?"

"అక్కయ్య—"

"అక్క? నాతో ఏమని చెప్పిరమ్మని పంపింది?"

"ఏమీ చెప్పమనలా! నీతో చిన్నన్నయ్యగారింటికి తీసుకుని వెళ్ళరా అని అన్నది, అదుగో అక్కడ నిలుచుంది—"అతను గుమ్మంవేపు చూపించాడు.

రమేశుడు విస్మయంతో స్తబ్ధుడై గుమ్మంవేపు చూశాడు. ఆమె స్తంబంచాటున నిలుచునివుంది. ఆయన దగ్గరకు వచ్చాడు. వినయపూర్వకంగా—"యివాళ ఎంతో అదృష్టవంతుణ్ణి! నాకు కబురెందుకు చేయలేక పోయారు? మీ రెందు కింత దూరం వచ్చారు? రా! లోపలికిరా!" అన్నాడు.

మొదట రమ అటూ యిటూ తచ్చాడింది. ఆ తరువాత యతీంద్రుని చేయిపట్టుకుని రమేశుని వెనకాల వచ్చి ఆయన గదిగుమ్మం దగ్గర కూచుంది—"ఇవాళ మీ యింటికి ఒక వస్తువు యాచన చేయడానికి వచ్చాను. యిస్తారా. చెప్పండి?"

తూంది. అతని గదిలోని తూర్పువేపు కిటికీ తెరిచేవుంది. దాని కెదురుగా నిలుచుని. స్తబ్ధంగా ఆకాశంవేపు చూస్తున్నాడు. హఠాత్తుగా ఎవరో పిల్లవాడి పిలుపువిని వెనక్కి తిరిగి చూసే సరికి రమ తమ్ముడు యతీంద్రుడు బయట నిలుచుని—"చిన్నన్నయ్యా! చిన్నన్నయ్యా—" అని పిలుస్తున్నాడు.

రమేశు దగ్గరకు వెళ్ళి అతని చేయిపట్టుకుని—"ఎవర్ని పిలుస్తున్నావు యతీన్—?" అని అడిగాడు.

"మిమ్మల్నే—"

"నన్నా: నన్ను చిన్నన్నయ్యా అని పిలవమని ఎవరు చెప్పారు నీకు—?"

"అక్కయ్య—"

"అక్కా? నాతో ఏమని చెప్పిరమ్మని పంపింది?"

"ఏమీ చెప్పమనలా! నీతో చిన్నన్నయ్యగారింటికి తీసుకుని వెళ్ళరా అని అన్నది, అదుగో అక్కడ నిలుచుంది—"అతను గుమ్మంవేపు చూపించాడు.

రమేశుడు విస్మయంతో స్తబ్ధుడై గుమ్మంవేపు చూశాడు. ఆమె స్తంబంచాటున నిలుచునివుంది. ఆయన దగ్గరకు వచ్చాడు: వినయపూర్వకంగా—"యివాళ ఎంతో అదృష్టవంతుణ్ణి! నాకు కబురెందుకు చేయలేక పోయారు? మీ రెందు కింత దూరం వచ్చారు? రా! లోపలికిరా!" అన్నాడు.

మొదట రమ అటూ యిటూ తచ్చాడింది. ఆ తరువాత యతీంద్రుని చేయిపట్టుకుని రమేశుని వెనకాల వచ్చి ఆయన గదిగుమ్మం దగ్గర కూచుంది—"ఇవాళ మీ యింటికి ఒక వస్తువుని భిక్షాటన చేయడానికే వచ్చాను. యిస్తారా. చెప్పండి?"

"కాని, విని సిగ్గుపడవద్దు. కోపమూవద్దు. ఏదో చాలాకాలం క్రిందటి కథ వింటున్నాననుకో—" అని రమేశు అన్నాడు.

ఆసంగతి చెప్పకుండా మధ్యలోనే అడ్డుకుందా మనుకుంది. రమ. కాని వంచిన తల యెత్తలేకపోయింది.

రమేశుడు శాంతంగా-కోమలంగా- నిర్లిప్తంగా చెప్పడం మొదలుపెట్టాడు—"రమా! నేను నిన్ను ప్రేమిస్తున్నాను. అలా యెవరూ యెవరిని ప్రేమించి వుండరని యివాళ అనుకుంటు న్నాను. చిన్నతనంలో మా అమ్మగారి నోటంట మనకు పెళ్ళవుతుందని వినేవాణ్ణి. ఆ తరువాత నా ఆశలన్నీ అడుగంటిన రోజు ఏడ్చాను. అదిప్పటికి గుర్తు కొస్తూంది—"

ఈమాటలన్నీ కరగించిన సీసంలా ఆమె చెవిలోపడి దహించ సాగినయ్! అపరిచితమైన, అనుభూతిలోని అసహ్యామైన వేదన, ఆ గుండెలో ఒక మూలనుంచి, యింకొక మూలకు కోసి, ముక్కలు ముక్కలు చేసినట్లయింది. కాని అడ్డుకునేందుకు ఏమీ వుపాయం కనుపించలేదు. అందువల్ల ఆమె నిరూపాయమైన రాతి ప్రతిమలాకూచుని, రమేశు విషాక్త మధుర విషయాలు ఒక్కొక్కటే వింటూవుండి—"నీకీ కథంతా చెప్పడం అన్యాయమని నువ్వాలోచిస్తున్నావు. నా మనసులో మొదట నాకూ అదే సందేహంవుంది. అందుకనే ఆనాడు తారకేశ్వరంలో ఒకనాటి ఆదరసత్కారాలవల్ల నా జీవితా న్నంతా మార్చివేసినప్పుడూకూడా ఏమీ చెప్పలేకపోయాను. అప్పుడు మెదలకుండా వూరుకోవడం నా విషయంలో అసహజంగా తోచింది—"

రమ సహించలేకపోయింది—"అందుకనే యివాళ గుమ్మంలో వుండగానే నన్ను అవమానిస్తున్నారన్నమాట." అని అడిగింది.

"కాని, విని సిగ్గుపడవద్దు. కోపమూవద్దు. ఏదో చాలాకాలం క్రిందటి కథ వింటున్నాననుకో—" అని రమేశు అన్నాడు.

ఆసంగతి చెప్పకుండా మధ్యలోనే అడ్డుకుందా మనుకుంది, రమ. కాని వంచిన తల యెత్తలేకపోయింది.

రమేశుడు శాంతంగా-కోమలంగా- నిర్లిప్తంగా చెప్పడం మొదలుపెట్టాడు—"రమా! నేను నిన్ను ప్రేమిస్తున్నాను. అలా యెవరూ యెవరిని ప్రేమించి వుండరని యివాళ అనుకుంటున్నాను. చిన్నతనంలో మా అమ్మగారి నోటంట మనకు పెళ్ళవుతుందని వినేవాణ్ణి. ఆ తరువాత నా ఆశలన్నీ అడుగంటిన రోజు ఏడ్చాను. అదిప్పటికి గుర్తుకొస్తూంది—"

ఈ మాటలన్నీ కరగించిన సీసంలా ఆమె చెవిలోపడి దహించ సాగినయ్! అపరిచితమైన, అనుభూతిలోని అసహ్యమైన వేదన, ఆ గుండెలో ఒక మూలనుంచి, యింకొక మూలకు కోసి, ముక్కలు ముక్కలు చేసినట్లయింది. కాని అడ్డుకునేందుకు ఏమీ వుపాయం కనుపించలేదు. అందువల్ల ఆమె నిరూపాయమైన రాతి ప్రతిమలాకూచుని, రమేశు విషాక్త మధుర విషయాలు ఒక్కొక్కటే వింటూవుండి—"నీకీ కథంతా చెప్పడం అన్యాయమని నువ్వాలోచిస్తున్నావు. నా మనసులో మొదట నాకూ అదే సందేహంవుంది. అందుకనే ఆనాడు తారకేశ్వరంలో ఒకనాటి ఆదరసత్కారాలవల్ల నా జీవితాన్నంతా మార్చివేసినప్పుడూకూడా ఏమీ చెప్పలేకపోయాను. అప్పుడు మెదలకుండా వూరుకోవడం నా విషయంలో అసహజంగా తోచింది—"

రమ సహించలేకపోయింది—"అందుకనే యివాళ గుమ్మంలో వుండగానే నన్ను అవమానిస్తున్నారన్న మాట." అని అడిగింది,

రమ పెదిమలు వణకినయ్! అనాడు, తనే, పోలీసుస్టేషనులో రిపోర్టుయిచ్చింది. ఆ తరువాత ఆమె చటుక్కున యేడుస్తూ-'నేను వెళ్ళను' అంది.

కొంచెంసేపు రమేశు ఆశ్చర్యంగావుండి—"కాదుకాదు రమా! ఇక నువ్విక్కడ వుండగూడదు. తొందరగా ఇక్కడినుంచివెళ్లు" అని రమ తమ్ముని చేయిపట్టుకుని, ఒకవిధంగా బలవంతంగానే, యిద్దర్నీ దొడ్డిదారిన బయటికిపంపి తలుపు మూసాడు.

13

రెండుమాసాలు కావచ్చింది. కొంతమంది దొంగలతోపాటు భజువానుకూడా 'లాకప్' లో వుంచారు. అనాడు సోదాలో రమేశుని యింట్లో ఏమీ అనుమానించతగ్గ వస్తువులు దొరకలేదు. భైరవాచారి సాక్ష్యంచెప్పాడు. ఆరోజురాత్రి తనకూతురుకు వరుని చూచేందుకు వెడుతూ భజువానుకూడా తీసుకునివెళ్ళానని చెప్పాడు. అయినప్పటికీ భజువాను జామీనుమీదకూడా వదల్లేదు. వేణీవచ్చి—రమా! ఎంతోదూరం ఆలోచించి పనిచేయాలి. లేకుంటే శత్రువు మనకు లొంగడు. 'ఆరోజున తన యజమాని చెప్పినప్రకారం కర్రతీసుకుని చేపలు లాక్కుని వెళ్ళేందుకు భజువ మాయింటికి వచ్చాడ'ని నువ్వు రిపోర్టు యివ్వకుంటే, ఆ వెధవను పట్టుకోవడం సాధ్యమయేదా? చూడమ్మాయీ! ఇంకా నాలుగైదుమాటలు కల్పించి అందులో రమేశు పేరుకూడా జోడించినట్లయితే తమాషా చూచేవాణ్ణి! కాని, నువ్వప్పుడు నా మాట వినలేదు'' అన్నాడు.

రమ పెదిమలు వణకినయ్! ఆనాడు, తనే, పోలీసుస్టేషనులో రిపోర్టుయిచ్చింది. ఆ తరువాత ఆమె చటుక్కున యేడుస్తూ–'నేను వెళ్ళను' అంది.

కొంచెంసేపు రమేశు ఆశ్చర్యంగావుండి—"కాదుకాదు రమా! ఇక నువ్విక్కడ వుండగూడదు. తొందరగా ఇక్కడినుంచివెళ్లు" అని రమ తమ్ముని చేయిపట్టుకుని, ఒకవిధంగా బలవంతంగానే, యిద్దర్నీ దొడ్డిదారిన బయటికిపంపి తలుపు మూసాడు.

13

రెండుమాసాలు కావచ్చింది. కొంతమంది దొంగలతోపాటు భజువానుకూడా 'లాకప్' లో వుంచారు. ఆనాడు సోదాలో రమేశుని యింట్లో ఏమీ అనుమానించతగ్గ వస్తువులు దొరకలేదు. భైరవాచారి సాక్ష్యంచెప్పాడు. ఆరోజురాత్రి తనకూతురుకు వరుని చూచేందుకు వెడుతూ భజువానుకూడా తీసుకుని వెళ్ళానని చెప్పాడు. అయినప్పటికీ భజువాను జామీనుమీదకూడా వదల్లేదు. వేణీవచ్చి—రమా! ఎంతోదూరం ఆలోచించి పనిచేయాలి. లేకుంటే శత్రువు మనకు లొంగడు. 'ఆరోజున తన యజమాని చెప్పినప్రకారం కర్రతీసుకుని చేపలు లాక్కుని వెళ్ళేందుకు భజువ మాయింటికి వచ్చాడ'ని నువ్వు రిపోర్టు యివ్వకుంటే, ఆ వెధవను పట్టుకోవడం సాధ్యమయేదా? చూడమ్మాయీ! ఇంకా నాలుగైదుమాటలు కల్పించి అందులో రమేశు పేరుకూడా జోడించినట్లయితే తమాషా చూచేవాణ్ణి! కాని, నువ్వప్పుడు నా మాట వినలేదు'' అన్నాడు.

వాళ్ళ నోటంట 'చినబాబు' గారి పేరే వినపడుతూంది. వా డొక్కడే మనిషయినట్టూ మనిద్దరం ఏమీ కానట్టూను. కాని యిది ఎక్కువకాలం సాగదు. వాణ్ణి పోలీసుల దృష్టిలో వుండేట్లు చేశాంగా? ఈ దెబ్బతో వాడి అంతు తేలిపోతుంది."

ఈ సంవాదముతో వేణీ తాను ఆశించిన ఉత్సాహం, ప్రోత్సాహం, రాకపోయేసరికి అతని మనసులో ఆశ్చర్యం చెందాడు. పైగా రమ ముఖం ఒక్కసారిగా మారిపోవడం గమ నించాడు. రమ అడిగింది—"అయితే నేనే రిపోర్టు చేశానని రమేశుకు తెలిసిందా?"

"ఆసంగతి సరిగ్గా తెలవదు. కాని చివరకు ఎలాగైనా యీ సంగతి తెలుసుకుంటాడు. భజువా కేసులో అన్నీ బయటపడ తాయ్!"

అందుకు రమ ఏమీ జవాబుచెప్పలేదు. ఆమె మెదలకుండా మనసులోనే, ఏదో పెద్ద అఘాతాన్ని సంబాళించుకుంటూన్న ట్లుంది. ఈ సంగతి ఎప్పుడో ఒకప్పుడు బయటపడితీరుతుంది. రమేశున్ని కష్టాల్లో యిరికించేందుకు తనే అగ్రతాంబూలం పుచ్చుకున్నదని తెలియకుండా వుండదు. ఒక్కక్షణం ఆగి అడిగింది. "ఏం పెద్దన్నయ్యా! ఇప్పుడు ఆయనసంగతే ప్రతి వాళ్ళనోటినుంచి వస్తుందికదూ?" అని.

"ఒక్క మనవూళ్ళోనేకాదు. పైగా చుట్టుప్రక్కల నాలు గైదు వూళ్ళలో కూడా స్కూళ్లు పెట్టించాలనీ, రోడ్లు వేయించా లనీ ప్రయత్నిస్తున్నాడట. ప్రస్తుతం యీ అలగాజాతి వాళ్ళంతా దొరలదేశాల్లో వూరికి ఒకటీ రెండు స్కూళ్ళు వున్నాయనీ.

వాళ్ళ నోటంట 'చినబాబు' గారి పేరే వినపడుతూంది. వా డొక్కడే మనిషయినట్టూ మనిద్దరం ఏమీ కానట్టూను. కాని యిది ఎక్కువకాలం సాగదు. వాణ్ణి పోలీసుల దృష్టిలో వుండేట్లు చేశాంగా? ఈ దెబ్బతో వాడి అంతు తేలిపోతుంది."

ఈ సంవాదముతో వేణీ తాను ఆశించిన ఉత్సాహం, ప్రోత్సాహం, రాకపోయేసరికి అతని మనసులో ఆశ్చర్యం చెందాడు. పైగా రమ ముఖం ఒక్కసారిగా మారిపోవడం గమ నించాడు. రమ అడిగింది—"అయితే నేనే రిపోర్టు చేశానని రమేశుకు తెలిసిందా?"

"ఆసంగతి సరిగ్గా తెలవదు. కాని చివరకు ఎలాగైనా యీ సంగతి తెలుసుకుంటాడు. ఖజువా కేసులో అన్నీ బయటపడ తాయ్!"

అందుకు రమ ఏమీ జవాబుచెప్పలేదు. ఆమె మెదలకుండా మనసులోనే, ఏదో పెద్ద అఘాతాన్ని సంబాళించుకుంటూన్న ట్లుంది. ఈ సంగతి ఎప్పుడో ఒకప్పుడు బయటపడితీరుతుంది. రమేశున్ని కష్టాల్లో యిరికించేందుకు తనే అగ్రతాంబూలం పుచ్చుకున్నదని తెలియకుండా వుండదు. ఒక్కక్షణం ఆగి అడిగింది. "ఏం పెద్దన్నయ్యా! ఇప్పుడు ఆయనసంగతే ప్రతి వాళ్ళనోటినుంచి వస్తుందికదూ?" అని.

"ఒక్క మనవూళ్ళోనేకాదు. పైగా చుట్టుప్రక్కల నాలు గైదు వూళ్ళలో కూడా స్కూళ్లు పెట్టించాలనీ, రోడ్లు వేయించా లనీ ప్రయత్నిస్తున్నాడట. ప్రస్తుతం యీ అలగాజాతి వాళ్ళంతా- దొరలదేశాల్లో వూరికి ఒకటీ రెండు స్కూళ్ళు వున్నాయనీ.

రమ యేమీ మాట్లాడలేదు. తన ప్రతిజ్ఞా, తనభవిష్యద్వాణి, యిలాగా అక్షర అక్షరం నిజమైనవని తెలుసుకుని కూడా ఆ స్త్రీ ముఖం అహంకారంతో ఉజ్వలమవలేదు. పైగా నల్లబడి పోయింది.అటువంటి ఆమె మనసులోని భావం గ్రహించేందుకు వేణీకి శక్తి లేకపోయింది, శక్తి లేకపోవచ్చు. కాని ఎంతటి వాళ్ళకైనా యిట్టే తెలిసిపోయేంత యిదిగా నల్లబడిం దాముఖం. వేణీ కూడా ఆ ముఖాన్ని చూశాడు. ఇందుకు ఆయన మనసు లోనే ఆశ్చర్యం చెందాడు. ఆయన మెదలకుండా వంటింటిలోకి వెళ్ళి చిన్నమ్మతో రెండుమూడు సంగతులు మాట్లాడి, యింటికి వెళ్ళిపోతున్నాడు. ఆయన్ని రమ సైగచేసి, పిలిచి—"పెద్ద న్నయ్యా! అయితే చిన్నన్నయ్య జెయిలుకువెడితే అది మనకు కళంకము కాదా?" అని అడిగింది.

వేణీ యింకా ఆశ్చర్యపడుతూ—"ఎందుకని?" అని అడి గాడు.

"ఆయన మనకు ఆత్మీయుడు! అటువంటివాణ్ణి మనమే రక్షించకపోతే లోకమంతా మనల్ని 'ఛీ-ఛీ' అని అనదా?"

"ఎవరికర్మ వాళ్ళు అనుభవిస్తారు. అందులో మనకే ముంది?"

రమ తిరిగి అదేవిధంగా కోమలంగా అన్నది—"నిజానికి ఆయన దొంగతనం చేసేవాడు కాడు. వాళ్ళ వెంటనైనా తిరిగే వాడు కాడు. పైగా యితరుల మేలుకోసం తన సర్వస్వము ఖర్చుపెడుతున్నాడు. అంతేగాదు. మనంకూడా వూరిలో తలెత్తు కుని తిరగ్గలమా?"

రమ యేమీ మాట్లాడలేదు. తన ప్రతిజ్ఞా, తనభవిష్యద్వాణి, యిలాగా అక్షర అక్షరం నిజమైనవని తెలుసుకుని కూడా ఆ స్త్రీ ముఖం అహంకారంతో ఉజ్వలమవలేదు. పైగా నల్లబడి పోయింది.అటువంటి ఆమె మనసులోని భావం గ్రహించేందుకు వేణీకి శక్తి లేకపోయింది, శక్తి లేకపోవచ్చు. కాని ఎంతటి వాళ్ళకైనా యిట్టే తెలిసిపోయేంత యిదిగా నల్లబడిం దాముఖం. వేణీ కూడా ఆ ముఖాన్ని చూశాడు. ఇందుకు ఆయన మనసు లోనే ఆశ్చర్యం చెందాడు. ఆయన మెదలకుండా వంటింటిలోకి వెళ్ళి చిన్నమ్మతో రెండుమూడు సంగతులు మాట్లాడి, యింటికి వెళ్ళిపోతున్నాడు. ఆయన్ని రమ సైగచేసి, పిలిచి—"పెద్ద న్నయ్యా! అయితే చిన్నన్నయ్య జెయిలుకువెడితే అది మనకు కళంకము కాదా?" అని అడిగింది.

వేణీ యింకా ఆశ్చర్యపడుతూ—"ఎందుకని?" అని అడి గాడు.

"ఆయన మనకు ఆత్మీయుడు! అటువంటివాణ్ణి మనమే రక్షించకపోతే లోకమంతా మనల్ని 'ఛీ-ఛీ' అని అనదా?"

"ఎవరికర్మ వాళ్ళు అనుభవిస్తారు. అందులో మనకే ముంది?"

రమ తిరిగి అదేవిధంగా కోమలంగా అన్నది—"నిజానికి ఆయన దొంగతనం చేసేవాడు కాడు. వాళ్ళ వెంటనైనా తిరిగే వాడు కాడు. పైగా యితరుల మేలుకోసం తన సర్వస్వము ఖర్చుపెడుతున్నాడు. అంతేగాడు. మనంకూడా వూరిలో తలెత్తు కుని తిరగ్గలమా?"

స్మరించి ఆమె మనసులో అతనిమీద కొంచెంగా విముఖత ఏర్పడింది. వేణీ ఏదో అంటూ అక్కడనుంచి వెళ్ళిపోయాడు. రమ కొంచెసేపు అలాగే నిలుచుని, ఆ తరువాత తనగదిలోకి వెళ్ళి కూచుంది. ఆనాడు ఏకాదశి. తిండి తిప్పల బెడద యేమీ లేదు. ఆ సంగతి గుర్తుకొచ్చేసరికి ఆమెకు కొంత శాంతి కలిగింది.

14

వర్షాకాలం గడచిపోయింది. రాబోతూన్న దుర్గానవరాత్రుల ఆనందం-మలేరియా భయం-బెంగాలీ గ్రామ్య జనులకు ఆకాశం లోనూ, వాయువులోనూ, చూపుల్లోనూ, తొంగి చూస్తున్నాయ్! రమేశునకు కూడా జ్వరం తగులుతూవుంది. గత సంవత్సరం ఈ రాక్షసి బారినుంచి తప్పించుకున్నాడు. కాని ఈసంవత్సరం తప్పించుకోలేకపోయాడు. మూడు రోజులనుంచీ జ్వరపడి, యివాళ ఉదయంలేచి—ఓ పెద్దమోతాదు క్వైనైన్ మ్రింగి, కిటికీ దగ్గరకు వచ్చి ఎండవేపు చూస్తూ ఆలోచనల్లోపడ్డాడు. "ఈగ్రామములోని అనవసరమైన మురికిగుంటలూ-వ్యర్థంగావున్న పొదలు-తుప్పలూ-మొదలైనవన్నీ, లేకుండా చేయడానికి-ఆగ్రామీణులకు నచ్చచెప్పగలనా-లేదా? ఈ మూడురోజుల జ్వరానుభవంలో-దీనికి ప్రతిక్రియ ఏదో ఒకటి చేయా"లని నిశ్చయించుకున్నాడు. తను జ్ఞానవంతుడైవుండి కూడా, మెదలకుండా వూరుకుంటే—చాలామంధి నెలల్లూ-సంవత్సరాల్లూ ఈ మలేరియా బాధను అను

స్మరించి ఆమె మనసులో అతనిమీద కొంచెంగా విముఖత ఏర్పడింది. వేణీ ఏదో అంటూ అక్కడనుంచి వెళ్ళిపోయాడు. రమ కొంచెసేపు అలాగే నిలుచుని, ఆ తరువాత తనగదిలోకి వెళ్ళి కూచుంది. ఆనాడు ఏకాదశి. తిండి తిప్పల బెడద యేమీ లేదు. ఆ సంగతి గుర్తు కొచ్చేసరికి ఆమెకు కొంత శాంతి కలిగింది.

14

వర్షాకాలం గడచిపోయింది. రాబోతూన్న దుర్గానవరాత్రుల ఆనందం-మలేరియా భయం-బెంగాళీ గ్రామ్య జనులకు ఆకాశం లోనూ, వాయువులోనూ, చూపుల్లోనూ, తొంగి చూస్తున్నాయ్! రమేశునకు కూడా జ్వరం తగులుతూవుంది. గత సంవత్సరం ఈ రాక్షసి బారినుంచి తప్పించుకున్నాడు. కాని ఈసంవత్సరం తప్పించుకోలేకపోయాడు. మూడు రోజులనుంచీ జ్వరపడి, యివాళ ఉదయంలేచి—ఓ పెద్దమోతాదు క్వినైన్ మ్రింగి, కిటికీ దగ్గరకు వచ్చి ఎండవేపు చూస్తూ ఆలోచనల్లోపడ్డాడు. "ఈగ్రామములోని అనవసరమైన మురికిగుంటలూ-వ్యర్థంగావున్న పొదలు-తుప్పలూ-మొదలైనవన్నీ, లేకుండా చేయడానికి-ఆగ్రామీణులకు నచ్చచెప్పగలనా-లేదా? ఈ మూడురోజుల జ్వరానుభవంలో-దీనికి ప్రతిక్రియ ఏదో ఒకటి చేయా"లని నిశ్చయించుకున్నాడు. తను జ్ఞానవంతుడై వుండి కూడా, మెదలకుండా వూరుకుంటే—చాలామంది నెలలూ-సంవత్సరాలూ ఈ మలేరియా బాధను అను

యింతలో ఎవరో ఏడుస్తున్న గొంతుతో పిలిచారు—"బాబు గారూ ?"

రమేశు త్రుళ్ళిపడ్డాడు. ఆయన తలతిప్పి చూసేసరికి భైరవాచారి నేలమీద పడిదొర్లుతూ ఏడుస్తున్నాడు. అతని ఏడెనిమిదేండ్ల కూతురుకూడా అతని వెంటవుంది. ఆమెకూడా తండ్రితో కలిసి యేడుస్తూ—బొబ్బలుపెట్టింది. చూస్తూ చూస్తుండగానే యింటిల్లాదులు అక్కడ పోగయ్ గుమిగూడారు. రమేశుని కిదేమీ అర్థంకాక, హతబుద్ధిలా అయాడు. యితనివాళ్ళ ఎవరైనా చచ్చిపోయారేమో, లేక ఏమి నష్టం కలిగిందో—యే విధంగా యితన్ని వూరడించాలో, రమేశునికి అర్థంకాలేదు. గోపాల్‌సర్కారుకూడా తన పని వదిలిపెట్టి పరుగెత్తుకుని వచ్చాడు. ఆయన దగ్గరకువచ్చి, భైరవుని చేయిపట్టుకున్నాడో లేదో—భైరవుడు ఆయన్ని గట్టిగా కౌగలించుకుని బావురుమని యేడ్చాడు. ఈ మనిషి కొంచానికే ఆడదానిలా యేడుస్తాడని, రమేశుకు గుర్తువచ్చింది. గోపాలసర్కార్ ఎంతో వూరడించాక ఆతను కొంచెం శాంతించి—యీ మహాశోకానికి కారణం చెప్పగానే—రమేశు స్థబ్దుడైపోయాడు. భైరవుని సాక్ష్యంవల్ల, భజువ విడిపింపబడ్డాడు. వాడిని పోలీసుల దృష్టినుంచి మళ్ళించడానికి వాడిదేశం పంపించాడు. ముద్దాయి ఎలాగో తప్పించుకున్నాడు కాని సాక్షిమాత్రం చిక్కులో పడిపోయాడు. ఎప్పుడైతే భైరవునికి సంగతి సందర్భాలు చూచాయగా తెలిసాయో, ఆ వెంటనే అతను కోర్టుకు పరుగుతీసి, అసలు విషయం తెలుసుకున్నాడు. అయిదారు రోజులక్రితం రాధానగరంలో వుండే వేణీ ఘోషాల

యింతలో ఎవరో ఏడుస్తున్న గొంతుతో పిలిచారు—"బాబు గారూ?"

రమేశు త్రుళ్ళిపడ్డాడు. ఆయన తలతిప్పి చూసేసరికి భైరవాచారి నేలమీద పడిదొర్లుతూ ఏడుస్తున్నాడు. అతని ఏడెనిమిదేండ్ల కూతురుకూడా అతని వెంటవుంది. ఆమెకూడా తండ్రితో కలిసి యేడుస్తూ—బొబ్బలుపెట్టింది. చూస్తూ చూస్తుండగానే యింటిల్లాదులు అక్కడ పోగయ్ గుమిగూడారు. రమేశుని కిదేమీ అర్థంకాక, హతబుద్ధిలా అయాడు. యితనివాళ్ళ ఎవరైనా చచ్చిపోయారేమో, లేక ఏమి నష్టం కలిగిందో—యే విధంగా యితన్ని వూరడించాలో, రమేశునికి అర్థంకాలేదు. గోపాల్‌సర్కారుకూడా తన పని వదిలిపెట్టి పరుగెత్తుకుని వచ్చాడు. ఆయన దగ్గరకువచ్చి, భైరవుని చేయిపట్టుకున్నాడో లేదో—భైరవుడు ఆయన్ని గట్టిగా కౌగలించుకుని బావురుమని యేడ్చాడు. ఈ మనిషి కొంచానికే ఆడదానిలా యేడుస్తాడని, రమేశుకు గుర్తువచ్చింది. గోపాలసర్కార్ ఎంతో వూరడించాక అతను కొంచెం శాంతించి—యీ మహాశోకానికి కారణం చెప్పగానే—రమేశు స్థబ్ధుడైపోయాడు. భైరవుని సాక్ష్యంవల్ల, భజువ విడిపింపబడ్డాడు. వాడిని పోలీసుల దృష్టినుంచి మళ్ళించడానికి వాడిదేశం పంపించాడు. ముద్దాయి ఎలాగో తప్పించుకున్నాడు కాని సాక్షిమాత్రం చిక్కులో పడిపోయాడు. ఎప్పుడైతే భైరవునికి సంగతి సందర్భాలు చూచాయగా తెలిసాయో, ఆ వెంటనే అతను కోర్టుకు పరుగుతీసి, అసలు విషయం తెలుసుకున్నాడు. అఖుధారు రోజుల్ల క్రితం రాధానగరంలో వుండే వేణీ ఛినమాము

ఒక్కమనిషికూడా నోరెత్తి ఈ అన్యాయాన్ని ప్రతిఘటించినవా ళ్ళేవరూలేరు. కారణం వాళ్ల యితర్ల విషయం అంతగా పట్టించు కోరు. ఇష్టపడరుకూడా! అయినప్పటికీ, దరిద్రులైన ప్రజలమీద నిస్సంకోచభావంతో అత్యాచారంచేసే సాహసం వీళ్ళకు యెక్కడ నుంచి ప్రాప్తిస్తుందో-ఏవిధంగా దేశవ్యాప్తంగా వున్న న్యాయ శాస్త్రాన్ని, ధర్మశాస్త్రాన్ని కూడా వీళ్లకసాయివాడికత్తికి యెలా అప్ప గిస్తారో ఆసంగతి యివాళ రమేశ్ ప్రత్యక్షంగా చూశాడు. ఒకవేపు అర్థబలం-కుటిలబుద్ధి వీళ్ళను రాజశాసనంనుంచి ఏవిధంగా రక్షి స్తుందో-ఆ విధంగానే రెండోవేపునుంచి, మృతసమాజంకూడా వీళ్ళ దుష్కర్మలకు శిక్షయేమీ విధించదు. అందువల్ల వీళ్ళు కొన్నివేల అన్యాయాలుచేసి కూడా-సత్యధర్మవిహీనమైన మృత గ్రామ్య సమాజం యొక్క నెత్తిన కూచుని, తమ యిష్టాను సారంగా నిరుపద్రవంగా విచ్చలవిడిగా, విహారముచేస్తున్నారు. యివాళ పెద్దమ్మ అన్నమాటలు మాటిమాటికి గుర్తుకువస్తున్నయ్! ఆనాడామె మర్మాంతకంగా నవ్వి—"రమేశ్! ఈవెధవ జాతి భేదాలూ-ఎక్కువ తక్కువ వివాదాలు, పొట్లాటలన్నీ అవతల పెట్టునాయనా! కేవలం నువ్వు దీపం వెలిగించు. అదేచాలు. గ్రామస్థులంతా చీకట్లోవుండి అంధులైపోయారు. నాయనా! వాళ్ళను ఒక్కసారి కళ్ళుతెరిచేట్లుచేయ్! అప్పుడుగాని వాళ్ళు యేది తెలుపో- యేది నలుపో. ఏది మంచిదో-ఏది చెడ్డదో తెలుసుకోలేరు. అని ఆమె యింకా అన్నది—"నువ్విక్కడికి రావే? వచ్చావునాయనా! యిక యిక్కడినుంచి వెళ్ళవద్దు. మీ బోటి వాళ్ళంతా యిలా ముఖం చాటు చేశారుకాబట్టే, గ్రామలక్ష్మి

యింతలో ఎవరో ఏడుస్తున్న గొంతుతో పిలిచారు—"బాబుగారూ?"

రమేశు త్రుళ్ళిపడ్డాడు. ఆయన తలతిప్పి చూసేసరికి భైరవాచారి నేలమీద పడిదొర్లుతూ ఏడుస్తున్నాడు. అతని ఏడెనిమిదేండ్ల కూతురుకూడా అతని వెంటవుంది. ఆమెకూడా తండ్రితో కలిసి యేడుస్తూ—బొబ్బలుపెట్టింది. చూస్తూ చూస్తుండగానే యింటిల్లాదులు అక్కడ పోగయి గుమిగూడారు. రమేశునికిదేమీ అర్థంకాక, హతబుద్ధిలా అయాడు. యితనివాళ్ళు ఎవరైనా చచ్చిపోయారేమో, లేక ఏమి నష్టం కలిగిందో—యేవిధంగా యితన్ని వూరడించాలో, రమేశునికి అర్థంకాలేదు. గోపాల్‌సర్కారుకూడా తన పని వదిలిపెట్టి పరుగెత్తుకుని వచ్చాడు. ఆయన దగ్గరకువచ్చి, భైరవుని చేయిపట్టుకున్నాడో లేదో—భైరవుడు ఆయన్ని గట్టిగా కౌగలించుకుని బావురుమని యేడ్చాడు. ఈ మనిషి కొంచానికే ఆడదానిలా యేడుస్తాడని, రమేశుకు గుర్తువచ్చింది. గోపాలసర్కార్ ఎంతో వూరడించాక అతను కొంచెం శాంతించి—యీ మహాశోకానికి కారణం చెప్పగానే—రమేశు స్థబ్ధుడైపోయాడు. భైరవుని సాక్ష్యంవల్ల, భజువ విడిపింపబడ్డాడు. వాడిని పోలీసుల దృష్టినుంచి మళ్ళించడానికి వాడిదేశం పంపించాడు. ముద్దాయి ఎలాగో తప్పించుకున్నాడు కాని సాక్షిమాత్రం చిక్కులో పడిపోయాడు. ఎప్పుడైతే భైరవునికి సంగతి సందర్భాలు చూచాయగా తెలిసాయో, ఆ వెంటనే అతను కోర్టుకు పరుగుతీసి, అసలు విషయం తెలుసుకున్నాడు. అఖుధారు రోజుల క్రితం రాధానగరంలో వుండే వేణీ ఛినమామ

గోపాల్‌సర్కారు చెక్కు తీసుకున్నాడు. కొంచెంసేపటి వరకూ ఆయన భైరవాచారి యిద్దరూ విహ్వాలపడిచూశారు, రమేశు తిరిగి తన అభిప్రాయం స్పష్టంగా చెప్పాడు. ఇప్పుడు తనతో రమేశు పరిహాసం చేయడం లేదని తెలుసుకున్నాడు. అందువల్ల అతను తొందరగా ముందుకువచ్చి రమేశుని పాదాలు గట్టిగా పట్టుకుని—యేడుస్తూ—అరుస్తూ ఆశీర్వదించి—నానా హంగామా చేశాడు. ఒకవేళ అప్పుడు రమేశుని స్థానంలో యింకొక దుర్బలుడు వున్నట్లయితే తనను తాను వదిలించుకోవడం చాలా కష్టమైపోయేది.

ఈ సంగతి గ్రామములో వ్యాపించడానికి అట్టేకాలం పట్ట లేదు. ఇక వేణీ—గోవిందగంగూళి సహజంగా వదలిపెట్టబడరని అందరూ అనుకున్నారు. తన పాతశత్రుత్వాన్ని బలపర్చుకోవడానికే చినబాబుగారు యిలా ఖర్చుపెడుతున్నారని అంతా అనుకున్నారు. కాని దుర్బలుడైన భైరవాచారి ఈ ఘోర అత్యాచార భారాన్ని మోయలేక యితని తలమీద పెట్టాడని, ఆ బరువును నిస్సంకోచంగా మోయడానికి రమేశు వొప్పుకున్నాడని యెవరూ తలచలేదు.

ఈ విధంగా ఒక నెల గడిచింది. మలేరియాకు విరుద్ధంగా మనసులోనే రమేశుడు యుద్ధాన్ని ప్రకటించి—ఆ చుట్టుప్రక్కల గ్రామాలన్నీ చూసి ఎంతో వుత్సాహంతో తిరిగివచ్చాడు. కాని ఆ వుత్సాహంలో రేపే భైరవునికేసు విచారణనికూడా తెలుసుకోలేకపోయాడు. ఇవాళ సాయంకాలం సన్నాయిమేళం వినపడే సరికి ఆయనక్కది గుర్తుకువచ్చింది. ఇవాళ భైరవాచారి దౌహిత్రికి

యింతలో ఎవరో ఏడుస్తున్న గొంతుతో పిలిచారు—" బాబు గారూ ?"

రమేశు త్రుళ్ళిపడ్డాడు. ఆయన తలతిప్పి చూసేసరికి భైరవాచారి నేలమీద పడిదొర్లుతూ ఏడుస్తున్నాడు. అతని ఏడెనిమిదేండ్ల కూతురుకూడా అతని వెంటవుంది. ఆమెకూడా తండ్రితో కలిసి యేడుస్తూ—బొబ్బలుపెట్టింది. చూస్తూ చూస్తుండగానే యింటిల్లాదులు అక్కడ పోగయ్ గుమిగూడారు. రమేశుని కిదేమీ అర్థంకాక, హతబుద్ధిలా అయాడు. యితనివాళ్ళ ఎవరైనా చచ్చిపోయారేమో, లేక ఏమి నష్టం కలిగిందో—యే విధంగా యితన్ని వూరడించాలో, రమేశునికి అర్థంకాలేదు. గోపాల్‌సర్కారుకూడా తన పని వదిలిపెట్టి పరుగెత్తుకుని వచ్చాడు. ఆయన దగ్గరకువచ్చి, భైరవుని చేయిపట్టుకున్నాడో లేదో—భైరవుడు ఆయన్ని గట్టిగా కౌగలించుకుని బావురుమని యేడ్చాడు. ఈ మనిషి కొంచానికే ఆడదానిలా యేడుస్తాడని, రమేశుకు గుర్తువచ్చింది. గోపాలసర్కార్ ఎంతో వూరడించాక అతను కొంచెం శాంతించి—యీ మహాశోకానికి కారణం చెప్పగానే—రమేశు స్థబ్ధుడైపోయాడు. భైరవుని సాక్ష్యంవల్ల, భజువ విడిపింపబడ్డాడు. వాడిని పోలీసుల దృష్టినుంచి మళ్ళించడానికి వాడిదేశం పంపించాడు. ముద్దాయి ఎలాగో తప్పించుకున్నాడు కాని సాక్షిమాత్రం చిక్కులో పడిపోయాడు. ఎప్పుడైతే భైరవునికి సంగతి సందర్భాలు చూచాయగా తెలిసాయో, ఆ వెంటనే అతను కోర్టుకు పరుగుతీసి, అసలు విషయం తెలుసుకున్నాడు. అఖుధారు రోజుల్క్రితం రాధానగరంలో వుండే వేణీ ఛినమావు

వచ్చి నిలుచున్నాడు. ఆయన్ని చూడగానే అందరి ముఖాలు క్షణంసేపు నల్లబడినయ్! శత్రుపక్షంలో ముఖ్యులను అక్కడ చూడగానే రమేశు ముఖం ఉజ్వల మవలేదు. ఆయన్ని ఆహ్వానించేందు కెవరూ ముందుకు రాలేదు. చివరకు ఎవరూ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. భైరవుడు అప్పుడు అక్కడలేడు. కొంచెంసేపయాక—"చూడు గోవిందన్నయ్యా...." అంటూ ఏదో పనిమీద బయటకు వచ్చాడు. తన అంగనంలో ఏదో ఓ పెద్దభూతం నిలుచున్నట్లు గాబరాపడి, వెంటనే లోపలికి పారి పోయాడు. రమేశు ముఖాన్ని చిన్నపుచ్చుకుని బైటికి వచ్చేశాడు. అతని మనసు మనసులోలేదు. ఇంతలో వెనకనుంచి ఎవరో పిలిచారు—"నాయనా రమేశ్"

రమేశు వెనక్కి తిరిగి చూసేసరికి దీను దగ్గుతూ వస్తున్నాడు. అతను దగ్గరకు వచ్చి—"పద నాయనా! యింటికి వెళ్దాంపద" అన్నాడు.

రమేశు నవ్వేందుకు ప్రయత్నించాడు. కాని నోటినుంచి నవ్వు రాలేదు. నడుస్తూ—నడుస్తూ దీను చెప్పడం మొదలు పెట్టాడు—"నాయనా! నువ్వు యితనికి చేసిన ఉపకారం అతని తల్లిదండ్రులుకూడా అతని కంతగా చేసివుండరు. ఈ సంగతి అందరికీ తెలుసు. కాని ఏమిచేయగలడు? ఉపాయంలేదు. పిల్లి పిల్ల తరం మేము కాపురాలు చేయాలి. అందువల్ల నిన్ను పిలిస్తే—అర్థమైందా నాయనా? పాపం యిందులో భైరవా వారిదికూడా దోషంలేదు. ఈ కాలపు పట్నవాసపు పిల్లలు జాతీ—మతం అవీ ఒప్పుకోరుగా, అందువల్ల తెలిసిందా నాయనా!

ఇప్పుడు అతని చిన్నకూతురికి పన్నెండేళ్ళు నిండినయ్! రెండు రోజుల తరువాత దాన్నికూడా దాటించాలి. నాయనా! మన సంఘం సంగతి అందరికీ తెలిసిందేగా! తెలియలేదా బాబూ?"

రమేశు ఆదరంగా—"చిత్తం గ్రహించాను" అన్నాడు.

రమేశుని సింహద్వారందగ్గరకు వచ్చి దీను ప్రశాంతముగా—"ఎందుకు తెలుసుకోలేరు? మీరు గ్రహింపులేనివాళ్ళు కారు. ఈ బ్రాహ్మణుని మాత్రం తప్పుగా భావించడానికి వీలులేదు. మాలాంటి ముసిలివాళ్ళకు పరలోకచింత...."అని అనబోతూంటే, రమేశుడు—"అవును....అదీనిజమే" అంటూ యింట్లోకి వెళ్ళి పోయాడు.

గ్రామస్థులంతా తనను వెలివేశారని గ్రహించాడు రమేశు. ఇంటికి చేరాక క్షోభతోనూ, కోపంతోనూ, ఆయనకళ్ళు యెఱ్ఱ పడినయ్! వేణీని, గోవిందగంగూళిని, భైరవాచారిని సాదర పూర్వకంగా ఆదరించి తీసుకుని రావడమే ఆయనకు కంటకంగా వుంది. వూళ్ళోవాళ్ళందరికీ యీసంగతి అంతా తెలిసికూడా భైరవుణ్ణి మన్నించడమేకాదు. సంఘగౌరవంకోసరం, రమేశుణ్ణి అతను ఆహ్వానించక పోయేసరికి, అతణ్ణి ఆదర గౌరవాలతో చూడసాగారు.

"అయ్యో భగవంతుడా" అంటూ రమేశు పెద్దకుర్చీలో కూల బడి నిట్టూర్పు విడిచాడు. "ఈ కృతఘ్నజాతి మహాపాపానికి ప్రాయశ్చిత్త మేమిటి? భగవంతుడా! ఇంత నిష్ఠుర అవ ఘానాన్ని నువ్వు క్షమించగలవా?"

15

ఇలా జరుగుతుందని రమేశుని మనసులో అనుమానం లేక పోలేదు. అయినా ఆ మరునాడు సాయంకాలం గోపాల్‌సర్కారు కోర్టునుంచి తిరిగివచ్చి, భైరవాచారి కోర్టుకు హాజరుకాలేదనీ, అందువల్ల కోర్టులో కేసు కొట్టివేశారనీ, తాము అక్కడ కట్టిన డబ్బంతా వేణీ వాళ్ళచేతుల్లోకి పోయిందనీ, చెప్పేసరికి, క్షణం సేపు రమేశునికి నఖశిఖపర్యంతం మండింది. ఆనాడు వీళ్ళ అత్యాచారాన్నీ, అన్యాయాన్నీ అణచాలని మోసపుబాకీ సొమ్మంతా రమేశు జమకట్టాడు. అయినా పాపిష్ఠుడైన భైరవుడు తన అపాయం తీరించని, వేణీబాబుతో సఖ్యత చేసుకున్నాడు. భైరవుని ఈ కృతఘ్నత—నిన్నటి అవమానం రెండూ కలిసి మొన్నటికంటే ఎక్కువ కోపాన్ని కలిగించింది. ఆయన వున్న పళంగా లేచి, బయటికి వెళ్ళేందుకు తయారయాడు. ఆత్మ సంవరణ మనే మాటే ఆయనకు గుర్తురాలేదు. యజమానిగారి కళ్ళ యెర్రదనాన్ని చూసి గోపాలసర్కారు భయపడి మెల్లగా అడిగాడు—"ఎక్కడికి వెళుతున్నారు!"

"యిప్పుడే వస్తాను" అంటూ రమేశు గబగబా వెళ్ళి పోయాడు. భైరవుని యింటిబయట ఎవరూలేరు. అప్పు డాయన లోపలికి వెళ్ళాడు. ఆ సమయంలో ఆచారిభార్య సాయంసంధ్య దీపారాధన చేత్తోపట్టుకుని తులసికోటవద్దకు వస్తూంది. హఠాత్తుగా రమేశుని, ఎదురుగా చూసేసరికి, ఆమె స్థంభించిపోయింది. ఆయన ఎప్పుడూ వచ్చేవాడు కాడు. ఇవాళ ఎందుకు వచ్చాడా? అని ఆలోచించేసరికి ఆమె కెందుకో భయం కలిగింది.

రమేశు ఆమెను అడిగాడు—"ఆచారిగా రెక్కడ !"

ఆమె అవ్యక్తంగా ఏమన్నదోకానీ, వినపడలేదు. అయి నప్పటికీ యింట్లో లేరని తెలిసింది. రమేశుని శరీరంమీద చొక్కాకూడా లేదు. అస్పష్టమైన ఆ సాయంత్రపు మసక వెలుతుర్లో ఆయన ముఖంకూడా సరిగ్గా కనుపించడంలేదు. ఇంతలో భైరవుని పెద్దకూతురు లక్ష్మి పిల్లవాణ్ణి చంకలో ఎత్తుకుని బయటికి వచ్చింది. ఎవరో ఒక అపరిచితుణ్ణి చూసి తల్లిని అడిగింది—"యీాయన ఎవరమ్మా ?"

కాని తన తల్లి ఏమీ చెప్పలేదు. రమేశుకూడా ఏమీచెప్ప లేదు. లక్ష్మి భయపడి కేకపెట్టింది—"నాన్నా ! ఎవరో మనిషి వచ్చి పెరట్లో నిలుచున్నాడు. ఏమీ మాట్లాడ్డంలేదు."

"ఎవరు ?" అంటూ తండ్రి బయటికివచ్చి, రమేశుని చూసి కొయ్యబారిపోయాడు. ఆ మసకవెలుతుర్లోకూడా ఆ బలమైన శరీరాన్ని గుర్తించేందుకు ఎక్కువకాలం పట్టలేదు. రమేశు కఠినంగా—'యిలారా' అని తనే వెళ్లి తన పిడికిలితో అతని చేయి పుచ్చుకుని—"యిటువంటి పనెందుకు చేశావు ?" అని అడిగాడు.

"నన్ను చంపాడ్రోయ్, లక్ష్మి ! తొందరగా వేణీబాబుకు కబురుచేయ్" అని యేడుస్తూ అన్నాడు.

అతనితోపాటు యింటిల్లాదులూ గొల్లున యేడ్చారు. క్షణ కాలంలో సాయంకాలపు ఆ నీరవత్వాన్ని చీల్చుకుంటూవచ్చిన యింతమంది యేడ్పుధ్వనులు ఆ వీధివాళ్ళందరినీ భయపెట్టాయి.

రమేశు దతన్ని గట్టిగా వూపుతూ—"ఊరుకో ! ఎందుకిలా చేశావో చెప్పు ?" అని అడిగాడు.

ఆ ప్రశ్నకు జవాబు చెప్పాలని ప్రయత్నించలేదు భైరవుడు. గొంతుపగిలేట్లు యేడుస్తున్నాడు. రమేశుని చేతిలోంచి, తనచేతిని వదిలించుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. చూస్తు చూస్తుండగనే గ్రామములోని స్త్రీపురుషాదులు అంగనమంతా నిండిపోయారు. ఆ తమాషా చూచేందుకు లోపలికి రావడానికి చాలామంది ప్రయత్నిస్తున్నారు. కాని క్రోధాంధుడైన రమేశు ఆవేపు ధ్యానముంచనేలేదు. అంతమందిలో కూడా రమేశు పిచ్చివానిలా భైరవునిచెయ్యి గుంజుతూనేవున్నాడు. రమేశుని బలం అందరికీ తెలుసు! దానిమీద ఆయన కళ్ళవేపుచూసి, భైరవున్ని విడిపించేందు కెవరికి ధైర్యంచాలకపోయింది. గోవిందుడు లోపలికి వచ్చాడు కాని గుంపులో కలిసిపోయాడు. వేణీ దూరంనుంచే చూసి చల్లగా జారుకుందామనుకుంటుండగానే, భైరవుడు యేడ్చి- "పెదబాబుగారూ" అన్నాడు.

కాని పెదబాబుగారు కూడా అతనివేపు కన్నెత్తిచూడకుండా క్షణంలో గుంపులో కలిసిపోయాడు. హఠాత్తుగా గుంపులోనుంచి త్రోవకలిగింది. ఇంతలో రమ గబగబావచ్చి రమేశుని చేయి పట్టుకుని—"జరిగిందేదో జరిగిపోయింది. ఇక వదిలిపెట్టండి" అన్నది.

రమేశుడు ఆమెవేపు క్రోధావేశంతో చూస్తూ—'ఎందుకని?' అని అడిగాడు.

రమ పండ్లను బిగపట్టి అస్పష్టంగా కోపంతో అన్నది— "యింతమంది ఎదట యిలా చేయడానికి మీకు సిగ్గులేకపోయింది. కాని, నేను సిగ్గుతో చచ్చిపోతున్నాను."

రమేశు ఆసనంలోని గుంపువేపుచూచి తాత్కాలికంగా భైరవుని చేయి వదిలిపెట్టాడు. అప్పుడు రమ కోమలస్వరంతో అన్నది—"యిక యింటికివెళ్ళండి."

రమేశు మారుమాటాడకుండా బయటికి వెళ్ళిపోయాడు. ఇదంతా ఏదో యింద్రజాలంలా, క్షణంలో జరిగిపోయింది. అతను వెళ్ళిపోయాక అక్కడ వున్నవారంతా రమేశుని విధేయత చూసేసరకి—వాళ్ళకు విచిత్రంగా తోచింది. అందుకని అందరి కళ్ళూ రమమీదపడినయ్! ఈ భయంకరమైన విషయం యింత ఆడంబరంగా మొదలై, యింత సులభంగా తేలిపోవడం అక్కడి వాళ్ళకు యిష్టంలేనట్లుంది.

అప్పుడు గోవిందగంగూళి ఎక్కడనుంచో బయటికివచ్చాడు. గుంపంతా చెదిరిపోయింది. గోవిందుడు ముఖాన్ని గంభీరంగా పెట్టి—"అతనిలా యింటిమీదకువచ్చి, యిలా చావకొట్టినంత పని చేసినందుకు ముందేమి చేయాలో ఆలోచించండి?" అన్నాడు.

భైరవుడు రెండుమోకాళ్ళసందున తలపెట్టి కూచుని రొప్పుతున్నవాడల్లా వుపాయంకోసం వేణీముఖంలోకి చూశాడు. అప్పటికింకా రమ వెళ్ళలేదు. ఆమె వేణీ అభిప్రాయాన్ని చూచాయగా గమనించి—"కాని పెద్దన్నయ్యా! ఇతనితప్పు కూడా లేకపోలేదు. అయినా యిప్పుడేం జరిగిందని యింత హంగామా చేస్తున్నారు?" అని అడిగింది.

వేణీ ఆశ్చర్యపడుతూ—"రమా! నువ్వా అలా మాట్లాడుతావేం?" అన్నాడు.

భైరవుని పెద్దకూతురు యింకా స్థంభాన్ని ఆనుకుని యేడుస్తూంది. ఆమె దెబ్బతిన్న సర్పంలా ఒక్కసారి గర్జించింది—

"రమక్కయ్యా! నువ్వు ఆయనతరపున మాట్లాడుతున్నావు. కాని ఎవరైనా మీయింట్లోదూరి యిలాగే మీనాన్నను కొడితే యేంచేసేదానివో చెప్పు" అని అడిగింది.

ముందు ఆ గర్జనవిని, రమ త్రుళ్ళిపడింది. తనతండ్రిని విడిపించినందుకు కృతజ్ఞత చూపకపోయింది. పైగా ఆమె మాటల్లోని కఠినమైన శ్లేషానికి రమ మండిపోయింది. అయినప్పటికి ఆత్మను అణచుకుని—"మీ నాన్నకూ—మా నాన్నకూ చాలా తేడావుందిలక్ష్మీ! నువ్వు దాన్ని పోలికగా తీసుకురావద్దు. నేనెవరితరపునా ఏమీ మాట్లాడ్డంలేదు. అందరి మంచికోసమే చెపుతూన్నాను" అన్నది.

లక్ష్మి పల్లెటూరిపిల్ల. పోట్లాటన్నా—కొట్లాటన్నా—ఒకరికి తీసిపోదు. ఆమె చటుక్కున ముందుకు వచ్చి—"నిజమే! అతని తరఫున పోట్లాడ్డానికి సిగ్గులేదూ! గొప్పింటివారి అమ్మాయివని ఎవరూ ఏమీ అనడంలేదు, లేకుంటే ఎవరికి తెలవదు? నువ్వుకాబట్టి యింకా ముఖం చూపిస్తున్నావు, యింకొకరైతే యీపాటికి వురిపోసుకుని చచ్చిపోయేవాళ్ళు— "అన్నది.

లక్ష్మిని వేణే కొంచెం దబాయిస్తూ—"లక్ష్మీ! నువ్వూరుకో! యిప్పుడా మాటలవల్ల లాభమేమిటి?" అన్నాడు.

"ఎందు కవుసరంలేదు? ఎవరివల్ల నాన్నగారింత బాధపడి యేడుస్తున్నారో-ఆయనవేపువచ్చి యిలా మాట్లాడుతుందా? ఒకవేళ యీర్రోజు నాన్నగారు చనిపోయినట్లయితే....?"

రమ ఒక్కక్షణం స్థబ్ధురాలైంది. అయినా వేణీ చూపుతున్న కృత్రిమకోపం చూసేసరికి ఆమెకున్న మంట ఒక్కసారి భగ భగమండింది. ఆమె లక్ష్మివేపు చూసి అన్నది—"లక్ష్మి అటు వంటి మనిషి చేతిలో మీనాన్న చనిపోవడం ఎంతో అదృష్టం. యివాళ మీనాన్న చనిపోయినట్లయితే, స్వర్గం వెళ్ళి వుండే వాడు."

లక్ష్మి కూడా కోపంగానే అన్నది–"అందుకేగామాలు నువ్వా యన అంటే పడిచస్తున్నావు."

రమ ఆమెకు జవాబు యేమీ చెప్పలేదు. ఆవేపునుంచి చూపులు మళ్ళించి వేణీవేపు చూసి అడిగింది—"కాని పెద్ద న్నయ్యా! యీసంగతేమిటో నువ్వేచెప్పు?" అని ఆమె అతని ముఖంలోకి తీక్షణంగా చూసింది–ఆదృష్టి అంధకారాన్ని చీల్చు కుని, వేణి హృదయంలోపలికికూడా చొచ్చుకునిపోయినట్లుంది.

వేణీ క్షుణ్ణుడై అన్నాడు–"నాకేం తెలుసమ్మా? లోకులు ఎన్నో అంటుంటారు. మనం వాటన్నిటికి పట్టించుకుని కూచుంటె పనిసాగదు–"

"లోకులు ఏమంటున్నారు"

వేణి ఎంతో అవజ్ఞాపూర్వకంగా–"—అంటే అననీయ్! లోకులు అన్నంతమాత్రాన మనశరీరం మీది చర్మం పోదులే-" అన్నాడు.

ఈ కపటసహానుభూతిని రమ గ్రహించింది. ఆమె కొంచం నేపుండి—"నీ శరీరం మీదున్న చర్మం పోనిమాటనిజమే! కాని అందరికి నీలాంటి మొద్దు చర్మం వుండదు. అయినా లోకు లకు యిదంతా చెప్పిందెవరు? నువ్వేనా?" అని అడిగింది.

"నేనా—?"

రమ మనసులోనే చాలామండి పోతూవుంది. కాని తనశక్తి నంతటిని ఏకంచేసి కోపాన్ని ఆపుకుంది. యిప్పు డామె స్వరంలో కోపంలేదు—"నేను తప్ప యింకెవరూ చెప్పలేరు. ప్రపంచంలో నువ్వుచేయని దుష్కర్మంటూలేదు. దొంగతనాలూ. ఫోర్జరీ, మోసం, యిళ్ళకు నిప్పెట్టించడం అన్నీ అయినయ్! అటువంటప్పుడు యిదెందుకు మాత్రం కొరతవుంచడం దేనికి?" అనిఅన్నది.

వేణి హత బుద్ధునిలా ఏమీ మాట్లాడలేదు.

రమ అన్నది—"ఆడవాళ్ళకు యిదెంతహాని కలిగించే సంగతో-అది తెలుసుకునే జ్ఞానం నీకులేదు. కానీ, ఈ అపవాదు వ్యాపింపచేయడంవల్ల నీకు లాభమేమిటి?"

వేణి భయపడుతూ—"నాకేం లాభము? ఒకవేళ నువ్వు చీకటిలో రమేశుని యింట్లోంచి వస్తున్నప్పుడు లోకులు చూస్తే నేనేం చేయను?" అన్నాడు.

అమాటమీద రమ ధ్యాసవుంచలేదు—"నేనింత మంది ఎదట యింకేమీ చెప్పను. కానీ పెద్దన్నయ్యా! నీ మనసులోని భావం నాకు తెలియదనీ అనుకోవద్దు. కాని నేను చనిపోయేముందు నిన్నూరికే విడిచిపెట్టి వెళ్ళను. యిది మాత్రం నిశ్చయమని నమ్ము—"

యింతవరకూ భైరవాచారి భార్య ఆదగ్గర్లోనే ఎక్కడోవుంది. యిప్పుడు ఆమె ముందుకు వచ్చి, రమచేయిపట్టుకుని, ముసుగు లోపల్నుంచే కోమల స్వరంతో—"నీకేం పిచ్చిపట్టిందా రమా? నిన్నెరుగని వాళ్ళెవరున్నారిక్కడ? అని ఆమె కూతురివేపు

చూసి—"నువ్వు ఆడదానివై వుండికూడా తోటి ఆడదాన్ని యింత అవమానించడం, తగదు. దీన్ని ధర్మం సహించదు. యివాళ ఈమె నీకు చేసిన ఉపకారం-నువ్వు మనిషికి పుట్టినదానివైతే, తెలుసుకునే దానివి" అన్నది.

ఆమె ఆ తరువాత, రమను లాక్కుంటూ లోపలికి తీసుకుని వెళ్ళింది. ఆచారి భార్య, తన భర్తనుద్దేశించి శ్లేషంగా చెప్పడం—వున్నదివున్నట్లు యధార్ధం చెప్పేసరికి, అక్కడవున్నవాళ్ళంతా-యెక్కడవాళ్ళక్కడ తప్పుకుని పోయారు.

ఈ సంఘటన జరగడానికి కార్యాకారణాలు——ఎంత గొప్పవైనా-ఏమైనా-కాని తాను నిగ్రహం లేకుండా, కారణంలేకుండా, ప్రవర్తించినందుకు రమేశుని శిక్షిత హృదయం-భద్రతాంతఃకరణం——ఎడతెగకండా రెండురోజుల వరకు బైటికి రాలేనంత యిదిగా బాధపడింది. అయినా యింతమందిలో తన లజ్జాభిమానాలు కొంత తను భరించేందుకు రమవచ్చిందే అనే ఆలోచన, అతని లజ్జా మేఘాలమీద ఒక్క మెరుపు మెరిసినట్లు క్షణ క్షణమూ, సౌందర్యమూ, మాధుర్యముతో నిండిన కాంతి రేఖలను ప్రసరింప చేసింది, అందువల్ల, అతని యింత విచారంతోపాటు, ఒక తృప్తి కలిగింది. ఈ సుఖ—దుఃఖాల వేదనలో యింకా కొంతకాలం యింట్లోనే అజ్ఞాతవాసం చేయాలని అనుకున్నాడు. కాని తన మూలంగా బైట యింకొక వ్యక్తిమీద కొంతంత అపవాదు పడిందన్న సంగతి కలలో కూడా అనుకోలేదు.

కాని అజ్ఞాతం వుండేవీలు ఆయనకు కలగలేదు. యివాళ సాయంకాలం పీరుపురంలోని ముసల్మానుల పంచాయితీ మీటిం

గుకు రమ్మని వాళ్ళు పిలవడానికి వచ్చారు. అదీగాక అలా మీటింగు పెట్టుకోమని తనే స్వయంగా వాళ్ళకు కొన్ని రోజుల క్రితం చెప్పాడు. యివాళ వాళ్ళంతా ఒకచోట గుమిగూడి చిన బాబుగారి కోసం ఎదురు చూస్తున్నారని విని అక్కడికని బయలుదేరాడు.

ప్రతి గ్రామములోనూ రైతుల్లో చాలామంది, బీదవాళ్ళన్న సంగతి రమేశు ఎంతో దూరం వాకబుచేసి, తెలుసుకున్నాడు. చాలామందికి ఒకసెంటు భూమన్నా లేదని గ్రహించాడు. ఇతరుల భూమి కౌలుకు చేసో—యితరులవద్ద పనులుచేసుకొనో—పొట్టపోసు కుంటున్నారని కూడా విన్నాడు. ఒకవేళ రెండు రోజులు పనిదొరకకపోయినా—ఏదైనా జబ్బుచేసినా యింటిల్లాదులు పస్తులుండేవారు. ఎంతోకాలం విచారించగా, వీళ్ళందరూ ఒకప్పుడు భూమివున్న వాళ్ళేనని, కాని అప్పులవల్ల అంతా పోగొట్టు కున్నారని తెలుసుకున్నాడు. ఈ అప్పు పద్ధతి కూడా సవ్యంగా వుండదు. శ్రీమంతులు భూమిని తాకట్టు పెట్టుకుని అప్పుయిస్తారు. కాని అప్పుడప్పుడూ వడ్డీ పుచ్చుకోరు. పంట పుచ్చుకునేవారు. ఈ లెక్క ప్రకారం అసలు ఫాయిదాలు కలిపితే అయిదు రెట్లయేది. అందువల్ల ఎప్పుడన్నా ఒకరైతు—సమాజిక క్రియ—కర్మకుగానీ—అనావృష్టి వల్లకానీ, కొంత ఋణం చేయకతప్పదు. కాని ఆ తరువాత సంబాళించుకుని నిలబడడం చాలా కష్టం! ప్రతి సంవత్సరం అతను ఆ శ్రీమంతుని యింటి ముందుకు వెళ్ళి చేయిచాపాల్సిందే! ఈ విషయంలో హిందూ—ముసల్మానులంతా ఒకటే— కారణం శ్రీమంతు

లంతా హిందువులే! రమేశు పట్టణంలో వుండి కొంత పుస్తకాల వల్ల తెలుసుకున్నాడు. యిప్పుడు గ్రామములో వుండి ప్రత్యక్షంగా చూశాడు. అప్పుడిక ఆశ్చర్యపోయాడు. ఆయన డబ్బు చాలా బ్యాంకీలో మూలుగుతూంది. ఆ డబ్బుతో యింకా కొంత పోగుచేసి—యీ అభాగ్యులను ఆ శ్రీమంతుల చేతుల్లోంచి తప్పిద్దామని చూచాడు. కాని ఒకటి—రెండుచోట్ల యిచ్చి—పుచ్చుకోవడంవల్ల, నష్టపడ్డాడు. అప్పుడు ఈ అసహాయులు—దరిద్రులు, తను అనుకున్నంత దయాపాత్రులు కారని గ్రహించాడు. వీళ్ళంతా దరిద్రులు, నిరూపాయులూ, అల్పబుద్ధులే! తప్పుడు వ్యవహారాల్లో తక్కువ వాళ్లుకాదు. అప్పు పుచ్చుకుని ఎగవేసేవాళ్ళు చాలామంది వున్నారు. వీళ్ళు సరళబుద్ధి—సాధువులుకారు. అబద్ధం చెప్పడానికి సిగ్గుపడరు. మోసగించడం బాగా వచ్చు. తమ యిరుగు పొరుగు యిళ్ళలోని స్త్రీల సౌందర్యాన్ని గురించి—కన్యల శీలాన్ని గురించి చర్చించడంలో తక్కువ వుండదు. పురుషులకు వివాహంకావడం చాలాకష్టం. దానితో పాటు భిన్నావస్థలలోవున్న విధవలభారం ప్రతి యింటిలోనూ వుంది. అందువల్ల వాళ్ళ నైతిక వ్యవహారం కూడా చాలా అపహ్యాం గానేవుంది. వీళ్ళకు సమాజంవుంది. దానిలో శాసనాలకు తక్కువలేదు. కాని, దొంగలతో పోలీసులకు ఏసంబంధం వుంటుందో—సమాజంతో వీళ్ళకూ అదే సంబంధం. దుర్బలులూ—దరిద్రులూ అని వీళ్ళను కోపగించడంకూడా అసంభవమే! విద్రోహీ, కుమార్గంలో నడిచే కొడుకుమీద తండ్రికి ఏ విధమైన మనోభావం వుంటుందో—రమేశు హృదయం

కూడా సరిగ్గా అలానే వుంది. అందువల్ల ఆ సాయంకాలం పీరుపురం పంచాయితీ రమేశుని పిలిచింది.

ఆ సాయంకాలపు మసక చీకటిని దూరంచేస్తూ—దశమినాటి చంద్రుడు కిటికీ బయట మైదానంమీద నాలుగువేపులా వెలుగుతున్నాడు. ఆ వేపు చూస్తూకూడా రమేశు వెళదా మనుకుంటూనే జాగుచేస్తున్నాడు. ఆ సమయంలో రమ వచ్చి తలుపుదగ్గర నిలుచుంది. అక్కడ వెలుతురులేదు. అందువల్ల యింటిదాసి అనుకుని రమేశు—"ఎందుకూ—?" అనిఅడిగాడు.

"మీరు బయటికి వెళుతున్నారా ?"

రమేశు త్రుళ్ళిపడ్డాడు—"ఎవరు రమా ? యిప్పుడు ఎందుకు వచ్చావు—?"

ఏకారణంవల్ల ఆమె యీ చీకటిలో రావాల్సి వచ్చిందో ఆ కారణం చెప్పవలసిన అవసరం లేకపోయింది. కాని వచ్చిన పని విషయం మాత్రం చాలావుంది. అందువల్ల ఏవిధంగా మొదలు పెట్టాలా అనునదిగమనించలేక పోయింది. అలాగే నిల్చునివుంది. రమేశుక్కూడా అలాగేవున్నాడు. కొంచంసేపున్నాక—"మీ శరీరంలో యెలావుంది ?" అని రమ అడిగింది.

"బాగాలేదు. యిప్పుడు తిరిగి రోజూ జ్వరం వస్తూనే వుంది—"

"అయితే కొన్నాళ్ళు యెక్కడికైనా వెళ్ళివస్తే బాగుంటుందేమో ?"

రమేశుడు నవ్వుతూ—"వెళితే బాగానే వుంటుంది. కాని యెలా వెళ్ళను" అని అన్నాడు.

లంతా హిందువులే! రమేశు పట్టణంలో వుండి కొంత పుస్తకాల వల్ల తెలుసుకున్నాడు. యిప్పుడు గ్రామములో వుండి ప్రత్యక్షంగా చూశాడు. అప్పుడిక ఆశ్చర్యపోయాడు. ఆయన డబ్బు చాలా బ్యాంకీలో మూలుగుతూంది. ఆ డబ్బుతో యింకా కొంత పోగుచేసి—యీ అభాగ్యులను ఆ శ్రీమంతుల చేతుల్లోంచి తప్పిద్దామని చూచాడు. కాని ఒకటి—రెండుచోట్ల యిచ్చి—పుచ్చుకోవడంవల్ల, నష్టపడ్డాడు. అప్పుడు ఈ ఆసహాయులు—దరిద్రులు, తను అనుకున్నంత దయాపాత్రులు కారని గ్రహించాడు. వీళ్ళంతా దరిద్రులు, నిరూపాయులూ, అల్పబుద్ధులే! తప్పుడు వ్యవహారాల్లో తక్కువ వాళ్లుకాదు. అప్పు పుచ్చుకుని ఎగవేసేవాళ్ళు చాలామంది వున్నారు. వీళ్ళు సరళబుద్ధి—సాధువులుకారు. అబద్ధం చెప్పడానికి సిగ్గుపడరు. మోసగించడం బాగా వచ్చు. తమ యిరుగు పొరుగు యిళ్ళలోని స్త్రీల సౌందర్యాన్ని గురించి—కన్యల శీలాన్ని గురించి చర్చించడంలో తక్కువ వుండదు. పురుషులకు వివాహంకావడం చాలాకష్టం. దానితో పాటు భిన్నావస్థలలోవున్న విధవలభారం ప్రతి యింటిలోనూ వుంది. అందువల్ల వాళ్ళ నైతిక వ్యవహారం కూడా చాలా అపహ్యాం గానేవుంది. వీళ్ళకు సమాజంవుంది. దానిలో శాసనాలకు తక్కువలేదు. కాని, దొంగలతో పోలీసులకు ఏసంబంధం వుంటుందో—సమాజంతో వీళ్ళకూ అదే సంబంధం. దుర్బలులూ—దరిద్రులూ అని వీళ్ళను కోపగించడంకూడా అసంభవమే! పితృద్రోహీ, కుమార్గంలో నడిచే కొడుకుమీద తండ్రికి ఏ విధమైన మనోభావం వుంటుందో—రమేశు హృదయం

వూహించిందికూడా అంతే: కానీ తనను తాను సంభాళించుకుని-సరే. వెళతాననుకో: అందువల్ల నీకు లాభమేమిటి....? నన్ను యిబ్బంది పెట్టడంలో నువ్వు తక్కువదానివికాదు. యివాళ రాబోవు ఆపదనుగురించి జాగ్రత్తపడమని చెప్పేందుకు వచ్చావేం? యివి మరిచిపోవడానికి, యివి జరిగి యెన్నో రోజులుకాలేదుగా. ఇప్పుడు నేను వెళ్ళిపోయినందువల్ల నీకు కలిగే లాభమేమిటో స్పష్టంగాచెప్పు. అప్పుడు నేను వెళ్ళేందుకు యిష్టపడతాను—అన్నాడు.

రమ ఏమి జవాబు చెపుతూందోనని ఆమె ముఖంవేపు చూస్తున్నాడు. కాని తాననుకున్న జవాబు రాలేదు. ఎంత అభిమానం రమ హృదయాన్ని ఆవరించిందో అతను గ్రహించలేదు. తను కఠినంగా, పరిహాసంగా విసిరిన మాటలలోని అఘాతంవల్ల ఆమె ముఖము ఎంత వివర్ణమైందో ఆచీకట్లో చూడలేదు. కొంచం సేపు మెదలకండావుండి—సరే! స్పష్టంగానే చెపుతాను. మీరు వెళితే నాకేమీ లాభంలేదు. కాని వెళ్ళకుంటే నష్టం ఎక్కువగా వుంది నేను సాక్ష్యం చెప్పాల్సివస్తుంది." అన్నది.

రమేశుడు నీరసంగా—"యిదాసంగతి? అయితే సాక్ష్యం యివ్వకుంటే యేం?" అని అడిగాడు,

రమ ఒక క్షణంవుండి—"యివ్వకుంటేనా? రెండు రోజుల తరువాత రాబోవు దేవీపూజలకు మాయింటికి యెవ్వరూరారు. యతీన్ ఉపనయనానికి కూడా ఎవరూ భోజనాలకురారు. నా నోములూ, వ్రతాలు-" యిటువంటి దుర్ఘటనలు తలుచుకునే సరికి రమేశుకు కంపరం కలిగింది—

ఆ తరువాత వినకపోయినా రమేశుకు పోయిందేమీలేదు. కానీ అడగకుండా వుండలేకపోయాడు—"ఆ తరువాత ?"

రమ వ్యాకులతతో అన్నది— "అతరువాతనా ? లేదు. లేదు. మీరు వెళ్ళండి ! రమేశన్నయ్యా ! నిన్ను ప్రార్థిస్తున్నాను, అన్నివిధాల నువ్వు నన్ను పాడుచేయవద్దు. ఈ వూరు నుంచి వెళ్ళిపోండి."

యిద్దరూ కొంచెంసేపు మెదలకుండా వూరుకున్నారు. యింతకు ముందు, ఎక్కడైన, ఏ పరిస్థితిల్లోనైనా రమ కనిపిస్తే రమేశుని హృదయం ఉద్రిక్తమయేది.ఎన్నివిధా ప్రయత్నించిసంభాళించుకుందామన్నా చేతనయేదికాదు, యిలాహృదయం ఎదురుతిరిగేసరికి ఎంతోబాధపడేవాడు. సిగ్గుపడేవాడు. తనమీధ తనకే కోపంవచ్చేది. కానీ ఏవిధంగాకూడా వశంలోకి వచ్చేదికాదు. అందులో విశేషించి యివాళ యీ సమయంలో తనయింట్లో ఆ రమ హఠాత్తుగా వొంటరిగా రావడంచూసేసరికి నిన్నటిసంఘటన జ్ఞాపకం అతని హృదయంలో చాంచల్యం మరింత యెక్కువైంది. కాని రమ అన్న ఆఖరిమాట అతనికళ్ళు తెరిచింది—"సరే అలాగే వెళతాను. కాని యిప్పుడిక వీలులేదు. నేను యిక్కడినుంచి పారిపోవడం నీకెంతమంచిదైనా—ఈరాత్రి నాదృష్టిలో అంత విలువగలది. నువు నీదాసీని పిలువు. నేనిప్పుడు బయటికి వెళ్ళాల్సివుంది."

"అయితే యివాళే వెళ్ళలేరా ?"

"లేదు. మీదాసీది ఎక్కడికివెళ్ళింది ?"

"నాతో ఎవరూ రాలేదు."

అదేమిటి ? యిక్కడికి అంత సాహసించి యెలా వొంటరిగా రాగలిగావు ? దాసీదాన్నికూడా వెంటతీసుకునిరాలేధా ?"

"తీసుకునివస్తేమాత్రం ఏముంది? అదయినా నన్ను మీ చేతుల్లోంచి రక్షించేదికాదుగా?"

"రక్షించలేకపోవచ్చు. కాని అపవాదునుంచి తప్పించుకునే దానివి. రాణీ! ఇప్పుడు తక్కువరాత్రి కాలేదు."

ఆపేరు చాలాకాలం నాటిది. కాని ఏదో అందామని నోటి చివరవరకూ వచ్చింది. కాని అనలేకపోయింది. అయినా తనలో తాను సంబాళించుకుని—"దానివల్లకూడా ఫలితంలేదు రమేశన్నయ్యా! చీకటిరాత్రి కాదుగా! నేను వెళ్ళగలను" అంటూ జవాబుకు యెదురుచూడకుండానే గబగబా బైటికి వెళ్ళిపోయింది.

16

రమ ప్రతిసంవత్సరం దుర్గ—పూజ బ్రహ్మాండంగా చేసేది. పూజకుముందే అంటే సప్తమినాడు గ్రామములోని బీదలకూ రైతులకు సంతృప్తిగా భోజనం పెట్టేది. బ్రాహ్మణుల యింట్లోంచి, అమ్మవారి ప్రసాదంకోసం వచ్చిపోయే జనంతో రాత్రి జామువరకూ యింట్లో కాలుపెట్టడానికే సందువుండేది కాదు. కేవలం హిందువులేకాదు. పీరుపురంలోని ముసల్మానులు కూడా గుంపులుగుంపులుగా వచ్చేవాళ్ళు. ఈ సంవత్సరంకూడా ఆమె అస్వస్థతగా వున్నప్పటికి—బ్రహ్మాండంగానే చేసింది. చండీమండపంలో ప్రతిమ—పూజకు కావలసిన సరంజామా—క్రిందున్న పెరట్లో వుత్సవానికి కావలసిన యేర్పాట్లుచేసివున్నయ్! సప్తమినాటిపూజ యథాసమయంలో పూర్తయింది. మెల్ల

మెల్లగా రెండోజాము—మూడోజాము కూడా గడుస్తుంది. ఆకాశంలో సప్తమినాటి చంద్రుడు వెలుగుతున్నాడు. కాని ముఖర్జీలవారింటి అంగనంలో ముఖ్యులైన పెద్దలు నలుగు రైదుగురు తప్ప ఎవరూలేరు. లోపల విరాటమైన అన్నంరాశి క్రమక్రమంగా గట్టిపడుతూ చల్లారిపోతూంది. కూరలన్నీ ఎండి వివర్ణమైపోతూన్నయ్! కాని యింతవరకూ వూళ్ళోనివాళ్ళు ఒక్కరుకూడా ప్రసాదంకోసంగాని, భోజనంకోసంగాని రాలేదు. "అరే యీ శూద్రపుముండాకొడుకులు యింత భోజనసామగ్రిని వృధాగా నష్టపరిచారు. వీళ్ళప్పుడే యింత పొగరెక్కిపోయారా?" అంటూ వేణీబాబుచేతిలో హుక్కాపట్టుకుని అటుయిటూ పచారు చేస్తున్నాడు. "వెధవలకు పాఠంచెపుతాను. ఇంటికప్పులు ఎగర గొట్టిస్తాను—అదిచేస్తాను—యిదిచేస్తాను—వగైరా-వగైరా" అంటున్నాడు. గోవింద్, ధర్మదాస్—హోల్దారు, పెద్దకోపంతో యిదంతా ఎవరిప్రోద్బలంవల్ల జరుగుతూందో-ఆచూకీతీద్దామని- తిరిగి-తిరిగివచ్చారు. అదీగాక హిందూ ముసల్మానులు ఏక మవడం చాలా ఆశ్చర్యంగా వుంది. ఒకప్రక్క, లోపల రమ చిన్నమ్మ తిట్లవర్షం కురిపిస్తూంది. ఆమె మరీ వికటంగా వుంది. ఇంత హంగామా జరుగుతున్నా—ఒక్కమనిషిమాత్రం మెదలకుండావుంది. ఆమె రమ. ఆమె అస్వస్థతగా వున్నది నిజమే! ఆమె ఎవరికి విరుద్ధంగాకూడా ఒక్కమాటన్నా అన లేదు. ఎవరిమీదా దోషంఆరోపించలేదు. ఇంతవరకూ ఆమెఒకర్ని ఆక్షేపించిగాని, పరుషంగా గాని మాట్లాడలేదు. ఆమె నిజంగా రమేనా? తనకు సుస్త్రీగావున్నమాట నిజమే! కాని అంగీక

రించదు. నవ్వుతూ ఎగరగొట్టేస్తుంది. రోగం రూపాన్ని మార్చేస్తుంది. పోతేపోయింది. కాని ఆమెలో ఆ అభిమానం, ఆ కోపంలేదు. ఆహరంలేదు. ఆమెకళ్ళు వ్యధతోనూ—కరుణతోనూ నిండినట్లున్నయ్! కొంచెం నిదానంగా పరీక్షించిచూస్తే—రెండు సజలనయనాల్లో దుఃఖసముద్రం అణిగివున్నదని, అది పొంగిపొర్లిందంటే ప్రపంచాన్ని యావత్తూ ముంచేయగలదని తెలుస్తుంది. ఆమె దేవీమందిరంలోకి వచ్చి అమ్మవారి కెదురుగా నిల్చుంది. ఆమెను చూడగానే, ఆమె శుభాకాంక్షులు గట్టిగా ఈ అలగాజాతివాళ్ళ ఏడేడు పద్నాలుగుతరాలవాళ్ళ పేర్లు పెట్టి తిట్టడం సాగించారు. అవన్నీ విని రమ కొంచెం మెల్లిగా నవ్వింది. ఆమె ఆ నవ్వు సరిగ్గా మనిషి చెట్టునుంచి త్రుంచినప్పుడు పువ్వుఎలా నవ్వుతూందో అలావుంది. ఆ నవ్వులో రాగద్వేషం, ఆశా—నిరాశలు మంచిచెడ్డలు ఏమీలేవు. అది సార్థకమైనదో— నిరర్థకమైనదో ఎవరికితెలుసు!

వేణీ కోపంతో మండిపడుతూ—"యిది నవ్వవలసిన విషయంకాదు. ఇది సర్వనాశనం కలుగచేసే విషయం. దీనికి కారకు లెవరో తెలిసిందంటే" అంటూ రెండుచేతుల వ్రేళ్ళు ఒకచోట చేర్చి—'ఈవిధంగా నలిపేస్తాను.' అన్నాడు.

రమ మనసులోనే కంపించింది. వేణీ వాగుతున్నాడు— "వెధవ ముండాకొడుకులు! ఎవరి అండచూసుకుని యింత యిదిగా చెలరేగారో—వాడు—ఆ రమేశు యిప్పుడు జెయిల్లో గానుగ తిప్పుతున్నాడు. ఇప్పుడు వీళ్ళను పరిమార్చడం ఎంత పని నాకు."

రమ యేమీ మాట్లాడలేదు. ఆమె వచ్చినపని పూర్తిచేసుకుని వెళ్ళిపోయింది.

భైరవున్ని కత్తితో పొడిచి చంపాలనే ప్రయత్నం చేశాడని నేరంమోపి, నెలాపదిహేనురోజుల క్రిందట రమేశుని జెయిలుకు పంపారు. కేసు రుజువుపర్చడానికి వాది ఎక్కువ కష్టపడవలసిన పనిలేకపోయింది. కొత్తగావచ్చిన మేజస్ట్రేటుకు అతను యిలాంటి నేరాలు చేయడం సంభవమేననీ, స్వభావికమేననీ ఎలానమ్మాడో తెలియదు. అంతేకాదు. ఇంకా బందిపోటు దొంగలతో-సంబంధం కూడా వుందని నమ్మాడు. అదీగాక పోలీసు డైరీలోని సంగతులు కూడా సాహాయ్యపడినయ్! అందులో, రమేశు యింతకుముందు కూడా యిటువంటి పనులు చేశాడని రాసివుంది. ఇంకా అనేక రకాలైన సందేహజనకములైన సంగతులు చాలా కనిపించినయ్! ఇకమీదట పోలీసులు అతన్ని దృష్టిలో వుంచుకోవాలని కూడా చెప్పాడు. పెద్దసాక్ష్యంకూడా అక్కరలేకపోయింది. అయినా రమ మాత్రం సాక్ష్యం చెప్పాల్సి వచ్చింది—"భైరవాచారిగారింట్లోకి వచ్చి రమేశ్ అతన్ని కొట్టబోయాడనేది నిజం! కాని కత్తితో పొడిచిందీ లేనిదీ నాకు తెలియదు. అసలు ఆయన చేతిలో కత్తి వున్నదీ లేనిదీ నాకు జ్ఞాపకం లేదు" అని చెప్పింది.

అయితే యిది నిజమేనా? జిల్లాకోర్టులో ఆమె దేవునియెదట ప్రమాణంచేసి చెప్పింది. కాని ప్రమాణం చేయించే నియమము లేని కోర్టులో ఆమె ఏం జవాబుచెపుతుంది? రమేశుడు కత్తితో పొడవలేదనీ, ఆయన చేతిలో అస్త్రమేకాదు—చివరకు ఓ పూచిక

పుల్లకూడా లేదని రమకంటే ఎక్కువగా తెలిసిం దెవరికి? కాని అంత కోర్టులో నీకు ఏవిషయం గుర్తుంది? ఏదిలేదు? అని అడిగేవాళ్ళే లేకపోయారు. కాని ఈనాటి కోర్టులో నిజం చెప్ప డానికి ఆమెకు దారి ఏమీలేదు. వేణీ మొదలైనవాళ్ళ చేతిలో గ్రామ్యసమాజం నిజం కావా లనదు. ఒకవేళతను నిజం చెప్పిన ట్లయితే—అందుకు ప్రతిఫలంగా అబద్ధపు అపవాదనే కాళిమను ముఖానికి పూసుకుని సంఘంలోంచి వెలికావలసి వచ్చేది. ఇలా చాలామందిని వెలివేశారు కూడా! అయినా రమేశునికి యింత దీర్ఘకాలం శిక్షపడుతుందని రమకు తెలియదు. మహా ఎక్కు వై తే వందో, రెండువందలో జుల్మానా వేస్తారని అనుకుంది. పైగా ఎన్నిసార్లు హెచ్చరించినా—రమేశు తనపని మానుకుని వెళ్ళిపోవడానికి అంగీకరించలేదు. అందువల్ల కోపంవచ్చి, ఒకసారి జరిమానా పడాల్సిందేననీ, మనసులో అనుకుంది. అదీ ఒక శిక్షే ననుకుంది. రమేశుకు యిటువంటి శిక్ష పడుతుం దనీ, ఆ రోగిష్టియైన రమేశుని ముఖం చూసైనా మేజిస్ట్రేటుకు దయకలగదనీ, ఒక్కసారే ఆరునెలల కఠినశిక్ష విధిస్తాడనీ కలలోకూడా అనుకోలేదు. అప్పుడు స్వయంగా రమ అతనివేపు కన్నెత్తి చూడలేకపోయింది. ఆ తరువాత—రమేశు కన్నార్ప కుండా తనవేపే చూస్తున్నాడని ఎవరో చెప్పగా విన్నది. జెయిలుకు హుకుం అయాక గోపాలసర్కారు ఏదోవిధంగా అప్పీలు చేద్దామని అన్నప్పుడు రమేశు—"వద్దు. ఒకవేళ మేజిస్ట్రేటు యావజ్జీవం శిక్షవేసినా నేను అప్పీలు చేయను. ఇంత కంటే నాకు జెయిలే మంచి దనిపిస్తూంది" అన్నాడు.

నిజంకాదూ? తన చిరానుగతుడైన భైరవాచారి తనమీద అబద్ధపుకేసుపెట్టి యిలా ఋణం తీర్చుకున్నాడు. రమ బోనులో నిలబడి తన చేతిలో కత్తి వున్నదీ లేనిదీ కూడా జ్ఞాపకం తెచ్చుకోలేకపోయింది. అటువంటప్పుడుఅప్పీలుచేసి ఎవరికోసం విడుదల పొందాలి.

అతని మీదున్న దుర్జేయమైన అభిమానం—రమ ఛాతీమీద కొండంత బరువు పెట్టినట్లుంది. దాన్నిదించి ఎక్కడ పెడదా మన్నా చోటు కనిపించ లేదామెకు. ఎంత గొప్ప బరువది—? తను అబద్ధంచెప్పి రాలేదనే సమర్థన తన అంతరాత్మ ఏవిధం గానూ వొప్పుకోవడంలేదు. ఆమె అబద్ధం చెప్పలేదను కుందాం. కాని నిజంకూడా చెప్పలేదు. నిజాన్ని దాచడం ఎంత పెద్ద అప రాధమో,—అవి ఆమెను యీ విధంగా అహర్నిశమూ తన అంతరాత్మను యెలా దహించేది ముందే తెలుసుకుంటే బావుం డేది. భైరవుని అపరాధంవల్ల రమేశుడు ఎంత బలాన్ని నష్ట పడ్డాడో మాటి మాటికి అదే గుర్తుకు వస్తూంది. అయినప్పటికి తను చెప్పిన ఒక్కమాట ప్రకారం అతని తప్పుక్షమించి మెదల కుండా వెళ్ళిపోయాడు. తన ఒక్కమాటను యిలా ఔదలతాల్చి మెదలకుండా వెళ్ళిపోయిన వాళ్ళెవరైనా వున్నారా యింత వరకు? యిప్పుడు కొన్ని నిజాలను గ్రహించ గలుగుతూంది. ఏ సమాజానికి భయపడి తనింత గర్హించతగిన పనిచేసిందో— ఆ సమాజం యెక్కడుంది? వేణీ మొదలైనవాళ్ళ స్వార్థం— క్రూరహింసా విధానంకన్న బయట దీని కెక్కడైనా స్థాన ముందా? గోవిందుని విధవ మరదలి సంగతి యెవరికి తెలి

యదు; వేణీతో ఆమెకున్న సంబంధం గ్రామమంతటికీ తెలియనిదికాదు. కాని అతను సమాజంలో నిష్కంటకంగా తలెత్తుకుని తిరుగుతున్నాడు. పైగా సమాజానికి పెద్ద వేణీబాబే! సమాజిక శృంఖలలన్నీ తమ చేతుల్లో వుంచుకుని తిరగడమే వాళ్ళ స్వార్థానికి పరమావధి. యిదే హిందూత్వం—! అయినప్పటికీ యీ అనర్థాలకన్నిటికీ మూలకారణుడైన భైరవునిమీద ఆమెకు కోపంరాలేదు. అతని కూతురు పన్నెండేళ్ళది వుంది. యిక తొందరలో దానికి పెళ్ళిచేయకుంటే—అతన్ని వెలివేస్తారు. ఈ వూళ్ళోని ప్రతివక్కరికీ వున్న బెడదేయిది. అన్నివిధాల హంగు వుండి కూడా తనే సమాజానికి భయపడవలసి వచ్చింది. అటువంటప్పుడు బీదవాడైన భైరవాచారి ఎలా భయపడకుండా వుండగలడు? వేణీకి విరుద్ధంగా ప్రవర్తించడం ఎంత భయంకరమైన విషయమో ఆమెకు తెలియనిదికాదు.

ముసలివాడైన సనాతన హజ్రా ఆయింటి గుమ్మం మీదుగా వెళుతున్నాడు. అతన్ని చూడగానే గోవిందగంగూలీ ముందు కేకవేసి, ఆ తరువాత బ్రతిమిలాడి—ఆపైన ఒక విధంగా బలవంతంమీద అతన్ని వేణీబాబు యెదట వుంచాడు. వేణీ మండిపడుతూ—"ఏమోయ్ సనాతన్—! మీకింత గర్వం ఎప్పటినుంచి వచ్చింది? మీ మెడమీద కొత్తతలకాయ మొలిచిందా?" అని అడిగాడు.

"పెద్దబాబుగారూ! రెండు తలలు ఎవరికుంటాయ్? మీబోటి వారికే రెండు తలలు లేనప్పుడు మాబోటి బీదవాళ్ళకు ఎలా వుంటయ్ బాబూ?" అన్నాడు సనాతనుడు.

"ఏమిట్రా అన్నావ్?" అని ఓ గావుకేకవేసి వేణీ మాట్లాడలేక పోయాడు. కొంతకాలం క్రిందట ఈ సనాతనుని యావదాస్థి వేణీ బాబుకు తాకట్టు అయింది. అప్పుడు ఈ సనాతనుడే నిత్యం రెండుపూటలా వచ్చి వేణీ కాళ్లుపిసికి వెళ్ళేవాడు. అటువంటి వాడి నోటినుంచి, యివాళ యిటువంటి మాటలా?

"పెద్దబాబుగారూ! నే నేమన్నాను—? రెండుతలలు యెవ రికీ వుండవు అన్నాను. యింకేమీ అనలేదు—" అన్నాడు సనాతనుడు,

"మీ గుండెల్లో ఎంత సాహసం లేకుంటే అమ్మవారి ప్రసా దానికి కూడా రాకుండా వుంటారు—? అటువంటప్పుడు మీరంతా ఎందుకు రాలేదో చెప్పు—" గోవింద్ కోపంగా అన్నాడు.

సనాతనుడు నవ్వి—"మాగుండెల్లో సాహసమా? మీరు చేయవలసిం దేదో చేసేశారు. సరే; యింక ఆసంగతి వదలేయండి! కాని అమ్మవారి ప్రసాదం కానీయండి! మరింకేమైనా కానీయండి! యిప్పు డిక పల్లెవా ళ్ళెవరూ మీ బ్రాహ్మణుల యింటికి తిన డానికి రారు. ఇంత పాపం వసుందర యెలాసహిస్తుందాని మేమంతా అనుకుంటున్నాము" అని హజ్రా ఒక నిట్టూర్పు విడిచి, రమవేపు చూసి—"రమతల్లీ! మీరు కొంచెం జాగ్రత్తగా వుండండి! పీరుపురం ముసల్మానులు వక్కసారే మండి పోతున్నారు. చినబాబుగారు తిరిగి వచ్చాక ఏంజరుగుతుందో తెలియదు. అదంతా ఈ దుర్గాతల్లికే తెలుసు! అయినా ఈ మధ్య వాళ్ళు రెండుమూడుసార్లు పెద్దబాబుగా రింటివేపుకూడా తిరిగి వెళ్ళారు. అప్పుడు పెదబాబుగారు ఎదురుపడకపోవడం చాలా మంచి దైంది" అని సనాతనుడు వేణీవేపుచూశాడు,

క్షణకాలం వేణీ కోపంగావున్న ముఖం తెల్లబడిపోయింది. సనాతనుడు మళ్ళీ—"పెదబాబుగారూ! నేను అమ్మవారియెదట అబద్ధం చెప్పడంలేదు. మీరు కొంచెం జాగ్రత్తగా వుండండి! రాత్రిం బగళ్ళు అనకుండా బయట తిరగవద్దు. ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, ఏంచేస్తారో చెప్పలేను'' అన్నాడు.

వేణీ ఏదో అందామనుకున్నాడు. కాని అతని నోటంట మాట పెకలలేదు. బహుశా అతనిలాంటి పిరికిపందలు ప్రపంచంలో వుండబోరేమో!

ఇంతసేపయాక రమ కరుణార్ద్రంగా అంది—"ఏం సనాతన్! చినబాబుగారి కారణంతోనే వాళ్ళంతా, యింత కోపంగా వున్నారనుకుంటాను.''

ఒకసారి దుర్గప్రతిమ వేపు చూసి, సనాతనుడు అన్నాడు—"అబద్ధంచెప్పి నరకాని కెందుకు వెళ్ళాలమ్మా? కాని ముసల్మానులకోపమే ఎక్కువగా వుందిప్పుడు. వాళ్ళు చినబాబుగారిని దేవునిలా కొలుస్తున్నారు. అందుకు నిదర్శనం చూడండి! జఫరాలీ వద్దనుంచి, ఎవరూ ఒకదమ్మిడీ వసూలుచేయలేకపోయారు. అతను చినబాబుగారు జెయిలుకు వెళ్ళినరోజున, స్కూలుకు వెయ్యిరూపాయలు దానం యిచ్చాడు. చిన్నబాబుగారి పేరుమీదుగా మసీదులో నమాజు కూడా చేస్తున్నారని విన్నాను.''

శుష్కించి, వాడివున్న రమ ముఖం ఒక్కసారి మెరిసింది. ఆమె మెదలకుండా—మిలమిలలాడుతున్న నిర్నిమేష నేత్రాలతో సనాతనుని ముఖంలోకి చూస్తూవుంది. వేణీ హఠాత్తుగా,

సనాతనుని చేయిపట్టుకుని—“సనాతన్! నువ్వు యీ సంగతి కొంచెం స్టేషన్‌దాకావచ్చి, యినస్పెక్టరుగారికి చెప్పు! నీవు కోరింది యిస్తాను. ఒకవేళ రెండెకరాల పొలం కావాలన్నా యిస్తాను. దేవత యెదట వొట్టువేసి చెప్పుతున్నాను సనాతన్! ఈ బ్రాహ్మణునిమాట వొప్పుకో” అని చెప్పాడు.

సనాతనుడు విస్మయంగా వేణీబాబు ముఖంలోకి చూస్తూ అన్నాడు—“పెదబాబుగారూ! నేను యింకెంతకాలం బ్రతుకుతాను. నేను ఈ పేరాశలోపడి—యీపనిచేసి చనిపోతే—నాశవం యెత్తడం అటుంచి, ఎవ్వరూ కాలితోకూడా ముట్టుకోరు. ఇప్పుడు ఆకాలం లేదు పెదబాబుగారూ! ఆకాలం వెళ్ళిపోయింది. చిన్నబాబుగారు కాలాన్ని తల్లక్రిందుచేసి వెళ్ళారు.”

“అయితే బ్రాహ్మణులమాట వినవన్నమాట? అంతేనా?” అని గోవిందు డడిగాడు.

తల అడ్డంగా తిప్పుతూ సనాతనుడు—“చెప్పలేను. గంగూళీ గారూ నేను చెపితే మీకు కోపం వస్తుంది, గాని ఆనాడు పీరుపురంలో స్కూలులో చినబాబుగారు—“మెడలో రెండుమూడు జంధ్యపుపోగులు వేసుకున్నంత మాత్రాన బ్రాహ్మణులు కాజాలరు” అని చెప్పారు. నేను ఈనాటివాన్నికాను. నాకంతా తెలుసు. మీరు చేస్తున్నపనులు బ్రాహ్మణులు చేసేవేనా? అమ్మగారూ! నేను మిమ్మల్ని అడుగుతున్నాను. మీరే చెప్పండి” అన్నాడు.

రమ ఏమీ జవాబుచెప్పకుండా తలవొంచుకుంది. సనాతనుడు యింకా వుత్సాహం తెచ్చుకుని మనసులోనిదంతా వెళ్ళగక్కాడు-

"అందులో ముఖ్యంగా కుర్రవాళ్ళుగుంపు....ఏరోజున చినబాబు గారు జెయిలుకు వెళ్ళారో—అనాటినుంచీ, గ్రామములో కుర్రకారంతా—చీకటిపడ్డాక జాఫరాలీ యింటిలో సమావేశమవుతున్నారు. వాళ్ళంతా 'అసలైన జమీందారు చినబాబుగారేనని, మిగిలినవాళ్ళంతా దొంగలూ—దోపిడీగాళ్ళ'ని బహిరంగంగా వూళ్ళన్నీ చాటిస్తున్నారు. 'అంతేకాదు. మేము సిస్తుయిస్తున్నాం. ఒకరికి భయపడము. ఒకవేళ వారు బ్రాహ్మణుల్లావుంటేసరే, లేకుంటే మేమెంతో, వాళ్ళూ అంతే' అంటున్నారు."

తడి ఆరిపోయిన గొంతుతో వేణీ అడిగాడు "మామీద వాళ్ళకంత కోపం ఎందుకు సనాతన్ ?"

కోపపడకండి పెదబాబుగారూ ; ఈ అనర్థకాలన్నిటికీ మీరే మూలకారణమని వాళ్ళు తెలుసుకున్నారు."

వేణీ మాట్లాడకుండా కూచున్నాడు. ఈ అలగాజాతివాడైన సనాతనునినోటంట యిటువంటి మాటలు వినికూడా కోపగించలేదు. అతని స్థితప్పుడు కోపం తెచ్చుకునేవిధంగాలేదు. గుండె దడదడ లాడుతూంది.

"అయితే వాళ్ళకు రంగస్థలం జాఫరాలీ యిల్లన్నమాట ? అక్కడ వా ళ్ళేమిచేస్తుంటారో నువ్వు చెప్పగలవా ?" అని గంగూళి అడిగాడు.

మొదట సనాతనుడు అతన్నిముఖంలోకి చూస్తూ కొంచెంసేపు వూరుకున్నాడు. ఆ తరువాత—"ఏంచేస్తుంటారో తెలవదు. కాని బాబుగారూ ! మీమంచిని కోరుకుంటే ఏవిధమైన అంతు లాగేందుకు ప్రయత్నించవద్దు. అక్కడ హింధూ—ముసల్మాను

లంతా సోదరులయారు. ఆ రెండుమతాలవారిది ఒకటేమనసు— ఒకే ప్రాణం. చినబాబుగారు జెయిలుకు వెళ్ళాక తుపాకిమందులా పోగైవుందక్కడ. దానిమధ్యలో అగ్గిపుల్లగీసి వేద్దామని ప్రయత్నించవద్దు బాబూ'' అని చెప్పివెళ్ళిపోయాడు.

చాలా సేపటివరకు ఎవరూ ఏమీ మాట్లాడలేదు. రమ లేచి వెళ్ళబోతూండగా వేణీ అన్నాడు-''రమా! సంగతంతా విన్నావు కదూ?''

రమ నవ్వించికాని ఏమీ అనలేదు. ఈ నవ్వు అతనికి మంట పుట్టించింది—''యిదంతా ఆ భైరవాచారిగాడివల్ల జరిగింది. నువ్వు ఆనాడువచ్చి వాడిని పిడిపించకుంటే యిలాజరిగేదికాదు. రమా! నీకు నవ్వులాటగానే వుంటుంది. నువ్వు ఆడదానివి. నువ్వు యింట్లోంచి బయటకురావాల్సిన అవసరం వుండదు. కాని మరి మాగతేమిటో చెప్పు! నిజంగా ఎవడన్నా తల పగులకొడితే యేం కావాలి? ఆడువాళ్ళతో కలిసి వ్యవహారం చేస్తే యిలానే అవుతుంది—'' అని వేణీ ముఖం మాడ్చుకుని కోపంతోనూ,-భయంతోనూ విహ్వాలుడై కూచుండి పోయాడు.

రమ స్తంభించి పోయింది. వేణీసంగతి ఆమెకు బాగా తెలుసు! కాని యిటువంటి లజ్జా పూర్వకమైన నెపంవేస్తాడని ఎప్పుడూ అనుకోలేదు. కొంచెంసేపు అక్కడనిలుచుని—జవాబు చెప్పకుండానే లోపలికివెళ్ళిపోయింది. ఆ తరువాత వేణీ పెద్దగావుకేకలు వేస్తూ-నాలుగైదు లైట్లలో-నలుగురు మనుష్యుల మధ్యగా-ఎంతో జాగ్రత్తగా యింటికి వెళ్ళాడు—

17

కళ్ళనీళ్ళుపెట్టుకుని, విశ్వేశ్వరి గదిలో వచ్చి అడిగింది— ''యివాళ యెలావుంది రమా?''

రమ ఆమె ముఖంలోకి చూసి కొంచెం నవ్వి-''యివాళ బాగానేవుంది పెద్దమ్మా!''

విశ్వేశ్వరివచ్చి ఆమె తల వద్ద కూచుని, తల, ముఖం, నిమరడం మొదలు పెట్టింది. యిప్పటికి మూడు నెలలనుంచి రమకు సుస్తీగావుంటూంది. ఆమె శరీరంలో దగ్గూ, మలేరియా వ్యాపించిపోయింది. గ్రామములో వృద్ధవైద్యుడు వ్యర్థమైన చికిత్సలుచేస్తూ చచ్చిపోతున్నాడు. కాని ఆముసలివైద్యునికి అది తగ్గకపోవడానికి కారణ మేమిటో అంతుపట్టలేదు, కాని విశ్వేశ్వరి మనసులో ఒక అనుమానం మెల్లమెల్ల దృఢపడుతూవుంది. ఆమె రమను తన కూతురులా చూసేది. అందులో వంచనయే మాత్రం లేదు. అందువల్ల ఆస్నేహమే రమ విషయంలో ఆమె సత్యదృష్టి అసమానంగా తీవ్రతరంచేసింది. ఇతరులు ఆమెను సరిగ్గా అర్థంచేసుకోలేక—ఏవేవోచికిత్సలూ, మందులూ వేస్తుంటే ఆమె గుండెలు పగిలిపోతున్నయ్! రోజురోజుకూ రమకళ్ళు గుంటలుపడడం చూసింది. కాని దృష్టిమాత్రం తీక్షణంగావుంది. ఎక్కడో దూరంగావున్న వస్తువును, తన దగ్గరకు తీసుకునివచ్చి చూడాలనేంత ఏకాగ్రంగా వున్నయ్ ఆచూపులు!

విశ్వేశ్వరిమెల్లగా ''రమా-'' అని పిల్చింది.

''ఏమిటి పెద్దమ్మా?''

''నేను నీకు తల్లిలాంటిదాన్ని రమా!''

"తల్లిలాంటి దానివేమిటి? నువ్వు నాతల్లివే పెద్దమ్మా."

విశ్వేశ్వరి వంగి రమ నొసలు ముద్దుపెట్టుకుని అన్నది.
"అయితే: నీ అసలు జబ్బేమిటో చెప్పమ్మా?"

"పెద్దమ్మా నిజంగా సుస్తీగానేవుంది"

తెల్లబడిపోయిన రమ ముఖం క్షణంలో ఎర్రబడిపోవడం విశ్వేశ్వరిచూసింది. అప్పుడు ఆమె ఎంతో ప్రేమ పూర్వకంగా, నూనె సంపర్కంలేని జుట్టులోకి వ్రేళ్ళుపోనిచ్చి—''అవునమ్మా! ఆసంగతి నాకీ కళ్ళకు తెలుస్తూనేవుంది. అయినా వీటితో చూడ లేని విషయం ఏమన్నావుంటే-అది యిప్పుడు నావద్ద దాచవద్దు. దాచినందువల్ల సుస్తీతగ్గదు.'' అని అడిగింది.

కిటికీ బైట యెండ యింకా తీవ్రంగాలేదు. గాలికూడా చల్ల గానే వీస్తూవుంది. అటువేపు చూస్తూ రమ ఏమీ మాట్లాడలేదు. కొంచెంసేపువున్నాక—''పెద్దమ్మా! యిప్పుడు పెద్దన్నయ్యకు ఎలావుంది?'' అని అడిగింది—

"బాగానే వున్నాడు. తలమీది గాయం మానడానికి యింకా కొంతకాలం పడుతుంది. కాని నాలుగైదు రోజుల్లో ఆసుపత్రి నుంచి యింటికి వస్తాడు.'' అని రమ ముఖంలోని బాధను చూసి—"విచారించవద్దమ్మా! విచారించవలసిందేమీలేదు. దీని వల్ల వాడికి బుద్ధివస్తుంది—'' అన్నది.

రమ ముఖంలో వేదనాభావం చూసి పెద్దమ్మ అన్నది—
''విచారించకమ్మా! యిది వాడికి జరిగి తీరవలసిందే: దీనివల్ల వాడు బాగుపడతాడు—'' అని రమ ముఖంలోని ఆశ్చర్యాన్ని గమనించి అన్నది—''తల్లిఅయి వుండికూడా—తన సంతానాని

కింత దుర్గతిపట్టినా, యిలా మాట్లాడుతుం దేమాని ఆలోచిస్తు న్నావా ? నేను నిజమే అంటున్నాను రమా ! కానీ నేను దీని వల్ల ఎక్కువగా బాధపడ్డానో— ఆనందించానో చెప్పలేను. ఎందు కంటే ఎవరు అధర్మానికి భయపడరో—లోకంలో సిగ్గు అనే దానికి వెరవరో—వాళ్ళకు ప్రాణాలంటే మహా భయమని నాకు తెలుసు ! అలా కాకుంటే ప్రపంచం యిప్పటికే మండి భస్మమై పోయేది. అందుకని రమా ! ఆ కల్లూకొడుకు వేణీకి చేసిన వుపకారం, ప్రపంచంలో యే ఆత్మీయుడూ చేయనట్టిదని గ్రహించాను. అమ్మాయీ ! బొగ్గును తోమినంత మాత్రంలో దాని రంగు మారదు. దాన్ని నిప్పులోవేసి కాల్చివేయాలి—"

"అయితే అప్పుడు యింట్లో ఎవరూలేరా ?"

"ఎందుకులేరు? అంతా వున్నారు. వాడు జెయిలుకు వెళ్ళా లని, నిశ్చయించుకునే—నూనె అమ్మే మిషమీద వచ్చాడు. వాడికి వేణీమీద ప్రత్యేకించి కోపమేమీలేదు. అందుకని వాడు కొట్టిన మొదటి దెబ్బకే వేణీ స్పృహతప్పి పడిపోయాడు. అప్పుడు వాడు మెదలకుండా నిలుచుని చూస్తున్నాడు. ఆ తరు వాత వాడు వేణీని యింకొక దెబ్బకూడా కొట్టలేదు. అంతేకాదు. వాడు వెళ్ళిపోతూ 'యికమీదనైనా వేణీ జాగ్రత్తగా వుండ కుంటే, నేను జెయిలునుంచి వచ్చినా— రాకపోయినా యిదే నా ఆఖరిదెబ్బ కాదని తెలుసుకోవాలి" 'అని చెప్పివెళ్ళాడు "

"అంటే యింకా చాలామంది అన్నయ్యకోసం కాచుకుని వున్నారన్నమాట. కాని పెద్దమ్మా ! యిదివరకు మన వూళ్ళో యీ అలగా జాతివాళ్ళకు యింత సాహసంలేదు. యిప్పుడు వీళ్ళకింత సాహసం ఎక్కడినుంచి వచ్చింది ?"

విశ్వేశ్వరి నవ్వుతూ "ఈ అలగాజాతి వాళ్ళకింత సాహసం యేలా, యెవరు కలగజేశారో- ఆ సంగతి నీకు తెలవదా? రమా! నిప్పు రగులుకుని వూరికే ఆరిపోదు. దాన్ని బలవంతంగా ఆర్పినా--ఆ చుట్టుప్రక్కలనున్న వస్తువుల్ని వేడిచేయక మానదు. రమేశు తిరిగివచ్చి, దీర్ఘజీవిగా ఎక్కడో అక్కడ సంతోషంగా వుంటేచాలు. వేణీ విషయం గుర్తుకు తెచ్చుకుని, నేను నిట్టూర్పు కూడా విడవను." అని అన్నది.

ఈ మాటేమో అన్నది కాని, బలవంతంగా నిట్టూర్పు అపుకోవడం రమ గమనించకపోలేదు. అందుచేత ఆమెచేతిని లాక్కుని తన గుండెలమీద పెట్టుకుని అలాగే పడుకునివుంది, కొంచెంసేపయాక విశ్వేశ్వరి తనను తాను సంబాళించుకుని— రమా! ఏకసంతాన మంటే ఎటువంటిదో అది ఒక్క తల్లికే తెలుస్తుంది. ఎప్పుడు వేణీ దెబ్బతిని పడిపోయాడో—— అప్పుడంతా చేరి బండిలో ఆసుపత్రికి తీసుకుని వెళుతున్నారు. ఆ సమయంలో నాస్థితి నేను చెప్పలేను. అయినప్పటికీ నేను ఒకర్ని దూషించలేదు. ఎవరిమీదా నేరం వేయలేదు. ఏకమాత్ర సంతానమని, తల్లిముఖం చూస్తూ ధర్మం తనవిధిని నిర్వర్తించ కుండా వుంటుందా? అది మాత్రం నేను మర్చిపోలేకపోయాను" అన్నది.

రమ ఏదో ఆలోచించి అన్నది—"పెద్దమ్మా! నేను నీతో వాదించాలనికాదు. కాని రమేశన్నయ్య ఏపాపంవల్ల యింత దుఃఖం అనుభవిస్తున్నాడు? మేమంతా ఎంతో ప్రయత్నంచేసి అతనను జెయిలుకు పంపామని అందరికీ తెలుసుగా?"

"కాదమ్మా కాదు! అదికాదు. రమేశుడు ఏమీ ఎరుగనివాడు కాబట్టే వేణీ యిప్పుడు హాస్పటల్లో వున్నాడు—ఇక నీ...." ఆమాట అనబోతూ ఆగిపోయింది. ఏసంగతి ఆమె నోటిచివర కంటా వచ్చి ఆగిపోయిందో, దాన్ని బలవంతంగా లోపల అణచుకుని—"ఏపనికూడా—వూరికే శూన్యంలో కలిసిపోదని యెరుగుదువు. దానిశక్తి యెక్కడో ఒకచోట పనిచేస్తూనే వుంటుంది. కాని అది ఏరూపంలో—ఎలాచేస్తుందో గ్రహించలేము. అందువల్లనే యింతవరకూ—ఒక మనిషిచేసిన పాపానికి, యింకొకరు ప్రాయశ్చిత్తం, ఎందుకు చేసుకోవాల్సి వస్తుందో—దాని మీమాంస యింతవరకు తేల్చలేకపోయాము. కాని రమా! ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సి వస్తూనే వుంది. యిందులో సందేహంలేదు."

రమ తన వ్యవహారాన్ని గుర్తుతెచ్చుకుని ఒక నిట్టూర్పు విడిచింది. విశ్వేశ్వరి మొదలుపెట్టింది—"రమా! దీనివల్ల నాకళ్ళుకూడా తెరుచుకున్నయ్! 'మేము మంచిచేస్తాం' అని అన్నంతమాత్రన మంచి చేయలేము. మొదటనుంచి ఎన్నో చిన్నా—పెద్ద—అవాంతరాల మెట్లుదాటి పైకి, వెళ్ళేంత ధైర్యం వుండాలి. ఒకనాడు రమేశుడు హతాశుడై, నావద్దకు వచ్చి—'పెద్దమ్మా! వీళ్ళకు మంచిచేయడం నాకు చేతకాదు. అందువల్ల నే నెక్కడినుంచి వచ్చానో అక్కడికే వెళ్ళిపోతాను' అని చెప్పాడు. అప్పుడు అతన్ని నేను ఆపి—'కాదు నాయనా! నువ్వు ఒకపని మొదలుపెట్టావు. దాన్ని మధ్యలోవదిలి వెళ్ళవద్దు' అని చెప్పాను. వాడు నామాట ఎప్పుడూ కాదనని

యెరుగడు. అందువల్ల ఆనాడు వాడు జెయిలుకు వెళ్ళవలసిన సంగతి విని నేనే బలవంతంగా వాడ్ని జెయిలుకు పంపానేమో ననుకున్నాను. కాని, వేణీని హాస్పటల్‌కు తీసుకుని వెళ్ళిన రోజున—వాడు జెయిలుకు వెళ్ళడమే మంచి దనుకున్నాను. అయినప్పటికీ—యెక్కడినుంచో వచ్చి, యితరులకు వుపకారం చేయడంలో యిన్నికష్టా లున్నాయనీ, ఈపని యింతకష్టమైం దనీ, మొదట్లో తెలుసుకోలేకపోయానమ్మా! మొదట్లో అందరిలో కలిసిపోవాల్సి వుంటుందని నేనెప్పుడూ అనుకోలేదు. ముందు కష్టంవచ్చినా—సుఖంవచ్చినా—అందరితోపాటు కలిసిరాకపోతే ఏపనీ జరగదని నాకు తెలవదు. వాడు మొదటినుంచీ—శిక్ష—సంస్కారమూ—శారీరకబలంతో—ఉన్నతమైన హృదయంతో పైస్థాన మాక్రమించి కూచున్నా—వాడ్ని ఎవరూ అర్థం చేసుకోలేకపోయారు. అమ్మాయీ! చివరకు నేను కూడా వాణ్ణి అర్థం చేసుకోలేకపోయాను. నేను వాడ్ని వెళ్ళనివ్వకపోయాను. పట్టుకుని యిక్కడ వుంచలేకపోయాను."

రమ ఏదో అందామనుకుంది; కాని చెప్పలేకపోయింది. విశ్వేశ్వరి అది గ్రహించి—"కాదు రమా! నేనందుకు పశ్చాత్తాప పడడంలేదు. కాని అమ్మాయీ! నువ్వు ఫిన్నాక కోపం చెందవద్దు. మీరంతా కలిసి వాణ్ణి చాలా క్రిందకుదింపి—నలుగురిలో కలిపారు. ఇది అధర్మమైతే కావచ్చు. కాని వాడు తిరిగి వచ్చాక యిందులోని సత్యాన్ని గ్రహించగలడని నేను గట్టిగా చెప్పగలను" అన్నది.

రమ ఆసంగతి సరిగ్గా గ్రహించలేకపోయింది. అందువల్ల అడిగింది—"కాని ఆయన క్రిందకు ఎందుకు దిగివస్తాడు

పెద్దమ్మా? మా అన్యాయాలవల్లా, అధర్మాలవల్లా, ఆయన ఎన్ని అవస్థలు పడినా—చివరకు మా దుష్కర్మలకు, మేమే నరకకూపంలోకి త్రోసివేయబడతాము. మా దుష్కర్మలు ఆయన కెందు కంటుకుంటాయ్?"

విశ్వేశ్వరి, మ్లానంగా నవ్వి అంది—"అమ్మాయీ! ఎందు కంటుకోవు? లేకుంటే పాపం యింత భయంకరంగా ఎందు కుంటుంది? సాధారణంగా ఉపకారానికి ప్రత్యుపకారం అలావుంచి పైగా అపకారమే చేస్తూంటారు కొందరు. అటువంటివారి కృతఘ్నత దాతను క్రిందకు దింపకలుగుతుందా? వాడు తిరిగివచ్చాక, ఈ కుంవాపుర గ్రామము వాడ్ని అలానే చేస్తుందా? కాదు. వాడు ఏచేత్తో దానంచేస్తూ తిరిగేవాడో—ఆచేతిని భైరవుడు నరికేశాడని నువ్వే స్పష్టంగా చూడగలవు" అని కొంచెం ఆగి—"కాని ఎవరికితెలుసు? ఇది వాడి మంచికే జరిగిందేమో! వాడి బలిష్టమైన పూర్తిచేతి దానాన్ని పుచ్చుకునే శక్తి వూళ్ళోవాళ్ళకి లేనప్పుడు ఆ సగం విరిగిన చేతిదానమే వాళ్ళకు వుపయోగపడుతుందేమో?'' అని ఆమె నిట్టూర్చింది.

రమ కొంచెంసేపటివరకూ మాట్లాడకుండా వూరుకుని, ఆమె చేతిని అటూ—యిటూ వూగిస్తూ ఎంతో నెమ్మదిగా—"సరే పెద్దమ్మా! అబద్ధపుసాక్ష్యంచెప్పి—ఒక నిరపరాధిని శిక్ష విధించేట్లు చేసినవాళ్ళ కేమీ శిక్షలేదా?" అని అడిగింది.

విశ్వేశ్వరి కిటికీలోంచి బయటకుచూస్తూ—ఆమె సంస్కారం లేని జుట్టులోకి వ్రేళ్లుపోనిచ్చి నిమురుతూవుంది. హఠాత్తుగా రమ కనుకొలకుల్లోంచి నీరురావడంచూసి, ఎంతో ఆదరంగా ఖాటిని

తుడిచిఅన్నది—"కాని యిందులో నీదోషం ఏమీలేదమ్మా! ఏపిరికిపందలు స్త్రీజాతిమీద అపనింద వేస్తామనే భయం చూపించి—నీమీద యీ పాపభారం వేశార్లో. ఆ శిక్షంతా వాళ్ళే అనుభవిస్తారు. ఇందులో నిన్నేమీ అంటదు."

ఈ వూరడింపు మాటలకు రమ కళ్ళలోంచి నీళ్ళు యింకా ఎక్కువ కాసాగినయ్! కొంచెంసేపుండి ఆమె అన్నది—''కాని వీళ్ళు ఆయనకు శత్రువులు. శత్రువును ఏవిధంగానైనా అణచ డంలో తప్పులేదని వీళ్ళు అంటారు. కాని, చెప్పుకోవడానికి నా కటువంటి సంజాయిషీ ఏమీలేదు పెద్దమ్మా ?''

"ఏమమ్మా! ఎందుకనిలేదు ?'' అని అడిగి పెద్దమ్మ చూపులు క్రిందకుదించింది. ఒక్కసారి మెరుపుమెరిసినట్లయింది. తన కిన్ని రోజులనుంచి వున్న సందేహం—ఈనాడు తీరిపోయి నట్లయింది. ఇవాళ రమను అర్థంచేసుకుని కొంచెంసేపు వేదనతో విస్మయంతో స్తంభించిపోయింది. ఇక రమ హృదయంలోని వ్యధ ఆమెకుతెలుసు! రమ కళ్ళుమూసుకునివుంది. అందువల్ల విశ్వేశ్వరి ముఖంలోనిభావం గుర్తించలేక పోయింది—

''పెద్దమ్మా.''

పెద్దమ్మ చకితయై—ఆమె తలపట్టుకుని అటూ—యిటూ వూపి—"ఏమిటోచెప్పు ?" అని అడిగింది.

''పెద్దమ్మా! ఇవాళ నీయెదట ఒకసంగతి వొప్పుకుంటాను. పీరుపురంలో—జాఫరాలీయింట్లో సాయంకాలమప్పుడు యువకు లంతాచేరి, రమేశన్నయ్య చెప్పిన మంచివిషయాలమీద చర్చించు కుంటున్నారట. వాళ్ళంతా గూండాలని పోలీసులకు వప్పగించా

లనే వదంతి యిక్కడ వ్యాపించింది. అందుకని వాళ్ళను జాగ్రత్తగా వుండమని మనిషిని పంపాను. మరి పోలీసులకు కావలసిం దిదేగా? ఒకసారి వాళ్ళచేతుల్లో పడితే, తిరిగి తప్పించుకోవడం మనతరంకాదు."

ఆ మాటలువిని, విశ్వేశ్వరి వణికిపోయింది—"ఆ....ఏమి టన్నావు? వేణీ తన గ్రామములోకి వృధాగా పోలీసుల ఉత్పాతాన్ని కావాలని కొనితెచ్చుకుంటున్నాడా?"

"వేణీ అన్నయ్యకు యిప్పటిశిక్ష దాని ప్రతిఫలమే నను కుంటాను. ఇలా అన్నందుకు నన్ను క్షమించు పెద్దమ్మా."

విశ్వేశ్వరి వంగి ఆమె నొసలు ముద్దుపెట్టుకుని—"నేను వాడితల్లిని. అటువంటి నేనే క్షమించలేకుంటే యింకెవరు క్షమిస్తా రమ్మా? భగవంతుడు నీకు మనశ్శాంతికూడా యివ్వాలని ప్రార్థిస్తున్నాను" అన్నది.

రమ తన కన్నీళ్ళు తుడుచుకుని—"రమేశు తిరిగివచ్చి తన సుఖక్షేత్రంలోని పంట అనుకూలంగా వుందని తెలుసుకున్నప్పుడే నాకు మనశ్శాంతి పెద్దమ్మా! ఆయన కోరినవిధంగా జరిగింది. తన గ్రామములో బీదరైతులంతా నిద్రనుంచి మేలుకున్నారు. వాళ్ళకాళ్ళమీద వాళ్ళు నిలుచున్నారు. వీళ్ళంతా ఆయన్ని అర్థం చేసుకున్నారు. ప్రేమిస్తున్నారు. కాని పెద్దమ్మా! ఈ ప్రేమానందంలో వారు నాతప్పును మరిచిపోతేరా?" అని అడిగింది.

విశ్వేశ్వరి ఏమీ మాట్లాడలేదు. ఆమె కళ్ళలోంచి ఒక కన్నీటి చుక్క రమ కపోలంమీద పడింది. ఆ తరువాత కొంచెంసేపు యిద్దరూ మెదలకుండా వున్నారు.

రమ పిలిచింది—"పెద్దమ్మా."

"ఏమిటమ్మా?"

"ఒక్కవిషయంలోమాత్రం మేమిద్దరం ఒకరికొకరం దూరం కాలేకపోయాము. అంటే నిన్ను మేమిద్దరం ప్రేమిస్తున్నా మన్నమాట."

విశ్వేశ్వరి మళ్ళీ ఒకసారివంగి ఆమె లలాటం ముద్దుపెట్టుకుంది.

"ఆ బలంమీద ఆధారపడి నేనొకసంగతి నీకు చెపుతున్నాను పెద్దమ్మా! నేను లేనప్పుడు ఆయన నన్ను క్షమించకుంటే, నా తరఫున తను అనుకున్నంత చెడ్డదాన్నిమాత్రం కాదని చెప్పు పెద్దమ్మా! నేనెంతగా ఆయన్ని దుఃఖపెట్టానో—అంతకంటే ఎక్కువ దుఃఖాన్ని నేను పొందాను. నీనోటంట విన్నాక ఆయన నమ్మకుండా వుండలేరనుకుంటాను."

విశ్వేశ్వరి గట్టిగా రమను కౌగిలించుకుని యేడ్చి అన్నది—"పదమ్మా! మనిద్దరం—ఏదేని పుణ్యక్షేత్రానికి వెళ్ళి వుందాం. ఎక్కడవేణీ—రమేశులాంటి వాళ్ళు వుండరో అట్టి క్షేత్రానికి వెళదాం. అక్కడ కన్నెత్తి చూసేసరికి దేవాలయపు శిఖరం కనుపిస్తుండాలి. అటువంటి ప్రదేశానికి వెళదాం. నే నంతా గ్రహించాను రమా! అమ్మాయీ! నువ్వీ లోకంలో నుంచి వెళ్ళేటప్పుడు—ఈ విషం గుండెల్లో వుంచుకుని వెళ్ళడం మంచిది గాదు. మనమంతా బ్రాహ్మణులం. యితర బ్రాహ్మణ స్త్రీలు యెక్కడికి వెళ్ళి వుండాలను కుంటారో మనంకూడా అక్కడికే వెళ్ళి వుందాం."

చాలాసేపు అలాగే వున్నాక—నిట్టూర్పును బలవంతంగా ఆపుకుని—"అలాగే అనుకున్నాను పెద్దమ్మా" అన్నది.

18

తను యింతకాలం నుంచి అనుభవించిన కష్టాలు—బాధలు—జైలుగోడల బయట భగవంతుడు యీ విధంగా సార్థకం చేస్తాడని రమేశుడు తన వున్మత్త వికారంలో కూడా అనుకోలేదు. ఆరుమాసాలు కఠిన జైలుశిక్ష అనుభవించి బయటికి రాగానే వూహకు అందనిసంగతి ఒకటి గోచరించింది. స్వయంగానే వేణీ ఘోషాల్ సెత్తిన గుడ్డకప్పుగుని అందరికంటే ముందు నిలబడి వున్నాడు. ఆ వెనకరెండు స్కూళ్ళలోని మాష్టర్లూ—విద్యార్థులు—పండితులూ, ఆ వెనుక చాలామంది హిందూ—ముసల్మానులు నిలుచుని వున్నారు. వేణీ రమేశుని గాఢంగా కౌగలించుకుని యేడుస్తున్నట్లుగా—"రక్తసంబంధం ఎటువంటిదో యిప్పుడు తెలుసుకున్నాను. తమ్ముడూ! యదుముఖర్జీ కూతురు ఆ వెధవ భైరవాచారిగాడిచేత యీపనిచేయించి, సిగ్గెగ్గులులేకుండా బోను యెక్కి యిలా అబద్ధం సాక్ష్యంచెప్పి నిన్నింత వేధిస్తుందని అప్పుడు నాకు తెలిసివుండి కూడా తెలియనట్లున్నాను. భగవంతుడు నాకు తగిన శిక్ష విధించాడు. నువ్వు జయిలులో బాగా వున్నావురా తమ్ముడూ: నేను బయట యీ ఆరుమాసాల నుంచీ వుడికి వుడికి వుర్లగడ్డలా అయాననుకో" అన్నాడు.

ఏమనాలో—ఏమనకూడదో రమేశునికి అర్థంకాక తల్లక్రిందై—అలాగే చూస్తున్నాడు. హెడ్మాష్టర్లు సాష్టాంగదండ ప్రణామములు చేశారు. ఆయన వెనక వున్నవాళ్ళు—కొందరు ముందుకువచ్చి ఆశీర్వదించారు. కొందరు సలాంచేశారు. మరి కొంధర్లు నమస్కరించారు. వేణీ యేడ్పుమాత్రం ఆగలేదు.

ఆయన గద్గదకంఠంతో—"నామీద కోపం పెట్టుకోవద్దు తమ్ముడూ! యింటికిపద. యేడ్చి—యేడ్చి అమ్మకు కళ్ళు పోయినంత్ల పనైంది" అన్నాడు.

గుఱ్ఱబ్బండి సిద్ధంగావుంది. రమేశుడు ఏమీ మాట్లాడకుండా దానిలోకి యెక్కి కూచున్నాడు, వేణీ ముందు సీటుమీద కూచుని తలమీది గుడ్డను తీసివేశాడు. దెబ్బ మానిపోయినా—అక్కడ మచ్చమాత్రం మాయలేదు. స్పష్టంగా కనిపిస్తూంది, రమేశుడు చకితుడై—"పెద్దన్నయ్యా! అదేమిటి?" అని అడిగాడు.

వేణీ ఒక దీర్ఘ నిశ్వాసంవిడిచి-కుడిచేతిలోని రేఖలు చూపిస్తూ-"ఎవరిమీద దోషం వేయను. యిదంతా నా కర్మఫలం: యిది నా పాపఫలం! కాని యిప్పుడా సంగతి విని యేంచేస్తావు?" అని అడిగాడు.

వేణీ తన ముఖంలో ఒక గంభీరవేదన వున్నప్పటికీ మెదల కుండా వున్నాడు. స్వయంగా తన నోటితో తాను చెప్పి దోషాన్ని స్వీకరించి విషయం తలచుకునే సరికి రమేశుని హృదయం మెత్తబడింది. ఏదో జరిగి వుండి వుంటుందని రమేశు గ్రహించాడు. కాని తెలుసు కునేందుకు ఎక్కువగా ప్రయత్నించలేదు. కాని వేణీ ఈ సంగతిని యే భూమికతో చెప్పడానికి ప్రారంభించాడో—అలా చెప్పేందుకు వీలు కుదర నందున మనసులో చాలా యాతన పడ్డాడు. ఒకటి రెండు నిము షాలు గడిచాక. ఆయన ఒక్క నిట్టూర్పువిడిచి రమేశుని దృష్టితనవేపు లాక్కుని చెప్పడము మొదలుపెట్టాడు—"పుట్టింది మొదలు నాలో ఓ దోషంవుంది, మనసులో ఒకటి వుంచుకుని

బయటికి వకటిచెప్పను. యితరులవలె నా మనసులోని మాట దాచను. అందువల్ల నేను ఎన్నో శిక్షలు పడవలసి వచ్చింది. అయినప్పటికీ నాకు జ్ఞానం రావడంలేదు."

రమేశుడు మెదలకుండాఅంతా వింటూండడం చూసేసరికి వేణీ తన స్వరాన్ని యింకా కోమలంగా—గంభీరంగాచేసి అన్నాడు—"ఆనాటి నా దోషం ఏమీలేదు, నా మనసులోని బాధను అణచుకోలేక పోయాను. అందుకని యేడుస్తూ—ఆమె దగ్గరకు వెళ్ళి-'రమా! మేము నీకు ఏమపకారం చేశామని నువ్వు మమ్మల్ని యిలా సర్వనాశనం చేస్తున్నావు? రమేశు జెయిలుకు వెళ్ళాడని అమ్మవింటే ప్రాణాలే విడిచేస్తుంది. మేమిద్దరం అన్నదమ్ములం. ఏదో ఆస్థి పాస్తులకోసం పోట్లాడుకుంటాము, యింకా ఏమేమో చేసుకుంటాం? అయినప్పటికీ వాడునాకు తమ్ముడు. కాని నువ్వు ఒక్కదెబ్బతోనే నాతమ్ముణ్ణీ మా అమ్మనూ పొట్టన పెట్టుకుంటున్నావు. కాని నిర్దోషులకు భగవంతుడనేవాడు వున్నాడు. అని అన్నాను." అంటూ బండిలోంచితలబయటపెట్టి-వేణీ ఆకాశంవేపు చూసి భగవంతునితో మొరపెట్టుకున్నట్లు చూశాడు. యిందులో రమేశుడుకలవలేదు. అయినా శ్రద్ధగా వింటున్నాడు. వేణీకొంచెం అన్నాడు—"రమేశ్! ఆసమయాన రమ అకృతి చూసేసరికి ఆగినాకు కంపరం పుట్టినది. యిప్పుడు తలుచుకున్నా-నాకు శివమెత్తినట్లుంది. ఆమె పళ్ళు పటపట కొరికి—"రమేశు తండ్రి మానాన్నను జెయిలుకు పంపాలనీ ప్రయత్నించలేదా? ఒకవేళ అంత వీలుంటే పంపకుండా వూరుకునేవాళ్లేనా?" అని అంది. అయినా ఆథజాతికి యింత దర్పము పనికిరాదు. నేను సహించ

లేకపోయాను. నేనూ కోపంగానే "సరే రమేశుడు విడుదలై రానీ చూద్దాం యీసంగతి'' అని చెప్పివచ్చాను.''

ఇంతవరకూ వేణీ చెపుతున్నమాటలు రమేశుడు సరిగ్గా అర్థం చేసుకోలేదు. తన తండ్రి యెప్పుడు రమ తండ్రిని జెయిలుకు పంపాలని చూశాడో ఆసంగతి తనకు తెలియదు. కాని ఒక ప్పుడు రమ చిన్నమ్మకూడా యిదేమాట అనడం, రమేశుకు గుర్తుకువచ్చింది. అందువల్ల ఆ తరువాత సంగతికూడా వినాలని ఉత్కంఠ పడ్డాడు. ఆసంగతి కనిపెట్టి వేణీ—"ఖూనీలు చేయించడం ఆమెకు అలవాటే. అందుకే ఆనాడు అక్బరును నీ మీదికి పంపిన సంగతి నీకు గుర్తులేదూ? కాని—నీ ముందువాడి ఆటలు సాగలేదు. పైగా వాడికి పాఠం నేర్పావు. కాని నువ్వు నన్ను చూస్తున్నావుగా—నాబోటి దుర్బలుడు........" అంటూ వేణీ విచారం చూపించి—కల్లూకొడుకు తననుకొట్టిన సంగతి కొంత కల్పించి తన భాషలో వివరించి చెప్పాడు.

రమేశుడు వూపిరి బిగబట్టి—"ఆ తరువాత?" అని అడిగాడు.

వేణీ మలినంగా నవ్వి—"ఆ తరువాత నాకేం గుర్తుంది తమ్ముడూ? ఎవరు నన్ను ఆసుపత్రికి తీసుకుని వెళ్ళారో-అక్కడేంజరిగిందో నాకేమీ తెలవదు. తెలివివచ్చేసరికి ఆసుపత్రిలో పడివున్నాను. తమ్ముడూ రమేశు! యీ మారు మా అమ్మపుణ్యం వల్లనే బ్రతికిపోయాను. అటువంటి అమ్మ యింకెవరికుంటుంది రమేశ్?" అని చెప్పాడు.

ఒక్కమాట కూడా రమేశు చెప్పలేకపోయాడు. కొయ్యి చెక్కలా కూచుండి పోయాడు. అయినా అతని రెండుచేతుల

వ్రేళ్ళు బిగించుకున్నయ్! ఆయనలో ప్రజ్వరిల్లుతూన్న కోపం-అసహ్యం యింతా అంతా కాదు. తనకోపం విలువ తనకే తెలవదు. వేణీ ఎంత చెడ్డవాడో తనకు తెలుసు! అతను చేయలేని పనంటూ ఏదీవుండదని కూడా తెలుసు! కాని ప్రపంచంలో యెవరైనా యింత అబద్ధాన్ని, యీవిధంగా నిస్సంకోచంగా ఏకధాటిగా చెప్పగలడా అని వూహించనుకూడా వూహించలేక పోయాడు. అందువల్ల రమ అపరాధాలన్నీ నిజమని భావించాడు.

అతను మళ్ళీ తిరిగి రావడంతోనే వూళ్ళో వాళ్ళందరికి ఉత్సవంలావుంది. రోజూ ఉదయం, సాయంత్రం, రెండు పూటలా, ఎంతోమంది రావడం-రకరకాలైన ఆత్మీయతను వ్యక్తపరిచారు. తను జెయిలుకు వెళ్ళానే అనే దుఃఖంకూడా ఎగిరిపోయింది. తను లేనప్పుడు ఆచుట్టుప్రక్కల గ్రామాల్లో ఒక సాంఘిక సంబంధం ఏర్పడిందనడంలో అతిశయోక్తి ఏమీ లేదు. తానులేని యీకొద్దిమాసాల్లో, యింత పరివర్తనం యెలా కలిగిందా అని సందేహించాడు. యిదివరకు వేణీ తన పనులకు అడ్డుపడేవాడని, యిప్పుడు ఆటంకంలేకపోయేసరికి తమపనులు ద్విగుణీకృతంగా సాగుతూందని తెలిసిందతనికి. వేణీని యిప్పుడు సరిగ్గా అర్థంచేసుకోగలిగాననుకున్నాడు. అతను యిలాంటి అనిష్ట కారి అని తెలిసినా-గ్రామమంతా దానికి ఎంతవరకు బాధ్యులో ఆ విషయం యివాళనే అర్థంచేసుకోగలిగాడు. అతనితో విరోధం విడిపోయినందుకు మనసులోనే సంతోషించాడు. అంతే కాదు, తనకు జరిగిన అన్యాయానికీ, అత్యాచారానికీ, వూరందరికీ కష్టంగానేవుందని గ్రామస్థులంతా చెప్పారు. వీళ్ళ సానుభూతి

పొంది, వేణీ తన ప్రక్కకు తిరగడంవల్ల కలిగిన ఆనందోత్స వాలతో రమేశుని హృదయం విప్పారింది. ఆరుమాసాల క్రింద తనుపని ప్రారంభించి, అవిసాగక పారిపోదామనుకున్నాడు. యిప్పుడవి ఫలోన్ముఖం కాగలసూచనలు కనుపించేసరికి, రమేశు డెంతో వుత్సాహంతో, యింటింటికీ వెళ్ళిసంగతి-సందర్భాలు కను క్కుంటూ కొన్నాళ్ళు గడిపేశాడు. కాని ఒక్కరివిషయంమాత్రం పట్టించుకోకుండా వూరుకున్నాడు. అదే రమ విషయం! రమ జబ్బుగా వుందని దారిలోనే విన్నాడు. కాని ఆమెకు జబ్బేమిటో? అది ఎంత ఎక్కువగా వుందో తెలుసుకుందామని ప్రయత్నించ లేదు. అతను రమతో తనకున్న సంబంధమంతా తెగతెంపులు చేసుకున్నానని అనుకున్నాడు. తన కష్టాలన్నిటికి కారణం రమేనని గ్రామస్తుల నోటంట కూడా విన్నాడు. అందువల్ల యిప్పుడు వేణీ చెప్పినది అబద్ధంకాదని బాగా అర్థమైంది.

అయిదారురోజు లయాక వేణీ వచ్చి రమేశుని పట్టుకున్నాడు. పీరుపురంలో రమకూ, తమకూ జాయింటు ఆస్తి విషయంలో వారిద్దరికీ చాలాకాలంనుంచి తగాదా లున్నయ్! ఇప్పుడు యిటు వంటి వుత్తమ అవుసరాన్ని విడవకండా దాన్ని హస్తగతం చేసుకోవాలని అతని వుద్దేశం!

వేణీ పైకి ఎన్నిచెప్పినా—రమ అంటే మహాభయం! కాని యిప్పు డామె జబ్బుగావుంది. వ్యాజ్యాలూ అవీ ఆడలేదు. అదీగాక అక్కడి ముసల్మానులు కూడా రమేశుని మాట కాదన లేరు. అందుకని ముందు ముందు ఏమవుతుందోననీ, యిటువంటి సమయం జారవిడవకూడదని రమేశునితో వాదం వేసుకున్నాడు.

రమేశుడు సంగతంతా విని—అందుకు వొప్పుకోకపోయేసరికి, ఎన్నో యుక్తులు ప్రయోగించి, చివరకు—"ఈపని నీవల్ల నెందుకు కాదు ? అవకాశం వచ్చినప్పుడు ఆమె నిన్ను విడిచి పెట్టలేదు ? ఇప్పుడు నువ్వు ఆమె జబ్బులో వుందంటున్నావు ? ఆమె నిన్ను జెయిలుకు పంపినప్పుడు నీకు జబ్బుగాలేదా ?" అని అడిగాడు.

ఆసంగతి నిజమే ! దీన్ని రమేశు కాదనలేకపోయాడు. అయినప్పటికీ అతని మనసెందుకో రమకు విరుద్ధంగా పోయేందుకు వొప్పుకోలేదు. వేణీ వెయ్యివిధాల చెప్పినా—వుత్తేజపరిచినా—రమ అసహాయస్థితి గుర్తుకొచ్చేసరికి—అతనిలోని విరోధభావమంతా—ఒక చిన్న నీటిచుక్కలా మారిపోయేది. ఇందుకు స్పష్టమైన కారణమేమిటో ఎంతవెతికినా అంతుపట్టలేదు. రమేశు మాట్లాడకుండా వూరుకున్నాడు. పనిజరిగేట్లయితే వేణీ ఎంతైనా ఓపిక చేయగలడు. అందువల్ల యిప్పుడు ఎక్కువగా సతాయించకుండా వెళ్ళిపోయాడు.

ఈమూరు యింకొక విషయం, రమేశుని దృష్టిని ఆకర్షించింది. అదేమిటంటే,—విశ్వేశ్వరికి మొదటినుంచీ యీ సంసారం మీద ఎక్కువ మమకారం లేదని అతనికి తెలుసు ! తను జెయిలులోంచి తిరిగి వచ్చాక ఆ మమకార మంతా అసహ్యం క్రిందకు మారినట్లు గ్రహించాడు. జెయిలునుంచి విడుదలై వచ్చాక, వేణీతోపాటు తానుగూడా—ఆమెదగ్గరకు వెళ్ళాడు. ఆనాడు విశ్వేశ్వరి ఆనంధం ప్రకటించి, గద్గదకంఠంతో అనేక ఆశీర్వాదాలు చేసింది. ఎందుచేతనోకాని అతనికి వాటివల్ల ఆనం

దానికి మారుగా కష్టముకలిగింది. ఇవాళ మాటల సందర్భములో విశ్వేశ్వరి కాశీలోవుండడానికి ప్రయాణ మవుతుందనీ, మళ్ళీ తిరిగి రాదని కూడా తెలిసింది. ఈమాట విని ఆయన తృళ్ళిపడ్డాడు. ఈసంగతి యింతవరకూ ఆయన వినలేదు. అయిదారురోజుల నుంచి, ఏదో తొందరపనులవల్ల, అటువేపు వెళ్ళలేదు. అది వరకు వెళ్ళినప్పుడు యీసంగతి ప్రస్తావనకు రాలేదు. తన విషయంలోకానీ, పరాయివాళ్ళ విషయంలోకానీ, యితరులతో చెప్పే అలవాటు విశ్వేశ్వరికి లేదు. అయినా యివాళ విన్న కబురూ—ఆనాటి సంఘటనా పోల్చి చూచుకునేసరికి ఆమె ఈ వైరాగ్యానికి కారణ మేమిటో అర్థమైంది. పెద్దమ్మ నిజంగానే యిక్కడ్నుంచి వెళ్ళిపోతూందని గ్రహించాడు. పెద్దమ్మ యిక్కడ లేకుంటే ఎంతలోటు కలుగుతుం దనే విషయం గుర్తు కొచ్చేసరికి అతని కళ్ళలో నీళ్ళు తిరిగినయ్! ఇక ఒక్క క్షణం కూడా వ్యర్థపరచకుండా ఆమెదగ్గరకు వెళ్ళాడు. అప్పుడు తొమ్మిది—పదిగంట లవుతుంది. యింట్లోకి వెళ్ళగానే దాసీది అమ్మగారు ముఖర్జీగా రింటికి వెళ్ళిందని చెప్పింది. రమేశు చకితుడై—"ఈ అసమయంలోనా?" అని అడిగాడు.

ఆ దాసీది చాలాకాలంనుంచీ అక్కడే పనిచేస్తుంటుంది. అందుకని—"అమ్మగారికి సమయాసమయాలు వున్నవా? అదీ గాక యివాళ రమ తమ్ముడి వడుగుగా!" అన్నది.

"యతీంద్రుని వడుగా?" రమేశుడు యింకా చకితుడై— "ఈ సంగతి ఎవరికీ తెలవదే" అన్నాడు.

"వారు వూళ్ళోవాళ్ళని ఎవరినీ పిలవలేదు. ఒకవేళ పిలిచినా భోజనాలకు ఎవరూ వెళ్ళరు. ఆమెగారిని అందరూ వెలివేశారు బాబూ!"

రమేశునిఆశ్చర్యానికి అంతులేదు. కొంచెంసేపు మెదలకుండా వూరుకుని అందుకు కారణం అడిగాడు. అందుకు దాసీ సిగ్గు పడుతూ తల ఒకవేపు తిప్పుకుని—"ఏమితెలుసు చినబాబు గారూ? రమమీద చాలా అపవాదులు వున్నయ్! అయినా మావంటి పేదవాళ్ళకు అటువంటివి, ఏమీ తెలియవుబాబూ" అంటూ వెళ్ళిపోయింది.

మెదలకుండా కొంచెం సేపుండి, రమేశు తన యింటికి వచ్చేశాడు. అది కోపంతో వేణీ చేసినపనేనని ఎవరిని అడక్కుండానే గ్రహించాడు. అతని కోపం ఎందుకో—యేపగ తీర్చు కోవడానికో, ఆమెమీద యిటువంటి అసహ్యమైన అపవాదులు వేయబడ్డాయో వూహించాలన్నా, అతనికి సాధ్యంకాలేదు.

19

ఆనాడు మధ్యాహ్నం తలవనితలంపుగా ఒక సంఘటన జరిగింది. కోర్టుకు వెళ్ళకుండా ఒక తగాదా తీర్పుకోసమని, మంగలి కైలాసుడు—షేక్‌మోతీలాలు యిద్దరూ తమతమ కాగితాలూ, సాక్షులను వెంటబెట్టుకుని రమేశుని శరణువేడారు. రమేశుడు ఆశ్చర్యపడి—"నాతీర్పు మీరెందుకు వొప్పుకుంటారు?" అని అడిగాడు.

వాదిప్రతివాదు లిద్దరూ జవాబుచెప్పారు—"ఎందుకు వొప్ప కోము బాబూ. జడ్జిగారికన్న తమరు విద్యాబుద్ధుల్లో తక్కువ వారుకాదు. ఆ జడ్జిగారూ—పెద్ద ఆఫీసర్లుకూడా మీవంటి పెద్ద మనుష్యుల్లోనివారేగా! ఒకవేళ రేపు మీకు జడ్జిగారి నౌకరి దొరికిందంటే అప్పుడు మీరిచ్చే తీర్పుకు మేము బద్ధులమై వుండాల్సిగా; మేము వొప్పుకోము అని అప్పుడనగలమా?"

ఈమాట వినేసరికి రమేశుని హృదయం అభిమానంతోనూ-ఆనందంతోనూ నిండిపోయింది.

కైలాసుడు అన్నాడు—"మేమిద్దరం మా ఫిర్యాదులు విడమర్చి చెప్పగలం! కాని కోర్టులో అలా చెప్పడానికి వీలుండదు. అదీగాక బాబుగారూ! అక్కడ ప్లీడర్లకు దోసిళ్ళకొద్దీ డబ్బు పోయనిదే పనేమీజరగదు. ఇక్కడ ఒక్కదమ్మిడీగూడ ఖర్చుండదు. వకీళ్ళకంతడబ్బు పోయనవుసరంలేదు. పైగా అంతదూరం నడవాల్సిన పనివుండదు. అందుకని బాబుగారూ! మీరేవిధంగా తీర్పుచెపుతారో—అది మంచిది కానీయండి, చెడ్డదికానీయండి, ఔదలదాల్చి యింటికి వెళ్ళిపోతాము. భగవంతుడు మాకిప్పుడు మంచిబుద్ధి చూపించాడు. అందుకనే కోర్టుకు వెళ్ళకుండా తమ దగ్గరకు వచ్చాము."

ఒక చిన్న పంటకాలువను గురించి వాళ్ళిద్దరూ తగాదా పడుతున్నారు. ఆ విషయాన్నిగురించిన దస్తావేజులూ—కాగితాలూ అన్నీ వాళ్ళు రమేశునికి యిచ్చారు. రేపుదయమే వస్తామని చెప్పివెళ్ళారు. రమేశు స్థిరంగా కూచున్నాడు. ఈ సంఘటన అతని వూహకు అతీతమైనది. తన సుదూరభవిష్యత్తులో—యింత పెద్ద ఆశకు తనమనసులో స్థానమీయలేదు. ఇవాళ వీళ్లు తన తీర్పు వొప్పుకోనీ, వొప్పుకోకపోనీ, కోర్టుకు వెళ్ళకుండా తగాదా పరిష్కరించుకుందామని వాళ్లు తనదగ్గరికి వచ్చారు. ఈ సంగతి అతని హృదయాన్ని ఆనందంతో ముంచివేసింది. ఇదేమంత పెద్దవిషయంకాదు. గ్రామములోని యిద్దరు మనుష్యులు సాధారణంగా పోట్లాడుకునే చిన్న తగాదాలాంటిదే: అయినప్పటికీ యీ తుచ్ఛమైన చిన్నవిషయాన్ని పురస్కరించుకునే, అతని హృదయంలో ఎన్నెన్నో ఆలోచనలు గగన కుసుమాల

వలె, వికసించసాగినయ్! ఈ అభాగిని జన్మభూమికి అతను ఎన్నెన్ని పనులు చేయగలడో వాటికి లెక్కగాని, దరిదాపుకాని, అతని కందలేదు. బయట వసంతజ్యోత్స్నతో ఆకాశమంతా నిండిపోయింది. దానివేపు చూస్తుంటే అకస్మాత్తుగా రమ గుర్తుకు వచ్చింది. అయినప్పటికి యింకొకరోజైతే ఈర్ష్యతో శరీరమంతా మండిపోయేదే? ఇవాళ మంటపుట్టడ మటుంచి, ఓచిన్న నిప్పు కణికంత ఉత్తాపంకూడా అనుభవించలేక పోయాడు. అతను మనసులోనవ్వుకుని, ఆమె నుద్దేశించి అన్నాడు—"రమా! నీవల్ల భగవంతుడు నా జీవితాన్నింత బాగుచేస్తాడని, నీవిచ్చినవిషం—అదృష్టవశాత్తూ నాకు అమృతంలా మారుతుందని, నీకు తెలిసి వున్నట్లయితే—నన్ను జెయిలుకు పంపడానికి సిద్ధపడేదానివి కాదనుకుంటాను."

అంతలో ఎవరో వచ్చినట్లు చప్పుడైంది.

"ఎవరది?"

"చినబాబుగారూ: నేను రాధను! రమ అక్కయ్యగారు తమర్ని ఒక్కసారి కనిపించి వెళ్ళమన్నారు!"

ఒకసారి కనుపించమని రమ దాసీని పంపింది. రమేశు ఆశ్చర్యం చెందాడు. ఇవాళ ఏ దురదృష్టదేవత తనతో పరిహాస మాడ్డంలేదుకదా? అనుకున్నాడు.

"చినబాబుగారూ! తమరు దయవుంచి ఒక్కసారి...."

"ఆమె యెక్కడుంది?"

"ఇంట్లో పడుకునివుంది" అని కొంచెం ఆగి—"యిక రేపు సమయం దొరకదు. అందుకని యిప్పుడే...." అని ఆగి పోయింది.

"అయితే పద" అంటూ లేచాడు రమేశు.

రమేశుని పిలుచుకుని రమ్మని దాసీని పంపి, రమ ఒక విధంగా మంచంమీద స్థిరంగా పడుకునివుంది. దాసి చెప్పిన మీదట రమేశు గదిలోకివచ్చాడు. అతను ఒక నాల్గుకాళ్ళబల్లను లాక్కుని కూచున్నాడు. రమ తన బలాన్నంతా ఏకంచేసి, రమేశుని కాళ్ళవద్ద కూచుంది. గదిలో ఒకమూల దీపం మినుకు మినుకు మంటూంది. ఆ అస్పష్టవెలుతుర్లో రమయొక్క అస్పష్ట రూపం ఏదో కొంత చూశాడు. అందువల్ల ఆమె శరీరస్థితిని తెలుసుకోలేకపోయాడు. ఇప్పుడు దారంటవస్తూ తన మనసులో సంకల్పించుకున్నదంతా—యిప్పుడు రమయెదట కూచోగానే, అన్నీ తారుమారైపోయినయ్! కొంచెంసేపటివరకూ మెదల కుండా కూచున్నాక, కోమలంగా—"యిప్పుడెలావుందిరాణీ?" అని అడిగాడు.

రమ ఆయన కాళ్ళవద్దనుంచి కొంచెం జరిగి కూచుని—"నన్ను మీరు రమా అనే పిలవండి" అని అన్నది.

రమేశుని వీపుమీద కొరడాతో కొట్టినట్లయింది. ఆయన వెంటనే కొంచెం కఠినంగా అన్నాడు—"మంచిదే: నువ్వు జబ్బుగావున్నావని విన్నాను. అందుకే యిప్పుడెలావుందని అడిగాను. లేకుంటే ఏపేరుతోనైనా—ప్రయోజనంలేదు. యిప్పుడు పేరుపెట్టి పిలవాలని కూడా లేదు నాకు. అంత అవ సరంకూడాలేదు."

రమ అంతా గ్రహించింది. కొంచెంసేపు స్థిరంగావున్నాక ఆమె మెల్లమెల్లగా అన్నది—"యిప్పుడు నాకు బాగానేవుంది" మళ్ళీ—"నేను మీకు కబురు పంపినందుకు మీకు ఆశ్చర్యం కల్గిగింధనుకుంటాను. కాని...."

రమేశు మధ్యలోనే తీవ్రంగా—"లేదు. ఆశ్చర్యంకలగ లేదు. యిప్పుడు నువ్వేపనులు చేసినా ఆశ్చర్యపడే రోజులు గతించాయి. అయినా నన్నెందుకు పిలిపించావు?" అని అడిగాడు.

ఈ మాట రమను ఎంతగాయపరిచిందో-రమేశు గ్రహించ లేకపోయాడు. కొంచంసేపు తలొంచుకుని కూచున్నాక రమ— "రమేశన్నయ్యా! యివాళ రెండు పనులకోసం మిమ్మల్ని కష్టపెట్టాను. నేను మీకెంత అపకారం చేశానో—అది నాకు తెలుసు! అయినప్పటికి మీరు వస్తారని నాకు నిశ్చయంగా తెలుసు! యిక నాయీ రెండు ఆఖరి కోర్కెలు తిరస్కరించరని కూడా తెలుసు!" అని, అన్నది.

కన్నీళ్లతో గొంతుక బొంగురుపోయింది. రమేశుడు స్పష్టంగా ఆవిషయాన్ని గ్రహించాడు. కనురెప్పపాటుకాలంలో అతనికి పూర్వపు స్నేహం పొంగిపొర్లింది. ఇన్ని అఘాత ప్రతిఘాతాలు జరిగినా, ఆస్నేహం యిప్పటికి ఉత్తంకాలేదనీ, కేవలం నిర్జీవంగా, అచేతనంగా పడివుందని తెలుసుకునేసరికి అతనికి ఆశ్చర్యం కలిగింది. ఒక్కక్షణం మెదలకుండావుండి—"నీకోరిక యేమిటి....?" అని అడిగాడు.

రమ చకితయై—తలెత్తి, మళ్ళీ క్రిందకు దించుకుంది— పెద్దన్నయ్య ఏ ఆస్థిని నీసాహాయ్యంవల్ల దఖలు పరుచుకుందామని అనుకున్నాడో, అది నిజానికి నాది. అంటే అందులో పదిహేను అణాలవంతునాది. ఒకవంతు మీది. దాన్ని నేను మీ చేతుల్లో పెట్టాలనుకుంటున్నాను."

రమేశు కొంచెం కోపంతో—"నువ్వేమీ భయపడవద్దు. దొంగతనంచేసేందుకు ఖుద్దీ వరకు నేనెవర్ని సాహాయ్యం కోరలేదు.

యిప్పుడు కూడా కోరను. ఒకవేళ నువ్వు దానంచేయాలనుకుంటే—ఆదానం పుచ్చుకోవడానికి చాలామంది వున్నారు. నేనా దానం పుచ్చుకోను—" అని అన్నాడు.

మొదటయితే "ముఖర్జీలదానం పుచ్చుకోవడానికి ఘోషాల వంశీయులకు అవమానంకాదు." అని చెప్పేదే: కానీ యిప్పుడా మాట పెకిలిరాలేదు. ఆమె ప్రార్థించినట్లుగా—"రమేశన్నయ్యా! నీవు దొంగతనం చేయడానికిసహాయ్యం కోరవని నాకు తెలుసు! ఒకవేళ పుచ్చుకున్నా దాన్ని నీ స్వంతానికి తీసుకోవని తెలుసు! కాని అదికాదు. తప్పుచేసినందుకు శిక్షవుండాలి. నేను ఎన్నో అపరాధాలుచేశాను. అందుకు జుల్మానాగా దీన్నెందుకు తీసుకోకూడదు?" అని అడిగింది.

రమేశుడు కొంచెంసేపు మెదలకుండావుండి—"యిక నీ రెండో కోరిక యేమిటి?" అని అడిగాడు.

"మాయతీంద్రుని నీచేతుల్లో పెట్టాలనుకున్నాను. వాన్ని నీలాంటి మనిషిగాచెయ్యి! పెద్దవాడయ్యాక, వాడు నీలా నవ్వుతూ-నవ్వుతూ స్వార్థత్యాగం చేయగలుగుతాడు."

రమేశుని మనసులో మలిన మంతా కరిగిపోయింది. రమ పైట కొంగుతో కన్నీళ్ళుతుడుచుకుని—"ఇది నాకళ్ళతో నేను చూడలేను. అయినప్పటికి యతీంద్రుని శరీరంలో పూర్వుల రక్తంవుందని నాకు నిశ్చయంగా తెలుసు! త్యాగంచేయడానికి కావలసిన శక్తి వాడి ఎముకల్లో వ్యాపించివుంది. వాడికి తగిన శిక్షణ గరిపినట్లయితే—వాడు ఎప్పుడో ఒకప్పుడు నీలా తలెత్తుకుని తిరగగలడు."

వెంటనే రమేశు ఆమెకు జవాబు చెప్పలేకపోయాడు. అతను కిటికీ బయట వెన్నెలతో నిండివున్న ఆకాశం వేపు చూస్తూ

న్నాడు. అతని మనసులో-యింతకు ముందు వీళ్ళతో పరిచయం లేనట్లుగా బాధపడ్డాడు. చాలా సేపటివరకూ మెదలకుండా వున్నాక—"చూడూ! నన్నీ విషయంలోకి లాగవద్దు. నేను ఎన్నో కష్టాలూ-దుఃఖాలు పొందాక వెలుతురు రేఖ చూడగలుగుతున్నాను. మళ్లీ యీకాస్తా ఎక్కడ ఆరిపోతుందోనని నాకు భయంగావుండి." అని అన్నాడు.

"కాదు రమేశన్నయ్యా! యిప్పుడా భయంలేదు. ఆ ప్రకాశం యిప్పుడిక ఆరదు. ఆనాడు పెద్దమ్మకూడా చెప్పింది. నీవు యెక్కడినుంచో వచ్చి ఎక్కడో పైన కూచుని పనులు చేయడానికి తలపెట్టావు. అందువల్లనే యిన్ని బాధలూ—కష్టాలు పడవలసి వచ్చింది. యిప్పుడు మేము మా దుష్కర్మలవల్ల నిన్ను క్రిందకు దించి యిప్పుడు సరైన ప్రదేశంలో నిలపగలిగాం: యిప్పుడు నువ్వు మా మధ్యలోకి వచ్చి నిలబడ్డావు. అందుకే నీకు భయంగావుంది. మొదట అయితే నీకీ అనుమానం కలిగేదేకాదు. ఆ సమయంలో నువ్వు మా గ్రామ్య సమాజానికి బయట వున్నావు. యిప్పుడు అందులోని ఒక వ్యక్తి వయ్యావు. అందుకని యీ జ్యోతి యిక చల్లారదు. యిప్పుడిక యీ ప్రకాశం రోజు రోజుకూ మరింత ఉజ్వలమవుతుంది."

హఠాత్తుగా పెద్దమ్మ అనే మాట వినేసరికి రమేశు ఉద్దీప్తుడయాడు—"ఏం రమా? అయితే నేను వెలిగించిన ఈ దీపజ్వాల యిక చల్లారదని నీకు తెలుసా?" అని అడిగాడు.

"అవును! నాకు బాగా తెలుసు! యిది అంతా తెలిసివున్న పెద్దమ్మ అన్నమాటలు. ఈ పని మీవల్ల కావలసిందే! రమేశన్నయ్యా! మా యతీంద్రుని, నీచేతుల్లోకి తీసుకుని, నా అపరాధా లన్నీ క్షమించి ఆశీర్వదించి పంపు. నేను నా స్వామి దగ్గరకు నిశ్చింతగా వెళతాను."

రమేశుని హృదయంలో—మెరుపులతో మెరిసిన శ్లాఘామే—మాటి మాటికీ మెరవసాగింది. కాని తలొంచుకుని మెదలకుండా కూచున్నాడు.

"యింకొక సంగతికూడా మీరు వొప్పుకోవాలి. చెబుతే వొప్పుకుంటారా?"

"ఏమిటా మాట?"

"నా విషయంలో ఎప్పుడూ నీవు వేణీ అన్నయ్యతో పోట్లాడవద్దు."

రమేశునికి అర్థంకాలేదు—"అంటే."

"దీనర్థం నువ్వు ఎప్పుడో ఒకప్పుడు తెలుసుకుంటావు. ఒక నాడు నాకు చాలా అసహ్యం కలిగింది. అప్పుడు పెద్దమ్మ వచ్చి 'అమ్మాయీ! మిథ్యను కదలించి సచేతనం చేయడంవల్ల దాని ఆయువు వృద్ధవుతుంది. అసహ్యంవల్ల ఆ మిథ్య ఆయువు ఎక్కువచేయడం మహాపాపం!" అని చెప్పింది. ఆమె వుపదేశం గుర్తుంచుకుని నేను నా దుఃఖ దౌర్భాగ్యమంతా గడిపాను. ఈ సంగతి నువ్వుకూడా మర్చిపోవద్దు రమేశన్నయా?"

రమేశు మెదలకుండా ఆమె ముఖంలోకి చూస్తున్నాడు. కొంచెం సేపుండి రమ—"రమేశన్నయ్యా! నన్ను క్షమించలేకపోయానే అనే దుఃఖం మాత్రం మనసులో వుంచుకోవద్దు. యివాళ కష్టంగా వున్నదే రేపు సహజం—సరళమవుతుందని నాకు తెలుసు! ఇందుకని యిప్పుడు నా మనసులో క్లేశమేమీ లేదు. ఆ నాడు నువ్వు నా అపరాధాలు సహజంగా క్షమించగలవు. నేను రేపు వెడుతున్నాను." అని అన్నది.

రమేశుడు చకితుడై అడిగాడు—"రేపా! ఎక్కడికి వెళతావు.?"

"పెద్దమ్మ యెక్కడికి తీసుకుని వెళితే అక్కడికి "

"ఆమె తిరిగి రాదని విన్నాను."

"నేనూరాను! నీ పాదాలముందు నేనుకూడా ఒకేసారి సెలవు పుచ్చుకుంటాను."

ఈమాట అని రమ భూమికి తల ఆనించింది. రమేశు కొంచెం సేపటి వరకు మెదలకుండా కూచుని ఒక నిశ్వాసం విడిచి—లేచి నిల్చుని—"సరే వెళ్ళు. నువ్వు ఎందుకని వెళుతున్నావో నేను తెలుసుకోవచ్చా?" అని అడిగాడు.

రమ మాట్లాడలేదు.

"నువ్వు అన్ని విషయాలు ఎందుకు రహస్యంగా వుంచి వెలుతున్నావో అది నీకేతెలుసు! కాని, నేనుకూడా త్రికరణశుద్ధిగా నిన్ను క్షమించేశక్తి నాకు భగవంతుడు ప్రసాదించాలని కోరుతున్నాను. నిన్ను క్షమించలేకపోయినందుకు ఎంతబాధపడుతున్నానో అది నా అంతరాత్మకే తెలుసు!"

రమ కళ్ళంట నీళ్ళు ప్రవహిస్తున్నాయ్! కాని ఆ మసక వెలుతురులో రమేశుడు చూడలేదు.

రమ యింకొకసారి నమస్కరించింది. ఆ తరువాత రమేశు బయటికి వెళ్ళిపోయాడు. దారంట వెళుతూ—వెళుతూ—తన భవిష్యత్తులో చేయవలసిన పనిపాటలలోని ఉత్సాహ మంతా యీ అస్పష్టంగావున్న వెన్నెల్లా వుందనుకున్నాడు.

ఆ మరునాడు ఉదయం రమేశు పెద్దమ్మగారింటిదగ్గరకు వచ్చేసరికి, విశ్వేశ్వరి పాలకీలో కూచుంటూవుంది. రమేశు కళ్ళ నీళ్లు తెచ్చుకుని దగ్గరకువెళ్ళి—"పెద్దమ్మా! మే మంతా ఏమి అపరాధం చేశామని మమ్మల్ని యిలా వదిలి వెళుతున్నావు?" అని అడిగాడు.

విశ్వేశ్వరి తన కుడిచేతిని అతని తలమీద వుంచి— "నాయనా! అపరాధాలు చెప్పుకుంటూవుంటే—వాటికి అంతు వుండదు. అందువల్ల వాటి అవసరంలేదు.'' అని ఆ తరువాత— "రమేశ్! ఒకవేళ నేనుయిక్కడ చనిపోయినట్లయితే—నాచితికి వేణీ తలకొరివి పెడతాడు. అటువంటప్పుడు నాకు ముక్తంటూ లేదు. నాయనా! నా యిహకాలమంతా మంటలతోనే గడిపాను. ఇప్పుడు నా పరకాలంకూడా బాధలు పడవలసి వస్తుందేమోననే భయంతో యిక్కడనుంచి పారిపోతున్నాను'' అని అన్నది.

రమేశుడు పిడుగుపడినట్లుగా స్తంభించిపోయాడు. యీనాడు పెద్దమ్మను గుర్తించినట్లు—ముందెప్పుడూ గుర్తించలేదు. కొంచెం సేపుండి—"పెద్దమ్మా! మరి రమ యెందుకు నీతో వస్తుంది'' అని అడిగాడు.

విశ్వేశ్వరి ఓగొప్ప నిశ్వాసాన్ని ఆపుకుని—గొంతు సవరించుకుంటూ—''నాయనా! ప్రపంచంలో ఆమెకు స్థానంలేదు. అందుకని ఆమెను భగవంతుని చరణాలవద్దకు తీసుకుని వెళుతున్నాను. అక్కడికి వెళ్ళాక ఆమె బ్రతుకుతుందో లేదో చెప్పలేను. కాని అది బ్రతికివున్నంతకాలం, దానికింత రూపం—గుణం, యింత గొప్ప హృదయం యిచ్చి, ఈ ప్రపంచంలోకి ఎందుకు పంపాడో—ఆ తరువాత ప్రపంచంలో దుఃఖాలనూ, అవమానాలనూ దానినెత్తిన రుద్ది ప్రపంచానికింత దూరంచేసి ఎందుకు పారవేశాడో—ఆ సంగతి అన్వేషించమని భగవంతుని ప్రార్థిస్తాను. ఇందులో భగవంతుని అర్థపూర్ణమైన మంగళప్రదమైన అభిప్రాయం వుందా లేక యిదంతా మన లోకసమాజం దానితో ఆడిన చెర్లాటా? రమేశ్! ప్రపంచంలో దానంత దుఃఖితురాలు యెవరూలేరు!!'' అంటుంటే ఆమెగొంతు బొంగురు

పోయింది. ఆమె యింత వ్యాకులపాటు పడుతుండగా యింత వరకూ ఎవరూ చూడలేదు. రమేశు నిశ్శబ్దంగా వున్నాడు. విశ్వేశ్వరి కొంచెంసే వున్నాక—"కాని రమేశ్! నువ్వు ఆమెను పొరపాటుగా అర్థం చేసుకోవద్దు. యిదే నా ఆదేశం. నేను వెళ్ళబోయేముందు యెవరిమీదా నెపంవేయను. నాకు యిష్టంకూడాలేదు. కాని దానికన్న నీ హితంకోరేవాళ్ళు ఎవరూ లేరనిమాత్రం ఎన్నడూ మర్చిపోవద్దు" అన్నది.

"కాని పెద్దమ్మా!" అని అనబోయాడు రమేశు.

ఆమె హఠాత్తుగా అడ్డువచ్చి—"రమేశ్! ఇందులో కానీ, గీనీ, అనడాని కేమీలేదు. నువ్వు విన్నదంతా అబద్ధం. నువ్వు తెలుసుకున్నదంతా తప్పు! ఇక ఈ అభియోగం యిక్కడితో అంతం కావాలి. కాని నువ్వు తలపెట్టిన పనులన్నీ—ఎల్లప్పుడూ, సమస్త అన్యాయాల్నీ హింసాద్వేషాల్నీ లక్ష్యపెట్టకుండా శక్తివంతంగా ముందుకు సాగిపోనియ్! ఇందుకోసమే ఆమెనోరు మూసుకుని అన్నీ సహిస్తూవచ్చింది. రమేశ్! ప్రాణాల్ని వదలడానికి సిద్ధమైందికాని నోరుమాత్రం విప్పలేదు" అన్నది.

సరిగా అదేసమయంలో గతరాత్రి రమ చెప్పిన రెండు సంగతులు రమేశుకు గుర్తుకువచ్చినయ్: కాని దుర్జేయమైన దుఃఖంలో ఆ మాటలు పెదవిదాటిరాలేదు. అతను తొందరగా తలొంచుకుని—శక్తినంతా ఏకంచేసి—"పెద్దమ్మా! అలాగే జరుగుతుందని ఆమెతోచెప్పు" అంటూ చేయిచాపి ఏదోవిధంగా విశ్వేశ్వరి పాదధూళి తీసుకుని తలమీద పెట్టుకుని త్వరత్వరగా బయటికి వెళ్ళిపోయాడు.

సమాప్తం.